www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

సోమవారం | 6-5-2024 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 65 సంచిక (Issue) : 20 | శ్రీ క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం, వసంతరుతువు, చైత్రమాసం, బహుళపక్షం; తిథి: త్రయోదశి మ. 2.41 తదుపరి చతుర్దశి; నక్షత్రం: రేవతి సా. 5.43 తదుపరి అశ్విని; వర్జ్యం: ఉ.6.50-8.17; దుర్ముహూర్తం: మ.12.37-1.28, మ.3.09-4.00; అమృతఘడియలు: మ.3.32-4.59; రాహుకాలం: ఉ.7.30-9.00; సూర్యోదయం: 5.50; సూర్యాస్తమయం: 6.33 | హైదరాబాద్ సిటీ*

Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

జడేజా ఆల్‌రౌండ్ షో

పంజాబ్‌పై చెన్నై విజయం



జడేజా (26 బంతుల్లో 43, 3/20)

ధర్మశాల: స్వస్థలంలో పంజాబ్ కింగ్స్ చేతిలో ఓడిన కసిమీదున్న చెన్నై సూపర్‌కింగ్స్ జట్టు..ఈసారి రవీంద్ర జడేజా ఆల్‌రౌండ్ (26 బంతుల్లో 3 ఫోర్లు, 2 సిక్సలతో 43, 3/20) షోతో అదే కింగ్స్‌ను మట్టికరిపించింది. చేసింది స్వల్ప స్కోరే అయినా జడేజాతోపాటు పేసర్లు కీలక సమయాల్లో రాణించడంతో ప్రత్యర్థిని 28 పరుగులతో చిత్తు చేసింది. తద్వారా చెన్నై మళ్లీ గెలుపు బాట పట్టింది. ఆదివారం జరిగిన మ్యాచ్‌లో మొదట చెన్నై 20 ఓవర్లలో 167/9 స్కోరు చేసింది. కెప్టెన్ రుతురాజ్ గైక్వాడ్ (32), డెరిల్ మిచెల్ (30) తమవంతు పాత్ర పోషించారు. రాహుల్ చాహర్, హర్షల్ పటేల్ చెరో 3, అర్షదీప్ సింగ్ 2 వికెట్లు తీశారు. అనంతరం పంజాబ్ 20 ఓవర్లలో 139/9 స్కోరుకే పరిమితమైంది. ప్రభ్‌సిమ్రన్ (30), శశాంక్ సింగ్ (27) పర్లేదనిపించారు. సిమర్‌జీత్, తుషార్ దేశ్‌పాండే చెరో 2 వికెట్లు తీశారు. జడేజా 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్'గా నిలిచాడు. ఈ గెలుపుతో పాయింట్ల పట్టికలో చెన్నై మూడో స్థానానికి దూసుకొచ్చింది. కాగా, బ్యాటర్లకు, బౌలర్లకు సమానంగా సహకరించే హైబ్రిడ్ పిచ్‌పై ఈ మ్యాచ్‌ను నిర్వహించడం విశేషం.

వికెట్లు టపా..టపా: భారీ ఛేదన కాదు..పైగా గత మ్యాచ్‌లో చెన్నైపై పంజాబ్ బ్యాటర్లు ఆడిన తీరు చూస్తే మళ్లీ కింగ్స్ సునాయాసంగా నెగ్గగలదని భావించారు. కానీ కీలక తరుణంలో చెన్నై బౌలర్లు ప్రత్యర్థికి చెక్ పెట్టారు. తన తొలి ఓవర్లోనే బెయిర్ స్టో (7), రొసో (0)లను తుషార్ బౌల్డ్ చేసి పంజాబ్‌ను దెబ్బ కొట్టాడు. ప్రభ్‌సిమ్రన్, శశాంక్ భారీషాట్లతో అలరిస్తూ మూడో వికెట్‌కు 53 పరుగులు చేసి ఇన్నింగ్స్‌ను గాడిలో పెట్టారు. వీరు క్రీజులో ఉన్నంతసేపూ మ్యాచ్ పంజాబ్‌వైపే మొగ్గింది. అయితే 8వ ఓవర్లో శశాంక్‌ను శాంట్నర్, 9వ ఓవర్లో ప్రభ్‌సిమ్రన్‌ను జడేజా, 10వ ఓవర్లో జితేశ్ (0)ను సిమర్‌జీత్ పెవిలియన్ చేర్చడంతో పంజాబ్ ఓటమి దాదాపు ఖాయమైంది. కర్రాన్ (7), అశుతోష్ (3) విఫలమయ్యారు. హర్‌ప్రీత్ (17 నాటౌట్), రాహుల్ చాహర్ (16), రబాడ (11 నాటౌట్) మెరుపులు పంజాబ్ ఓటమి అంతరాన్ని మాత్రమే తగ్గించాయి.

ఆ నలుగురి చలవతో..: జడేజా, రుతురాజ్, మిచెల్.. ఆఖర్లో శార్దూల్ (17) ధనాధన్ బ్యాటింగ్‌తో చెన్నై సవాలు విసిరే స్కోరు చేసింది. రహానె (9) త్వరగా అవుటైనా.. రుతురాజ్ దంచడంతో పవర్ ప్లేను 60/1తో చెన్నై ముగించింది. కానీ 8వ ఓవర్లో స్పిన్నర్ రాహుల్ చాహర్ రుతురాజ్‌ను, దూబే (0)ని పెవిలియన్ చేర్చి చెన్నైకి డబుల్ షాకిచ్చాడు. తొమ్మిదో ఓవర్లో మిచెల్‌ను ఎల్బీ చేసిన హర్షల్ పంజాబ్‌కు మరో కీలక బ్రేక్ ఇచ్చాడు. అయితే జడేజా, మొయిన్ అలీ (17), శాంట్నర్ (11), శార్దూల్ రాణించడంతో చెన్నై స్కోరు 150 దాటింది.

స్కోరుబోర్డు

చెన్నై: రహానె (సి) రబాడ (బి) అర్షదీప్ 9, రుతురాజ్ (సి) జితేష్ (బి) చాహర్ 32, మిచెల్ (ఎల్బీ) హర్షల్ 30, దూబే (సి) జితేష్ (బి) చాహర్ 0, మొయిన్ (సి) బెయిర్ స్టో (బి) కర్రాన్ 17, జడేజా (సి) కర్రాన్ (బి) అర్షదీప్ 43, శాంట్నర్ (సి) కర్రాన్ (బి) చాహర్ 11, శార్దూల్ (బి) హర్షల్ 17, ధోనీ (బి) హర్షల్ 0, తుషార్ (నాటౌట్) 0, గ్లీసన్ (నాటౌట్) 2, **ఎక్స్‌ట్రాలు: 6; మొత్తం: 20 ఓవర్లలో 167/9: వికెట్లపతనం:** 1-12, 2-69, 3-69, 4-75, 5-101, 6-122, 7-150, 8-150, 9-164; **బౌలింగ్:** రబాడ 3-0-24-0, అర్షదీప్ 4-0-42-2, కర్రాన్ 4-0-34-1, హర్‌ప్రీత్ 1-0-19-0, రాహుల్ చాహర్ 4-0-23-3, హర్షల్ 4-0-24-3.

పంజాబ్: ప్రభ్‌సిమ్రన్ (సి) సబ్ సమీర్ (బి) జడేజా 30, బెయిర్ స్టో (బి) తుషార్ 7, రొసో (బి) తుషార్ 0, శశాంక్ (సి) సిమర్‌జీత్ (బి) శాంట్నర్ 27, కర్రాన్ (సి) శాంట్నర్ (బి) జడేజా 7, జితేశ్ (సి) ధోనీ (బి) సిమర్‌జీత్ 0, అశుతోష్ (సి) సిమర్‌జీత్ (బి) జడేజా 3, హర్‌ప్రీత్ (నాటౌట్) 17, హర్షల్ (సి) సబ్ సమీర్ (బి) సిమర్‌జీత్ 12, రాహుల్ చాహర్ (బి) శార్దూల్ 16, రబాడ (నాటౌట్) 11, **ఎక్స్‌ట్రాలు: 9; మొత్తం: 20 ఓవర్లలో 139/9; వికెట్లపతనం:** 1-9, 2-9, 3-62, 4-68, 5-69, 6-77, 7-78, 8-90, 9-117; **బౌలింగ్:** శాంట్నర్ 3-0-10-1, తుషార్ 4-0-35-2, గ్లీసన్ 4-0-41-0, జడేజా 4-0-20-3, సిమర్‌జీత్ 3-0-16-2, శార్దూల్ 2-0-12-1.

నేటి మ్యాచ్

రాత్రి 7.30 గం.
వేదిక: ముంబై
ముంబై X హైదరాబాద్

పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	ఫ.తే	పా	నె.ర.రే
కోల్‌కతా	11	8	3	0	16	1.453
రాజస్థాన్	10	8	2	0	16	0.622
చెన్నై	11	6	5	0	12	0.700
హైదరాబాద్	10	6	4	0	12	0.072
లఖ్‌నవూ	11	6	5	0	12	-0.371
ఢిల్లీ	11	5	6	0	10	-0.442
బెంగళూరు	11	4	7	0	8	-0.049
పంజాబ్	11	4	7	0	8	-0.187
గుజరాత్	11	4	7	0	8	-1.320
ముంబై	11	3	8	0	6	-0.356

దంచేసి.. కూల్చేసి

టాప్ లేపిన కోల్‌కతా
నరైన్ మెరుపులు
చెలరేగిన చక్రవర్తి, హర్షిత్
98 పరుగులతో లఖ్‌నవూ చిత్తు



సునీల్ నరైన్ (39 బంతుల్లో 81, 1/22)

లఖ్‌నవూ: సునీల్ నరైన్ (39 బంతుల్లో 6 ఫోర్లు, 7 సిక్సలతో 81, 1/22) సూపర్ షోతో.. వరుసగా మూడో విజయాన్ని నమోదు చేసిన కోల్‌కతా నైట్‌రైడర్స్ ప్లేఆఫ్స్‌కు మరింత చేరువైంది. ఆదివారం ఏకపక్షంగా సాగిన మ్యాచ్‌లో కోల్‌కతా 98 పరుగుల తేడాతో లఖ్‌నవూ సూపర్ జెయింట్స్‌ను చిత్తు చేసింది. మొత్తం 16 పాయింట్లతో టాప్‌లోకి దూసుకెళ్లింది. తొలుత కోల్‌కతా 20 ఓవర్లలో 235/6 స్కోరు చేసింది. సాల్ట్ (32), రఘువంశీ (32) రాణించారు. నవీనుల్ 3 వికెట్లు పడగొట్టాడు. ఛేదనలో లఖ్‌నవూ 16.1 ఓవర్లలో 137 పరుగులకే కుప్పకూలింది. స్టొయినిస్ (36), రాహుల్ (25) మినహా మిగతా బ్యాటర్లు విఫలమయ్యారు. వరుణ్ చక్రవర్తి, హర్షిత్ రాణా చెరో 3 వికెట్లతో ప్రత్యర్థి బ్యాటింగ్ వెన్ను విరవగా.. రస్సెల్ 2 కీలక వికెట్లు పడగొట్టాడు. నరైన్ 'మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్'గా నిలిచాడు.

బ్యాట్లెత్తేశారు: బ్యాటర్ల వైఫల్యంతో లఖ్‌నవూ ఘోర ఓటమిని మూటగట్టుకొంది. కోల్‌కతా బౌలర్ల దెబ్బకు క్రమం తప్పకుండా వికెట్లను చేజార్చుకొన్న సూపర్ జెయింట్స్.. ఏ దశలోనూ మ్యాచ్‌లోకి రాలేక పోయింది. ఓపెనర్ అర్షిన్ కులకర్ణి (9) స్వల్ప స్కోరుకే వెనుదిరిగినా.. స్టొయినిస్ ధాటిగా ఆడుతూ స్కోరు బోర్డును పరుగులు పెట్టించాడు. మరో ఓపెనర్ రాహుల్‌తో కలసి 50 పరుగుల భాగస్వామ్యాన్ని నెలకొల్పాడు. సిక్స్‌తో ఖాతా తెరిచిన స్టొయినిస్.. 4వ ఓవర్‌లో స్టార్క్ బౌలింగ్‌లో మూడు బౌండ్రీలు బాదాడు. ఆ తర్వాతి ఓవర్‌లో నరైన్ నాలుగు పరుగులే ఇవ్వగా.. హర్షిత్ బౌలింగ్‌లో స్టొయినిస్ మరో సిక్స్ కొట్టాడు. దీంతో పవర్‌ప్లేలో లఖ్‌నవూ 55/1తో మెరుగ్గానే కనిపించింది. కానీ, 15 పరుగుల తేడాతో రాహుల్, దీపక్ హుడా (5), స్టొయినిస్‌ను కోల్పోయిన సూపర్ జెయింట్స్ 85/4తో ఒక్కసారిగా కష్టాల్లో పడింది. రాహుల్‌ను హర్షిత్ అవుట్ చేయగా.. హుడాను చక్రవర్తి వికెట్ల ముందు దొరకబుచ్చుకొన్నాడు. స్టొయినిస్, పూరన్ (10)ను రస్సెల్ వెనక్కిపంపడంతో లఖ్‌నవూ పరాజయం దాదాపుగా ఖరారైంది. బదోని (15)ను నరైన్ అవుట్ చేయగా.. రెండు సిక్స్‌లు బాదిన టర్నర్ (16)ను చక్రవర్తి రిటర్న్ క్యాచ్‌తో వెనక్కిపంపాడు. క్రునాల్ పాండ్యా (5), యుధ్‌వీర్ (7), బిష్ణోయ్ (2) ఇలా వచ్చి అలా వెళ్లారు.

ఆరంభం అదిరింది: మరోసారి నరైన్ మెరుపులు మెరిపించడంతో కోల్‌కతా భారీ స్కోరు చేసింది. సాల్ట్‌తో కలసి తొలి వికెట్‌కు 26 బంతుల్లో 61 పరుగులు జోడించిన నరైన్.. రఘువంశీతో రెండో వికెట్‌కు 79 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పాడు. టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన నైట్‌రైడర్స్‌కు ఓపెనర్లు సాల్ట్, నరైన్ అదిరే ఆరంభాన్నిచ్చారు. 3వ ఓవర్‌లో నవీనుల్ బౌలింగ్‌లో వీరిద్దరూ చెరో రెండు బౌండ్రీలతో బ్యాట్‌లకు పనిచెప్పారు. ఆ తర్వాతి ఓవర్‌లో మొహిసిన్ బౌలింగ్‌లో చెలరేగిన నరైన్ 4,4,4,6తో ఏకంగా 20 రన్స్ రాబట్టాడు. అయితే, సాల్ట్‌ను నవీనుల్ క్యాచవుట్ చేయడంతో.. రఘువంశీతో కలసి నరైన్ స్కోరు బోర్డును నడిపించాడు. దీంతో పవర్‌ప్లేలో కోల్‌కతా 70/1తో నిలిచింది. కాగా, 9వ ఓవర్‌లో రనౌట్ ప్రమాదాన్ని తప్పించుకొన్న రఘువంశీ సిక్స్‌లతో జట్టు స్కోరును సెంచరీ మార్క్ దాటించాడు. మరోవైపు అర్ధ శతకం పూర్తి చేసుకొన్న నరైన్.. స్టొయినిస్ వేసిన 11వ ఓవర్‌లో మూడు సిక్స్‌లతో మోత మోగించాడు. ఈ దశలో పూర్తిగా అటాకింగ్ గేమ్ ఆడుతున్న నరైన్‌ను అవుట్ చేసిన బిష్ణోయ్.. జట్టుకు ఊరటనిచ్చాడు. బ్యాటింగ్ ఆర్డర్‌లో ముందుగా వచ్చిన వచ్చిన రస్సెల్ (12)ను నవీనుల్ వెనక్కిపంపగా.. రఘువంశీని యుధ్‌వీర్ పెవిలియన్ చేర్చాడు. డెత్ ఓవర్లలో ధాటిగా ఆడతారనుకున్న రింకూ (16), కెప్టెన్ శ్రేయాస్ (23) జోరు చూపలేకపోయారు. ఆఖరి ఓవర్‌లో శ్రేయాస్ అవుటైనా.. రమణ్‌దీప్ (25 నాటౌట్) జట్టు స్కోరును 230 దాటించాడు.

స్కోరుబోర్డు

కోల్‌కతా: సాల్ట్ (సి) రాహుల్ (బి) నవీనుల్ 32, నరైన్ (సి/సబ్) పడిక్కళ్ (బి) బిష్ణోయ్ 81, రఘువంశీ (సి) రాహుల్ (బి) యుధ్‌వీర్ 32, రస్సెల్ (సి/సబ్) గౌతమ్ (బి) నవీనుల్ 12, రింకూ (సి) స్టొయినిస్ (బి) నవీనుల్ 16, శ్రేయాస్ (సి) రాహుల్ (బి) యశ్ 23, రమణ్‌దీప్ (నాటౌట్) 25, వెంకటేశ్ (నాటౌట్) 1, **ఎక్స్‌ట్రాలు: 13; మొత్తం: 20 ఓవర్లలో 235/6; వికెట్ల పతనం:** 1-61, 2-140, 3-167, 4-171, 5-200, 6-224; బౌలింగ్: స్టొయినిస్ 2-0-29-0, మొహిసిన్ 2-0-28-0, నవీనుల్ హక్ 4-0-49-3, యశ్ ఠాకూర్ 4-0-46-1, క్రునాల్ 2-0-26-0, రవి బిష్ణోయ్ 4-0-33-1, యుధ్‌వీర్ 2-0-24-1.

లఖ్‌నవూ: రాహుల్ (సి) రమణ్‌దీప్ (బి) హర్షిత్ 25, అర్షిన్ (సి) రమణ్‌దీప్ (బి) స్టార్క్ 9, స్టొయినిస్ (సి) హర్షిత్ (బి) రస్సెల్ 36, దీపక్ హుడా (ఎల్బీ) వరుణ్ 5, పూరన్ (సి) సాల్ట్ (బి) రస్సెల్ 10, బదోని (సి) స్టార్క్ (బి) నరైన్ 15, టర్నర్ (సి అండ్ బి) వరుణ్ 16, క్రునాల్ (సి) సాల్ట్ (బి) హర్షిత్ 5, యుధ్‌వీర్ (సి) రస్సెల్ (బి) వరుణ్ 7, రవి బిష్ణోయ్ (ఎల్బీ) హర్షిత్ 2, నవీనుల్ (నాటౌట్) 0, **ఎక్స్‌ట్రాలు: 7; మొత్తం: 16.1 ఓవర్లలో 137 ఆలౌట్; వికెట్ల పతనం:** 1-20, 2-70, 3-77, 4-85, 5-101, 6-109, 7-125, 8-129, 9-137, 10-137; **బౌలింగ్:** వైభవ్ 2-0-21-0, స్టార్క్ 2-0-22-1, నరైన్ 4-0-22-1, హర్షిత్ రాణా 3.1-0-24-3, వరుణ్ చక్రవర్తి 3-0-30-3, రస్సెల్ 2-0-17-2.

భారత రిలే జట్లకు నిరాశ

నసావు (బహామస్): భారత పురుషుల 4×400 మీటర్ల రిలే జట్టుకు పారిస్ ఒలింపిక్స్ రౌండ్-1 క్వాలిఫికేషన్స్‌లో నిరాశ ఎదురైంది. ఆదివారం ఇక్కడ జరిగిన హీట్స్‌లో రాజేశ్ రమేశ్‌కు కాలి కండరాలు పట్టేయడంతో భారత జట్టు రేసు పూర్తి చేయలేక మధ్యలోనే నిష్క్రమించింది. ఇక, తెలుగమ్మాయి దండి జ్యోతికశ్రీ, రూపల్ చౌదరి, రాజేశ్ రమేశ్, అవినాశ్‌లతో కూడిన మిక్స్‌డ్ 4×400 మీటర్ల రిలే జట్టు హీట్స్‌లో ఆరో స్థానంలో.. మహిళల 4×400 మీటర్ల రిలే జట్టు ఐదో స్థానంలో నిలిచి నిరాశపరిచాయి. అయితే, భారత జట్లకు అప్పుడే అవకాశాలు ముగిసిపోలేదు. రౌండ్-1లో విఫలమైన అన్ని విభాగాల్లోని జట్లకు సోమవారం జరిగే రౌండ్-2 క్వాలిఫికేషన్స్‌లో పోటీపడేందుకు అవకాశం ఉంటుంది. ఈ రౌండ్-2 పోటీల్లో రాణిస్తే పారిస్ టిక్కెట్ దక్కనుంది.

ఒకే గ్రూపులో భారత్-పాక్



అక్టోబరు 4న కివీస్‌తో తొలి పోరు
మహిళల టీ20 వరల్డ్‌కప్ షెడ్యూల్

దుబాయ్: బంగ్లాదేశ్ ఆతిథ్యం ఇవ్వనున్న మహిళల టీ20 వరల్డ్ కప్ షెడ్యూల్‌ను ఐసీసీ ఆదివారం విడుదల చేసింది. డిఫెండింగ్ చాంప్ ఆస్ట్రేలియా, న్యూజిలాండ్, పాకిస్థాన్ లాంటి జట్లున్న గ్రూప్-ఎలోనే భారత్ కూడా ఉంది. ఈ ఏడాది అక్టోబరు 3 నుంచి 20 వరకు టోర్నీ జరగనుంది. 4న జరిగే తమ తొలి మ్యాచ్‌లో కివీస్‌తో, 6న పాకిస్థాన్‌తో, 9న క్వాలిఫయర్-1తో, 13న ఆసీస్‌తో భారత్ ఆడనుంది. గ్రూప్-బిలో ఆతిథ్య బంగ్లాతోపాటు సౌతాఫ్రికా, ఇంగ్లండ్, వెస్టిండీస్, క్వాలిఫయర్-2 జట్లు ఉండనున్నాయి. అక్టోబరు 17, 18 తేదీల్లో సెమీస్ మ్యాచ్‌లు, 20న ఢాకాలో ఫైనల్ జరుగుతాయి. ఢాకాలో జరిగిన ఈ కార్యక్రమంలో ప్రధాని షేక్ హసీనా, భారత్, బంగ్లా దేశాల కెప్టెన్లు హర్మన్‌ప్రీత్, నిగర్ సుల్తాన్ పాల్గొన్నారు.

బజ్‌రంగ్‌పై తాత్కాలిక నిషేధం

న్యూఢిల్లీ: ఇటీవలే జరిగిన ట్రయల్స్ సందర్భంగా డోప్ టెస్ట్ కోసం శాంపిల్ ఇచ్చేందుకు నిరాకరించిన స్టార్ రెజ్లర్ బజ్‌రంగ్ పూనియాపై తాత్కాలిక నిషేధం విధించారు. మార్చి 10న సోనెపట్‌లో ఆసియా ఒలింపిక్ క్వాలిఫయర్స్ కోసం నిర్వహించిన ట్రయల్స్‌లో ఓటమిపాలైన బజ్‌రంగ్ శాంపిల్ ఇవ్వకుండా వెళ్లిపోయాడు. కాగా తనపై విధించిన నిషేధాన్ని ఎత్తివేసే దాకా బజ్‌రంగ్ ఏ ట్రయల్స్‌లోనూ పాల్గొనలేడు. ఇది అతని ఒలింపిక్ అవకాశాలపై ప్రభావం చూపే అవకాశముంది. అయితే శాంపిల్ ఇచ్చేందుకు తాను నిరాకరించలేదని బజ్‌రంగ్ చెప్పాడు.

కప్పు గెలిస్తే భారీ నజరానా

పాక్ జట్టుకు పీసీబీ బంపరాఫర్

లాహోర్: వచ్చేనెల్లో జరిగే టీ20 ప్రపంచకప్ గెలిస్తే జట్టులోని ఒక్కోసభ్యుడికీ తలో రూ. 2.77 కోట్లు (భారత కరెన్సీలో రూ. 83 లక్షలు) చొప్పున నజరానా ఇస్తామని పీసీబీ చైర్మన్ మొహిసిన్ నక్వీ ప్రకటించారు. ఈ ప్రపంచ కప్‌లో పోటీపడే పాక్ తుది జట్టును ఇంకా ప్రకటించాల్సి ఉంది.

థామస్, ఉబెర్.. రెండూ చైనాకే

చెంగ్డూ (చైనా): ఆతిథ్య చైనా జట్టు థామస్, ఉబెర్ కప్ టీమ్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్‌లను కైవసం చేసుకుంది. ఆదివారం జరిగిన ఉబెర్ కప్ ఫైనల్లో చైనా మహిళలు 3-0తో ఇండోనేసియాను చిత్తుచేసి విజేతలుగా నిలిచారు. థామస్ కప్ తుది పోరులోనూ చైనా 3-1తో ఇండోనేసియానే ఓడించి టైటిల్ దక్కించుకుంది.

బిజినెస్

22,775 పైన బుల్లిష్

(మే 6-10 తేదీల మధ్య వారానికి)



డా. భువనగిరి అమర్‌నాథ్ శాస్త్రి

టెక్ వ్యూ

నిఫ్టీ గత వారం 22,863-22,348 పాయింట్ల మధ్యన కదలాడి గత వారంతో పోల్చితే 56 పాయింట్ల లాభంతో 22,476 వద్ద ముగిసింది. ఈ వారాంతంలో 22,775 కన్నా పైన ముగిస్తే స్వల్పకాలానికి బుల్లిష్ అవుతుంది.

- 20, 50, 100, 200 రోజుల చలన సగటు స్థాయిలు 22,613, 22,566, 22,404, 22,424 వద్ద ఉన్నాయి. ఇవి నిరోధ, మద్దతు స్థాయిలుగా నిలుస్తాయి. 50 డీఎంఏ 200 డీఎంఏ కన్నా పైన ఉండడం దీర్ఘకాలిక బుల్లిష్ ట్రెండ్ సంకేతం.

బ్రేకౌట్ స్థాయి: 22,775 **బ్రేక్‌డౌన్ స్థాయి:** 22,175
నిరోధ స్థాయిలు: 22,675, 22,775, 22,875 (22,575 పైన బుల్లిష్)
మద్దతు స్థాయిలు: 22,275, 22,175, 22,075 (22,375 దిగువన బేరిష్)

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



6వ తేదీ			
హైదరాబాద్	475	విజయవాడ	460
వరంగల్	477	గోదావరి	460
చిత్తూరు	563	విశాఖపట్నం	470
		దజను గుడ్లు రూ.60	

ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	133	గోదావరి	141
వరంగల్	133	విజయవాడ	141
కరీంనగర్	133	గుంటూరు	141
మహబూబ్‌నగర్	133	ఒంగోలు	141
కర్నూలు	133	చిత్తూరు	142
విశాఖపట్నం	133		

గృహ రుణాలు.. రూ.27 లక్షల కోట్లు

మార్చి నాటికి రికార్డు స్థాయికి చేరిక

ఆర్‌బీఐ వెల్లడి



న్యూఢిల్లీ: రియల్టీ బూమ్ గృహ రుణాలకీ డిమాండ్ పెంచుతోంది. ఈ ఏడాది మార్చి నెలాఖరు నాటికి బ్యాంకులు, హౌసింగ్ ఫైనాన్స్ కంపెనీలు మంజూరు చేసిన గృహ రుణాల మొత్తం రికార్డు స్థాయిలో రూ.27.23 లక్షల కోట్లకు చేరింది. రెండేళ్ల క్రితంతో పోలిస్తే ఇది రూ.10 లక్షల కోట్లు ఎక్కువ. భారతీయ రిజర్వ్ బ్యాంక్ (ఆర్‌బీఐ) ఇందుకు సంబంధించిన తాజా గణాంకాలు విడుదల చేసింది. కొవిడ్ తర్వాత నివాస గృహాలకు డిమాండ్ విపరీతంగా పెరగడం, ప్రభుత్వ సానుకూల విధానాలు, ఆకర్షణీయమైన ఫైనాన్సింగ్ ఆప్షన్లు, సొంతింటిపై పెరిగిన మక్కువ ఇందుకు ప్రధానంగా దోహదం చేశాయి. గత రెండేళ్లలో బిల్డర్లు పెద్దఎత్తున నివాస గృహాల ప్రాజెక్టులు ప్రారంభించి అమ్మడం కూడా ఇందుకు దోహదం చేసిందని ప్రాప్‌ఈక్విటీ సీఈఓ, ఎండీ సమీర్ జసూజ తెలిపారు.

భవిష్యత్ ఫేష్: ఈ సంవత్సరం కూడా గృహ రుణాలకు ఢోకా ఉండదని బ్యాంకింగ్ వర్గాల అంచనా. అయితే రుణాల వృద్ధి రేటు గత రెండేళ్ల స్థాయిలో మాత్రం ఉండకపోవచ్చని బ్యాంక్ ఆఫ్ బరోడా (బీఓబీ) ప్రధాన ఆర్థికవేత్త మదన్ సబ్నవిస్ అభిప్రాయం వ్యక్తం చేశారు. ఏది ఎలా ఉన్నా మరో ఆరేళ్లలో గృహ రుణాల మార్కెట్ లక్ష కోట్ల డాలర్ల (ప్రస్తుత మారకం రేటు ప్రకారం సుమారు రూ.83.30 లక్షల కోట్లు) స్థాయికి చేరనుందని ఇక్రా సీనియర్ వైస్ ప్రెసిడెంట్ కార్తీక్ శ్రీనివాసన్ అంచనా. రెండు మూడేళ్ల క్రితం వరకు అందుబాటు ధరల గృహాలకు ఎక్కువ డిమాండ్ ఉండేది. ఇప్పుడు ఉన్నత ఆదాయ వర్గాలు ధర ఎక్కువైనా విశాలమైన నివాస గృహాల కొనుగోలుకు ఆసక్తి చూపిస్తున్నారు.

రోజుకి 507 కొత్త కంపెనీల నమోదు

న్యూఢిల్లీ: దేశంలో గత ఆర్థిక సంవత్సరం (2023-24)లో 1,85,312 కంపెనీలు నమోదయ్యాయి. అంటే రోజుకి 507 కొత్త కంపెనీలు నమోదయ్యాయన్న మాట. కాగా గత ఏడాది మొత్తంలో నమోదైన కంపెనీలన్నింటి ఉమ్మడి పెయిడప్ మూలధనం రూ.30,927.40 కోట్లు. ఒక్క మార్చి నెలలోనే 16,600 కంపెనీలు రిజిస్టర్ చేసుకున్నాయి. కాగా 2022-23లో నమోదైన మొత్తం కంపెనీలు 1,59,524 కాగా వాటన్నింటి ఉమ్మడి పెయిడప్ మూలధనం రూ.18,132.16 కోట్లు. ఇదిలా ఉండగా ఈ ఏడాది మార్చి చివరి నాటికి దేశంలో ఉన్న మొత్తం కంపెనీల సంఖ్య 26,63,016. కాగా వాటిలో 64 శాతం అంటే 16,91,495 కంపెనీలు క్రియాశీలంగా పని చేస్తున్నాయి. మార్చి చివరి నాటికి మూతపడిన కంపెనీల సంఖ్య 9,31,644. కాగా అందులో 2,470 కంపెనీలు నిద్రాణ దశలో ఉన్నాయి. 10,385 కంపెనీలు లిక్విడేషన్‌లో ఉన్నాయి. ఇవి కాకుండా అధికారిక రికార్డుల నుంచి మరో 27,022 కంపెనీల తొలగింపు ప్రక్రియ కొనసాగుతోంది. కార్పొరేట్ వ్యవహారాల మంత్రిత్వ శాఖ మార్చి బులెటిన్‌లో ఈ వివరాలు అందించింది.

మొత్తం కంపెనీల్లో 71 శాతం సేవల రంగంలో ఉండగా 23 శాతం పారిశ్రామిక రంగంలో, 6 శాతం వ్యవసాయ రంగంలో ఉన్నాయి. రాష్ట్రాల వారీగా చూసినట్టయితే 2023-24లో 17.6 శాతం కంపెనీలు మహారాష్ట్రలో నమోదయ్యాయి. ఈ ఏడాది మార్చి నాటికి దేశంలో 5164 విదేశీ కంపెనీలు నమోదు కాగా వాటిలో 3,288 కంపెనీలు (64 శాతం) క్రియాశీలంగా పని చేస్తున్నాయి.

యాక్సిస్ నిఫ్టీ బ్యాంక్ ఇండెక్స్ ఫండ్

యాక్సిస్ మ్యూచువల్ ఫండ్.. యాక్సిస్ నిఫ్టీ బ్యాంక్ ఇండెక్స్ ఫండ్‌ను ప్రారంభించింది. ఇది ఓపెన్ ఎండెడ్ ఇండెక్స్ ఫండ్. ఈ ఫండ్‌కు నిఫ్టీ బ్యాంక్ టీఆర్ఐ బెంచ్ మార్క్‌గా ఉండనుంది. ఈ ఫండ్ కనీస పెట్టుబడి రూ.500. ఈ ఫండ్ ముగింపు తేదీ ఈ నెల 17.

హెచ్‌డీఎఫ్‌సీ మాన్యుఫ్యాక్చరింగ్ ఫండ్

హెచ్‌డీఎఫ్‌సీ మ్యూచువల్ ఫండ్.. హెచ్‌డీఎఫ్‌సీ మాన్యుఫ్యాక్చరింగ్ ఫండ్‌ను తీసుకువచ్చింది. తయారీ రంగంలోని కంపెనీలకు సంబంధించిన ఈక్విటీ, ఈక్విటీ సంబంధిత సెక్యూరిటీల్లో ఈ ఫండ్ పెట్టుబడులు పెడుతుంది. ఇది ఓపెన్ ఎండెడ్ ఈక్విటీ పథకం. భారతీయ తయారీ రంగంలోని వృద్ధి అవకాశాలకు అనుగుణంగా ఈ ఫండ్ వ్యూహాత్మకంగా పెట్టుబడులు పెట్టనుంది. ఈ ఫండ్ ముగింపు తేదీ మే 10.

ఈ వారం మూడు ఐపీఓలు

రూ.6,393 కోట్ల సమీకరణ

న్యూఢిల్లీ: ఈ వారం కూడా ఐపీఓ మార్కెట్ కళకళలాడనుంది. రూ.6,393 కోట్ల సమీకరణ కోసం ఆధార్ హౌసింగ్ ఫైనాన్స్, హెల్త్‌కేర్ టెక్ కంపెనీ ఇండిజెన్, ట్రావెల్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ టీబీఓ టెక్ కంపెనీలు.. పబ్లిక్ ఇష్యూలు (ఐపీఓ) జారీ చేస్తున్నాయి. ఇందులో రూ.4,233 కోట్లు ఆఫర్ ఫర్ సేల్ (ఓఎఫ్ఎస్) ద్వారా, మిగతా మొత్తాన్ని కొత్త షేర్ల జారీ ద్వారా ఈ మూడు కంపెనీలు సమీకరించబోతున్నాయి. ఇందులో ఇండిజెన్ కంపెనీ ఐపీఓ సోమవారం, మిగతా 2 కంపెనీల ఐపీఓలు బుధవారం ప్రారంభం కానున్నాయి. ఆధార్ హౌసింగ్ ఫైనాన్స్ రూ.300-315 ప్రైస్ బ్యాండ్‌లో, ఇండిజెన్ రూ.430-452 ధరల శ్రేణిలో, టీబీఓ టెక్ కంపెనీ రూ.875-920 ప్రైస్ బ్యాండ్‌లో షేర్లు జారీ చేస్తున్నాయి.

బెల్‌స్టార్ రూ.1,300 కోట్ల ఐపీఓ: ముత్తూట్ ఫైనాన్స్ అనుబంధ సంస్థ బెల్‌స్టార్ మైక్రోఫైనాన్స్ కూడా ఐపీఓకు సిద్ధమైంది. ఐపీఓ ద్వారా రూ.1,300 కోట్ల సమీకరణ కోసం కంపెనీ సెబీకి దరఖాస్తు చేసింది.

భారత్ అవకాశాల గని: వారెన్ బఫెట్

వాషింగ్టన్: ప్రపంచ అగ్రశ్రేణి కుబేరుల్లో ఒకరైన వారెన్ బఫెట్ దృష్టి భారత స్టాక్ మార్కెట్‌పై పడింది. భారత మార్కెట్‌ను ఆయన అవకాశాల గనిగా అభివర్ణించారు. 'భారత మార్కెట్ వెతకని అవకాశాలు కల్పిస్తోంది. భవిష్యత్‌లో మా బెర్క్‌షైర్ హాత్‌వే కంపెనీ భారత మార్కెట్‌ను అన్వేషించాలనుకుంటోంది' అన్నారు. బెర్క్‌షైర్ వార్షిక సదస్సులో ఒక హెడ్జ్ ఫండ్ మేనేజర్ అడిగిన ప్రశ్నకు సమాధానంగా బఫెట్ ఈ విషయం చెప్పారు.

అప్రమత్తంగా ఉండటం బెటర్!

దేశీయ స్టాక్ మార్కెట్లలో అనిశ్చితి కొనసాగుతోంది. ఒకవైపు అంతర్జాతీయంగా ప్రతికూల పరిస్థితులు నెలకొన్నాయి. మరోవైపు దేశీయ మార్కెట్లలో వదంతులు మదుపరులను ఆందోళనకు గురి చేస్తున్నాయి. దీంతో ఎన్నికలు ముగిసే వరకు అప్రమత్తంగా ఉండటం మంచిది. ఆ తర్వాత సూచీల మూమెంటమ్‌ను అంచనా వేయొచ్చు. గత శుక్రవారం గరిష్ఠ స్థాయిల్లో సూచీలు బలమైన నిరోధాన్ని ఎదుర్కొన్నాయి. ఈ వారం నిఫ్టీకి 22,450 వద్ద మద్దతు, 22,650 వద్ద నిరోధ స్థాయిలున్నాయి.

స్టాక్ రికమండేషన్స్

పిరామల్ ఫార్మా: నష్టాల మార్కెట్లోనూ ఈ షేరు అదరగొడుతోంది. ట్రేడింగ్, డెలివరీ వాల్యూమ్స్ క్రమంగా పెరుగుతున్నాయి. పైగా 52 వారాల గరిష్ఠ స్థాయి రూ.149ని బ్రేక్ చేసింది. గత శుక్రవారం ఈ షేరు 5.6% లాభంతో రూ.151 వద్ద క్లోజైంది. ఇన్వెస్టర్లు ఈ కౌంటర్‌లో రూ.150 స్థాయిలో పొజిషన్ తీసుకుని రూ.177/185 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.143 స్థాయిని కచ్చితమైన స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

కోల్ ఇండియా: సుదీర్ఘ అప్‌ట్రెండ్ తర్వాత ఈ కౌంటర్‌లో స్వల్ప దిద్దుబాటు జరిగింది. మరోసారి ఈ షేరు జీవితకాల గరిష్ఠాన్ని చేరే అవకాశం ఉంది. గత ఈ వారం నెల గరిష్ఠ స్థాయిలను అధిగమించింది. వాల్యూమ్ అనూహ్యంగా పెరుగుతోంది. గత శుక్రవారం ఈ షేరు 4.56 శాతం లాభంతో రూ.474 వద్ద క్లోజైంది. మదుపరులు ఈ కౌంటర్‌లో రూ.460/470 శ్రేణిలో పొజిషన్ తీసుకుని రూ.545/625 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.445 స్థాయిని స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

ప్రెస్టీజ్ ఎస్టేట్స్: ఈ కౌంటర్‌లో మూమెంటమ్ బాగుంది. రూ.1,440 వద్ద ఆల్‌టైమ్ హైను బ్రేక్ చేసింది. స్వల్ప దిద్దుబాటు అనంతరం ట్రేడింగ్, డెలివరీ వాల్యూమ్ పుంజుకుంది. నష్టాల సెషన్‌లో కూడా ఈ షేరు 4.27 శాతం లాభంతో రూ.1,460 వద్ద ముగిసింది. ట్రేడర్లు ఈ కౌంటర్‌లో రూ.1,450 స్థాయిల్లో పొజిషన్ తీసుకుని రూ.1,570/1,650 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.1,430 స్థాయిని స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

జిందాల్ సా: ఈ మెటల్ కంపెనీ షేర్లపై ఇన్వెస్టర్లకు ఆసక్తి పెరిగిపోతోంది. సుదీర్ఘ అప్‌ట్రెండ్ తర్వాత ఇందులో కన్సాలిడేషన్ జరిగింది. వాల్యూమ్ పెరుగుతుండటంతో మార్చి రెండో వారం నుంచి ఈ షేరు ఏకంగా 50 శాతం పెరిగింది. గత శుక్రవారం ఈ షేరు 3.49 శాతం లాభంతో సరికొత్త జీవితకాల గరిష్ఠ స్థాయి రూ.575 వద్ద స్థిరపడింది. మూమెంటమ్ ఇన్వెస్టర్లు ఈ కౌంటర్‌లోకి రూ.570/550 శ్రేణిలో ప్రవేశించి రూ.665/720 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.540 స్థాయిని స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

టొరెంట్ ఫార్మా: గత వారం ఈ కౌంటర్‌లో వాల్యూమ్ భారీగా పెరిగింది. పైగా స్వల్పకాలిక నిరోధాన్ని బ్రేక్ చేసింది. సూపర్‌ట్రెండ్ ఇండికేటర్ సైతం 'బై' సిగ్నల్ ఇచ్చింది. గత శుక్రవారం ఈ షేరు 2.42 శాతం లాభంతో రూ.2,734 వద్ద క్లోజైంది. ఇన్వెస్టర్లు ఈ కౌంటర్‌లో రూ.2,730/2,710 స్థాయిల్లో పొజిషన్ తీసుకుని రూ.2,840/2,960 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.2,700 స్థాయిని స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.



- మూర్తి నాయుడు పాదం,
మార్కెట్ నిపుణులు, నిఫ్టీ మాస్టర్
niftymasterlive@gmail.com

నోట్ : పెట్టుబడి నిర్ణయాలు తీసుకునే ముందు మదుపరులు తమ ఫైనాన్షియల్ అడ్వైజర్ల సలహాలు తీసుకోవాలి.

ప్రధాన నిరోధాలు 22,650, 22,800



వి. సుందర్ రాజా

టెక్ వ్యూ

నిఫ్టీ గత వారం పాజిటివ్ ధోరణిలో ప్రారంభమై 22,800 వరకు వెళ్లినా గత శుక్రవారంనాడు బలమైన కరెక్షన్‌కు లోనై 200 పాయింట్ల మేరకు నష్టపోయి. వారం మొత్తం మీద 55 పాయింట్ల మేరకు లాభపడినా 22,500 కన్నా దిగువన వారం కనిష్ఠ స్థాయిలో ముగియడం గరిష్ఠ స్థాయిల్లో అప్రమత్తతకు సంకేతం. టెక్నికల్‌గా మార్కెట్ గత కొద్ది వారాలుగా చూస్తున్న సైడ్‌వేస్ ట్రెండ్‌ను కొనసాగించింది. గత రెండు నెలలుగా గరిష్ఠ స్థాయిల్లో సరైన కొనుగోళ్ల మద్దతు లేని కారణంగా నిలదొక్కుకోలేకపోతుంది. అదే సమయంలో దిగువ స్థాయిల్లో లభిస్తున్న కొనుగోళ్ల మద్దతు కారణంగా కనిష్ఠ స్థాయిల్లో రికవరీ కూడా సాధిస్తోంది. టెక్నికల్‌గా ప్రధాన ట్రెండ్ పాజిటివ్‌గానే ఉంది. కాగా గతవారం మిడ్‌క్యాప్ 100 సూచీ 310 పాయింట్లు లాభపడగా, స్మాల్‌క్యాప్ 100 సూచీ 45 పాయింట్లు నష్టపోయింది. మార్కెట్ మరోసారి జీవితకాల గరిష్ఠ స్థాయిలకు చేరువగా వస్తోంది. పలుమార్లు ఇక్కడ ఎదుర్కొన్న పరీక్షల్లో విఫలమవుతూ వస్తోంది. ఈ వారంలో మార్కెట్ పాజిటివ్‌గానే ప్రారంభమై జీవితకాల గరిష్ఠ స్థాయిల్లో పరీక్ష ఎదుర్కొనవచ్చు.

బుల్లిష్ స్థాయిలు: నిఫ్టీ పాజిటివ్ ధోరణిలో ట్రేడయితే మరింత అప్‌ట్రెండ్ కోసం ప్రధాన నిరోధం 22,650 కన్నా పైన నిలదొక్కుకోవాలి. మరో ప్రధాన నిరోధం 22,800. గత నెల 10వ తేదీన ఈ స్థాయి నుంచే మార్కెట్ బలమైన రియాక్షన్ సాధించింది. ఆ పైన నిలదొక్కుకున్నప్పుడే మరింత అప్‌ట్రెండ్ ఉంటుంది. మానసిక అవధి 23,000.

బేరిష్ స్థాయిలు: ప్రస్తుత స్థాయి 22,500 వద్ద నిలదొక్కుకోవడంలో విఫలమైతే దిగువన 22,300 వద్ద మద్దతు ఉంది. అక్కడ కూడా విఫలమైతే మరింత బలహీనపడుతుంది. ప్రధాన మద్దతు స్థాయి 22,000.

బ్యాంక్ నిఫ్టీ: ఈ సూచీ గత వారంలో బలమైన ర్యాలీ సాధించి మానసిక అవధి 50,000 వరకు వెళ్లింది. అక్కడ మైనర్ కరెక్షన్‌లో పడి వారం గరిష్ఠ స్థాయి కన్నా 10,000 పాయింట్లు దిగజారిది. అయినా వారంలో చివరికి 720 పాయింట్ల లాభంతో 48,920 వద్ద ముగిసింది. అప్‌ట్రెండ్ కోసం నిరోధ స్థాయి 49,500 కన్నా పైన నిలదొక్కుకోవాలి. ప్రధాన నిరోధం 50,000. ఒక వేళ 49,000 స్థాయిలో విఫలమైతే బలహీనతను సూచిస్తుంది. మద్దతు స్థాయి 48,600.

పాటర్న్: వీక్లీ చార్టుల ప్రకారం 22,800 వద్ద "డబుల్ టాప్" పాటర్న్ ఏర్పడింది. మరింత అప్‌ట్రెండ్ కోసం దీన్ని బ్రేక్ చేయాలి. అలాగే ఇదే స్థాయిలో "అడ్డంగా ఏర్పడిన రెసిస్టెన్స్ ట్రెండ్‌లైన్" కన్నా పైన నిలదొక్కుకోవాలి.

టైమ్: ఈ సూచీ ప్రకారం ఈ వారంలో స్వల్పకాలిక రివర్సల్ ఉంది.

సోమ వారం స్థాయిలు
నిరోధం : 22,610, 22,650
మద్దతు : 22,500, 22,430
www.sundartrends.in

www.andhrajyothy.com
ANDHRAJYOTHI
సోమవారం | 6-5-2024 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 65 సంచిక (Issue) : 20
Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru
హైదరాబాద్ సిటీ *



ఆంధ్రప్రదేశ్ డీజీపీ ఔట్

- వైసీపీతో అంటకాగిన రాజేంద్రనాథ్ రెడ్డి బదిలీ 7
- తక్షణమే కార్యాలయం విడిచి వెళ్లాలని ఈసీ ఆదేశం
- ఎన్నికల విధులు అప్పగించరాదని ప్రభుత్వానికి సూచన
- శాంతి భద్రతల అదనపు డీజీ శంకబ్రతకు బాధ్యతలు
- నేడు 11 గంటల్లోగా ముగ్గురి పేర్లు పంపాలని సీఎస్‌కు ఆదేశం
- డీజీపీతో పాటు అనంతపురం, రాయచోటి డీఎస్పీలూ బదిలీ

ఏడాదికి 1.3 లక్షలు

తెలంగాణలోని పేదింటి మహిళ ఖాతాలో టకాటక్ వేస్తాం





అలంపూర్‌లో కాంగ్రెస్ జన జాతర సభకు భారీగా హాజరైన జనం; నిర్మల్ జన జాతర సభలో ప్రజలకు రాహుల్ అభివాదం, చిత్రంలో సీఎం రేవంత్

- ఇందులో కేంద్రం ఇచ్చేది రూ.లక్ష.. రాష్ట్రమిచ్చేది రూ.30వేలు
- ఇంటి పనుల్లో మహిళల శ్రమకు గుర్తింపుగానే లక్ష చొప్పున..
- ఈ పథకంతో దేశంలో పేద మహిళలను లక్షాధికారుల్ని చేస్తాం
- రాజ్యాంగం రద్దుకు ఎన్డీయే కుట్ర.. రక్షించే లక్ష్యమే 'ఇండియా'ది
- అందుకే ఇవి ఎన్నికలు కావు.. 2 సమూహాల మధ్య జరిగే యుద్ధం
- మోదీ పనిచేసింది 22 మంది ధనికుల కోసమే..
- వారికి రూ.16 లక్షల కోట్లు మాఫీ చేశారు
- మేం రైతులకు రుణమాఫీ చేస్తాం.. ఎమ్మెస్పీకి చట్టబద్ధత కల్పిస్తాం
- నిరుద్యోగుల కోసం 'పెహలీ నౌకరీ పక్కా' పేరుతో ప్రత్యేక పథకం
- దీనికింద ప్రభుత్వ, ప్రైవేటు రంగ సంస్థల్లో ఏడాది అప్రెంటిస్‌షిప్
- దేశవ్యాప్తంగా జనగణన.. ప్రతి సంస్థనూ సర్వే చేస్తాం
- ఫలితంగా ఎవరి వద్ద ఎంత సంపద ఉందో తేలిపోతుంది
- తర్వాత క్రాంతికారీ రాజకీయాలతో ముఖచిత్రమే మారుతుంది
- రిజర్వేషన్లపై పరిమితిని ఎత్తేస్తాం.. 50శాతానికి మించి ఇస్తాం
- తెలంగాణలోని పథకాలను దేశవ్యాప్తంగా అమలు చేస్తాం
- మోదీ సర్కారు చిమ్మిన విద్వేషాల వీధుల్లో మేం ప్రేమను పంచాం
- నిర్మల్, అలంపూర్ కాంగ్రెస్ జనజాతర సభల్లో రాహుల్ గాంధీ

హైదరాబాద్, మహబూబ్‌నగర్, నిర్మల్, మే 5 (ఆంధ్రజ్యోతి): కేంద్రంలో 'ఇండియా' కూటమి అధికారంలోకి వస్తే దేశవ్యాప్తంగా ప్రతి పేద కుటుంబం నుంచి ఓ మహిళను గుర్తించి ఏడాదికి రూ.లక్ష చొప్పున ఖాతాల్లో వేస్తామని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ప్రకటించారు. గత పదేళ్లలో మోదీ ప్రభుత్వం దేశంలోని 22 బడా కుటుంబాల ప్రయోజనాల కోసమే పనిచేసిందని, పేద ప్రజలను ఏమాత్రం పట్టించుకోలేదని.. 'ఇండియా' కూటమి మాత్రం దేశవ్యాప్తంగా కోట్లలో ఉన్న నిరుపేదలను లక్షాధికారులుగా మార్చేందుకు ప్రత్యేక పథకాన్ని రూపొందించిందని పేర్కొన్నారు. పేద కుటుంబాల్లో పురుషులతో పాటు మహిళలూ పనులకు వెళతారని, అయితే మహిళలు ఇంటి పనుల కోసం 8 గంటల అదనంగా పని చేస్తారని, ఇందుకు వారికి ఎలాంటి చెల్లింపులూ ఉండవన్నారు. వారి ఈ శ్రమను గుర్తించి నెలకు రూ.8,500 చొప్పున ఖాతాల్లో టకాటక్ పడేలా ప్రత్యేక పథకాన్ని రూపొందించినట్లు చెప్పారు. తెలంగాణ రాష్ట్రంలో ఆరు గ్యారెంటీల్లో భాగంగా ప్రతి నిరుపేద మహిళకు నెలకు రూ.2,500 చొప్పున చెల్లింపు హామీని త్వరలోనే అమలు చేస్తామని చెప్పారు. ఆ మేరకు తెలంగాణలోని ప్రతి పేద కుటుంబానికి చెందిన మహిళకు రాష్ట్ర ప్రభుత్వం నుంచి రూ.30వేలు, కేంద్రం నుంచి రూ.లక్ష కలిపి రూ. 1.30 లక్షలు ఖాతాలో పడతాయని వివరించారు. లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆదివారం నిర్మల్ జిల్లా కేంద్రంలో, గద్వాల జిల్లా అలంపూర్‌లో జరిగిన జనజాతర సభల్లో రాహుల్ గాంధీ ప్రసంగించారు. ఈ లోక్‌సభ ఎన్నికలు విభిన్న సిద్ధాంతాలున్న రెండు సమూహాల మధ్య జరుగుతున్న యుద్ధం అని.. ఓవైపు రాజ్యాంగాన్ని రక్షించేందుకు

మిగతా 9వ పేజీలో...

'ఫైనల్'గా మోదీని ఓడించాలి!

- 13న పోలింగ్.. తెలంగాణ వర్సెస్ గుజరాత్ మ్యాచే 9
- బీజేపీని డకౌట్ చేయాలి.. సెమీస్‌లో బీఆర్ఎస్‌ను ఓడించాం
- దేవుడి పేరుతో ఓట్లు అడిగేందుకు బీజేపీ నేతలు సిగ్గుపడాలి
- 'కారు' పాడైంది జుమ్మేరాత్ బజార్లో అమ్మాల్సిందే: రేవంత్



సికింద్రాబాద్‌లోని పరేడ్‌గ్రౌండ్ సభలో అమిత్ షా, కిషన్‌రెడ్డి, ఈటల అభివాదం

ఎస్సీ, ఎస్టీ, బీసీలకు

అదనపు రిజర్వేషన్లు

- ముస్లిం రిజర్వేషన్లు తొలగించి వారికి ఇస్తాం
- రిజర్వేషన్లపై కాంగ్రెస్ ఫేక్ వీడియోలు
- వాటిని షేర్ చేసిన సీఎం రేవంత్
- పోలీసులు ఆయన వెంట పడరా?
- తెలంగాణలో బీజేపీకి 10 సీట్లు ఖాయం
- రాహుల్ గాంధీకి ఏటీఎంలా తెలంగాణ
- మజ్లిస్, బీఆర్ఎస్, కాంగ్రెస్ ఒక్కటే
- కాగజ్‌నగర్, నిజామాబాద్, సికింద్రాబాద్ సభల్లో కేంద్ర హోం మంత్రి అమిత్ షా

ఆసిఫాబాద్/నిజామాబాద్/హైదరాబాద్ సిటీ, మే 5 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం రాహుల్ గాంధీకి ఏటీఎంలా ఉపయోగపడుతోందని కేంద్ర హోం మంత్రి, బీజేపీ అగ్రనేత అమిత్ షా ఆరోపించారు. ఇక్కడ ఆర్ఆర్ ట్యాక్స్ పేరిట రూ.కోట్లు వసూలు చేసి ఢిల్లీకి పంపిస్తున్నారన్నారు. ఆర్ఆర్ అంటే రాహుల్‌గాంధీ, రేవంత్‌రెడ్డి ట్యాక్స్ అని.. కాంగ్రెస్ పాలన అంటేనే ఇలా ఉంటుందని విమర్శించారు. ఎండలు పెరగ్గానే రాహుల్ బాబా థాయ్‌లాండ్, బ్యాంకాక్ విహారయాత్రలకు వెళ్లిపోతారని చెప్పారు. రాహుల్ బాబా లేనిపోని ఆరోపణలు చేసి ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని ధ్వజమెత్తారు. కాంగ్రెస్ అంటేనే ముస్లింలను పెంచి పోషించడమన్నారు. బీజేపీ అధికారంలోకి రాగానే ముస్లిం రిజర్వేషన్లను తొలగించి ఎస్సీ, ఎస్టీ, ఓబీసీలకు అదనంగా వాటిని వర్తింపజేస్తామని ప్రకటించారు. మూడోసారి మోదీ వస్తే రిజర్వేషన్లు తీసేస్తారని కాంగ్రెస్ నేతలు విష ప్రచారం చేస్తున్నారని ఆయన విమర్శించారు. అవి తప్పుడు ప్రచారాలని, ఈ పదేళ్లలో రిజర్వేషన్లు ఏమైనా తీసేశారా!? అని ప్రశ్నించారు. ఇండియా కూటమికి అసలు

మిగతా 10వ పేజీలో...

జగన్ అవినీతి వల్లే పోలవరం జాప్యం!

- వైసీపీ పాలనలో ఏపీలో గూండాగిరీ, అరాచకం
- అభివృద్ధికి బాబు పునాదులు.. ధ్వంసం చేసిన జగన్
- ప్రగతికి బాబు, మోదీ భరోసా.. 2ఏళ్లలో పోలవరం పూర్తి
- రాజధాని అమరావతిని పునర్నిర్మిస్తాం 7
- ధర్మవరం 'ప్రజాగళం' సభలో కేంద్ర హోంమంత్రి అమిత్‌షా

కుర్చీ పోతుందని రేవంత్ భయం

- బీజేపీకి ఎక్కువ సీట్లొస్తే కాంగ్రెస్ అగ్ర నాయకులు ఆయన పదవికి ఎసరు పెడతారని ఆందోళన
- అందుకే రిజర్వేషన్ల రద్దు అని దుష్ప్రచారం 10
- కాంగ్రెస్ సర్కారును పడగొట్టే ఉద్దేశం లేదు
- ఈ ప్రభుత్వం గద్దె దిగేందుకు ఐదేళ్లు ఎక్కువ
- రాష్ట్ర అభివృద్ధికి కేంద్రం రూ.లక్షల కోట్లు ఇచ్చింది
- తెలంగాణ ప్రగతికి మోదీ గ్యారెంటీ: కిషన్‌రెడ్డి

సాయిధరమ్‌తేజ్‌పై దాడి


- డ్రింక్ బాటిల్ విసిరిన వైసీపీ మూకలు
- త్రుటిలో తప్పించుకున్న హీరో తేజ్ 9
- పక్కనే ఉన్న యువకుడికి తీవ్ర గాయాలు
- జనసేన, టీడీపీ శ్రేణులతో వాగ్వాదం
- ఏపీలోని తాటిపర్తి రోడ్‌షోలో తీవ్ర ఉద్రిక్తత



7

మా మామ అంబటి నీచుడు, నిక్రృష్టుడు

- ఆయనకు ఓటేయకండి.. విలువల్లేని మనిషి
- నిస్సిగ్గుగా పెద్ద గొంతేసుకొని
- ఏ అబద్ధాన్నైనా నిజం చేయొచ్చనుకుంటాడు
- ఈయనకు ఓటేస్తే.. లేకి వాళ్లూ
- గౌరవంగా బతకొచ్చనే భరోసా ఇచ్చినట్లే
- రాంబాబు అల్లుడు గౌతమ్ వీడియో వైరల్



వీణవంకలో ఆత్మీయ సమ్మేళనానికి హాజరైన ప్రజలు; జగిత్యాల రోడ్‌షోలో మాట్లాడుతున్న కేసీఆర్

కాంగ్రెస్ ఐదేళ్లూ ఉండదు

- ఎప్పుడు ఎన్నికలు జరిగినా గెలిచేది బీఆరెస్సే
- తెలంగాణ ఉద్యమం ఇంకా అయిపోలేదు
- రాష్ట్ర పునర్నిర్మాణ ప్రక్రియ మిగిలే ఉంది
- కాంగ్రెస్ సర్కారుకు తోక.. తొండం తెలవదు
- తులం బంగారం తుస్.. రాహుల్‌వి అబద్ధాలే
- నీళ్ల తరలింపు కుట్రపై సప్పుడు చేయని రేవంత్
- నేను సీఎంగా ఉన్నప్పుడు ఒప్పుకోలేదు
- నూకలు తినమన్న మోదీకెందుకు ఓటెయ్యాలి?
- ఎన్నికల్లో కాంగ్రెస్, బీజేపీని చిత్తుచేయాలి
- బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ వ్యాఖ్యలు

హుజూరాబాద్/వీణవంక/జగిత్యాల, మే 5: "కాంగ్రెస్ పాలనపై నాలుగైదు నెలల్లోనే ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వచ్చింది. కాంగ్రెస్ సర్కారు పనై పోయింది. ఐదేళ్లు కొనసాగే పరిస్థితి లేదు. అతి తొందరలోనే కాంగ్రెస్ సర్కారు ట్రాక్ తప్పింది. ఇప్పుడున్న కాంగ్రెస్ నాయకుల చేతగానితనమే ఇందుకు కారణం. ఎప్పుడు ఎన్నికలొచ్చినా వచ్చేది బీఆర్ఎస్ ప్రభుత్వమే" అని బీఆర్ఎస్ చీఫ్, మాజీ సీఎం కేసీఆర్

మిగతా 10వ పేజీలో...

మళ్లీ కాంగ్రెస్‌కు ఓటేస్తే దొంగలకు సద్ది కట్టినట్టే

- 6 గ్యారెంటీల బాండ్లు బౌన్స్
- దీనికి శిక్షగా పార్లమెంట్ ఎన్నికల్లో ఓడించాలి 10
- రాహుల్ కాదు.. 'రాంగ్' గాంధీ
- ఓట్ల కోసం మళ్లీ కాంగ్రెస్ కుట్ర
- తెలంగాణ ప్రజలకు సీఎం క్షమాపణ చెప్పాలి: హరీశ్‌రావు

నేటి నుంచి రైతుభరోసా

- మిగిలిన 39 లక్షల ఎకరాలకు రూ.2 వేల కోట్ల చెల్లింపు
- 3 రోజుల్లో పంపిణీ పూర్తి చేసేలా ఏర్పాట్లు
- ఏ పరిమితులు లేకుండా అందరికీ పెట్టుబడి సాయం



హైదరాబాద్, మే 5 (ఆంధ్రజ్యోతి): యాసంగి సీజన్‌లో మిగిలిపోయిన రైతుభరోసా బకాయిలను సోమవారం నుంచి పంపిణీ చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాట్లు చేసింది. ఖజానాలోని నిధులను సర్దుబాటు చేసి తక్షణమే రైతుభరోసా బకాయిలు చెల్లించాలని సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించడంతో అధికారులు ప్రక్రియకు శ్రీకారం చుట్టారు. ఇప్పటికే 111 లక్షల ఎకరాలకు రైతుభరోసా పంపిణీ పూర్తయింది. సోమవారం నుంచి 3 రోజులపాటు మిగిలిన 39 లక్షల ఎకరాలకు రైతుభరోసా పంపిణీ చేయాలని ప్రభుత్వం నుంచి ఆదేశాలు వచ్చాయి. ఇందుకు రూ.2 వేల కోట్లు సర్దుబాటు చేయాల్సి ఉంటుంది. రాష్ట్ర ఖజానాలో అందుబాటులో ఉన్న నిధులతో నగదు బదిలీ ప్రారంభించాలని నిర్ణయించారు. ఆర్బీఐ నుంచి అప్పు తీసుకుంటుండగా.. అవి ఈ నెల ఏడో తేదీన ప్రభుత్వ ఖాతాలోకి జమ కానున్నాయి. ఆలోపే రైతుభరోసా చెల్లింపులు ప్రారంభించాలని ఆర్థికశాఖకు ఆదేశాలు వెళ్లాయి. వ్యవసాయశాఖ అధికారులు

మిగతా 12వ పేజీలో...

పంట నష్టపరిహారం పంపిణీ నేటి నుంచే

12



- ఇటీవలి వడగండ్ల వానకు 15,814 ఎకరాల్లో నష్టం
- ఎకరాకు 10వేల చొప్పున 15.81కోట్ల పరిహారం
- రైతులకు ఇచ్చిన మాట నిలబెట్టుకున్నాం: తుమ్మల

వామ్మో.. 47 దాటేసింది!

- జగిత్యాల జిల్లా వెల్గటూరులో 47.1 డిగ్రీలు
- ఈ సీజన్‌లో ఇదే అత్యధిక ఉష్ణోగ్రత
- సాయంత్రానికి పలు జిల్లాల్లో వానలు
- వడదెబ్బకు ఐదుగురు.. 12
- పిడుగులు పడి నలుగురి మృత్యువాత
- మరో మూడు రోజులు రాష్ట్రంలో ఎండలే



సుడిగాలి మోటారు!

గంటకు అద్దె రూ.4-6 లక్షలు

- లోక్‌సభ ఎన్నికల్లో విస్తృత ప్రచారానికి హెలికాప్టర్లు
- కాంగ్రెస్‌కు 3, బీజేపీకి 2.. నేటి నుంచి మరో నాలుగు
- ప్రధాని మోదీ, కేంద్ర హోం మంత్రి షాకు ప్రత్యేకం..!
- ఈ ఆరు రోజులు మోతెక్కనున్న తెలంగాణ గగనతలం
- ఇంకా వినియోగించని బీఆర్ఎస్.. చివర్లో వాడే చాన్స్

హైదరాబాద్, మే 5(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఓ మూలన ఉన్న పట్టణంలో బహిరంగ సభ.. మరో దిక్కున ఉండే నగరంలో కార్నర్ మీటింగ్..! మధ్యలో ఇంకోచోట రోడ్ షో..! అన్నిటినీ కవర్ చేయాలి..! ప్రజలను కలవాలి..! ఓట్లు అభ్యర్థించాలి..! మమ్మల్నే గెలిపించమని కోరాలి..! అటు చూస్తే సమయం లేదు నాయకా అంటూ పోలింగ్ తేదీ తరుముతోంది! దీంతో సుడి గాలి ప్రచారం కోసం రాజకీయ పార్టీలు గాలి మోటార్లను విస్తృతంగా వాడేస్తున్నాయి. తమ నేతలు ఒకే రోజు పలు సభల్లో పాల్గొనాల్సి ఉండడం, షెడ్యూల్‌కు అందుకోవాల్సిన పరిస్థితుల్లో గంటకు రూ.లక్షల్లో అద్దె చెల్లిస్తూ

మిగతా 11వ పేజీలో...

వివిధ

సాహిత్య వేదిక

బొమ్మలు: అక్బర్



పొయ్యి పెట్టుకునే మూలలు లేవు
ఉన్నదళ్ల గీ మూల మీద గుడిసెనే
అయితే ఎండాకాలమచ్చిందంటే
సెర్లపొంటి ఏరుకచ్చుకునే తుంగసొప్ప
మా ఇంటి మీద వాలిన సల్లటి సుట్టమైతుండే
ఇసుక జల్లెడలెక్క ఉన్న ఇల్లు మొత్తం
వానాకాలం సూర్నీళ్లతో తానమాడుతదనే భయానికి
ఇస్కూల్ పిల్లగానికి అంగి తొడిగినట్టు
తాటిపత్రి కప్పేటోళ్ళం
ఎన్ని జేస్తే ఏం లాభం
ఎన్నడు లేని కప్పల పెళ్ళికి
ఈ యేడు ఎంత దయ కలిగిందో వానదేవునికి
చెరువు తల్లి గుండెలో మా గుడిసెను నింపుకోమన్నాడు.
ఎన్నిసార్లు చెప్పేదో నాయన
ఇంటి గచ్చు కింద ఎర్రమొరం పోపిద్దాంరా అని,
ఎవరికి తెలుసు, ఇప్పుడు గిట్ల ఎర్రమన్ను చెరువుల తేలిపోతదని
పాపం అరుగుమీద బొగ్గుతోని అక్కచెల్లెలు గీసుకున్న అష్టచెమ్మగళ్ళలో
ఇప్పుడు కట్ల మైసమ్మ ఒక్కతే కూసోని ఆడుకుంటున్నదేమో.
ఎన్ని కొంగలు గుడిసెమీద కూసోని ముచ్చట్లు పెట్టుకుంటున్నయో
మా తలాపుకున్న మట్టి గోడలల్ల
ఇప్పుడు ఎన్ని మన్నుపాములు పండుకున్నయో
ఇంటి ముందట ఇసుక కుప్పల
ఇప్పుడు ఎన్ని కప్పలు ఒర్రుతున్నయో
సక్కటి సెయి రాతతో ఉత్తరం రాసి
భద్రంగా బీరువాలో దాసుకొని
సమాధానం కోసం ఎదురుసూస్తున్నట్టు
ప్రభుత్వమైతే జాగ లెక్కలేసింది కానీ
ఇల్లు ఇచ్చేతందుకే తారీఖు చెప్పడం మర్సిపోయింది.

జానెడు చదరంగం పెట్టెల రెండు రాజ్యాలు ఇరికినట్టు
దోసిట్ల పట్టుకునే గల్ల గురిగంత మా ఇంట్ల
రూపాయి బిళ్ళలోలే ఇంతమందిమి
సిన్నప్పుడు ఎట్లా ఉండేటోళ్ళమో,
ఇంత చిన్న ఇంట్ల శంకుమూలలు,

సందీప్ వొటారికారి

93902 80093

అమృతలత - అపురూప అవార్డ్స్

అమృతలత - అపురూప అవార్డ్స్ కార్యక్రమం మే 19 సాయంత్రం 4.15 నుంచి ఎన్.టి.ఆర్. ఆడిటోరియం, తెలుగు యూనివర్సిటీ, హైదరాబాద్‌లో జరుగుతుంది. ముఖ్య అతిథి వోలేటి పార్వతీశం, విశిష్ట అతిథి అలేఖ్య పుంజాల, ఆత్మీయ అతిథి తులసి. అమృతలత జీవన సాఫల్య పురస్కారాలను కె.వి. కృష్ణకుమారి, ఆలూరి విజయలక్ష్మి అందుకుంటారు. అపురూప అవార్డులను జి.ఎస్. లక్ష్మి, సిహెచ్ సుశీలమ్మ, శివలక్ష్మి, సావేరి దుర్గాభవాని, సమతా రోష్ని, నండూరి సుందరీ నాగమణి, కొండపల్లి నీహారిణి, జ్యోతిర్మయి, అంజనీ యలమంచిలి, గీత హజారే, ప్రేమ మాలిని, దేవనపల్లి వీణావాణి అందుకుంటారు.

టి. వసంత

'వేదిక' సాహిత్య సమావేశం

'వేదిక' ఆధ్వర్యంలో మే 11 సాయంత్రం జరగనున్న గూగుల్ మీట్ ఆన్‌లైన్ సమావేశంలో వి వి గనేశనందన్ రాసిన ఆంగ్ల నవల 'Brotherless Night'ను స్వప్న పేరి పరిచయం చేస్తారు. తర్వాత వెంకట్ ఈశ్వర్ కథ 'ఋతుపవనం' మీద చర్చ వుంటుంది. వివరాలకు: 81426 42638

అనిల్ అట్లూరి

గీతమ్ పురస్కారం

గీతమ్ సంస్థ పన్నెండవ వార్షికోత్సవం సందర్భంగా ఉత్తమ కవితా సంపుటాలను ఎంపిక చేసి 'గీతమ్ పురస్కారం' ఇస్తున్నాం. అత్యుత్తమ సంపుటికి రూ. 10116/- నగదు, జ్ఞాపికతో పురస్కారం ఉంటుంది. 2016-2024 మధ్య కాలంలో విడుదలైన సంపుటాలను మూడు కాపీలను చిరునామా: గీతమ్ సాహితీ సంస్థ, పిఠాపురం - 533450, ఫోన్: 98483 98240కు పంపాలి.

ఓలేటి వెంకటేశ్వర రావు

చెన్నమనేని రంగనాయకమ్మ అవార్డ్

శ్రీలేఖ సాహితి, వరంగల్ ఆధ్వర్యంలో చెన్నమనేని రంగనాయకమ్మ స్మారక విశిష్టాద్వైత జాతీయ సాహిత్య పురస్కార సభ మే 12 సాయంత్రం 5గంటలకు ముప్పవరపు వెంకయ్య నాయుడు స్వగృహం, జూబ్లీహిల్స్, హైదరాబాద్‌లో జరుగుతుంది. ముఖ్య అతిథి- మాజీ ఉప రాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్య నాయుడు; సభాధ్యక్షులు- రేవూరి అనంత పద్మనాభరావు; సత్కారములు- శ్రీదేవి మురళీధర్, వైష్ణవ వేంకటరమణమూర్తి, గార రంగనాథం. 'శ్రీభాష్యము-శర దీపిక', 'వేదాంత దేశికులు-హంస సందేశము' పుస్తకాల ఆవిష్కరణ ఉంటుంది.

శ్రీలేఖ సాహితి

అనుకుంటాం కానీ..

మరొకరి ప్రేమ వలన
మనకొచ్చేది ఏముంది!
మోహమూ మోసమూ

కలిసిరావడం కన్నా
కలిదోషమేముంది!
దంభమూ దాహమూ

వరుస విజయాలొసగని
విషాదమేముంది!
విస్మృతీ ఓటమీ

వద్దు వద్దు అనుకోగలిగితే
వచ్చి చేరనిదేముంది!
మోక్షమూ మోదమూ

టి. శ్రీవల్లీ రాధిక



తామరాకు

రోజు ముగిసే సమయానికి
భిక్షువు తన జోలె కుమ్మరించి
ఒక్క నాణెం కోసం వెతుక్కున్నట్టు నేనూ,
ఎక్కడైనా 'రా' అనే ఒక్క అక్షరం ఉందేమో
ఇన్ని వేల ఉత్తరాల్లోనని!

పోగొట్టుకున్న ప్రేమ
పోగొట్టుకోలేని ప్రాణం
సర్దుకొని సాగలేని రెండు విరుద్ధాలు
గుప్పెడు శరీరంలో,
దేన్ని ఎటు నుంచి లాగి ఎటు ముడివేయాలని?

పొద్దు తోటే గుండె కుంగుతుంది
నడిరేయి మైదానంలో
మూడోకంటికి తెలియని తుఫాను,
ఏం పట్టుకుపోయిందో
ఎంత మేట కొట్టుకుపోయిందో
ఎవరూ అడగరు,
ఈ అంతర్లీనపు ఆస్తి నష్టం గురించి.

మరోసారి పగిలిపోయాక

నువ్వున్న నిన్న
నువ్వు లేని నిన్న
ఏదీ మతిలో ఉండదు

గుర్తు రానంత దూరం పోలేక
గుర్తు చేయకూడనంత దూరం మాత్రమే వెళ్లాను!

ఇదో లోకం
నవ్వే మనుషులు గ్రహాంతరవాసుల్లా
ప్రేమ ఎబ్బెట్టుగా
స్వేచ్ఛ అబద్ధంలా
దుఃఖం అజరామరంగా
లోకాన్ని చూసే నా చూపు మారిపోతుంది!

ఇప్పుడు ఏదీ స్పష్టంగా కనిపించదు
ఏ ముఖమూ గుర్తుపట్టలేను

కంటి ముందు కొందరు మనుషులు
కొన్ని వాహనాలు - కొన్ని వస్తువులు
శూన్యం అనలేని మసక
మరణం అనలేని మనుగడ!

రేఖాజ్యోతి

97044 23255



కవులు యాత్రికులై, యాత్ర కవిత్వమైనప్పుడు...!

మొట్టమొదటి మనిషికి ప్రకృతి స్నేహిత. చెట్టు, పిట్ట, ఏరు, ఆకాశం ఇవన్నీ అద్భుతాలు. వీటి నుండే ప్రేరణ పొందాడు. జీవితానికి, సాహిత్యానికి ఇవి మూలాలు. నదినో, సముద్రాన్నో చూసినప్పుడు ఇప్పటికీ మనిషి అప్రయత్నంగా కేకలు వేస్తాడు. కానీ కాలక్రమంలో ఇప్పటి మనిషి ప్రకృతికి దూరం అయ్యాడు. ఒక్కసారి మన గుండెల మీద చేయి వేసి నిజాలు మాట్లాడుకుంటే మనం చంద్రుడిని పలకరించి చాలా రోజులు అయి ఉంటుంది. ఎగిరే పక్షులను, పాడే తూనీగలను శ్రద్ధగా పరిశీలించి చాలాకాలం అయి ఉంటుంది. వాస్తవానికి సాహిత్యం అక్కడి నుంచే మనిషికి అందింది. పాయల మురళీకృష్ణ అన్నట్టు- ప్రతి యాత్ర జీవితంలోనుంచి జీవితంలోకి, చరిత్రగా మారే క్షణం నుంచి చరిత్ర లోకి.

మానవుడిగా జన్మించాక ఏదో ఒక ఊరిలో పుడతాం. చాలామంది అదే ఊర్లో ఉండిపోతారు. కొందరు ఉద్యోగ రీత్యా వేరే ప్రాంతాలకు వెళ్తారు. ఉన్న చోటే ఉన్నా, వేరే ప్రాంతాలకు వెళ్లినా ఎక్కువమంది ఏదో ఒక చోట స్థిరపడి పెళ్లి చేసుకుంటారు, పిల్లల్ని కంటారు, చనిపోతారు. కానీ మనిషిగా అవకాశం ఉన్నప్పుడు వివిధ ప్రాంతాల్ని చూడాలి, ఆస్వాదించాలి. హత్తుకోవాలి లోపలికి తీసుకోవాలి. అలా తీసుకున్న వాటిని కొందరు యాత్రా సాహిత్యంగా రికార్డు చేస్తున్నారు. కొందరు కవులు తాము వెళ్ళిన ప్రాంతాలను చూసి అక్కడ పొందిన స్ఫూర్తితో కవిత్వం అవుతున్నారు.


ఒక కవి రామప్ప గుడిని చూడ్డానికి వెళ్ళాడు. ఆ ఉలికళకు శిలాపూర్వక వందనాలు సమర్పించుకున్నాడు. పిలిస్తే చాలు లేచి ఒక్క ఉదుటన దూకడానికి సిద్ధంగా ఉన్న నందిని చూసి ఆశ్చర్యపోయాడు. ఆ గుడి చుట్టూ రకరకాల భంగిమలలో ఎన్నో కథలను హృదయాల్లోకి పంపుతున్న యువతీ యువకుల చిత్రాలు చూశాడు. ఆ శిల్పాలను చెక్కిన ఉలి ఉంటే తిరూర్లో తుంజన్ ఘంటాన్ని ఊరేగించినట్లు ఊరేగించాలని పొంగిపోయాడు. ముగింపులో-

"ఇంతకీ ఈ శిల్ప ప్రాచీన కట్టడంలో/ ఇవాళ ఇట్టే ఇమిడిపోతున్న నేనెవరిని/ నాటి రామప్పనా/ అతనికి రాయినందించిన సహచరుణ్ణా లేక అనుచరుణ్ణా/ లేక ఈ గుడి మీద వాలిన తొలి పక్షినా" ('ఉలి కళ', దర్భశయనం శ్రీనివాసాచార్యులు) అంటూ తాదాత్మ్యం చెందాడు. ఈ కవి బుద్ధగయను సందర్శించి బోధి వృక్షం నీడలో మనసుని శుభ్రం చేసుకున్నాడు. చెట్టు నీడ నుంచి వెళ్లిపోతూ బుద్ధుని నీడ వెలుతురై ఆయన కళ్ళల్లోకి చేరినది. తేటపడ్డ చూపుతో ఈ యాత్రను కొనసాగిస్తూ, "నా దారిని నేనే వెతుక్కుంటూ" అంటూ తాను పొందిన జ్ఞానోదయాన్ని మన ముందు ఉంచాడు. దర్భశయనం అండమాన్ జైలు గురించి కూడా ఒక కవిత రాశాడు. అక్కడి చీకటి గదిలో ఈ దేశపు పోరాట యోధుల్ని బంధించి ఆనందించిన తెల్లవాడి మురికితనాన్ని, వాడి భయాన్ని ఆయన మనకు గుర్తు చేస్తాడు. ఢిల్లీలోని లోటస్ టెంపుల్‌ని చూశాక కూడా ఆయన 'కమల దేవళం' అనే శీర్షికతో అద్భుతమైన కవిత రాశాడు.

యాత్రలకు వెళ్లిన వ్యక్తులు కవులు అయితే కచ్చితంగా వారు కవిత్వంలో ఆ ప్రాంతాన్ని రికార్డు చేస్తారు. ఇది సాంస్కృతిక ప్రసారంలో ఒక భాగం అవుతుంది. అట్లాంటి కవితలు చదివిన పాఠకుడు, అటు వెళ్లినప్పుడు ఆ కవి రాసిన భావాలు లేదా అనుభూతులు నిజమా కావా పరీక్షించుకుంటాడు. బెల్లంకొండ రవికాంత్ అనే కవి మైసూర్ వెళ్ళాడు. అయితే అతను మైసూర్ గురించి రాయలేదు. మైసూర్ వెన్నెల గురించి కవిత రాశాడు. వాస్తవానికి వెన్నెల ఎక్కడైనా వెన్నెలే, అయితే ఈ కవిని మైసూర్ వెన్నెల ఆవహించింది. అసలు మైసూర్ వెన్నెలను అక్షరాలు చేయడానికి ఎన్నో భాషా శాస్త్ర పరిశోధనలు జరగాలి అంటాడు. కవిత ముగింపులో తనకు తాను ఒక ప్రశ్న వేసుకున్నాడు. మైసూర్‌లో నువ్వేం చూసావు అని అడిగితే- "మెరుస్తున్న కళ్ళతో/ హృదయాన్ని కాగితంలా పరిచి/ వెన్నెల్లో తడిచి ముద్దయిన నన్ను/ ఈ అక్షరాలను చూపిస్తాను," అంటూ ఇదే కవితని మనకు సాక్షిగా ఇచ్చాడు. అయితే అందరి కవులు రాసిన యాత్రకు సంబంధించిన కవితల్లో కవిత్వం ఉండకపోవచ్చు.

డమ్మీ భావాలని కవిత్వంలో చూపించితే మనకు తెలిసిపోతుంది. యాత్ర అనుభూతికి సంబంధించింది. ఆ కవి రాసిన అనుభూతి నాలోకి కూడా ప్రసారం కావాలి. అందువల్ల యాత్రలకు వెళ్లి కవిత్వం రాసే కవులు భావాల్లో, భావనల్లో నిజాయితీ ఉండాలి. డాక్టర్ ఎన్. గోపి గోవాకి వెళ్లారు. ఆయనకి గోవా భావ కవిత్వంలా కనిపించింది. లోతుల్లోకి వెళ్తే మానవీయ సంగీతం వినిపించింది.

అక్కడ గైడు చెప్పేవన్నీ ఆయనకు యాంత్రిక వచనాల్లా వినిపిస్తున్నాయి. గోవా ఎందుకో చాలా మారిపోయినట్టుగా ఆయన కనిపించింది. "ఒకప్పుడు గోవా నిండా ప్రాచీన హవా/ పావురాల్లా తిరిగే మరబోట్లతో/ ఇప్పుడిది నయా గోవా" అంటారు. అయితే ఈ కవి తను ప్రారంభిస్తూనే "అరేబియా సముద్రం మీద స్వారీ చేసే జవనాశ్వం గోవా/ పశ్చిమ కనుమల్లో విరబూసిన నీటి పువ్వు/ కొంకణీ కింకిణులు ధ్వనించే పుణ్యభూమి" అని అనడం ద్వారా గోవాని చాలా అద్భుతంగా చిత్రీకరిస్తారు.



కశ్మీర్‌ని చూసిన ఇద్దరు కవులు విభిన్నంగా స్పందించడం గమనించ వచ్చు. పాపినేని శివశంకర్ 'కుంకుమ పూల రాణి' అనే పేరుతో ఓ కవిత రాశారు. ఈ కవిత కాలం 2010. కశ్మీర్ చరిత్రతో ఆ కవిత ప్రారంభం అవుతుంది. కశ్మీర్‌ను మొగల్ రాజుల మోహస్వప్నంగా, ఎండిన నా గుండెల్లో సైతం ప్రేమను పచ్చగా మొలిపించే కాల్పనిక సౌందర్యంగా హత్తుకున్నారు.

> యాత్రలకు వెళ్లిన వ్యక్తులు కవులు అయితే కచ్చితంగా వారు కవిత్వంలో ఆ ప్రాంతాన్ని రికార్డు చేస్తారు. ఇది సాంస్కృతిక ప్రసారంలో ఒక భాగం అవుతుంది. అట్లాంటి కవితలు చదివిన పాఠకుడు, అటు వెళ్లినప్పుడు ఆ కవి రాసిన భావాలు లేదా అనుభూతులు నిజమా కావా పరీక్షించుకుంటాడు.

ఇదంతా మొదటి భాగం అయితే రెండవ భాగంలో కశ్మీర్‌లోని కల్లోల పరిస్థితి గురించి చెప్పుకొచ్చారు. అక్కడి చీకటి కంచెలు, విభజన రేఖలు, దుఃఖ ఆగ్రహాలను చెప్తూ- "ఈ కాటుక రాత్రిలాగానే ఘనీభవించిన దాల్ సరస్సుపై/ కదలని షికారాలో/ మానని గాయాలు నిమురుకుంటున్న కన్నీటి కాలకన్యా/ నా పగిలిన సౌందర్య పాత్రవు నువ్వేనా/ చెరచబడిన స్వప్నానివి నువ్వేనా," అంటూ చారిత్రక సాక్ష్యాలను వర్తమాన వాస్తవాలను బేరీజు వేస్తూ రాశారు. అలాగే సుంకిరెడ్డి నారాయణరెడ్డి 'కాశ్మీరం' అనే పేరుతో 2018లో ఓ కవిత రాశారు. ఈ కవికి కశ్మీర్‌లో కరెంట్ పోల్ చివరన కూడా మంచు పువ్వే కనిపించింది. "ఎక్కడ చూసినా పత్తిని తెంపి పరచినట్టు, ఇళ్ళు అన్ని మల్లెపూలను కప్పుకున్నట్టు, మేఘాలు దిగివచ్చి కొండల మీద కండువాలా పరుచుకున్నట్టు/ చెట్ల ఆకుల మీద ముగ్గుజల్లినట్టు, జీలం నదుల గుండ్ల మీద కుందేలు పిల్లలు కూర్చున్నట్టే" కశ్మీర్‌లో మంచు కనిపించింది. ఇక్కడ కవి ఒక పొడవైన ఉపమాలంకారాన్ని సమర్థవంతంగా వాడుకున్నాడు. ఇంకా కవి కవితలో మంచుతో అక్కడ పడే ఇబ్బందుల్ని చెప్తాడు. ఈ కవికి కశ్మీర్‌లో పేదరికపాయ కనిపించింది. కడుపులో కల్లోల భాష వినిపించింది. కశ్మీర్ మాదే అనే స్వరాలు వినిపించాయి. జెండాల అహంకార తూటాల పగులు మధ్య విచ్ఛిన్నమైన ముఖాలు కూడా కనిపించాయి- "తెల్ల గులాబిలు ఈ నేలలో రక్తం స్రవిస్తున్నవి/ నాగళ్ళు ఏకే 47 అవుతున్నవి/ పొలాలు బుల్లెట్లను పండిస్తున్నవి/ సౌందర్య లోయ ప్రతిచ్ఛాయ నెత్తురుపాయ/ కాశ్మీర పురా సౌందర్యం/ కళ్ళల్ల మెదులుతున్నది". ఈ కవితలో గమనించదగ్గ మరో అంశం కవిత అంతా కూడా తెలంగాణ జీవద్భాషలో సాగుతుంది.

మరొకవి వఝల శివకుమార్ బ్రైస్ లోయ అందాలను చూసి ఆశ్చర్యపోయాడు. పసితనపు అవ్యక్త అనుభూతిని పొందాడు. లోయలు శతాబ్దాల సహస్రాబ్దాల భౌగోళిక సంక్షోభాలను, సన్నిపాతాలను పద్యాలుగా పొదిగి దాచుకున్న మహాకావ్య సంగ్రహాలయంగా అనుకున్నాడు- "బ్రైస్! ఓ సౌందర్య లయా/ నీ మనసు అద్దంలో/ ఉదయాస్తమయాలు సింగారించుకుంటాయి/ సున్నపురాతి గోడలను సహజగవాక్షాలను/ రెక్కల స్తంభాలను మీటుతూ గాలి/ మంచు కోతలు గతాన్ని గానం చేస్తుంది" అంటూ ఆ లోయ రసప్రవాహ చలనాన్ని మనలోకి తీసుకెళ్తాడు.

పనిలో పనిగా మానవుడు సృష్టిస్తున్న కొత్త విధ్వంసాన్ని గుర్తు చేస్తాడు. కొండలను, గుట్టలను, అడవులను, ఎడారులను సైతం వదలని దురాశను ప్రశ్నిస్తాడు. కవి తాను చూసిన ఒక ప్రాంతం అందాన్నే కాకుండా, అక్కడ ధ్వంసం అయిపోతున్న లేదా మరణం అయిపోతున్న చుట్టు పక్కల పరిస్థితులను కూడా అక్షరీకరించాల్సిన అవసరం కూడా ఉంటుంది.

మంత్రి కృష్ణమోహన్ కర్ణాటకలోని హొయసల, హళేబీడు వెళ్ళాడు. పరమానందాన్ని పొందాడు. అక్కడ చరిత్ర, పలకరించిన మనోహర శిల్పాలు అతని అనాది మోహాన్ని కదిలించాయి. అతను నిలబడిన ప్రదేశం ఎంత చదివినా పూర్తికాని మహాకావ్యం అనిపించింది. అక్కడి కట్టడాలు మానవాళికి మౌనంగా సందేశాన్ని వినిపిస్తున్నట్లు అనిపించాయి- "వెదుక్కుంటూ వచ్చానిక్కడికి/ దూరాభారం లెక్కచేయక/ సకుటుంబంగా/ పిల్లలేం తిలకించారో/ ఏం అందిందో తెలియదు/ అయినా అందినదేదో అందిన క్షణమే/ తెలియాలనేముంది గనక" అని అని ఒక తత్వాన్ని ప్రకటించాడు.

ముకుంద రామారావు నయాగరా జలపాతాన్ని చూసి, కరిగి కన్నీరు అయిన అనంత జలరాశి, పరవళ్ళు తొక్కుతున్న ప్రవాహం, సూర్యకాంతిని హత్తుకొని రాళ్ళ మీద తలబాదుకుంటున్న ఇంద్రధనుస్సు, ఒళ్ళు ఝుళ్లనిపించే ఆకాశ అవయవంగా కవిత్వీకరించాడు. ప్రముఖ కవి అన్నవరం దేవేందర్ ఇంద్రవెల్లి వెళ్ళాడు. అక్కడ తీగలు తీగలుగా ఎగబడే పోరాటం చూసాడు.

ఆదివాసుల ప్రాకృతిక జీవన వైవిధ్యానికి అబ్బురపడ్డాడు. ఎద నిండిన ఆనందంతో అడవిని గుండెల్లో పెట్టుకొని ఇంటికి ప్రయాణమయ్యాడు- "ప్రవాహ గోదావరి దాటంగానే/ అడవితో ఆత్మీయ అలయ్ బలయ్/ దారికిరువైపులా చెట్లకు నెత్తుటి పూలు అమరత్వపు జ్ఞాపకాల నయనాలు" అంటాడు. ఈ ప్రయాణం అతనిలో ఎర్రదనాన్ని నింపింది. అలాగే ఆయన పాపికొండల మధ్య ప్రయాణం చేశారు. అక్కడి పత్ర హరిత జీవితాలను చూసి సంబర పడుతూనే ప్రపంచీకరణ పాము పరివాప్తి కోసం అడవి, ఆదివాసి అంతర్ధానం అయిపోతాయేమోనని దిగులు పడ్డాడు. ఆయనే బొగత జలపాతానికి వెళ్ళాడు. అక్కడి నీళ్ల ఉరవడి చూసి కళ్ళల్లో నీళ్లు పెట్టుకున్నాడు. వాన చినుకులు కోసం ఎదురుచూసే కళ్ళకి ఒకేసారి అన్ని నీళ్లు కనిపిస్తే, హఠాత్తుగా కన్నీళ్లే వస్తాయి. బొగత జలపాతం చుట్టూ ఉన్న దృశ్యాలను ప్రతి వాక్యంలోనూ కవి నింపాడు. ఇక రేణుక అయోల తన తాజమహల్ సందర్శనను 'ప్రేమ కట్టడం' అనే పేరుతో కవితగా మలిచారు. ఆమెకు అక్కడ ప్రేమ పాదాలు, పదాలతో పాటు కఠిన శిలలు మోసిన కూలీల చెమట ధారలు, చలువరాతి పలకల కింద నలిగిన బతుకుల ఆనవాళ్లు కనిపించాయి. అయితే షాజహాన్ ప్రేమని మోసుకెళ్తున్నంత అనుభూతితో ఆమె అక్కడి నుంచి తిరిగి వచ్చింది.

చత్తీస్‌గఢ్‌లో జగదల్పూర్ సమీపంలో చిత్రకూట్, దండకారణ్యాన్ని చూసినపుడు పాయల మురళి "కాకులు లేని ఆకాశమా నీలో నా దేశాన్ని దర్శిస్తున్నాను, ఇది నా నిజప్రదేశ యాత్రలా ఉంది" అంటాడు. అక్కడ ఏ పిట్టల కిలకిలలు లేని దండకారణ్యాన్ని చూసి, "నువ్వు ఇంకా సూర్యోదయాన్ని స్వప్నంలోనే వెతుక్కుంటున్నావా" అని సందేహాన్ని వ్యక్తం చేస్తాడు.

అయితే కేవలం ఒకే ఒక కవితలో అన్ని అంశాల్ని కవులు చెప్పలేకపోవచ్చు. అంతా చెప్పేయాలని అనుకున్నా సాగతీతలు అతివ్యాప్తులు తప్పవు. మనం యాత్రలకు వెళ్ళినప్పుడు అక్కడి అనుభవాలు అనుభూతులతో పాటు సామాన్యుల జీవితాన్ని కూడా దృష్టిలో పెట్టుకుంటే మంచిది. గత సాహిత్య చరిత్రలో సామాన్యులను విస్మరించడం ప్రత్యేకంగా గుర్తు చేయాల్సిన అవసరం లేదు. అదే పొరపాటున మనం పునరావృతం చేయకూడదు. మల్లారెడ్డి మురళీమోహన్ అడవి రుచి తెలియాలంటే తేనె పూసిన కళ్ళతో చూడమంటాడు. ఆకాశాన్ని అర్థం చేసుకోవడానికి మబ్బులు భాష నేర్చుకోమంటాడు. "మనిషితనం గుబాళించాలంటే/ ప్రయాణించే దారి పొడుగునా/ ప్రతి చేష్టా, ప్రతి స్పర్శ/ ప్రకృతికి పర్యాయపదమై జీవయాత్ర సాగించాలి". యాత్రలు చేద్దాం. యాత్రలో సాహిత్యాన్ని, ప్రకృతిని, సమాజాన్ని ఎలా చూడాలో అలా చూద్దాం.

సుంకర గోపాల్

94926 38547

పలు అస్తిత్వాల అనువర్తనం 'ఆసు'



"కవికి సమాజానికి మధ్య సమన్వయం కుదిరేవరకూ కవి కవిత్వం రాస్తూనే ఉంటాడు." నిబద్ధతగల ఏ కవీ దీనికి అతీతుడు కాడు. ఈ కోవకు చెందినవాడే వెల్దండి శ్రీధర్. ఇటీవలి కాలంలో తను వెలువర్చిన కవితా సంపుటి 'ఆసు' వొక చర్చనీయ సందర్భం. తెలుగు సాహిత్యంలో 2002 నాటికే అంతకు క్రితం ఉన్న సాహిత్య భావజాలానికి, పోస్ట్ మాడ్రనిజం అస్తిత్వ భావజాలానికి మధ్య నిలబడి సందిగ్ధత జూలు విదుల్చుకుంది. చాలామంది తమ కవిత్వంలో నిప్పురాజేసే కార్యక్రమానికి స్వస్తి చెప్పి అస్తిత్వ వాదాల్లోకి జొరబడిపోయారు. ఈ మూసల్లోంచి బయట పడి కొత్త మార్గాన్ని అనుసరిస్తున్న వాడే వెల్దండి శ్రీధర్.

ముందుమాటలో జూకంటి జగన్నాథం చెప్పినట్లు కవి తన కవిత్వంలో 'నిప్పు'ను అలాగే కాపాడుకుంటూ వచ్చాడు. శీర్షిక చూచాయగా అస్తిత్వ ప్రకటన చేస్తున్నా పేదరికం, దోపిడీల కాళ్ల కింద నలిగిన చిన్ననాటి అనుభవాల్లోంచి భావప్రకటన ఒక్కసారిగా Incredibleను కూడా వెంటేసుకొని విరుచుకు పడుతుంది. 'ఖాళీ ఫ్లవర్' కవితలోని అభివ్యక్తి పాఠకుడిని కాస్త ఘాటుగా తాకుతుంది. గిట్టుబాటు ధర పొందలేని రైతు నిస్సహాయతని నిటారుగా నిలబెట్టి రాజ్యాన్ని నిలదీస్తాడు:

"మరుజన్మలోనైనా
ఖడ్గమై మొలిస్తే బావుండు
పంటను పెంటలా చూసేవాడి
తలను తుత్తునియలు చేయడానికి"

కాలం కవిత్వాన్ని శాసిస్తుంది అనడం కొన్నిసార్లు అతిశయోక్తి అవుతుందేమో కానీ అన్నిసార్లు కాదు. రెండు దశాబ్దాల నుండి తెలుగు కవిత్వం దళిత, స్త్రీ, ప్రాంతీయ అస్తిత్వాల్ని పొదివి పట్టుకొని జాగ్రత్తగా అడుగులేస్తుంది. దీనికి గుర్తుగా యాస, భాష ప్రత్యేక సూచికాంకాలయ్యాయి. ఇష్టపడి కొందరు, అనివార్యంగా మరి కొందరు మొత్తానికి దాదాపు ఏదో ఒక సందర్భంలో ఈ కాల ప్రవాహంలో అడుగుమోపినవారే. శ్రీధర్ ఈ తరహా ప్రాంతీయ అస్తిత్వ వాదాన్ని పదును పెట్టడంలో భాగంగా నిర్ద్వందంగా నినదిస్తాడు.

"పంచాయితద్దూ
పెద్దమనుషులొద్దూ
ఏండ్లసంది గెట్టు పెట్టే ఉన్నది
గీతదాటితే మరోసారి సాయుధ పోరాటం
హద్దుల ఉంటే అలైబలై పీరీల పండుగ"

పై వాక్యాలు పూర్తిగా ప్రాంతీయ అస్తిత్వంలో మునిగి తడితడిగా వడివడిగా కవిత్వంలోకి అడుగులేసిన భావ ప్రకంపనలు. ఇలాంటి స్నిగ్ధ వ్యక్తీకరణ వెల్దండి శ్రీధర్ 'మోదుగుపూలు' కవితలో చూడొచ్చు.

"గుండెలోని
మంటలు కొన్ని అడవిని చేరి
పాఠాలేవో నేర్పుతూ
మింటిని తాకుతాయి
అరుణారుణ సూర్య బింబాలు
అడవి అంచున ఉదయిస్తాయి"


- దీనిలో డిక్షన్ పాతది కాని వ్యక్తీకరణ కూర్పులో కొత్తదనం ఉంది. ఇదే కవితలోని "మోదుగుపూలు బడుగుజీవుల ఆకలి డొక్కలు" అనే పదాలు దృశ్యసాదృశ్యాన్ని అర్థ పరిపుష్టిని కలిగి ఉన్నాయి.

వెల్దండి శ్రీధర్ కుటుంబ వృత్తి రీత్యా నేతపని చేసేవారు. 'ఆసు' అనే శీర్షిక ఈ కవితా సంపుటికి ఆ నేపథ్యంలోంచే ఎంచుకున్నది కావచ్చు.

"నాగలి లేనిదే పంటను తీయలేనట్లు
ఆసు లేనిదే బట్టను నేయలేం
చీర నేర్చిన ఊసులన్నీ
నునుగారంగా ఆసు నేర్పినవే" అంటాడు.

తెలంగాణ నేలకు ఒక ప్రత్యేకత ఉంది. పోరాటాల నేపథ్యం ఉంది. దీనికి పురాలంకృతంగా చరిత్రలో నలిగిపోయిన అణచివేత, దోపిడీల పునరావృతాలున్నాయి. ఎక్కడ అణచివేత అధికంగా అనిర్వచనీయమవుతుందో అక్కడ తిరుగుబాటు సాధారణ సంప్రదాయమవుతుంది. తెలంగాణ మట్టిలో పుట్టి గాయపడ్డ ప్రతి మనిషి ఈ భావనను బహిరంగంగానో, అంతర్గతంగానో వ్యక్తపరుస్తూనే ఉంటాడు. "ఒక మనిషి ఇంకో మనిషిని కొనగలిగేంత ఆర్థిక స్థితి కలిగి ఉండకూడదు" అలాంటి స్థితి నెలకొన్న ప్రతి చోట సమాజ విచ్ఛిన్నతకు బీజం పడుతూనే ఉంటుంది అంటాడు రూసో. కానీ అవి ఏ పేదవాడి ఎదురు చూపుల ముంగిటిలో 'న్యాయాన్ని' ఆవిష్కరించిన దాఖలాలు లేవనే చెప్పాలి. అలా అని ఒక సభ్య సామాజిక వ్యాసాంశంగా ఈ విషయాన్ని నిష్కర్షగా చెప్పలేం. ఇక విడమర్చే వెనులుబాటు, విరుచుకుపడి ఖండించే aggressiveness కవికి ఉంటుంది. వెల్దండి శ్రీధర్ విషయంలోనూ అంతే... అదే అస్తిత్వం గాయపడ్డప్పుడు యుద్ధానికి సిద్ధమైన సైనికుడిలా తెగింపుతో ఊగిపోతాడు.

> తెలుగు సాహిత్యంలో 2002 నాటికే అంతకు క్రితం ఉన్న సాహిత్య భావజాలానికి, పోస్ట్ మాడ్రనిజం అస్తిత్వ భావజాలానికి మధ్య నిలబడి సందిగ్ధత జూలు విదుల్చుకుంది. చాలామంది తమ కవిత్వంలో నిప్పురాజేసే కార్యక్రమానికి స్వస్తి చెప్పి అస్తిత్వవాదాల్లోకి జొరబడిపోయారు. ఈ మూసల్లోంచి బయటపడి కొత్త మార్గాన్ని అనుసరిస్తున్న వాడు వెల్దండి శ్రీధర్.



"దొరలకు సైతం ఎదురు నిలబడి
కానూన్ తప్పనియ్యని నిఖార్సైన బిరుసుతనం
... ...
మాట తప్పితే కళ్ళకు మొక్కుతుంది
రివాజు తప్పి కలల దగ్గర పెట్టమంటే
అదే పాడె మీద కప్పే చివరి వస్త్రం అవుతుంది"

కాని వాస్తవానికి 'ఆసు' కవితా సంపుటిలోంచి మట్టి వాసన అస్తిత్వానికంటే ముందుగా పాఠకుడిని కమ్ముకొని మైమర్చిపోయేలా చేస్తుంది. వెల్దండి శ్రీధర్ నొస్టాల్జియాలో బహుశా మట్టిదే మొదటి మెట్టేమో! 'నవ్విన నాగలి' అనే కవిత మొత్తం ప్రతీకాత్మకం. ఏ పదాల పెదాల్ని మూసేయాలన్నా మనసొప్పదు:

"మెతుకు కావ్యానికి/ వాన చినుకులు ముందుమాట రాస్తున్నాయి/ మట్టి సారాన్ని సవరించి/ పచ్చదనాన్ని అదను మీద నాటుతున్నాయి/ పనిముట్లు స్వేదాన్ని చిందిస్తూ/ మేఘాల రుమాళ్లతో/ ముఖం తుడుచుకుంటున్నాయి/ మన్నుకు వెన్న పూసి/ ఇంట్లోని చేతులన్నీ/ వెన్నెముకను నిటారుగా నిలబెడుతున్నాయి"

వెల్దండి శ్రీధర్ 'ఆసు' కవితా సంపుటి జీవితాన్ని వివిధ కోణాల్లో మన కళ్ళముందుంచుతుంది. అన్ని కోణాల్ని స్పర్శించగల్గటం అసాధ్యం కాని కొంతవరకు ఊహించగలం. వెల్దండి శ్రీధర్ స్త్రీవాదం, దళితవాదం, విప్లవవాదం, ప్రాంతీయవాదం అన్నింటినీ తన కవిత్వంలో స్పృశించాడు. ఊపిరి సలపకుండా పనితో అలసిపోయి నిద్రలోకి జారిపోయిన భార్య గూర్చి రాస్తూ ఒక్క మాటలో "స్వప్నంలో ఎప్పుడో ఊపిరి తీసుకున్నట్లు కలగంటుంది" అంటాడు. అత్యున్నతమైన వ్యక్తీకరణ ఇది. బ్రివిటీని కావాల్సిన చోట వాడుకోవడమంటే ఇదే.


ఇలా సాగిపోయే 'ఆసు' కవితా ప్రవాహంలో వెల్దండి శ్రీధర్ తాత్విక భూమికల్లోకి ఇంకిపోవడానికి 'మట్టిపాట' రాగాన్ని ఎంతో హృద్యంగా ఆలపిస్తాడు.

"నడిపించేది గుండె చప్పుడే అనుకుంటాం
మట్టి హృదయపు సవ్వడి విన్నవాడిదే
బతుకు పల్లవైనా... చరణమైనా.."

కందుకూరి దుర్గా ప్రసాద్

96189 29018

www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI
ABN ఆంధ్రజ్యోతి
Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru



ఆదివారం ఉష్ణోగ్రత గరిష్ఠం 42.8 కనిష్ఠం 29.3



ఓటింగ్‌కు దూరం.. దూరం!

కంపల్సరీ ఓటింగ్ అంటే..

ఓటు వేయడం అనేది బాధ్యత. కానీ, హక్కుల గురించి మాట్లాడే చాలామంది దీనిని నిర్వర్తించేందుకు ఆసక్తి చూపడం లేదన్నది అందరికీ తెలిసిన అంశం. ప్రజల్లో ఓటింగ్‌పై నిరాసక్తత గమనించి కొన్ని దేశాలు ఓటింగ్‌ను కంపల్సరీ చేశాయి. మరి కొన్ని దేశాలైతే ఓటు వేయకుంటే జరిమానాలూ విధిస్తున్నాయి. నిజానికి కంపల్సరీ ఓటింగ్ అనేది కొత్త విషయమేమీ కాదు. 1892లో బెల్జియం, 1912 నుంచి అర్జెంటీనాలో ఓటు తప్పనిసరిగా వేయాలని నిబంధన తీసుకువచ్చారు. అర్జెంటీనాలో 1914లోనూ, ఆస్ట్రేలియాలో 1924లోనూ ఈ నిబంధన అమల్లోకి వచ్చింది. ఇప్పటికీ దీనిని అమలు చేస్తున్నాయి. నెదర్లాండ్స్, వెనిజులా లాంటి దేశాల్లో ఈ నిబంధన కొంతకాలం అమలు చేసి ఎత్తేశారు. సింగపూర్‌లో సరైన కారణం చెప్పకపోతే ఓటరు జాబితా నుంచి పేరు తొలగిస్తారు. మరలా నమోదు చేసుకోవాల్సి ఉంటుంది. సరైన కారణం చెప్పకపోతే జరిమానా కూడా చెల్లించాల్సి ఉంటుంది.

● ఓటరు నమోదుకూ నగరవాసుల వెనుకంజ

ఓటింగ్‌కు దూరంగా ఉంటున్నవారిలో హైదరాబాద్ వాసులు ముందు వరుసలో ఉంటున్నారు. పోలింగ్ జరిగిన ప్రతిసారీ గ్రేటర్ దాదాపు వెనుకంజలో ఉంటోంది. ఓటు వేయడానికే కాదు.. ఓటు నమోదు చేసుకునేందుకు కూడా చాలా మంది యువత ఉత్సాహం చూపడం లేదు.

హైదరాబాద్ సిటీ, మే 5 (ఆంధ్రజ్యోతి): అత్యధిక పోలింగ్ శాతం నమోదు కావాలంటే కంపల్సరీ ఓటింగ్ ఒక్కటే మార్గం అని చెబుతున్నారు గత ఎన్నికల పోలింగ్ సరళిని క్షుణ్ణంగా పరిశీలించిన కొందరు అధ్యయనకారులు. కొన్ని దేశాల్లో ఈ తరహా ఓటింగ్ ఉందని, మన దేశంలోనూ అది అమలు చేయడం కష్టమేకానీ, ఆ దిశగా ఆలోచన చేస్తే ఫలితాలు మాత్రమే కాదు, రాజకీయ నాయకుల తీరూ మారే అవకాశాలున్నాయంటున్నారు.

ఎన్నికల్లో పాల్గొంటున్న యువతరం సంఖ్య దేశంలో తక్కువగానే ఉంటున్నది. మరీ ముఖ్యంగా కొత్తగా ఓటు కోసం నమోదు చేసుకుంటున్న యువతరం కూడా తక్కువే. భారత ఎన్నికల సంఘం ఇటీవల వెల్లడించిన ఒక నివేదికలో దేశంలో ఈ ఎన్నికల వేళ 18 ఏళ్లు నిండి ఓటు వేసేందుకు అర్హులైన కొత్త ఓటర్లు 49 మిలియన్‌ల మంది ఉంటే, కేవలం 18 మిలియన్‌ల మంది మాత్రమే నమోదు చేసుకున్నారని పేర్కొంది. ప్రస్తుతం దేశంలోనే అత్యధిక యువత కలిగిన బిహార్‌లో కేవలం 17 శాతం మాత్రమే ఓటు కోసం నమోదు చేసుకున్నారని కూడా ఆ అధ్యయనం వెల్లడించింది. ఢిల్లీలో ఇది 21 శాతంగా ఉంటే, అత్యధిక లోక్‌సభ స్థానాలు కలిగిన ఉత్తర ప్రదేశ్‌లో 23 శాతంగా ఉందని చెబుతున్నది. మరి హైదరాబాద్‌లో కేవలం 76,833 మంది నమోదు చేసుకున్నారు. ఇది చాలదూ.. మన వారికి ఈ ఎన్నికల పట్ల ఎంత ఆసక్తి ఉందో వెల్లడించడానికి!

ఓటు వేయకపోతే..

ఓటు వేయకపోతే పెరూలో ప్రభుత్వ పథకాలు కొన్నాళ్లపాటు అందవు. బొలివియా లాంటి దేశాల్లో ఓటు వేసిన తర్వాత ఒక కార్డు ఇస్తారు. దీనిని చూపిస్తేనే ఎన్నికల తర్వాత మూడు నెలలపాటు జీతంను బ్యాంకు నుంచి పొందగలరట. బెల్జియం లాంటి దేశాల్లో ఓటరు కాకపోతే, ప్రభుత్వ ఉద్యోగం పొందడం దుర్లభమే!

తొలిసారి ఓటు వేస్తున్నారా?

● స్థిరమైన లక్ష్యాలు మనసులో ఉంచుకుని ఓటు వేయాలంటున్న నిపుణులు

హైదరాబాద్ సిటీ, మే 5 (ఆంధ్రజ్యోతి): తెలంగాణాలో ఓటు అర్హత వచ్చిన వారిలో దాదాపు 67% వరకూ నమోదు చేసుకున్నారని ఎన్నికల సంఘ నివేదికలు వెల్లడిస్తున్నాయి. తొలిసారిగా ఓటు వేసే యువతలో ఉత్సాహం తొణికిసలాడుతుంది. ఆ ఉత్సాహాన్ని ఇప్పటికే సామాజిక మాధ్యమాలలో చూపుతున్నారు. అయితే తొలిసారి ఓటు వేయబోతున్న వారికి నిపుణులు కొన్ని సూచనలు చేస్తున్నారు.

*** నియోజకవర్గం గురించి అవగాహన పెంచుకోవాలి**

తొలిసారి ఓటు వేస్తోన్న నగరవాసులలో చాలామందికి తమ నియోజకవర్గమేదో తెలియదు. కాబట్టి ముందుగా తమ నియోజకవర్గం గురించి తెలుసుకోవాలి. ఎన్నికల సంఘం వెబ్‌సైట్‌లో ఈ సమాచారం ఉంటుంది.

*** కావాల్సిన డాక్యుమెంట్లు..**

ఓటరు కార్డు ఉండాలి. అయితే చాలామందికి ఓటరు కార్డు వచ్చి ఉంటుంది కానీ, చివరి నిమిషంలో నమోదు చేసుకున్న వారికి అందకపోయి ఉండవచ్చు. అలాంటి వారు

మిగతా 4వ పేజీలో..

పోలింగ్ స్టేషన్‌లో అత్యుత్సాహం వద్దు...

తొలిసారి ఓటు వేస్తున్నప్పుడు భావోద్వేగాలను నియంత్రించుకోవడం కష్టం. కొంతమంది ఎంతగా తనిఖీలు చేసినా సెల్‌ఫోన్ లోపలకు పట్టుకుని వెళ్లడం, సెల్ఫీలు తీసుకోవడం చేస్తారు. ఈ అత్యుత్సాహం మిమ్మల్ని ప్రమాదంలో పడేయవచ్చు.

సకుటుంబ సపరివార సమేతంగా..
ప్రచారంలో బంధుగణం



ప్రచారం చేస్తున్న ఈటల సతీమణి జమున

హైదరాబాద్ సిటీ, మే 5 (ఆంధ్రజ్యోతి): పోలింగ్ సమయం దగ్గరపడుతున్న కొద్దీ అభ్యర్థులు ప్రచారం జోరు పెంచుతున్నారు. వారితో పాటు కుటుంబసభ్యులు, బంధువులు ప్రచారంలో పాల్గొంటున్నారు. అభ్యర్థులు ఓ ప్రాంతంలో ప్రచారం నిర్వహిస్తే, వారి బంధువులు మరో ప్రాంతం ఎంచుకుంటున్నారు. అందరూ కలిసి అన్ని ప్రాంతాలనూ చుట్టేలా ప్రణాళికలను రచించుకుంటున్నారు. కొడుకులు, కోడళ్లు, కుమార్తెలు ఎన్నికల ప్రచారంలో పాల్గొంటూ కరపత్రాలు పంచుతున్నారు. బీఆర్ఎస్ సికింద్రాబాద్ పార్లమెంట్ అభ్యర్థి పద్మారావు గౌడ్‌కు మద్దతుగా నలుగురు కుమారులతో పాటు మొదటిసారిగా కోడలు శిల్పారామేశ్వర్ గౌడ్ మామ గెలుపుకోసం ప్రచారం చేస్తున్నారు. కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి గెలుపుకోసం భార్య కావ్యారెడ్డి, కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి దానంనాగేందర్ గెలుపుకోసం భార్యతో పాటు బంధువులు ఎన్నికల ప్రచారం చేస్తున్నారు. మల్కాజిగిరి పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి ఈటల రాజేందర్ గెలుపుకోసం ఆయన సతీమణి జమున, కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి పట్నం సునీతారెడ్డి కోసం కుమార్తె మనీషారెడ్డి ప్రచారం చేస్తున్నారు.



ప్రచారంలో కాంగ్రెస్ అభ్యర్థి సునీతారెడ్డి కుమార్తె మనీషారెడ్డి

బ్రేక్‌ఫాస్ట్ విత్ ఓటర్స్

● అపార్ట్‌మెంట్లు, కాలనీ సంఘాలతో సమావేశాలు



హైదరాబాద్ సిటీ, మే 5 (ఆంధ్రజ్యోతి): ఎండలు ఎక్కువగా ఉండడంతో అభ్యర్థులు ఉదయం, రాత్రుల సమయాల్లో ప్రచారానికి ఎక్కువ సమయం కేటాయిస్తున్నారు ఉదయం పూట బ్రేక్‌ఫాస్ట్ సమావేశాలు నిర్వహిస్తున్నారు. పార్కుల్లో వాకింగ్‌కు వచ్చే వారిని కలుస్తున్నారు. సాయంత్రం, రాత్రి పూట కాలనీ, అపార్ట్‌మెంట్ల ఓటర్లతో ఎక్కువ సమావేశాలు నిర్వహిస్తున్నారు. ఇంతకు ముందు ఎక్కువగా మురికివాడలు, బస్తీలపైనే దృష్టి సారించి ఓట్లను సాధించేందుకు ప్రయత్నాలు చేసే వారు. ఈసారి మధ్యతరగతి ఓట్లు ఉండే కాలనీలు అపార్ట్‌మెంట్లపై ఎక్కువగా కన్నేశారు. కనీసం 300 నుంచి 500 మంది ఓటర్లు ఉండే అపార్ట్‌మెంట్లను గుర్తించి వారిని కలుసుకుని మద్దతు కూడగట్టుకుంటున్నారు. స్థానికంగా ఉండే కార్యకర్తలకు, నాయకులకు ఈ బాధ్యతలు అప్పగించారు. ముందుగా వారు రెండు, మూడు సార్లు చర్చలు జరిపిన తర్వాత అభ్యర్థులతో ముఖాముఖి సమావేశం ఏర్పాటు చేస్తున్నారు. సనత్‌నగర్, అంబర్‌పేట, ఖైరతాబాద్, ముషీరాబాద్, సికింద్రాబాద్ అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఈ తరహా భేటీలు ఎక్కువగా జరుగుతున్నాయి. విద్యాధికులు ఎక్కువగా ఉండే కాలనీలపై కూడా అభ్యర్థులు ప్రధానంగా దృష్టి కేంద్రీకరిస్తున్నారు.

బీజేపీ అగ్ర తాంబూలం

- కమలం నేతల ప్రచార జోరు
- మరోసారి రానున్న మోదీ
- అమిత్ షా ఇప్పటికే రెండు సార్లు రాక
- నగరంలోనే కేంద్రమంత్రులు



పరేడ్‌గ్రౌండ్‌లో ఆదివారం సాయంత్రం జరిగిన సభలో ప్రజలకు అభివాదం చేస్తున్న అమిత్ షా, చిత్రంలో కిషన్‌రెడ్డి, ఈటల తదితరులు

సభకు హాజరైన జనం

హైదరాబాద్ సిటీ, మే 5 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల ప్రచారానికి ఇంకా కేవలం ఆరు రోజులు మాత్రమే ఉంది. దీంతో కమలం అగ్రనేతలు గ్రేటర్‌పై నజర్ పెట్టారు. నామినేషన్ల ప్రక్రియ ప్రారంభం కాకముందే ప్రధాని నరేంద్రమోదీ మల్కాజిగిరిలో రోడ్డు షో నిర్వహించి అగ్రనేతల ప్రచారానికి శ్రీకారం చుట్టారు. ఈ నెల 10న నిర్వహించే బహిరంగసభలో మరోసారి పాల్గొననున్నారు. హైదరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గంలో అభ్యర్థి మాధవీలత కొంపెల్లకు మద్దతుగా కేంద్ర మంత్రి అమిత్‌షా ఈనెల ఒకటిన పాతబస్తీలో రోడ్డు షో నిర్వహించారు. పరేడ్‌గ్రౌండ్‌లో ఆదివారం నిర్వహించిన బహిరంగ సభలో పాల్గొన్నారు. పార్టీ జాతీయ అధ్యక్షుడు నడ్డా రోడ్డుషో నిర్వహించారు. మాజీ గవర్నర్

మిగతా 4వ పేజీలో..

కాంగ్రెస్ 'సై'తం..



గ్రేటర్‌లోని కనీసం మూడు స్థానాలను దక్కించుకోవాలని కాంగ్రెస్ లక్ష్యాన్ని నిర్దేశించుకుంది. దీనిలో భాగంగా టీపీసీసీ అధ్యక్షులుగా ఉన్న సీఎం రేవంత్‌రెడ్డి నగరంలో రోడ్‌షోలు నిర్వహిస్తున్నారు. కాంగ్రెస్ అగ్రనేతలుగా ఉన్న రాహుల్‌గాంధీ, మల్లికార్జున్ ఖర్గే, ప్రియాంకగాంధీలతో కూడా నగరంలో సభలకు, రోడ్‌షోలకు ప్లాన్ చేస్తున్నారు. బీఆర్ఎస్ నుంచి ఇప్పటికే కేటీఆర్ రోడ్‌షోలు నిర్వహిస్తున్నారు. మధ్యాహ్నం వేళలో ఫంక్షన్‌హాల్స్‌లో అసెంబ్లీ నియోజకవర్గాల పార్టీ ముఖ్య నేతలతో సభలు, సమావేశాలు జరుపుతున్నారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌తో భారీ సభను జరిపేందుకు ప్రణాళికలు చేపడుతున్నట్లు తెలిసింది.

అమిత్ షా మీటింగ్ హైలైట్స్

- బస్సులు, ఆటోల్లో జైశ్రీరామ్ నినాదాలతో సభకు జనాలు తరలివచ్చారు.
- సెక్యూరిటీ స్కానర్లను లెక్కచేయకుండా తోసుకుంటూ మహిళలు సభాప్రాంగణంలోనికి వెళ్లారు.
- సభ ఆలస్యం కావడంతో అమిత్ షా ప్రసంగం ప్రారంభం కాక ముందే జనం బయటికి వెళ్లడం కనిపించింది.
- రాత్రి 7.55 నిమిషాలకు అమిత్ షా స్పీచ్ ప్రారంభమై 8.17 గంటలకు ముగిసింది.
- మోదీ మాస్కులతో ఓ అభిమాని సభా ప్రాంగణంలో సందడి చేశాడు.
- మోదీ పాలనలో ఏనాడూ రిజర్వేషన్లు తగ్గించలేదని కె. లక్ష్మణ్ తెలిపారు. కాంగ్రెస్ రక్తంలేని రేవంత్ రెడ్డి అబద్ధాలు చెప్తూ ప్రజలను మోసం చేస్తున్నారని ఆరోపించారు.
- అణగారిన వర్గాలకు, వెనకబడిన కులస్థులకు పదవులను కట్టబెట్టింది బీజేపీనేనని ఈటల రాజేందర్ అన్నారు. అబద్ధాలు చెప్పి రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ నాయకులు, మళ్లీ ప్రజలను మోసం చేయాలని చూస్తున్నారన్నారు.
- సభ నేపథ్యంలో జేబీఎస్ కూడళ్లతో పాటు పరిసరప్రాంతాలు కాషాయమయంగా మారాయి.

మిగిలింది ఐదు రోజులే అయినా.. 4

లష్కర్‌లో కుల సమీకరణలు



- అభ్యర్థుల సామాజికాంశం ప్రభావితం
- గంపగుత్తగా ఓట్లు రాబట్టుకునే అవకాశం
- పార్టీలతో సంబంధం లేకుండా ఓట్లేయ్యాలంటున్న కులపెద్దలు
- ఇప్పటికే తమ అభ్యర్థిని గెలిపించుకోవాలంటూ నిర్ణయాలు





హైదరాబాద్ సిటీ, మే5 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ మహానగరంలో అత్యంత కీలకంగా ఉన్న సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గంలో కుల సమీకరణాలు మొదలయ్యాయి. తమ సామాజికవర్గానికి చెందిన ఓట్లను గంపగుత్తగా రాబట్టుకునేందుకు అభ్యర్థులు ప్రయత్నాలు చేస్తున్నారు. బీఆర్ఎస్ నుంచి బరిలో దిగిన పద్మారావుగౌడ్, కాంగ్రెస్ నుంచి బరిలో దిగిన దానం నాగేందర్ అదే పనిలో బిజీగా ఉన్నారు. ఆయా సామాజిక వర్గాల ప్రధాన కార్యాలయాలన్నీ సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గాల పరిధిలోనే ఉండడంతో పెద్దలంతా పార్టీలతో సంబంధం లేకుండా తమ సామాజికవర్గ అభ్యర్థిని గెలిపించుకోవాలంటూ ఓ నిర్ణయానికి వచ్చినట్లు తెలిసింది. సికింద్రాబాద్ లోక్‌సభ పరిధిలో యాదవ, ముదిరాజ్, మున్నూరుకాపు, గంగపుత్ర, గౌడ్, ఎస్సీ, ఎస్టీ సామాజికవర్గాలకు చెందినవారు పలు అసెంబ్లీ నియోజకవర్గాలను ప్రభావితం చేసే సంఖ్యలో ఉన్నారు. దీంతో అభ్యర్థులు ఆయా సామాజికవర్గాల ఓట్లను రాబట్టుకోవడానికి కులపెద్దలతో సంప్రదింపులు జరిపినట్లు తెలిసింది.

పార్టీలను చూడకండి అంటూ..

కాంగ్రెస్ అభ్యర్థి దానం నాగేందర్ సామాజికవర్గం మున్నూరుకాపు కావడంతో పార్టీని చూడకుండా ఆయనకే మద్దతు ఇవ్వాలని కులపెద్దలు ఓ నిర్ణయానికి వచ్చినట్లు తెలిసింది. అంబర్‌పేట, సనత్‌నగర్, జూబ్లీహిల్స్, ఖైరతాబాద్ నియోజకవర్గాల్లో ఆ సామాజికవర్గం బలంగా ఉండడంతో ఆ ఓట్లను గంపగుత్తగా రాబట్టుకునేందుకు దానం ప్రయత్నం చేస్తున్నట్లు తెలిసింది. అలాగే, బీఆర్ఎస్ అభ్యర్థి పద్మారావుగౌడ్‌కు ఇప్పటికే గౌడ సామాజికవర్గం కులపెద్దలు మద్దతు ప్రకటించినట్లు తెలిసింది. పార్టీలతో సంబంధం లేకుండా తమకు ఓటేయాలని సామాజికవర్గం వాట్సప్ గ్రూప్‌ల్లో అభ్యర్థులు మెసేజ్‌లు పెడుతున్నారు.

గంపగుత్తగా రాబట్టుకునే అవకాశం

తమ సామాజికవర్గాలే గాకుండా సికింద్రాబాద్ లోక్‌సభ నియోజకవర్గం పరిధిలో బలంగా ఉన్న యాదవ, ముదిరాజ్, గంగపుత్ర, ఎస్సీ, ఎస్టీ ఓట్లను గంపగుత్తగా రాబట్టుకునేందుకు బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీ అభ్యర్థులు ప్రయత్నాలు మొదలుపెట్టారు. ముదిరాజ్ ఓట్లను రాబట్టుకోవడానికి కాంగ్రెస్ తరపున ఆ సామాజికవర్గానికి చెందిన నేతలతో సంప్రదింపులు చేస్తున్నట్లు తెలిసింది. భారీ సమావేశాన్ని ఏర్పాటు చేసి, తమ డిమాండ్ల పరిష్కారానికి అందరి సమక్షంలో హామీలు ఇచ్చేందుకు సిద్ధం అవుతున్నారు.



బీఆర్ఎస్ మల్కాజిగిరి, సికింద్రాబాద్ పార్లమెంట్ అభ్యర్థులు రాగిడి లక్ష్మారెడ్డి, పద్మారావు గౌడ్‌కు మద్దతుగా పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ ఆదివారం రాత్రి రోడ్ షో నిర్వహించారు. ఈమేరకు గులాబీ శ్రేణులు భారీ ఏర్పాట్లు చేయడంతో విశేష స్పందన వచ్చింది. నగరంలోని ఉప్పల్, ఎల్బీనగర్, రాంనగర్ చౌరస్తాల్లో ఈ రోడ్‌షోలు జరిగాయి. - రాంనగర్ (ఆంధ్రజ్యోతి)

పరీక్ష



వైద్య విద్యా కోర్సుల్లో ప్రవేశాల కోసం ఆదివారం నిర్వహించిన నీట్ పరీక్ష రాయడానికి నిజాం కాలేజీకి వచ్చిన విద్యార్థులు



ఆఫ్టర్ 9 పబ్

యువతులను ఎరగా వేసి..

● పబ్‌లో గలీజు దందా... ● పోలీసుల అదుపులో 32 మంది యువతులు, 131 మంది పురుషులు, బౌన్సర్లు, సిబ్బంది

బంజారాహిల్స్, మే 5(ఆంధ్రజ్యోతి): ఓ పబ్ నిర్వాహకులు గలీజు దందాకు తెర లేపారు. వ్యాపారం పెంచుకునేందుకు యువతులను ఎరగా వేస్తున్నారు. నిబంధనలను ఉల్లంఘించి వారితో అసభ్యకరమైన నృత్యాలు చేయిస్తున్నారు. బేగంపేట ఉర్వశి పబ్ వ్యవహారం వెలుగులోకి వచ్చిన కొద్ది రోజులకే బంజారాహిల్స్‌లో ఆఫ్టర్ 9 పబ్‌లో జరుగుతున్న బాగోతాన్ని పోలీసులు బట్టబయలు చేశారు. అసభ్యకరమైన నృత్యాలు చేస్తున్న 32 మంది యువతులను, 131మంది పురుషులను, బౌన్సర్లను, సిబ్బందిని అదుపులోకి తీసుకున్నారు. పబ్ యజమానులు పరారీలో ఉన్నారు. బంజారాహిల్స్ రోడ్డు నంబర్ 14లో ఆఫ్టర్ 9 పేరిట పబ్ నడుస్తోంది. అర్ధరాత్రి దాటినా పబ్‌లో వ్యాపారం జోరుగా కొనసాగుతోంది. పశ్చిమ మండలం టాస్క్‌ఫోర్స్ పోలీసులు, బంజారాహిల్స్ పోలీసులు శనివారం అర్ధరాత్రి దాటాక దాడులు నిర్వహించారు. పబ్‌లో చూసేసరికి

మిగతా 4వ పేజీలో..

యువతులను ఎరగా వేసి..

(3వ పేజీ తరువాయి): పోలీసులు అవాక్కయ్యారు. మద్యం సీసాలతో యువతులు అసభ్యకరరీతిలో నృత్యాలు చేస్తుండగా, వినియోగదారులు ఆస్వాదిస్తూ మద్యం తాగుతున్నారు. చెవులు చిల్లులు పడే శబ్దం డీజే పాటలు మారుమోగిపోతున్నాయి. పోలీసులు పబ్‌ను చుట్టుముట్టి 32 మంది యువతులను, 131 మంది పురుషులను, ఐదుగురు బౌన్సర్లను, సిబ్బందిని అదుపులోకితీసుకున్నారు. పబ్ యజమాని వెంకట్రావు అలియాస్ రాముతో పాటు మరికొంత మంది పరారీలో ఉన్నారు. నిందితులపై బంజారాహిల్స్ పోలీసులు వివిధ సెక్షన్ల కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఏపీ నుంచి బ్రోకర్ ద్వారా యువతులు

ఆఫ్టర్ 9 పబ్‌కు ఏపీకి చెందిన ఓ బ్రోకర్ ద్వారా యువతులను తరలిస్తున్నట్లు తెలిసింది. ప్రతీ పదిహేను రోజులకోసారి వీరిని మార్చేలా నిర్వాహకులు బ్రోకర్‌తో ఒప్పందం కుదుర్చుకున్నట్టు సమాచారం.

బీజేపీ 'అగ్ర' తాంబూలం

(3వ పేజీ తరువాయి)

తమిళి సై సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గంలో ప్రచారం నిర్వహించారు.

అభ్యర్థులకు వెన్నుదన్నుగా

నామినేషన్ల సమయంలో పలువురు కేంద్రమంత్రులు వచ్చి అభ్యర్థులకు వెన్నుదన్నుగా నిలిచారు. సికింద్రాబాద్ అభ్యర్థి కిషన్‌రెడ్డి నామినేషన్ సమయంలో కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ ర్యాలీలో పాల్గొన్నారు. మల్కాజిగిరి అభ్యర్థి ఈటల రాజేందర్‌కు మద్దతుగా కేంద్రమంత్రి హరిదీప్ సింగ్ పూరి, హైదరాబాద్ అభ్యర్థి మాధవీలత కొంపెల్ల నామినేషన్ సమయంలో కేంద్ర మంత్రి అనురాగ్ సింగ్ ఠాకూర్ వచ్చారు. ఉత్తర భారతదేశానికి చెందిన వారు ఇక్కడ ఎక్కువ మంది ఉండడంతో కేంద్ర మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌తో కిషన్‌రెడ్డి సమావేశాలు నిర్వహించి మద్దతు కూడగట్టుకునే ప్రయత్నం చేశారు. కంటోన్మెంట్‌లోని మాజీ సైనికులతో సమావేశమయ్యారు. మల్కాజిగిరిలో తమిళులు ఎక్కువగా ఉండడంతో మాజీ గవర్నర్ తమిళిసైతో ప్రచారం చేయిస్తున్నారు. సీఎం యోగి ఆదిత్యనాథ్‌తో కూడా ప్రచారం చేయించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. సికింద్రాబాద్ అభ్యర్థి కిషన్‌రెడ్డికి మద్దతుగా నటుడు సురేష్ అంబర్‌పేటలో, కుష్బు జూబ్లీహిల్స్‌లో ప్రచారం చేశారు.

మిగిలింది ఐదు రోజులే..

- అయినా ప్రచారంలో ఉత్సాహం కరువు
- కేడర్‌లో తొలగని గందరగోళం
- అగ్రనేతల ప్రచారమే ఆధారం

హైదరాబాద్ సిటీ/రామంతాపూర్, మే 5 (ఆంధ్రజ్యోతి): పోలింగ్‌కు మరో ఏడు రోజులు.. ప్రచారానికున్నది ఐదు రోజులు మాత్రమే. అయినా ప్రజలను కలవడంలో.. వారి మద్దతు కూడగట్టడంలో నాయకుల్లో మునుపటి ఆసక్తి కనిపించడం లేదు. అసెంబ్లీ ఎన్నికలతో పోలిస్తే ప్రచారం నామ్ కే వాస్తేగా సాగుతుండగా.. ఎన్నికలు దగ్గర పడుతున్న తరుణంలో పోల్ మేనేజ్‌మెంట్ విషయంలోనూ అదే నిర్లిప్తత కనబడుతోంది. దీంతో క్షేత్రస్థాయిలో నాయకులు, కార్యకర్తలు తీవ్ర అసంతృప్తికి గురవుతున్నారు. రోడ్ షోలు, కార్నర్ మీటింగ్‌లు.. సంఘాలతో సమావేశాలు మినహా ఇంటింటి ప్రచారం, పాదయాత్రలు నామమాత్రంగానే చేశారు. పార్లమెంట్ పరిధి ఎక్కువగా ఉండడం.. ఎండల తీవ్రత ఇందుకు కారణమని సీనియర్ నాయకులు చెబుతున్నారు. ఉన్న సమయాన్ని వినియోగించుకొని ప్రజల్లోకి వెళ్లడంపైనా పార్టీలు, అభ్యర్థులు పూర్తిస్థాయిలో దృష్టి సారించలేకపోయారు. సమయం తక్కువగా ఉండడంతో ఈ ఐదు రోజులూ వీలైనంత ఎక్కువగా పార్టీలోని కీలక వ్యక్తులతో ప్రచారం చేయించేందుకు ఆసక్తి చూపుతున్నారు.

బూత్‌లకు కోత..

పోలింగ్‌కు వారం, పది రోజుల ముందు బూత్‌ల వారీగా స్థానిక కార్యకర్తలకు పోల్ మేనేజ్‌మెంట్ బాధ్యతలు అప్పగిస్తారు. తమ పరిధిలోని ఓటర్లను కలుస్తూ.. పార్టీ అభ్యర్థికి ఓటు వేయాలని కోరాలి. అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఒక్కో బూత్‌కు పది మంది కార్యకర్తలకు బాధ్యతలు అప్పగించగా కొన్ని నియోజకవర్గాల్లో ప్రస్తుతం వారి సంఖ్య తగ్గిస్తున్నారు. ఐదారుగురిని ఎంపిక చేస్తున్నారు. దీంతో ఇతరులు అసంతృప్తికి గురవుతున్నారు. గతంలో బూత్‌కు ఖర్చుల నిమిత్తం రూ.10 వేల చొప్పున కొన్ని పార్టీలు మూడు, నాలుగు దఫాలుగా.. ఇంకొన్ని పార్టీలు రోజూ రూ.10 వేలు ఇచ్చేవి. ఇప్పుడా మొత్తాన్ని సగానికి తగ్గించారు.

అంటీముట్టనట్టుగా వారు..

ఒక్కో పార్లమెంట్ పరిధిలో ఓటర్ల సంఖ్యను బట్టి 1800 నుంచి 2500 వరకు పోలింగ్ బూత్‌లున్నాయి. ఒక్కో బూత్ పరిధిలో 1200 నుంచి 1400 మంది ఓటర్లు ఉంటారు. గత గణాంకాలను పరిశీలిస్తే నగరంలో పోలయ్యే ఓట్లు 50 శాతం లోపే. ఈ నేపథ్యంలో ఒక్కో బూత్‌లో 600-800 మంది మాత్రమే ఓటు వేస్తుంటారు. వీరిలో అత్యల్పం వ్యక్తిగత ఆసక్తితో ఓటు వేసే వారుంటే.. స్థానిక నాయకులు పలుమార్లు కలిసి విన్నవిస్తే కొందరు.. ప్రలోభ పర్వాన్ని బట్టి ఇంకొందరు ఓటు హక్కు వినియోగించుకుంటారు. ప్రస్తుత పార్లమెంట్ ఎన్నికల్లో పోల్ మేనేజ్‌మెంట్ విషయంలో ప్రధాన పార్టీలు అంతగా దృష్టి సారించడం లేదన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. ప్రలోభ పర్వాన్ని పక్కన పెడితే.. కనీసం బూత్ పరిధిలో అందుబాటులో ఉన్న ఓటర్లను కలిసి ఓటు వేయమని చెప్పే పరిస్థితి కూడా మెజార్టీ ప్రాంతాల్లో లేదు. ఒక్కో పార్లమెంట్ పరిధిలో ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలు ఉన్నాయి. సికింద్రాబాద్, హైదరాబాద్ లోక్‌సభ స్థానాల పరిధిలో 21 లక్షల నుంచి 22 లక్షల ఓటర్లు ఉండగా.. దేశంలోని అతి పెద్దదైన మల్కాజ్‌గిరిలో ఏకంగా 38 లక్షలకు పైగా ఓటర్లున్నారు. వీరందరిని అభ్యర్థులు, కీలక నేతలు కలవడం దాదాపు అసాధ్యం. ఈ నేపథ్యంలో ఎక్కడికక్కడ ప్రచారం నిర్వహించాలి. పలు బస్తీలు, కాలనీల్లో స్థానిక నేతలు కూడా ఓటర్ల వద్దకు వెళ్లడం లేదు. శాసనసభా నియోజకవర్గాల వారీగా పార్టీ సమన్వయకర్తలను నియమించినా పరిస్థితి మారలేదు. బీఆర్‌ఎస్ విషయానికి వస్తే కొందరు ఎమ్మెల్యేలు, కార్పొరేటర్లు.. బీజేపీ, కాంగ్రెస్‌లకు చెందిన పలువురు కార్పొరేటర్లూ ప్రచారం విషయంలో అంటీముట్టనట్టుగా వ్యవహరిస్తున్నారు.

తొలిసారి ఓటు వేస్తున్నారా?

(3వ పేజీ తరువాయి)

ఆధార్, డ్రైవింగ్ లైసెన్స్, పాస్‌పోర్ట్ లేదా ఇతర గుర్తింపు పత్రాలను తమ వద్ద ఉండేలా జాగ్రత్త పడటం మంచిది.

పోలింగ్ స్టేషన్ లొకేషన్

తమ పోలింగ్ స్టేషన్ ఎక్కడ ఉందో ముందే తెలుసుకోవడం మంచిది. ఎన్నికల సంఘం వెబ్‌సైట్‌లో చూడవచ్చు.

వాట్సాప్ యూనివర్సిటీలను కాదు..

ఎన్నికలలో సామాజిక మాధ్యమాల హవా కొనసాగుతున్నది. నిరాధార వార్తలు గాలి కంటే వేగంగా ఈ మాధ్యమాలలో విస్తరిస్తున్నాయి. ఆరోపణలకు కొదవే లేదు. దీంతో నిజం ఏదనేది తెలియక గందరగోళంలో పడతాడు ఓటరు. అందుకే విశ్వసనీయ సమాచారం కోసం ఫ్యాక్ట్‌చెక్ వెబ్‌సైట్లు చూడటం మంచిది. రాజకీయాలతో అవగాహన ఉన్నవారితో చర్చించడం వల్ల కొంతమేర అవగాహన కలగవచ్చు.

పోలింగ్ బూత్ ప్రక్రియ

క్యూలో నిల్చోవాలి. లోపలకు వెళ్లిన తర్వాత సంతకాలు చేసి, వేలిపై సిరా గుర్తు పెట్టించుకుని ఈవీఎం మెషీన్‌ల దగ్గరకు వెళ్లిన తరువాత సరైన అభ్యర్థిని ఎంచుకుని ఓటు వేయాలి.

ఓటు వేసిన తర్వాత..

బటన్ నొక్కగానే శబ్దం వచ్చింది కాబట్టి ఓటు వేసేశాం అని సంబర పడిపోకుండా మీరు వేసిన ఓటు సరైన వారికి పడిందా లేదా అన్నది ధ్రువీకరించుకోవడానికి వీవీపాట్ మెషీన్ వైపు చూస్తే ఎంపిక చేసుకున్న అభ్యర్థి గుర్తు కనిపిస్తుంది.



'సల్ల'గుండ

ఎండలు మండుతున్నాయి. వేడి నుంచి ఉపశమనం కోసం కొందరు ఆదివారం ఖైరతాబాద్ చౌరస్తాలో వాహనదారులకు, ప్రయాణికులు మజ్జిగ పంపిణీ చేశారు. మజ్జిగ తాగిన వారు పంపిణీ చేసే వారి కడుపు సల్లగుండ అని దీవించారు.

- ఫొటో: ఆంధ్రజ్యోతి, స్టాఫ్‌ఫొటోగ్రాఫర్



షేడ్‌నెట్స్ ఏర్పాటు చేయరూ..

- ఏపీ, పుదుచ్చేరిలో సిగ్నల్స్ వద్ద ఏర్పాటు
- నగరంలోనూ ఏర్పాటు చేయాలంటూ వినతులు

హైదరాబాద్ సిటీ, మే 5 (ఆంధ్రజ్యోతి): ఎండలు మండుతున్నాయి. పగటి ఉష్ణోగ్రతలు గణనీయంగా పెరగడంతో రోడ్లపైకి వచ్చేందుకు ప్రజలు భయపడుతున్నారు. అత్యవసరంగా బయటకు వచ్చిన వారు ట్రాఫిక్ సిగ్నళ్ల వద్ద ఇబ్బంది పడుతున్నారు.

ఎండ వేడి నుంచి వాహనదారులకు ఉపశమనం కలిగించేందుకు పుదుచ్చేరి, ఏపీలోని వైజాగ్‌లో అధికారులు సిగ్నల్స్ వద్ద షేడ్‌నెట్స్ ఏర్పాటు చేశారు. సిగ్నల్ పడిన సమయంలో వాహనదారులు ఈ నెట్ కింద కొంత సమయం సేదతీరుతున్నారు. ఈ వీడియోలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయ్యాయి. ఇదే తరహాలో నగరంలోని రద్దీ జంక్షన్లలో షేడ్‌నెట్స్ ఏర్పాటు చేయాలని పలువురు వాహనదారులు కోరుతున్నారు. రద్దీగా ఉండే నగర రోడ్లపై షేడ్‌నెట్స్ ఏర్పాటు చేస్తే వేలాది మంది వాహనదారులకు ఎండ నుంచి రక్షణ దొరుకుతుందని పలువురు అభిప్రాయపడుతున్నారు. రోడ్డు నిబంధనలు పాటించని వారిపై చలాన్లు విధించే అధికారులకు ఎండ నుంచి రక్షణ కల్పించాలనే స్పృహ లేదని పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



పంజాగుట్ట వద్ద ఎండలో వేచి ఉన్న వాహనదారులు



పుదుచ్చేరిలో రోడ్డుపై ఏర్పాటు చేసిన షేడ్‌నెట్(అంతర్ చిత్రంలో)

ఒక్కో సిగ్నల్ వద్ద 30 నుంచి 90 సెకన్ల వరకు..

నగరంలోని రోడ్లపై నిమిషానికి వందల వాహనాలు వెళ్తుంటాయి. రద్దీని బట్టి ఆయా ప్రాంతాల్లో సిగ్నల్ 30 సెకన్ల నుంచి 90, 120 సెకన్లకు మారుతుంటుంది. ఈ సమయంలో సిగ్నల్ దాటేందుకు రెండు నుంచి మూడు నిమిషాల సమయం పడుతోంది. దీంతో ఎండలో వేచి ఉంటున్న వాహనదారులు అవస్థలు పడుతున్నారు. సిగ్నళ్లు ఎత్తివేసి, యూటర్న్‌లను ఏర్పాటు చేసినా, సిగ్నల్స్ వద్ద రద్దీ పెరుగుతూనే ఉంది. ఫ్లైఓవర్లు, అండర్‌పాసులు కొంత మేర ట్రాఫిక్‌రద్దీని తగ్గించడంతోపాటు నీడను ఇస్తున్నాయి.

లింగంపల్లి నుంచి కూకట్‌పల్లి, అమీర్‌పేట, ఖైరతాబాద్, లక్డీకాపూల్, మాసబ్‌ట్యాంక్, బంజారాహిల్స్, నానల్‌నగర్, మెట్టుగూడ, రవీంద్రభారతి, అఫ్జల్‌గంజ్, చాదర్‌ఘాట్, ఆర్టీసీ క్రాస్‌రోడ్స్, సికింద్రాబాద్, ఎల్‌బీస్టేడియం, ట్యాంక్‌బండ్, రాణిగంజ్, ప్యారడైజ్, ప్యాట్నీ, తిరుమలగిరి, అల్వాల్, బేగంపేట, ఐటీ కారిడార్, సైబర్ టవర్స్, కొండాపూర్, గచ్చిబౌలి, నానక్‌రాంగూడ, విప్రో సర్కిల్, ఖాజాగూడ, మెహిదీపట్నం, ఈసీఐఎల్, ఐడీపీఎల్ కూడళ్ల వద్ద పెద్ద ఎత్తున వాహనాలు నిలుస్తున్నాయి.

బండిపై కూర్చోలేకపోతున్నా..



జంక్షన్లలో వాహనాల పొగల మధ్య ఎండలో సిగ్నల్ కోసం వేచిచూస్తున్నాం. నానల్‌నగర్, రేతిబౌలి, మెహిదీపట్నం రైతుబజార్ వద్ద, పెలికాన్ సిగ్నల్స్ వద్ద ఎక్కువసేపు వేచి చూడాల్సి వస్తుంది. మధ్యాహ్నం ఆర్డర్లు ఎక్కువగా ఉంటాయి. హోటళ్లలోకి వెళ్లి ఆర్డర్ తెచ్చుకునేలోపు బైక్ వేడెక్కుతుంది. బైక్ సీటుపై కూర్చోవడం కష్టంగా ఉంటుంది. ఎండ వేడికి ఫుడ్ డెలివరీ చేయలేకపోతున్నాం.

- వంశీ, స్విగ్గీ డెలివరీ బాయ్

ఒక్క నిమిషంలో పంపేస్తున్నాం..

సైఫాబాద్ పరిధిలో ఉదయం, సాయంత్రం వేళల్లో కొన్నిచోట్ల ట్రాఫిక్ రద్దీ ఉంటుంది. మధ్యాహ్నం వాహనాల రద్దీ ఎక్కువగా ఉండకపోవడంతో ఆటోమాటిక్ సిగ్నల్ వ్యవస్థతో ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరిస్తున్నాం. ఆర్ 1, ఆర్ 2, ఆర్ 3లుగా రహదారులను గుర్తించి ఎండలు ఉన్న సమయంలో ఒక్క నిమిషం వరకు వాహనాలు బయలుదేరేలా ఏర్పాట్లు చేశాం.

- రాజశేఖర్, సైఫాబాద్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్

అన్నివర్గాలు మోదీకి అండగా నిలవాలి

బీజేపీ సికింద్రాబాద్ అభ్యర్థి కిషన్‌రెడ్డి

గోల్నాక, మే 5 (ఆంధ్రజ్యోతి): దేశం కోసం అన్ని వర్గాల ప్రజలు ప్రధానమంత్రి నరేంద్రమోదీ నాయకత్వానికి అండగా ఉండాలని, మూడోసారి గెలిపించి దేశాభ్యున్నతికి బాసటగా నిలవాలని కేంద్ర మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, పార్టీ సికింద్రాబాద్ ఎంపీ అభ్యర్థి జి.కిషన్‌రెడ్డి కోరారు. ఆదివారం అంబర్‌పేట ఛే నెంబర్‌లోని మహారాణా ప్రతాప్ ఫంక్షన్‌హాల్‌లో మాజీ కార్పొరేటర్ వనం రమేష్ అధ్యక్షతన సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ పద్మశాలీ ప్రతినిధుల ఆత్మీయ సమ్మేళనం జరిగింది. కిషన్‌రెడ్డి ముఖ్యఅతిథిగా ప్రసంగించారు. మోదీ నాయకత్వమే దేశానికి శ్రీరామరక్ష అన్నారు. అన్నివర్గాల అభ్యున్నతి మోదీ నాయకత్వంలో జరిగిందన్నారు. ఈ ఎన్నికల్లో సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం నుంచి రెండోసారి పోటీ చేస్తున్న తనను ఆశీర్వదించి గెలిపించాలని కోరారు. తాను అన్ని వర్గాల ప్రజల వికాసానికి, అభ్యున్నతికి శక్తివంచన లేకుండా కృషి చేస్తున్నానని పేర్కొన్నారు. ఆత్మీయ సమ్మేళనంలో కార్పొరేటర్ పావని వినయ్, పద్మశాలీ సంఘం ప్రతినిధులు పుట్ట పాండురంగయ్య, బాబురావు, గట్టయ్య, హరి, జయసింహ, శ్రీనివాస్, నర్సింగ్, మురళి, సుంకి సుధాకర్, నర్సింగ్‌రావు, బీజేపీ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎస్.గౌతమ్‌రావు, ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు జి.ఆనంద్‌గౌడ్, సి.వినోద్‌యాదవ్, డాక్టర్ సమత పాల్గొన్నారు.



ప్రసంగిస్తున్న కిషన్‌రెడ్డి

ఐటీ ఉద్యోగాల పేరుతో మోసం

- బెంగళూరుకు చెందిన వ్యక్తి అరెస్ట్
- నిందితుడిపై దేశవ్యాప్తంగా 16 కేసులు

హైదరాబాద్ సిటీ, మే 5 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ ఐటీ సంస్థల్లో ఉద్యోగాలు ఇప్పిస్తానని ఆన్‌లైన్ వేదికల్లో ప్రచారం చేసుకుంటూ, నిరుద్యోగుల నుంచి అందినకాడికి దోచుకుంటున్న మోసగాడిని సైబర్ క్రైం పోలీసులు అరెస్ట్ చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బెంగళూరు దొడ్డబల్లాపుర ప్రాంతానికి చెందిన ఎస్.మహేష్ ఫేస్‌బుక్, ఇన్‌స్టా, టెలిగ్రామ్‌లో ప్రముఖ ఐటీ సంస్థలో ఉద్యోగాలిప్పిస్తానంటూ ప్రచారం చేసుకుంటున్నాడు. యూసుఫ్‌గూడ ప్రాంతానికి చెందిన నిరుద్యోగి, టెలిగ్రామ్‌లో యాడ్ చూశాడు. ఐటీ ఉద్యోగం కావాలంటూ సంప్రదించాడు. ఆఫర్ లెటర్ వెంటనే రావడంతో ఈ విషయాన్ని తన స్నేహితులతో పంచుకున్నాడు. మరో ఏడుగురు మిత్రులు కూడా మహేష్‌ని సంప్రదించారు. వారి నుంచి రూ. 46.19 లక్షలు వసూలు చేసిన మహేష్, ఆన్‌లైన్ ఇంటర్వ్యూ నిర్వహించి, నకిలీ ఆఫర్ లెటర్లు ఇచ్చాడు. ఇది తీసుకొని ఆయా సంస్థల వద్దకు వెళ్లిన వారు ఆఫర్ లెటర్ నకిలీదని నిర్ధారించుకున్నారు. మోసపోయామని సైబర్ క్రైం పోలీసులకు ఫిర్యాదు చేశారు. సాంకేతిక ఆధారాలతో పోలీసులు మహేష్‌ని అరెస్ట్ చేశారు. అతడి నుంచి మూడు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. మహేష్‌పై దేశవ్యాప్తంగా 16 కేసులు నమోదయ్యాయని పోలీసులు తెలిపారు. బ్యాక్‌డోర్‌లో ఐటీ జాబ్ అంటూ కొంతమంది సైబర్ నేరగాళ్లు డబ్బులు వసూలు చేస్తున్నారని, వారి వలలో పడకుండా ఉండాలని సైబర్ క్రైం డీసీపీ కవిత నిరుద్యోగులకు సూచించారు.



మహేష్

కాంగ్రెస్ గెలుపే లక్ష్యంగా పనిచేయాలి: రంజిత్‌రెడ్డి



రంజిత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరుతున్న బీఆర్ఎస్ నాయకులు

చేవెళ్ల, మే 5 (ఆంధ్రజ్యోతి): దేశంలో అధికారంలోకి వచ్చేది కాంగ్రెస్ ప్రభుత్వమే అని, ఆ దిశగా కాంగ్రెస్ శ్రేణులు కష్టపడి పనిచేయాలని చేవెళ్ల కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి గడ్డం రంజిత్‌రెడ్డి పార్టీ నాయకులు, కార్యకర్తలకు సూచించారు. ఆదివారం చేవెళ్ల మండల పరిధిలోని ఆలూర్ గ్రామ మాజీ సర్పంచ్ లక్ష్మీ, మాజీ ఎంపీటీసీలు బుచ్చయ్య, వెంకటయ్య . మల్కాపూర్ ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి ఆధ్వర్యంలో పలువురు బీఆర్ఎస్ నాయకులు రంజిత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారందరికి కాంగ్రెస్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం రంజిత్‌రెడ్డి మాట్లాడుతూ తెలంగాణలో అధికారంలోకి వచ్చిన మాదిరిగా కేంద్రం లోనూ కాంగ్రెస్ అధికారంలోకి వస్తుందన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని భారీ మెజార్టీతో గెలిపించి ఆదరించాలని కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వం తోనే గ్రామాల్లో అభివృద్ధి పనులు సాగుతాయన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో రాష్ట్రం అభివృద్ధి దిశగా ముందుకు సాగుతుందన్నారు. ఎంపీగా గెలిపిస్తే చేవెళ్లను మరింత అభివృద్ధి చేస్తానని అన్నారు.

కార్యక్రమంలో పొలుష్యన్ బోర్డు సభ్యుడు సత్యనారాయణరెడ్డి, ఎంపీటీసీ నరేందర్, నర్సింలు, భీమయ్య, రాజు, నర్సింలు, ప్రశాంత్, వెంకటేశ్, హైమాద్, నరేందర్‌గౌడ్ తదితరుల ఉన్నారు.

పద్మశాలిపురంలో సామ ప్రచారం

రంజిత్‌రెడ్డికి మద్దతుగా కాంగ్రెస్ పార్టీ కో-ఆర్డినేటర్ సామ ఇంద్రపాల్‌రెడ్డి మైలార్‌దేవుపల్లి డివిజన్‌లోని పద్మశాలిపురం, మదుభన్‌కాలనీ, ఆప్కో కాలనీలలో ఆదివారం ఇంటింటికి ప్రచారం నిర్వహించారు. హస్తం గుర్తుపై ఓటు వేసి డాక్టర్ రంజిత్‌రెడ్డిని గెలిపించాలని ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. దేశంలో రాబోయేది కాంగ్రెస్ ప్రభుత్వమేనన్నారు. మైలార్‌దేవుపల్లి డివిజన్‌లో కాంగ్రెస్‌కు భారీ మెజారిటీ సాధించడానికి కృషి చేస్తున్నానన్నారు.

చేవెళ్ల ఎంపీగా రంజిత్‌రెడ్డిని గెలిపించాలి

రాజేంద్రనగర్, మే5(ఆంధ్రజ్యోతి): చేవెళ్ల ఎంపీగా రంజిత్‌రెడ్డిని గెలిపించాలని గ్రేటర్ మాజీ మేయర్ బొంతు రామ్మోహన్ అన్నారు. ఆదివారం రాజేంద్రనగర్, ఉప్పర్‌పల్లికి చెందిన వివిధ పార్టీల యువకులు కాంగ్రెస్‌లో చేరారు. వారికి మాజీ మేయర్ బొంతు రామ్మోహన్, రాజేంద్రనగర్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి కస్తూరి నరేందర్ ముదిరాజ్ కండువాలను కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం ద్వారానే దేశంలో శాంతి సామరస్యత, స్వేచ్ఛ సమానత్వాలు లభిస్తాయన్నారు. కార్యక్రమంలో నాయకులు కోరని బాల్‌రాజ్, పలుగుచెరువు మహేశ్, బొక్క ప్రభాకర్‌రెడ్డి, వి.లలిత్, అనుముల జాన్‌పాల్, చలసాని విష్ణుమూర్తి, రాపోలు సత్తయ్య, శ్రీకాంత్ ముదిరాజ్ పాల్గొన్నారు.


రాజేంద్రనగర్‌లో కాంగ్రెస్ పార్టీలో చేరుతున్న యువకులు


లెనిన్‌నగర్ బస్తీల్లో ప్రచారం చేస్తున్న సీతారంజిత్‌రెడ్డి, తీగల

మీర్‌పేట కార్పొరేషన్‌లో సీతారంజిత్‌రెడ్డి ప్రచారం

సరూర్‌నగర్, మే 5 (ఆంధ్రజ్యోతి): మీర్‌పేట్ కార్పొరేషన్‌లోని 13,30,35వ డివిజన్లలో దేరంగుల యాదయ్య ఆధ్వర్యంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డితో కలిసి చేవెళ్ల కాంగ్రెస్ అభ్యర్థి రంజిత్‌రెడ్డి సతీమణి సీతారంజిత్ రెడ్డి పాల్గొన్నారు. ఇంటింటికీ వెళ్లి ఓటర్లను కలిసి చేయి గుర్తుకు ఓటేసి తన భర్తను గెలిపించాలని కోరారు. సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని, అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను చూసి కాంగ్రెస్ అభ్యర్థికి ఓటేయాలని ఆమె విజ్ఞప్తి చేశారు.

రేవంత్ పాలనకు ప్రజలు ఫిదా : పారిజాతారెడ్డి

రాష్ట్రంలో రేవంత్‌రెడ్డి పాలనకు ప్రజలు ఫిదా అయ్యారని, ఆయన నాయకత్వాన్ని బలపరుస్తూ పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిని గెలిపించడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, బడంగ్‌పేట్ మేయర్ చిగిరింత పారిజాతానర్సింహారెడ్డి అన్నారు. కార్పొరేషన్ పరిధిలోని పలు డివిజన్లలో పర్యటించి కాంగ్రెస్ చేవెళ్ల అభ్యర్థి గడ్డం రంజిత్‌రెడ్డికి మద్దతుగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. మీర్‌పేట్ 10వ డివిజన్‌లోని పలు కాలనీల్లో కార్పొరేటర్ ముద్దా పవన్‌కుమార్‌తో కలిసి ఆ పార్టీ మీర్‌పేట్ శాఖ అధ్యక్షుడు సామిడి గోపాల్‌రెడ్డి ఇంటింటికీ తిరిగి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. హస్తం గుర్తుకు ఓటేసి కాంగ్రెస్ అభ్యర్థిని గెలిపించాలని ఓటర్లను కోరారు. ఆర్‌కేపురం డివిజన్ పరిధిలోని ఎన్‌టీఆర్‌నగర్‌లో టీపీసీసీ ప్రతినిధి దేప భాస్కర్‌రెడ్డి ఇంటింటికి ప్రచారం చేశారు. హస్తం గుర్తుకు ఓటు వేసి కాంగ్రెస్ పార్టీని గెలిపించాలని కోరారు.

కాంగ్రెస్, బీజేపీలకు ఓటు వేస్తే ఒరిగేదేమీ లేదు

బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి పద్మారావు

సికింద్రాబాద్, మే 5 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్, బీజేపీలకు ఓటు వేస్తే ప్రజలకు ఒరిగేదేమీ లేదని బీఆర్ఎస్ సికింద్రాబాద్ ఎంపీ అభ్యర్థి టి. పద్మారావు గౌడ్ అన్నారు. మాజీ మంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్‌తో కలిసి పద్మారావు ఆదివారం రాంగోపాల్‌పేట్ డివిజన్‌లో ఇంటింటికీ తిరిగి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. మినిస్టర్ రోడ్డులోని సాయిబాబా ఆలయం వద్ద నుంచి ప్రచారాన్ని ప్రారంభించి కాచిబౌలి, వెంగళరావునగర్, సీ-లైన్, ఎఫ్-లైన్, గై దిన్ బాగ్, నల్లగుట్ట, నల్లగుట్ట మసీదు తదితర ప్రాంతాల్లో ప్రచారం చేశారు. స్థానికులు కల్లు లొట్టి, మోకు, ముస్తాక్‌లను స్థానికులు వారికి బహూకరించారు. అనంతరం పద్మారావు, తలసాని మాట్లాడుతూ ప్రజలు అభివృద్ధి, సంక్షేమాన్ని కోరుకుంటున్నారని, అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్‌ను గెలిపించడం ద్వారా స్పష్టం చేశారని, పార్లమెంట్ ఎన్నికల్లోనూ అవే ఫలితాలు పునరావృతమవుతాయని పేర్కొన్నారు. మాయమాటలు, దొంగ హామీల ఇస్తున్న కాంగ్రెస్, బీజేపీలను ప్రజలు నమ్మే పరిస్థితి లేదని అన్నారు. ఓట్లేసి గెలిపించి, ఎంపీని చేస్తే కేంద్ర మంత్రి హోదా పొందిన జి.కిషన్‌రెడ్డి సికింద్రాబాద్ నియోజకవర్గ ప్రజలకు ఏంచేశారని వారు ప్రశ్నించారు. మరోవైపు ఐదు నెలల్లోనే కాంగ్రెస్ పార్టీ ప్రజల విశ్వాసం కోల్పోయిందన్నారు. తమను మోసం చేసిన కాంగ్రెస్ పార్టీకి గుణపాఠం చెప్పేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని వారు పేర్కొన్నారు. పద్మారావునగర్‌లో బీఆర్ఎస్ పార్టీ కార్యాలయాన్ని పద్మారావు, తలసాని శ్రీనివాస్‌యాదవ్‌లు ప్రారంభించారు. ఈ సందర్భంగా అంబేడ్కర్ విగ్రహానికి పూల మాల వేసి నివాళులర్పించారు.


పద్మారావుకు నుదుట తిలకం దిద్దితున్న మహిళ

పార్టీ మారే వారిని ప్రజలు ఆదరించరు

ఖైరతాబాద్, మే 5 (ఆంధ్రజ్యోతి): పార్టీలు మారే నాయకులను ప్రజలు ఆదరించరని బీఆర్ఎస్ అభ్యర్థి పద్మారావుగౌడ్ అన్నారు. ఆదివారం ఖైరతాబాద్ నియోజకవర్గంలోని కుందన్‌బాగ్, బీఎస్ మక్తా, హరిగేట్, ఎంఎస్ మక్తాలలో పద్మారావు రోడ్ షో నిర్వహించారు. అనంతరం రాజ్‌నగర్, మారుతీనగర్, బీజేఆర్‌నగర్, న్యూ సీఐబీ క్వార్టర్స్‌లో పాదయాత్ర చేశారు.

కారు గుర్తుకు ఓటేసి తనను గెలిపించాలని కోరారు. ఖైరతాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జి మన్నె గోవర్ధన్‌రెడ్డి, కంటోన్మెంట్ ఇన్‌చార్జి గజ్జెల నగేష్, ఎన్నికల ఇన్‌చార్జి ఎంఎన్ శ్రీనివాస్, గజ్జెల ఆనంద్‌కుమార్, రాంరెడ్డి, దానం రవి, శ్రీనివాస్, మేఘన తదితరులు పాల్గొన్నారు.

బలహీనవర్గాలు, మైనారిటీల సమస్యలపై పోరాటం చేస్తున్నది మజ్లిస్

ఎంఐఎం హైదరాబాద్ ఎంపీ అభ్యర్థి అసదుద్దీన్

చార్మినార్ మే 5(ఆంధ్రజ్యోతి): దేశంలోని పేదలు, బడుగు బలహీనవర్గాలు, మైనారిటీల సమస్యలపై పోరాటం చేస్తుంది మజ్లిస్ పార్టీ అని హైదరాబాద్ ఎంపీ అభ్యర్థి అసదుద్దీన్ ఒవైసీ అన్నారు, ఆదివారం చంద్రయాణగుట్ట నియోజకవర్గంలోని బార్కస్, కంచన్‌బాగ్ డివిజన్‌లలో ఆయన ఎన్నికల ప్రచారం చేసి ఇంటింటికి వెళ్లి ఎంఐఎం పార్టీకి ఓటేసి తనను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా అసదుద్దీన్ ఒవైసీ మాట్లాడుతూ హైదరాబాద్ పార్లమెంట్ పరిధిలోని నియోజకవర్గాలలో కేంద్రం నుంచి ప్రత్యేక నిధులు మంజూరు చేయించి అభివృద్ధి చేశానన్నారు. ప్రచారం కార్పొరేటర్లు హాఫిజ్‌పటేల్, వహాబ్ అబ్దుల్ రెహమాన్‌షా, సరూర్ నగర్ మండల ప్రజాపరిషత్ మాజీ ఉపాధ్యక్షుడు ఓమర్ బామ్, మొహసిన్ ఖురేషి తదితరులు పాల్గొన్నారు,


బార్కాస్‌లో ప్రచారం చేస్తున్న అసదుద్దీన్ ఒవైసీ

అసదుద్దీన్‌కు మద్దతుగా ఎమ్మెల్సీ ప్రచారం

అసదుద్దీన్‌కు మద్దతుగా మజ్లిస్ ఎమ్మెల్సీ రియాజుల్ హసన్ ఆఫంది, కార్పొరేటర్ సోహైల్‌ఖాద్రీ, ఆ పార్టీ నాయకులు ఆదివారం డివిజన్‌లోని పలు బస్తీలు కాలనీలలో ఎన్నికల ప్రచారం చేశారు. పార్లమెంట్ ఎన్నికలలో ఎంఐఎం పార్టీకి ఓటేసి అసదుద్దీన్ ఒవైసీని గెలిపించాలని కోరారు. ప్రచారంలో ఆయన వెంట మూర్తుజా అలీ, మహముద్, హషీం, తదితరులు ఉన్నారు.

బీఆర్ఎస్‌కు ప్రజల నుంచి అనూహ్య స్పందన: ఎంపీ అభ్యర్థి గడ్డం శ్రీనివాస్

అఫ్జల్‌గంజ్, మే 5 (ఆంధ్రజ్యోతి): ప్రచారంలో ఎక్కడికి వెళ్లినా ప్రజల నుంచి అనూహ్య స్పందన లభిస్తున్నదని బీఆర్ఎస్ హైదరాబాద్ ఎంపీ అభ్యర్థి గడ్డం శ్రీనివాస్ యాదవ్ చెప్పారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆదివారం మంగళ్‌హాట్, దత్తాత్రేయనగర్ డివిజన్ పరిధిలోని రహీపురం, శివలాల్‌నగర్, సీబీటీ క్వార్టర్స్, గండి హనుమాన్, గంగాబౌలి, మాగ్ర, నల్ల పోచమ్మగుడి, కుమ్మర్‌వాడి, అంబేడ్కర్‌నగర్, అవుట్ పోస్ట్ నటరాజ్‌నగర్ తదితర ప్రాంతాల్లో పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి ఆయన ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా దత్తాత్రేయ నగర్‌లో ఓ హోటల్‌లో ఆయన దోశలు వేశారు పేదళ్ల బీఆర్ఎస్ పాలనలో చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తూ కారు గుర్తుకు ఓటు వేసి తనను గెలపించాలని ఓటర్లను అభ్యర్థించారు.

కాసాని జ్ఞానేశ్వర్‌ను గెలిపించాలని బీఆర్ఎస్ నాయకుల ప్రచారం

రాజేంద్రనగర్, మే5(ఆంధ్రజ్యోతి): ప్రత్యేక తెలంగాణను తెచ్చిన పార్టీగా, పదేళ్లలో జరిగిన అభివృద్ధి, అమలు చేసిన సంక్షేమ పథకాలను దృష్టిలో పెట్టుకొని చేవెళ్ల నియోజకవర్గంలో బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్ ముదిరాజ్‌ను భారీ మెజారిటీతో గెలిపించాలని ఆ పార్టీ నాయకులు కోరారు. ఆదివారం రాజేంద్రనగర్ సర్కిల్ అత్తాపూర్ డివిజన్‌లోని శివానగర్, క్రిష్ణానగర్ బస్తీలలో బీఆర్ఎస్ రాజేంద్రనగర్ నియోజకవర్గం ఇన్‌చార్జి పుటం పురుషోత్తంరావు, సీనియర్ నాయకుడు కొలన్ సుబాష్ రెడ్డి, పార్టీ నాయకులతో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో రైతుబంధు, రైతుబీమా, షాదీముబారక్, కల్యాణలక్ష్మి, దళితబంధు, 20 వేల లీటర్ల తాగునీరు ఉచితంగా కేసీఆర్ అందజేశారని ప్రజలకు వివరించి, పార్లమెంట్ ఎన్నికలలో బీఆర్ఎస్ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్‌కు ఓటేసి గెలిపించాలని కోరారు. ప్రచారంలో వారి వెంట నాయకులు శెట్టి గారి చిన్న, రావుల జంగయ్య, రవీందర్‌గౌడ్, అజయ్, హరీష్ తదితరులు ఉన్నారు.


శివానగర్‌లో ప్రచారం చేస్తున్న పుటం పురుషోత్తంరావు, కొలన్ సుబాష్‌రెడ్డి, తదితరులు

చేవెళ్లలో కొండా విశ్వేశ్వర్‌రెడ్డిని గెలిపించాలి

రాజేంద్రనగర్, మే5(ఆంధ్రజ్యోతి): పార్లమెంట్ ఎన్నికలో చేవెళ్ల నియోజకవర్గంలో బీజేపీ ఎంపీ అభ్యర్థి కొండా విశ్వేశర్‌రెడ్డిని గెలిపించాలని ఆ పార్టీ నాయకులు కోరారు. విశ్వేశ్వర్‌రెడ్డికి మద్దతుగా అత్తాపూర్ తేజస్వినీనగర్‌లో లాలా లజపతిరాయ్ శక్తీ కేంద్రం ఇన్‌చార్జి రాచూరి రాజశేఖర్ ఆధ్వర్యంలో ఆదివారం ప్రచారం నిర్వహించారు. కేంద్రంలో బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమని, మూడోసారి ప్రధానిగా నరేంద్రమోదీ ఎన్నికకావడం తథ్యం అన్నారు. ప్రజలు బీజేపీ పట్ల సానుకూలతో ఉన్నారన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు రణ్‌ధీర్‌సింగ్, దుర్గాప్రసాద్, సంతోష్, కోలేకర్ రామమూర్తి పాల్గొన్నారు.

మైలార్‌దేవుపల్లిలో...

బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర నాయకుడు అడికె రాజు ఆధ్వర్యంలో మైలార్‌దేవుపల్లి డివిజన్‌లోని పద్మశాలిపురం, మధు బన్‌కాలనీలలో ఆదివారం ఎన్నికల ప్రచారం చేశారు. ఇంటింటికి వెళ్లి కేంద్రంలో ప్రధాని మోదీ ప్రభుత్వ అమలు చేస్తున్న పథకాలను వివరించి బీజేపీకి ఓటేసి కొండా విశ్వేశ్వర్‌రెడ్డిని గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చేవెళ్లలో కొండా విశ్వేశ్వర్‌రెడ్డి గెలుపును ఎవరూ ఆపలేరన్నారు.


తేజస్వినీ నగర్‌లో ప్రచారం చేస్తున్న బీజేపీ నాయకులు రాచూరి రాజశేఖర్ తదితరులు

చేవెళ్ల సీటును ప్రధానికి కానుక ఇవ్వాలి

చేవెళ్లలో గెలిచి ఆ సీటును ప్రధాని మోదీకి కానుక ఇవ్వాలని రాజ్యసభ సభ్యుడు హరినారాయణ్‌జీ పంచారియా అన్నారు. అత్తాపూర్ మార్వాడీ సమాజ్ పిలుపు మేరకు ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. పార్లమెంట్ ఎన్నికలలో చేవెళ్ల నియోజకవర్గంలో బీజేపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డిని గెలిపించాలన్నారు. దేశవ్యాప్తంగా బీజేపీకి నాలుగు వందల సీట్లు వచ్చేలా కార్యకర్తలు పనిచేయాలని సూచించారు. కార్యక్ర మంలో నాయకులు ఎస్.విజయ్‌కుమార్, సాయి యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

తవ్వీన గుంతలను పూడ్చండి

మదీన, మే 5 (ఆంధ్రజ్యోతి): అధికారులు ఇష్టానుసారంగా పనులు చేయడంతో డ్రైనేజీ పైపులన్ను ధ్వంసం అయ్యాయని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇళ్ల నుంచి బయటకు వెళ్లలేని దుస్థితి ఏర్పడిందని వాపోతున్నారు. బహదూర్‌పురా మోచీ కాలనీలో తాగునీటి పైపులైనులు శిథిలావస్థకు చేరాయి. నూతన పైపులైన్ వేయడానికి నెల రోజుల క్రితం జలమండలి అధికారులు ఎక్స్‌కవేటర్‌తో మూడు అడుగుల మేర తవ్వారు. ఈ క్రమంలో అంతర్గతంగా ఉన్న డ్రైనేజీ పైపులైన్ ధ్వంసం అయింది. ఇదేమిటని అడిగితే సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆవేదన చెందుతున్నారు. దాంతో తప్పని పరిస్థితుల్లో తామే సొంతంగా డబ్బు జమ చేసుకుని ప్రైవేట్ వ్యక్తులతో డ్రైనేజీలకు మరమ్మతులు చేయించుకుంటున్నామని వారు చెబుతున్నారు. ఇందుకోసం ఒక్కో ఇంటికి రూ. 15 వేల నుంచి రూ. 20 వేల వరకు ఖర్చు అయిందని అన్నారు. అధికారుల నిర్లక్ష్యం కారణంగానే డ్రైనేజీ పైపులైన్లు ధ్వంసం అయ్యాయని వారు ఆరోపిస్తున్నారు. సుమారు 45రోజుల క్రితం తవ్వి వదిలేసిన గుంతలను పూడ్చకుండా అలాగే వదిలేశారు. దీంతో పాదచారులు, వాహనదారులు, చిన్నపిల్లలు గుంతలలో పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తవ్వీన పైపులైన్ కాలువలను పూడ్చి వేయించాలని మోచీ కాలనీ వాసులు కోరుతున్నారు.


డ్రైనేజీ లైన్‌కు సొంత డబ్బుతో మరమ్మతులు చేయించుకుంటున్న స్థానికులు

క్రీడాకారులకు ఉచిత శిక్షణ తరగతులు ప్రారంభం

ఎర్రగడ్డ, మే 5 (ఆంధ్రజ్యోతి): జీటీఎస్ కాలనీ గ్రౌండ్లో ఆదివారం క్రీడాకారులకు ఉచిత శిక్షణ తరగతులను బీజేపీ నాయకురాలు దేరంగుల ప్రసన్న జెండా ఊపి ప్రారంభించారు.

ఈ సందర్భంగా కోచ్ అనిల్ తయ్యప్ప మాట్లాడుతూ.. విద్యార్థులకు వేసవిలో ఉచితంగా పలు క్రీడల్లో శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నామని తెలిపారు. క్రీడా పోటీలు నిర్వహించి గెలుపొందిన వారికి బహుమతులు అందజేస్తామన్నారు.

సంఘ సేవకుడు కళ్లెం శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ.. ఆదివారం స్లో సైకిలింగ్ పోటీలు నిర్వహించి గెలుపొందిన వారికి బహుమతులు అందజేస్తామని తెలిపారు.

మరిన్ని మెహిదీపట్నం జోన్ వార్తల కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/PAKrD71లో చదవండి.
Note: Andhrajyothi.com/editions/hyd/set-6 abids, mehadipatnam, charminarలో చూడగలరు.
నోట్: htpps://epaper.andhrajyothy.comలో లాగిన్ అయిన తరువాత క్యూఆర్‌కోడ్‌ని స్కాన్ చేయగలరు.

మల్కాజిగిరి పార్లమెంట్‌కు కాంగ్రెస్ ఎన్నికల కమిటీ కో- ఆర్డినేటర్ల నియామయం

అఫ్జల్‌గంజ్, మే 5 (ఆంధ్రజ్యోతి): మల్కాజిగిరి పార్లమెంట్‌కు కాంగ్రెస్ ఎన్నికల కమిటీ కో-ఆర్డినేటర్లను నియమించారు. నాంపల్లిలోని గాంధీభవన్‌లో జరిగిన సమావేశంలో టీపీసీసీ ఎన్నికల కమిటీ కన్వీనర్ కపిలవాయి దిలీప్ కుమార్ ఆదివారం ప్రకటించారు. ఐఎన్‌టీయూసీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు గుంజ శ్రీనివాస్, టీపీసీసీ ఉపాధ్యక్షుడు ఎం.ఆర్.జి.వినోద్‌రెడ్డి, జి.నరసింహాగౌడ్, మంజులా రెడ్డి, జి.రాఘవేంద్ర, కె.చిన్నారెడ్డి నియమించినట్లు దిలీప్ కుమార్ వెల్లడించారు. ఈ సందర్భంగా గుంజ శ్రీనివాస్ మాట్లాడుతూ... మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గంలో కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి పట్నం సునీతా మహేందర్‌రెడ్డి గెలుపు కోసం కృషి చేస్తానన్నారు.

బాక్సింగ్‌లో జిలానీకి గోల్డ్ మెడల్



పహాడిషరీఫ్ మే 5 (ఆంధ్ర జ్యోతి): తెలంగాణ స్టేట్ బాక్సింగ్ చాంపియన్‌షిప్‌లో నగరంలోని కొత్తపేటకు చెందిన సయ్యద్ జిలానీ(17) గోల్డ్ మెడల్ సాధించాడు. తెలంగాణ బాక్సింగ్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో సికింద్రాబాద్‌లోని సౌత్ లాలాగూడ రైల్వేస్టేషన్‌లో 7వ యూత్‌మెన్, ఉమెన్ తెలంగాణ స్టేట్ బాక్సింగ్ చాంపియన్‌షిప్-2024 పోటీలు మూడు రోజుల పాటు నిర్వహించారు. ఆదివారం జరిగిన 71-75 కిలోల విభాగంలో నిర్వహించిన పోటీలో సయ్యద్ జిలానీ గోల్డ్‌మెడల్ సాధించాడు. అతడు మీర్‌పేటలోని టీకేఆర్ ఇంజనీరింగ్ కాలేజీలో ఈసీఈ ఫస్ట్ ఇయర్ చదువుతున్నాడు. బాక్సింగ్‌పై ఉన్న మక్కువను గుర్తించి ప్రోత్సహించడంతోనే గోల్డ్‌మెడల్ సాధించాడని తండ్రి సయ్యద్ అబ్దుల్ ఖాదర్ జిలానీ తెలిపారు.


దేవాలయ కమిటీ సభ్యులతో భక్తులు

బాబుల్‌రెడ్డినగర్ ఉమ్మడి దేవాలయ కమిటీ అధ్యక్షుడిగా ఉప్పల్ శ్రీను

రాజేంద్రనగర్, మే 5 (ఆంధ్రజ్యోతి): రాజేంద్రనగర్ సర్కిల్ మైలార్‌దేవుపల్లి డివిజన్ బాబుల్‌రెడ్డినగర్ ఉమ్మడి దేవాలయాల అధ్యక్షుడిగా ఉప్పల్ శ్రీను నియమితులయ్యారు. ఆదివారం జరిగిన దేవాలయ కమిటీ సమావేశంలో మాజీ కౌన్సిలర్ ఎస్.వెంకటేశ్, నాయకులు సోమ శ్రీనివాస్ గుప్తా, మల్లేశ్, సేడెం వెంకటరమణ గుప్తా ఆధ్వర్యంలో దేవాలయ కమిటీ సభ్యులను నియమించారు. ఉపాధ్యక్షుడిగా కిషోర్, ప్రధాన కార్యదర్శిగా పల్లపు జగన్, కోశాధికారిగా శంకర్ నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఉప్పల్ శ్రీను మాట్లాడుతూ, దేవాలయ అభివృద్ధి కోసం కోర్ కమిటీ సభ్యులుగా ఉన్న వారితో కలసి ముందుకు సాగుతానన్నారు. కార్యక్రమంలో కిష్టప్ప, ఎస్.హనుమంతు, ఎల్.కిష్టప్ప, అశోక్ కుమార్, సందీప్‌గుప్తా, రవి, బాలరాజు, మల్లేశ్, రామకృష్ణ, శేఖర్ పాల్గొన్నారు.

మోదీ పాలనలో భారత్ అభివృద్ధి

- బీజేపీ ఓబీసీ సామాజిక సమ్మేళనం

కార్వాన్, మే 5 (ఆంధ్రజ్యోతి): గోల్కొండ జిల్లా కార్వాన్ ఓబీసీ మోర్చా అధ్యక్షుడు ఉదయ్‌కుమార్ అధ్యక్షతన బీజేపీ ఓబీసీ సామాజిక సమ్మేళనం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బీజేపీ హైదరాబాద్ ఎంపీ మాధవీలత, ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు ఆనంద్‌గౌడ్, ఎంబీసీ కమీషన్ మాజీ చైర్మన్ తాడూరి శ్రీనివాస్ హాజరయ్యారు.

ఈ సందర్భంగా ఉదయ్ కుమార్ మాట్లాడుతూ ప్రధాని పాలనలో భారత్ అభివృద్ధి పథంలో నడుస్తుందని అన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు ఉమారాణి, పూసరాజు, సంజయ్, వెంకటేశ్, డిజ్వర్‌సింగ్, రవీందర్‌సింగ్, లాల్‌సింగ్, గోవర్ధన్, శ్రీనివాస్, నర్సింగరావు, ముకేశ్‌సాగర్, ప్రవీణ్‌కుమార్, సుధాకర్ యాదవ్, వివిధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా సబితారెడ్డి పుట్టిన రోజు వేడుకలు

రాజేంద్రనగర్, మే5(ఆంధ్రజ్యోతి): విద్యాశాఖ మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే పట్లోళ్ల సబితారెడ్డి జన్మదిన వేడుకలను ఆదివారం నగరంలోని శ్రీనగర్‌కాలనీలో ఘనంగా నిర్వహించారు. రాజేంద్రనగర్ సర్కిల్‌కు చెందిన బీఆర్ఎస్ నాయకులు సబితారెడ్డి నివాసానికి వెళ్లి పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపారు. వారి సమక్షంలో సబితారెడ్డి కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా సబితారెడ్డి మాట్లాడుతూ, చేవెళ్ల పార్లమెంట్ నుంచి పోటీ చేస్తున్న బీఆర్ఎస్ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్‌ను గెలిపించడానికి ప్రతి కార్యకర్త కష్టపడి పనిచేయాలని సూచించారు. సబితారెడ్డిని కలసిన వారిలో రాజేంద్రనగర్ కార్పొరేటర్ పి.అర్చన జయప్రకాశ్, బీఆర్ఎస్ నాయకులు కొత్త రాజశేఖర్ రెడ్డి, పి.రమేశ్‌చారి, ఎం.ప్రభాకర్‌రెడ్డి, పి.శ్రీనివాసులు, డి.రమేశ్ ముదిరాజ్, జర్నలిస్టు సంఘం రాజేంద్రనగర్ సర్కిల్ అధ్యక్షుడు మేకల దామోదర్‌రెడ్డి, వర్కాల చందు తదితరులు ఉన్నారు.


కేక్ కట్ చేస్తున్న సబితారెడ్డి

మైలార్‌దేవుపల్లిలో ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ జన్మదిన వేడుకలు

రాజేంద్రనగర్, మే5(ఆంధ్రజ్యోతి): రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి.ప్రకాశ్‌గౌడ్ జన్మదిన వేడుకలను ప్రకాశన్న యువసేన అధ్యక్షుడు టి.రాముగౌడ్ ఆధ్వర్యంలో ఘనంగా జరుపుకొన్నారు. ఆదివారం ఉదయం దుర్గానగర్ శ్రీజయదుర్గాదేవీ ఆలయం వద్ద మాజీ కార్పొరేటర్ టి.ప్రేందాస్‌గౌడ్ కేక్ కట్‌చేసి అందరికీ తినిపించారు. ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ తిరుపతికి వెళ్లారని, అందుకే పార్టీ నాయకులతో కలసి కేక్ కట్ చేశామని ప్రేందాస్ గౌడ్ తెలిపారు. కార్యక్రమంలో మైలార్‌దేవుపల్లి డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు టి.ప్రేంగౌడ్, ప్రధాన కార్యదర్శి గుమ్మడి కుమార్, యువత అధ్యక్షుడు అక్కెం రాఘవేందర్ యాదవ్, నాయకులు డి.రమేశ్, రాజేశ్ యాదవ్, కె.యాదగిరి, ఎం.వెంకటేశ్, లక్ష్మీరాజ్, వజ్రమ్మ, భూదేవీ, రాజు ముదిరాజ్, సనావుల్లా, అతావుల్లా, ఫహీమ్, గట్టయ్య, బి.శ్రీనివాస్, లక్ష్మారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


కేక్‌కట్ చేస్తున్న ప్రేందాస్ గౌడ్, ప్రకాశన్న యువసేన అధ్యక్షుడు రాముగౌడ్ తదితరులు

రాజ్యాంగాన్ని మార్చడం ఎవరితరమూ కాదు: ఎస్సీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు

బర్కత్‌పుర, మే 5 (ఆంధ్రజ్యోతి): రాజ్యాంగం, రిజర్వేషన్ల రద్దు అంటూ కాంగ్రెస్ పార్టీ చేస్తున్నది దుష్ప్రచారం మాత్రమేనని, రాజ్యాంగాన్ని మార్చడం ఎవరితరమూ కాదని బీజేపీ ఎస్సీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు బి. ఓంప్రకాష్, కార్పొరేటర్ డాక్టర్. సురేఖ స్పష్టం చేశారు. బీజేపీ మూడోసారి అధికారంలోకి వస్తే రిజర్వేషన్లను రాజ్యాంగాన్ని రద్దు చేస్తుందని నకిలీ వీడియోలతో అసత్య ప్రచారం చేస్తున్న సీఎం... ప్రజలకు బహిరంగ ంగా క్షమాపణలు చెప్పాలని వారు డిమాండ్ చేశారు. ఆదివారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ తొలి ప్రధాని నెహ్రూ రిజర్వేషన్లను రద్దు చేయాలని సీఎంలకు ఉత్తరాలు రాసిన విషయాన్ని కాంగ్రెస్ నేతలు మరిచిపోయారని ఆరోపించారు. మతం పేరిట రిజర్వేషన్లు ఇవ్వడం నేరమని రాజ్యాంగంలో స్పష్టం చేసినా... గతంలో వైఎస్, ప్రస్తుతం కర్నాటకలో కాంగ్రెస్ ప్రభుత్వాలు దొడ్డిదారిన ముస్లింలకు రిజర్వేషన్లు కల్పిస్తున్నారని, దీనిని ప్రజలు గమనించాలని కోరారు. బీజేపీపై దుష్ప్రచారం చేస్తున్న కాంగ్రెస్ నాయకులకు ప్రజలు సరైన గుణపాఠం చెప్పాలని వారు కోరారు. కార్యక్రమంలో బీజేపీ గోల్కొండ జిల్లా ఎస్సీ మోర్చా అధ్యక్షుడు రాజేందర్, ప్రధాన కార్యదర్శి నిర్మల్ రాజ్, ఓబీసీ మోర్చా ఉపాధ్యక్షుడు రాకేష్, యువమోర్చా ఉపాధ్యక్షుడు అరవింద్, ఎస్సీ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి బొమ్మల మహేందర్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఓంప్రకాష్

రాజేంద్రనగర్ సర్కిల్‌లో బీఆర్ఎస్ ఖాళీ?

రాజేంద్రనగర్, మే 5 (ఆంధ్రజ్యోతి): రాజేంద్రనగర్ సర్కిల్‌లో బీఆర్ఎస్ పార్టీ వరుస ఎదురుదెబ్బలు తగులుతున్నాయి. బీఆర్ఎస్ పార్టీలోని ముఖ్య నాయకులు ఇతర పార్టీలకు వలసపోతున్నారు. ఇప్పటికే పలువురు కాంగ్రెస్‌లో చేరగా, మరికొందరు ఆ దిశగా పావులు కదుపుతున్నారు. దీంతో రాజేంద్రనగర్ సర్కిల్‌లో బీఆర్ఎస్ ఖాళీ కావడం ఖాయంగా కన్పిస్తోంది.

ఇటీవల కాంగ్రెస్ చేరిన పలువురు

మైలార్‌దేవుపల్లి డివిజన్ బీఆర్ఎస్ మాజీ అధ్యక్షుడు సరికొండ వెంకటేశ్‌తో పాటు తెలంగాణ ఉద్యమ సమయం నుంచి పార్టీలో ఉన్న చలసాని విష్ణుమూర్తి, రాపోలు సత్తయ్య, కె.సత్యనారాయణగౌడ్ తదితరులు ఏప్రిల్ 2న కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. బీఆర్ఎస్ రాజేంద్రనగర్ సర్కిల్ సీనియర్ నాయకుడు సామ ఇంద్రపాల్‌రెడ్డి ఏప్రిల్ 25న రాజేంద్రనగర్‌కు సీఎం ఎ.రేవంత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. ఆయన వెంట ఉప్పర్‌పల్లి, చింతల్‌మెట్, ఖయ్యూంనగర్, భూపాల్‌నగర్, ఎర్రబోడకు చెందిన పలువురు బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు కాంగ్రెస్‌లో చేరారు. ఇటీవల రాజేంద్రనగర్ డివిజన్ బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శిగా ఉన్న పలుగుచెరువు మహేశ్ తన అనుచరులతో కలసి కాంగ్రెస్‌లో చేరారు. 2 రోజుల క్రితం సులేమాన్‌నగర్ డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు షేక్ నయిముద్దీన్, ఆయన అనుచరులతో సీఎం రేవంత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు.


నయిముద్దీన్‌కు కండువా కప్పి ఆహ్వానిస్తున్న సీఎం (ఫైల్)

'కొత్త' తలనొప్పులు... తలలు బాదుకుంటున్న పాత నాయకులు

రాష్ట్రం ఏర్పడిన తర్వాత అధికారం కోల్పోయి, దిక్కులేని నావలా మారిన పార్టీకి అండగా ఉండి, మొదటి నుంచి కాంగ్రెస్ పార్టీలో ఉన్న నాయకులు తలలు బాదుకుంటున్నారు. పది సంవత్సరాలు ప్రతిపక్షంలో ఉండి అనేక కష్టాలకు ఓర్చుకుని పార్టీ కోసం పనిచేస్తున్నామని, ఇప్పటి వరకు బీఆర్ఎస్‌లో ఉండి, అధికారం పోగానే ఆ పార్టీ నాయకులు ఇప్పుడు కొత్తగా కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నారని, దాంతో మొదటి నుంచి పార్టీ కోసం పనిచేసిన తాము వెనుకబడి పోతున్నామని కొందరు కాంగ్రెస్ నాయకులు తమ సన్నిహితుల వద్ద వాపోతున్నారు. 'కొత్త'వారితో తలనొప్పులు వస్తాయని వారు అంటున్నారు. ఈ పరిస్థితి ఎంపీ ఎన్నికల ఒరకే ఉంటుందా..? ముమ్ముందు కూడా ఇలానే ఉంటుందా... అని ఆందోళన చెందుతున్నారు. మొదటి నుంచి పార్టీ కోసం పనిచేసిన వార్కి తగిన గుర్తింపు ఇచ్చి వారికే పార్టీ పదవులలో మొదటి ప్రాధాన్యం ఇవ్వాలని వారు కోరతున్నారు. భవిష్యత్‌లో జరుగబోయే కార్పొరేటర్ ఎన్నికలలోనూ పాత వారికే అవకాశాలు ఇవ్వాలని కోరుతున్నారు.

సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో తెలంగాణ బాలోత్సవం

రాంనగర్, మే 5 (ఆంధ్రజ్యోతి): చిన్నారుల్లో అంతర్లీనంగా నిక్షిప్తమైన సృజనాత్మకతను వెలికితీయడానికి తెలంగాణ బాలోత్సవం సంస్థ ఎంతో కృషి చేస్తుందని కేంద్ర బాలసాహితీవేత్త చొక్కాపు వెంకటరమణ ప్రశంసించారు. ఆదివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో తెలంగాణ బాలోత్సవం సమ్మర్ క్యాంపు ప్రారంభమైంది. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ ఈ నెల 22వ తేదీ వరకు బాలోత్సవం సమ్మర్ క్యాంపు కొనసాగుతుందన్నారు. ప్రస్తుత సమాజంలో విద్య ఒక్కటే కాదని కళలు, క్రీడలలోనూ ప్రావీణ్యత సాధించాలని చిన్నారులకు సూచించారు. చిన్నారుల్లో జ్ఞాపకశక్తిని ఫోకస్ చేసి ప్రతిభాపాటవాలను మెరుగుపరిచే విజ్ఞాన సమ్మర్ క్యాంపు తెలంగాణ బాలోత్సవం విజ్ఞానదాయకంగా నిర్వహిస్తుందన్నారు. విజ్ఞానదర్శిని ప్రతినిధి రమేష్ మాట్లాడుతూ పిల్లలకు విజ్ఞానశాస్త్ర, సామాజిక పర్యావరణ, ప్రకృతి పాఠాలు, మానవ సంబంధాల వంటి విషయాలపై అవగాహన పెంపొందించుకోవడానికి సమ్మర్ క్యాంపులు దోహదపడతాయన్నారు. తెలంగాణ బాలోత్సవం అధ్యక్షుడు భూపతి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఆంగ్ల భాష మోజులోపడి తెలుగు మరిచిపోతున్న ఈతరానికి తెలుగు మాధుర్యాన్ని పంచే బాధ్యత, అమ్మదనాన్ని, తెలుగు ధనాన్ని బాలోత్సవం నేర్పిస్తుందన్నారు.

వీవీ ప్యాట్లలో సింబల్ లోడింగ్ పూర్తి చేయాలి

రిటర్నింగ్ అధికారి అనుదీప్ దురిశెట్టి

హైదరాబాద్ సిటీ, మే 5 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల్లో పోటీచేస్తున్న అభ్యర్థుల సింబల్ లోడింగ్‌ను త్వరగా పూర్తి చేయాలని హైదరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అధికారులను ఆదేశించారు. ఈ మేరకు ఆదివారం చాంద్రాయణగుట్ట, గోషామహల్, చార్మినార్, యాకుత్‌పురా, కార్వాన్, బహదూర్‌పురా, మలక్‌పేట్ డీఆర్‌సీ సెంటర్లను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా వీవీ ప్యాట్లలో అభ్యర్థుల సింబల్ లోడింగ్ ప్రక్రియను పరిశీలించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ అసెంబ్లీ సెగ్మెంట్లలోని పోలింగ్ కేంద్రాల ఈవీఎంల సెగ్రిగేషన్ పూర్తి చేయాలని సూచించారు. ఆయన వెంట ఏఆర్‌ఓలు, సిబ్బంది ఉన్నారు.

అభ్యర్థులు వాహన అనుమతులు తీసుకోవాలి

ఎన్నికల్లో పోటీచేస్తున్న అభ్యర్థులు వాహనాల అనుమతులను వెంటనే తీసుకోవాలని హైదరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి సూచించారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో ఆదివారం వివిధ పార్టీల ప్రతినిధులు, అభ్యర్థులు, హైదరాబాద్ జనరల్ అబ్జర్వర్ పీఐ శ్రీవిద్య సమక్షంలో రెండో విడత ర్యాండమైజేషన్ ద్వారా ఈవీఎంలను కేటాయించారు. ఈ సందర్భంగా అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ పోలింగ్ కేంద్రాల వారీగా బ్యాలెట్ యూనిట్లను కేటాయించినట్లు తెలిపారు. అభ్యర్థులు ఫారం-8 సమర్పించిన 24 గంటల్లోనే ఐడీ కార్డు జారీ చేస్తామని తెలిపారు. 10 పోలింగ్ సేషన్లకు ఒక సెక్టోరల్ అధికారిని నియమించామని, ఎన్నికల రోజున పనిచేయని యంత్రాల స్థానంలో 20 నిమిషాల్లోపే సీసీ టీవీ వీడియో కవరేజ్‌తో రీప్లేస్ చేస్తామని ఆయన పేర్కొన్నారు.



వీవీ ప్యాట్లను పరిశీలిస్తున్న రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి

పోస్టల్ బ్యాలెట్‌తో ఓటేసిన 5,233 మంది

జిల్లా ఎన్నికల అధికారి రోనాల్డ్ రోస్

హైదరాబాద్ సిటీ, మే 5 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఇప్పటివరకు 5,233 మంది పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటుహక్కు వినియోగించుకున్నారని జిల్లా ఎన్నికల అధికారి రోనాల్డ్‌రోస్ తెలిపారు. ఆదివారం జిల్లాలో 1,914 మంది ఓటుహక్కు వినియోగించుకున్నట్టు తెలిపారు. సికింద్రాబాద్ నియోజకవర్గంలో 975 మంది, హైదరాబాద్ లోక్‌సభ పరిధిలో 848మంది, కంటోన్మెంట్‌లో 91 మంది ఓటుహక్కు వినియోగించుకున్నారని వెల్లడించారు. హోం ఓటింగ్‌లో భాగంగా సికింద్రాబాద్ కంటోన్మెంట్ నియోజకవర్గంలో 57కు 52 మంది సికింద్రాబాద్, హైదరాబాద్ లోక్‌సభ నియోజకవర్గాల్లో 514కు 479 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. మొత్తం జిల్లాలో 571 హోం ఓటర్లు గాను 531 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారని జిల్లా ఎన్నికల అధికారి రోనాల్డ్‌రోస్ తెలిపారు.

మూడేళ్ల బాలుడిపై వీధి కుక్కల దాడి

అబ్దుల్లాపూర్‌మెట్, మే 5 (ఆంధ్రజ్యోతి): చిన్నారులపై వీధి కుక్కల దాడులు కొనసాగుతూనే ఉన్నాయి. నగర శివారు పెద్దఅంబర్‌పేట్ మున్సిపాలిటీ పరిధిలోని సూర్యవంశీ కాలనీలోని ఓ అపార్ట్‌మెంట్ ముందు ఆదివారం మూడేళ్ల బాలుడు రిషీ ఆడుకుంటున్నాడు. ఆ సమయంలో అటువైపు వచ్చిన వీధి కుక్కల గుంపు బాలుడిపై దాడి చేశాయి. బాలుడిని కిందపడేసి నడుంతో పాటు ఇతర భాగాల్లో విచక్షణారహితంగా కొరికాయి. గమనించిన స్థానికులు కుక్కలను హడలించడంతో బాలుడిని వదిలేసి పారిపోయాయి. కొంత కాలంగా కాలనీలో కుక్కల బెడద ఎక్కువైందని పలుమార్లు మున్సిపల్ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని కాలనీవాసులు ఆగ్రహం వ్యక్తం చేశారు. వీధి కుక్కల నివారణకు మున్సిపల్ అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని కాలనీవాసులు కోరుతున్నారు.



బాలుడి నడుం భాగంలో విచక్షణరహితంగా గాయపరిచిన కుక్కలు

చెరువులో చేపల వేటకు వెళ్లిన ఇద్దరు గల్లంతు

పహాడీషరీఫ్ మే 5 (ఆంధ్రజ్యోతి): జల్‌పల్లి పెద్ద చెరువులో చేపల వేటకు వెళ్లిన ఇద్దరు బాలురు ప్రమాదవశాత్తు చెరువులో మునిగిపోయిన సంఘటన పహాడీషరీఫ్ పోలీసుస్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్‌ఐ శ్రీనివాస్, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ఎర్రకుంట బార్కస్‌కు చెందిన ఐదుగురు యువకులు ఆదివారం ఉదయం 10 గంటలకు జల్‌పల్లి పెద్ద చెరువుకు చేపల వేటకు వెళ్లారు, వీరిలో ఎర్రకుంటకు చెందిన అబ్దుల్ వాహెద్(14), బార్కస్‌కు చెందిన ఉస్మాన్ సహాది(16), మరో యువకుడు కలిసి చెరువులో ఉన్న గుండుపై నిల్చొని చేపలు పడుతున్నారు. ఈ సందర్భంలో ముగ్గురు ప్రమాదవశాత్తు చెరువులో పడిపోయారు. గమనించిన ఓ యువకుడు చెరువులో దిగి ఒకరిని కాపాడాడు. అబ్దుల్ వాహెద్, ఉస్మాన్ సహాది చెరువులో మునిగిపోయారు. సమాచారం అందుకున్న పహాడీషరీఫ్ పోలీసులు చెరువు వద్దకు వెళ్లి స్థానిక ఈతగాళ్ళతో గాలించినా ఆదివారం సాయంత్రం వరకు మృతదేహాల ఆచూకీ లభించలేదు. మృతదేహాలను వెలికి తీసేందుకు గజఈతగాళ్ళను రప్పించేందుకు ప్రయత్నిస్తున్నామని పోలీసులు తెలిపారు.

నిబంధనలను అతిక్రమించిన కాలేజీలపై చర్యలు తీసుకోవాలి: ఏబీవీపీ

హైదరాబాద్ సిటీ, మే5(ఆంధ్రజ్యోతి): నిబంధనలు ఉల్లంఘించి అక్రమంగా కాలేజీలు నిర్వహిస్తున్న యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలని ఏబీవీపీ స్టేట్ యూనివర్సిటీస్ కన్వీనర్ జీవన్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్రంలోని కార్పొరేట్ విద్యా సంస్థలపై విద్యాశాఖ అధికారుల నియంత్రణ కొరవడడంతో కొందరు విద్యను వ్యాపారంగా మార్చుకుని విద్యార్థులను వేధిస్తున్నారని ఆరోపించారు. రాష్ట్రంలో నిబంధనలు ఉల్లంఘించిన 27 కాలేజీలకు జరిమానా విధించడం మంచిదైనప్పటికీ, నిర్వాహకులను నియంత్రించేలా పర్మిషన్ రద్దు లాంటి కఠిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

కంటి సమస్యలపై సీఎంఈ

హైదరాబాద్ సిటీ, మే 5 (ఆంధ్రజ్యోతి): కిమ్స్ ఆధ్వర్యంలో, అప్తమాలజీ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో నిరంతర వైద్య విద్య (సీఎంఈ) సికింద్రాబాద్ ఆస్పత్రిలో ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కిమ్స్ మెడికల్ డైరెక్టర్ డాక్టర్ సంబిత్ సాహు హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. శస్త్ర చికిత్సలలో నైపుణ్యాలు, క్లిష్టమైన కేసుల్లో చికిత్స అందించడం తదితర విషయాలు, ఆర్థికపరమైన అంశాలు, క్రమశిక్షణ, కొత్త క్లినిక్‌లు, ఆస్పత్రుల ఏర్పాటు, అనుమతులపై చర్చించారు. రిఫ్రాక్టివ్ సర్జరీలు, క్యాటరాక్ట్ సర్జరీలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, సంక్లిష్టమైన కేసుల్లో శస్త్ర చికిత్సలు చేసేటప్పుడు పాటించాల్సిన నియమాలు తదితర అంశాలపై చర్చించారు. అప్తమాలజీ విభాగం సీనియర్ క్యాటరాక్ట్ సర్జన్ డాక్టర్ బి.ప్రణతి, హైదరాబాద్ అప్తల్మాలజీ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి సరోజినీదేవి కంటి ఆస్పత్రి ప్రొఫెసర్ డాక్టర్ మోదీని పండార్‌పూర్కర్ నిర్వహణ కార్యదర్శులుగా వ్యవహరించారు. సరోజినీదేవి కంటి ఆస్పత్రి డాక్టర్ రామన్ తదితరులు పాల్గొన్నారు.



కిమ్స్‌లో కంటి సమస్యలపై ఏర్పాటు చేసిన సీఎంఈ కార్యక్రమాన్ని జ్యోతి వెలిగించి ప్రారంభిస్తున్న వైద్యులు



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న అతిథులు

కుల నిర్మూలన పుస్తకావిష్కరణ

రవీంద్రభారతి, మే 5 (ఆంధ్రజ్యోతి): డా.బీఆర్.అంబేడ్కర్ ఇంగ్లీష్ మూలం నుంచి వచ్చిన కుల నిర్మూలన పుస్తకాన్ని దివంగత రచయిత చంద్రశేఖర్ అనువాదం చేయడం అభినందనీయమని వక్తలు అన్నారు. ఆదివారం రవీంద్రభారతి కాన్ఫరెన్స్ హాల్‌లో బుద్దిస్ట్ సొసైటీ ఆఫ్ ఇండియా తెలంగాణ శాఖ ఆధ్వర్యంలో ప్రముఖ రచయిత డా.చంద్రశేఖర్ వర్ధంతి సభ నిర్వహించారు. అతిథులుగా హాజరైన చెన్నూరు ఆంజనేయరెడ్డి, శివనాగిరెడ్డి, పరంధాములు, డా.సత్తయ్య కులనిర్మూలన పుస్తకాన్ని ఆవిష్కరించారు. చంద్రశేఖర్ పేరు మీద బుద్ధ భూమి ప్రత్యేక సంచికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చంద్రశేఖర్ రచనల గురించి విశ్లేషించారు. చంద్రశేఖర్ సేవలు ఎనలేనివని కొనియాడారు. ఆయన మరణం తీరని లోటని పేర్కొన్నారు. కార్యక్రమంలో సంఘం సభ్యులు నూకల నర్సింహ, సంజీవరెడ్డి, వరుణ్‌కుమార్, నల్లబాబు, యాదగిరిరావు, తాడి సురేష్, మూర్తి పాల్గొన్నారు.

కేబుల్ బ్రిడ్జిపై ఇన్‌స్పెక్టర్ వేడుకలు

● విచారణకు ఆదేశించిన డీసీపీ

రాయదుర్గం, మే 5 (ఆంధ్రజ్యోతి): దుర్గంచెరువు కేబుల్ బ్రిడ్జిపై జన్మదిన వేడుకలు చేసుకున్న మాదాపూర్ ఇన్‌స్పెక్టర్ జి.మల్లేశ్ ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారడంతో మాదాపూర్ జోన్ డీసీపీ డాక్టర్ వినీత్ సమగ్ర విచారణకు ఆదేశించారు. నివేదిక ఆధారంగా చర్యలు తీసుకుంటామని ఆయన ఆదివారం విడుదల చేసిన ఓ ప్రకటనలో తెలిపారు. కేబుల్ బ్రిడ్జిపై వరుస ప్రమాదాలు జరుగుతుండటంతో మాదాపూర్ డీసీపీ వినీత్ ఏప్రిల్ 16న వేడుకలు జరపడం, ఫొటోలు దిగడం, వాహనాలు నిలపడంపై నిషేధం విధించారు. ఉన్నతాధికారుల ఆదేశాలను పాటించాలని ఇన్‌స్పెక్టర్ మల్లేశ్ పలువురికి అవగాహన కల్పించి తానే రూల్స్ బ్రేక్ చేశారు. ఏప్రిల్ 20వ తేదీ రాత్రి కేబుల్ బ్రిడ్జిపై జరిగిన బర్త్‌డే వేడుకల్లో పటాన్‌చెరు ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ శ్రవణ్, రాజేంద్రనగర్ సీఎస్ ఇన్‌స్పెక్టర్ సంజయ్‌తో కలిసి పాల్గొన్నారు.



మాదాపూర్ కేబుల్ బ్రిడ్జిపై కేక్ కట్ చేసి తినిపిస్తున్న దృశ్యం

జూన్ 20న యూహెచ్‌క్యూ రిక్రూట్‌మెంట్ ర్యాలీ

● అగ్నివీర్(జీడీ), అగ్నివీర్ టెక్నికల్, క్లర్క్ రిక్రూట్‌మెంట్ డ్రైవ్

అల్వాల్, మే 5 (ఆంధ్రజ్యోతి): 1ఈఎంఈ సెంటర్ సికింద్రాబాద్‌లో జూన్ 20న యూనిట్ హెడ్‌క్వార్టర్ కోటా(యూహెచ్‌క్యూ) కింద ఆర్మీ రిక్రూట్‌మెంట్ ర్యాలీని నిర్వహిస్తున్నారు. అగ్నివీర్(జీడీ), అగ్నివీర్ టెక్నికల్, క్లర్క్, అగ్నివీర్ ట్రేడ్స్‌మన్ విభాగాల్లో రిక్రూట్‌మెంట్ డ్రైవ్‌ను చేపడుతున్నారు. పదో తరగతి కేటగిరీలో (డ్రెస్సర్, చెఫ్, కమ్యూనిటీ, స్టీవార్డ్, వాషర్‌మ్యాన్) 8వ వతరగతి విద్యార్హతలపై మెస్ కీపర్, హౌస్ కీపర్, అవుట్‌స్టాడింగ్ స్పోర్ట్స్‌మన్‌లు రిక్రూట్‌మెంట్‌కు అర్హులు. అన్ని కేటగిరీలకు చెందిన అభ్యర్థుల వయస్సు 17.5 నుంచి 21 సంవత్సరాల మధ్య ఉండాలి. అగ్నివీర్ జనరల్ డ్యూటీకి 45శాతం మార్కులతో 10 తరగతి లేదా మెట్రిక్ ఉత్తీర్ణత అయి ఉండాలి. అగ్నివీర్ టెక్నికల్ కోసం 10వ ప్లస్ 2 లేదా ఇంటర్మీడియట్‌లో పాస్ అయి ఉండాలి. ఫిజిక్స్, కెమిస్ట్రీ, మ్యాథ్స్, ఇంగ్లిష్, సైన్స్‌లో 50శాతం మార్కులతో ప్రతి సబ్జెక్టులో 40శాతంతో ఏదైనా గుర్తింపు పొందిన రాష్ట్ర విద్యామండలి నుంచి ఉత్తీర్ణులై ఉండాలి. అగ్నివీర్ ట్రేడ్స్‌మన్ కోసం 10వ తరగతి చదువుతున్న వారు, 10వ తరగతిలో సాధారణ ఉత్తీర్ణత అయిన వారుకూడా అర్హులు. అర్హులైన అభ్యర్థులు ర్యాలీలో పాల్గొనడానికి 2024 జూన్ 20న ఉదయం 5గంటలకు కోటేశ్వర్ ద్వార్, 4 ట్రైనింగ్ బెటాలియన్, 1 ఈఎంఈ సెంటర్ సికింద్రాబాద్‌లో రిపోర్ట్ చేయాలని రక్షణశాఖ అధికారులు ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఇతర వివరాల కోసం 1 ఈఎంఈ సెంటర్ బొల్లారం, సికింద్రాబాద్, తెలంగాణ రాష్ట్రం, పిన్-500010 లేదా ఈ-మెయిల్: awwaleagle@gmail.com లేదా www.joinindianarmy@nic.in ని సందర్శించవచ్చు. ఫోన్ నంబర్ 040-27863016 ద్వారా సమాచారం తెలుసుకోవచ్చని పేర్కొన్నారు.

ఎన్నికల సిత్రాలు



సబ్జిమండి గంగపుత్ర భవన్‌లో గంగపుత్రుల ఆత్మీయ సమ్మేళనంలో చేపలు, వలతో మాజీ గవర్నర్ తమిళిసై, హైదరాబాద్ పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి మాధవీలత - కార్వాన్ (ఆంధ్రజ్యోతి)



మంగళ్‌హట్‌లో ఎన్నికల ప్రచారంలో భాగంగా ఓ హోటల్‌లో దోశ వేస్తున్న హైదరాబాద్ పార్లమెంటు బీఆర్ఎస్ అభ్యర్థి గడ్డం శ్రీనివాస్ యాదవ్ - అఫ్జల్‌గంజ్, (ఆంధ్రజ్యోతి)

ప్రచార హోరు

గ్రేటర్ పరిధిలోని హైదరాబాద్, సికింద్రాబాద్, మల్కాజిగిరి, చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గాల పరిధిలో ప్రచారం వాడీవేడిగా కొనసాగుతోంది. ఆదివారం ఆయా నియోకవర్గాల పరిధిలోని పలు ప్రాంతాల్లో సభలు, సమావేశాలు, రోడ్ షోలతో పాటు వినూత్నంగా ప్రచారం చేస్తూ అభ్యర్థులు, నాయకులు ఓటర్లను ఆకట్టుకునే ప్రయత్నం చేశారు.



చేవెళ్ల పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి గడ్డం రంజిత్‌రెడ్డికి మద్దతుగా నాదర్‌గుల్ కమ్మగూడలో నిర్వహించిన ప్రచారంలో జొన్న రొట్టెలు చేస్తున్న టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, బడంగ్‌పేట్ మేయర్ పారిజాతా నర్సింహారెడ్డి - సరూర్‌నగర్ (ఆంధ్రజ్యోతి)



మల్కాజిగిరి పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డికి మద్దతుగా ప్రచారం చేసి డిఫెన్స్‌కాలనీలోని పార్కులో వాకర్స్‌తో కలిసి వ్యాయామం చేస్తున్న ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి - చంపాపేట (ఆంధ్రజ్యోతి)



సికింద్రాబాద్ పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి జి.కిషన్‌రెడ్డికి మద్దతుగా ముషీరాబాద్ నియోజకర్గం గాంధీనగర్ డివిజన్‌లో ఓ వృద్ధుడిని ఓటు అభ్యర్థిస్తున్న ఎంపీ డా. కె.లక్ష్మణ్, కార్పొరేటర్ పావనివినయ్‌కుమార్ - చిక్కడపల్లి (ఆంధ్రజ్యోతి)

టీఎస్ ఎప్‌సెట్‌కు 942 మంది దివ్యాంగుల దరఖాస్తు

● పరీక్షాకేంద్రాల్లో ఉచితంగా స్క్రైబ్‌ల ఏర్పాటు ● విజువల్లీ హ్యాండీక్యాప్డ్ అభ్యర్థులకు అదనపు సమయం..

హైదరాబాద్ సిటీ, మే 5 (ఆంధ్రజ్యోతి): టీఎస్ఎప్‌సెట్‌కు రాష్ట్రవ్యాప్తంగా 942మంది దివ్యాంగులు దరఖాస్తు చేసుకొన్నారు. ఇంజనీరింగ్ పరీక్ష కోసం మొత్తం 626మంది దరఖాస్తు చేసుకోగా, వీరిలో106మంది హియరింగ్ ఇంపేర్డ్ (హెచ్‌ఐ), 406మంది అంగవైకల్యం(ఓహెచ్), 114మంది అంధత్వం(వీహెచ్) కలిగిన అభ్యర్థులు ఉన్నారు. అగ్రికల్చర్ అండ్ ఫార్మసీ పరీక్షకు 316మంది దరఖాస్తు చేసుకోగా, 26 మంది హెచ్‌ఐ, 230మంది ఓహెచ్, 60మంది వీహెచ్ కేటగిరీ అభ్యర్థులు ఉండడం గమనార్హం.

ప్రతి బ్రాంచ్/సెక్షన్‌లో మూడేసి సీట్లు

ఇంజనీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ కాలేజీల్లోని ప్రతి బ్రాంచ్/ సెక్షన్‌లో వీహెచ్, ఓహెచ్, హెచ్‌ఐ కేటగిరీ అభ్యర్థులకు ఒక్కొక్క సీటు చొప్పున రిజర్వేషన్‌ను ప్రభుత్వం కల్పించింది. అయితే, ఆయా కేటగిరీలకు చెందిన విద్యార్థుల్లో 40 శాతం కంటే ఎక్కువ వైకల్యం ఉన్న అభ్యర్థులందరికీ ఈ రిజర్వేషన్ వర్తిస్తుంది. విజువల్ హ్యాండీక్యాప్డ్ కేటగిరీ కింద దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు ఎప్‌సెట్ రాసేందుకు(జవాబులను ఆన్‌లైన్‌లో బబుల్ చేసేందుకు) ఆయా పరీక్షా కేంద్రాల్లో నిర్వాహకులే ఒక స్క్రైబ్‌ను ఏర్పాటు చేస్తారు. హ్యాండీక్యాప్డ్ అభ్యర్థుల సంఖ్య మేరకు ఇప్పటికే స్క్రైబ్‌లను(ఆర్ట్స్ కోర్సులు చదివిన వారిని) ఎప్‌సెట్ అధికారులు సిద్ధం చేశారు. ఇందుకోసం అభ్యర్థుల నుంచి ఎటువంటి చార్జ్ వసూలు చేయరు. విజువల్ హ్యాండీక్యాప్డ్ అభ్యర్థులకు స్క్రైబ్‌తో సదుపాయంతో పాటు ప్రతిగంటకు 20 నిమిషాల చొప్పున అదనపు సమయం కూడా కేటాయిస్తామని ఎప్‌సెట్ కోకన్వీనర్ డాక్టర్ కె.విజయకుమార్ రెడ్డి తెలిపారు.

బలమైన ప్రాథమిక ఆరోగ్య సంరక్షణ కేంద్రాలు అవసరం

● ఏఐజీ హాస్పిటల్స్ వైస్‌చైర్మన్ డాక్టర్ పీవీఎస్ రాజు

మియాపూర్, మే 5(ఆంధ్రజ్యోతి): ప్రజల ఆరోగ్యం, శ్రేయస్సును సాధించడంలో ప్రాథమిక ఆరోగ్య సంరక్షణ కేంద్రాలు ప్రధాన పాత్ర పోషిస్తాయని, దేశంలో బలమైన ప్రాథమిక ఆరోగ్య సంరక్షణ కేంద్రాలు చాలా అవసరమని ఏఐజీ హాస్పిటల్స్ చైర్మన్ డాక్టర్ పీవీఎస్ రాజు పేర్కొన్నారు. కొండాపూర్‌లోని సీఆర్ ఫౌండేషన్‌లో ఆదివారం నూతనంగా ఏర్పాటు చేసిన సీఆర్ ఫౌండేషన్ రోటరీ ప్రోలిఫిక్స్ డయాగ్నోస్టిక్ సెంటర్‌ను ఎల్‌వీ ప్రసాద్ ఐ ఇనిస్టిట్యూట్ వ్యవస్థాపకులు డాక్టర్ గుల్లపల్లి ఎన్.రావు, పద్మశ్రీ అవార్డు గ్రహీత, నిమ్స్ మాజీ డైరెక్టర్ ప్రొఫెసర్ దాసరి ప్రసాద్‌రావు, సీఆర్ ఫౌండేషన్ గౌరవ అధ్యక్షుడు, మాజీ ఎంపీ సురవరం సుధాకర్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ పీవీఎస్ రాజు మాట్లాడుతూ ప్రాథమిక ఆరోగ్య సంరక్షణ ముఖ్య ఉద్దేశం ప్రజల మొత్తం ఆరోగ్యాన్ని మెరుగుపరచడం, అంటువ్యాధుల వ్యాప్తిని నిరోధించడం అని అన్నారు. సీఆర్ ఫౌండేషన్‌లో ప్రాథమిక ఆరోగ్య సంరక్షణ కేంద్రంలో ప్రోలిఫిక్స్ డయాగ్నోస్టిక్ సెంటర్‌ను అందుబాటులోకి తీసుకురావడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ డెక్కన్ డిస్ట్రిక్ట్ గవర్నర్ శరత్‌చౌదరి, అధ్యక్షుడు అనిల్ రాంచందాని, సీఆర్ ఫౌండేషన్ అధ్యక్షుడు డాక్టర్ కె.నారాయణ, ప్రధాన కార్యదర్శి పల్లా వెంకట్‌రెడ్డితో పాటు పలువురు పాల్గొన్నారు.



సీఆర్ ఫౌండేషన్ రోటరీ ప్రోలిఫిక్స్ డయాగ్నోస్టిక్ సెంటర్ ప్రారంభోత్సవంలో పాల్గొన్న అతిథులు

నేను బతికున్నంత కాలం బీజేపీలోనే ఉంటా

● రాహుల్ గాంధీ నోరు తెరిస్తే బీజేపీకే లాభం
● తాండూరులో గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్

తాండూరు, మే 5 (ఆంధ్రజ్యోతి): 'నేను బతికున్నంత కాలం బీజేపీలోనే ఉంటా.. ప్రధాని మోదీ జపం చేస్తా..' అని గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ అన్నారు. తాండూరులో ఆదివారం బీజేపీ ఎంపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి తరఫున ఎన్నికల ప్రచారంలో భాగంగా బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఇందిరాచౌక్‌లో జరిగిన సభలో మాట్లాడుతూ.. హిందూ సమాజాన్ని కాంగ్రెస్ పార్టీ సర్వనాశనం చేసిందని ఆరోపించారు. రాహుల్‌గాంధీ నోరు తెరిస్తే బీజేపీకే లాభమని అన్నారు. ఆయన బీజేపీ స్టార్ ప్రచారక్ అవుతారని ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. పార్లమెంట్ ఎన్నికల తర్వాత రాహుల్‌గాంధీ ఇటలీ పారిపోవడం, కేసీఆర్, కేటీఆర్ జైలుకు వెళ్లడం ఖాయమని అన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న రంజిత్‌రెడ్డి బంజారాహిల్స్‌లో హనుమాన్ ఆలయ భూమిని కబ్జా చేశారని ఆరోపించారు. బీజేపీ కార్యకర్తలు ఆంజనేయస్వామి సైనికులుగా పనిచేయాలని సూచించారు. గతంలో ఒవైసీ కుటుంబాన్ని వైఎస్సార్ తర్వాత కేసీఆర్, ఇప్పుడు రేవంత్‌రెడ్డి ప్రోత్సహిస్తున్నారని మండిపడ్డారు. ఒవైసీ సోదరులను జైల్లో పెట్టించిన ఘనత కిరణ్ కుమార్‌రెడ్డికే దక్కిందన్నారు. కాంగ్రెస్, బీఆర్ఎస్‌కు ఒప్పందం ఉందని రాజాసింగ్ ఆరోపించారు. బీజేపీ చేవెళ్ల ఎంపీ అభ్యర్థిగా కొండా విశ్వేశ్వర్‌రెడ్డి ఉండడం ఈ ప్రాంత ప్రజల అదృష్టమని ఆయన అన్నారు. అనంతరం కొండా విశ్వేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ.. రేవంత్‌రెడ్డి కేవలం కొడంగల్ సీఎంగా వ్యవహరిస్తున్నారని అన్నారు. కాగ్నా నదిని కొడంగల్‌కు తరలించే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. 3లక్షల మెజారిటీతో తన విజయం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అసాధ్యమైన హామీలు ఇచ్చి చిప్పచేతిలో పట్టుకొని తిరుగుతున్నారని ఆయన ఎద్దేవా చేశారు. బషీరాబాద్‌లో రైళ్లు ఆపిస్తానని, ఈఎస్ఐ ఆస్పత్రి, కళాశాల ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు యు.రమేష్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు మాధవరెడ్డి, ప్రధాన కార్యదర్శి కృష్ణ ముదిరాజ్, నాయకులు బాలి శివకుమార్, అంతారం లలిత, శ్రీలత సుదర్శన్‌గౌడ్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న రాజాసింగ్

ఆస్తి కాజేసి అమ్మకు చిత్రహింసలు

● భార్యతో కలిసి కుమారుడి దుశ్చర్య

కార్వాన్, మే 5 (ఆంధ్రజ్యోతి): వృద్ధాప్యంలో ఉన్న కన్నతల్లికి అండగా నిలవాల్సిన కుమారుడు భార్యతో కలిసి ఆమెను చిత్రహింసలకు గురి చేస్తున్నాడు. అమ్మను నమ్మించి ఆమె పేరిట ఉన్న ఇంటిని సొంతం చేసుకున్న ఆ కుమారుడు.. కన్నతల్లికి కనీసం తిండి కూడా పెట్టడం లేదు. హైదరాబాద్ టప్పాచబుత్ర పోలీసుస్టేషన్ పరిధిలో జరిగిన ఈ ఘటన వివరాలిలా ఉన్నాయి. స్థానిక నటరాజ్‌నగర్‌కు చెందిన సర్దార్ బేగం(60)కు కుమారుడు మహ్మద్ ఇలియాజ్, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. అందరికీ పెళ్లిళ్లు అయిపోయాయి. మూడు పెళ్లిళ్లు చేసుకున్న ఇలియాజ్ వారికి విడాకులు ఇచ్చి ఇటీవల నాలుగో పెళ్లి చేసుకున్నాడు. ఇలియాజ్ దంపతులు ప్రస్తుతం తల్లితో కలిసి ఉంటున్నారు. తల్లితో మంచిగా ఉన్నట్లు నటించిన ఇలియాజ్ ఆమె పేరిట ఉన్న ఇంటిని తన పేరున గిఫ్ట్‌డీడ్ చేయించుకున్నాడు. ఇల్లు తన సొంతమైన తర్వాత భార్యతో కలిసి కన్నతల్లిని వేధించడం మొదలుపెట్టాడు. సర్దార్ బేగంను నిత్యం కొట్టడం, తిట్టడంతోపాటు కనీసం భోజనం కూడా పెట్టకుండా హింసిస్తున్నారు. ఇటీవల ఇలియాజ్ దంపతులు సర్దార్ బేగంను విచక్షణారహితంగా కొడుతుండగా అది చూసిన బేగం మనవడు సయ్యద్ సమీర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో విషయం బయటికి రాగా కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

మద్యం మత్తులో పినతల్లిపై దాడి

యూసుఫ్‌గూడ, మే 5 (ఆంధ్రజ్యోతి): తండ్రితో గొడవపడ్డ పినతల్లిపై మద్యం మత్తులో ఓ యువకుడు దాడి చేశాడు. మధురానగర్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మధురానగర్‌లోని జవహర్‌నగర్‌లో నివసించే సరళ(40) ఈవెంట్ మేనేజ్‌మెంట్ సంస్థలో పనిచేస్తోంది. ఈమెకు ముగ్గురు అక్కలు ఉన్నారు. ఈ ముగ్గురూ చనిపోయారు. సరళ ఇంటి సమీపంలోనే ఓ అక్క భర్త రాములు, అతడి కుమారుడు నాగరాజు ఉంటున్నారు. ఈనెల 2న మధ్యాహ్నం విద్యుత్ పోయిన సమయంలో రాములు పక్కనే ఉన్న సరళ ఇంటికి వచ్చి ఆమెతో గొడవపడ్డారు. విషయం తెలుసుకున్న రాములు కుమారుడు నాగరాజు మద్యం మత్తులో ఈనెల 3న రాత్రి 11.30 గంటల సమయంలో సరళ ఇంటికి వెళ్లి 'మా నాన్నని తిడతావా' అంటూ ఆమెపై దాడి చేశాడు. ఆమెను జుట్టుపట్టి రోడ్డుపైకి ఈడ్చుకొచ్చి మరీ కొట్టాడు. ఈ సంఘటనలో సరళకు తీవ్రగాయాలు కావడంతో ఆస్పత్రికి వెళ్లి చికిత్స చేయించుకుంది. అనంతరం మధురానగర్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు దర్యాప్తులో ఉంది.

బంగారు నగలు మాయం

● దంపతులపై బాధితురాలి ఫిర్యాదు

యూసుఫ్‌గూడ, మే 5 (ఆంధ్రజ్యోతి): పర్సులో ఉన్న బంగారు ఆభరణాలు మాయమయ్యాయని ఓ మహిళ మధురానగర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రహ్మత్‌నగర్‌లో నివాసం ఉండే రోసెట్టా పీయిర్‌సన్ గత సంవత్సరం డిసెంబర్‌లో బిజినెస్ టూర్‌లో భాగంగా ఆఫ్రికా వెళ్లి మార్చి నెలలో తిరిగి వచ్చింది. ఈమెకు ఆఫ్రికా వెళ్లే ప్రయత్నం చేస్తున్న దంపతులు బేబి, బద్రితో స్నేహం ఉంది. రోసెట్టా తన కుమార్తెకు జ్వరం రావడంతో బేబి, బద్రి సహకారంతో ఆస్పత్రికి తీసుకెళ్లింది. బాలికను ఆస్పత్రి నుంచి ఈ నెల 26న తీసుకొని ఇంటికి వచ్చింది. రోసెట్టా తన పర్సులో పెట్టుకున్న రెండు బంగారు చెయిన్‌లు, రెండు ఉంగరాలు కనిపించలేదు. దీంతో బేబి, బద్రిలపై అనుమానం వ్యక్తం చేస్తూ రోసెట్టా పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

మక్బూల్ హత్య కేసులో నిందితుడి కోసం వేట

● అంజాద్‌ను పట్టుకునేందుకు 9 ప్రత్యేక బృందాలు
● అత్తాపూర్ ఇన్‌స్పెక్టర్ వెంకట్రామిరెడ్డి

రాజేంద్రనగర్, మే 5 (ఆంధ్రజ్యోతి): ఇంద్రానగర్‌లో శనివారం సాయంత్రం కాంగ్రెస్ నాయకుడు మక్బూల్(55)పై కత్తితో దాడి చేసి హత్యచేసిన నిందితుడు అంజాద్‌ను అరెస్ట్ చేసేందుకు 9 ప్రత్యేక పోలీసు బృందాలతో గాలిస్తున్నామని అత్తాపూర్ ఇన్‌స్పెక్టర్ వెంకట్రామిరెడ్డి తెలిపారు. అంజాద్‌ను అరెస్టు చేసేందుకు మూడు ఎస్ఓటీ, ఆరు లా అండ్ ఆర్డర్ టీములతో గాలింపు చర్యలు చేపట్టామని తెలిపారు. ఈ దాడిలో ఎడమ చేతికి బలమైన కత్తిపోట్లు పడిన మనోజ్‌కుమార్ లంగర్‌హౌజ్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. ప్రస్తుతం మనోజ్‌కుమార్ ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని వైద్యులు తెలిపారు.



చికిత్స పొందుతున్న మనోజ్ కుమార్

ప్రభుత్వం న్యాయం చేయాలి: మక్బూల్ కుటుంబ సభ్యులు

హత్యకు గురైన మక్బూల్‌కు భార్య నూర్జహా బేగం(45)తో పాటు నలుగురు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. మక్బూల్‌కు కాంగ్రెస్ పార్టీ అంటే అభిమానమని, పార్టీ కార్యక్రమంలో పాల్గొనడానికి వెళితే హత్య చేశారని కుటుంబ సభ్యులు బోరున విలపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం తమకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. మక్బూల్ అంత్యక్రియలు ఆదివారం సాయంత్రం ఇంద్రానగర్ శ్మశాన వాటికలో నిర్వహించారు.

పార్టీ డబ్బుల పంపకం గురించే గొడవ?

ఇంద్రానగర్‌లో కాంగ్రెస్ బూత్ కమిటీ సభ్యులకు పార్టీ ఇచ్చిన డబ్బులు మక్బూల్ ఒక్కడే తీసుకుంటున్నాడని భావించిన అంజద్ ఈ దాడికి పాల్పడ్డాడని స్థానికులు చర్చించుకుంటున్నారు. అయితే, అంజాద్ పట్టుబడితే గానీ హత్యకు గల కారణాలు చెప్పలేమని పోలీసులు చెబుతున్నారు.

సజ్జల భార్గవ్‌కు ఈసీ నోటీసులు.. సీఐడీ విచారణ

» చంద్రబాబు, నారా లోకేశ్‌లపైనా కేసు

» నేడు విచారణకు రావాలని పిలుపు

అమరావతి, మే 5(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని వృద్ధులకు ఇంటింటికీ పింఛన్లు అందకపోవడానికి టీడీపీ అధినేత చంద్రబాబు కారణమంటూ ఐవీఆర్ఎస్ కాల్స్ ద్వారా ఓటర్లను తప్పుదోవ పట్టిస్తున్న వైసీపీ సోషల్ మీడియా విభాగం హెడ్ సజ్జల భార్గవ రెడ్డికి ఎన్నికల సంఘం(ఈసీ) నోటీసులు ఇచ్చింది. ఆయనపై సీఐడీ విచారణకు ఆదేశించింది. టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు వర్ల రామయ్య ఇచ్చిన ఫిర్యాదుపై స్పందించిన ఈసీ ఈ మేరకు ఆదేశాలు జారీ చేసింది. మరోవైపు ల్యాండ్ టైటిలింగ్ యాక్టుపై టీడీపీ నేతలు ఐవీఆర్ఎస్ కాల్స్ ద్వారా ఫేక్‌ప్రచారం చేస్తున్నారంటూ విజయవాడ సెంట్రల్ వైసీపీ ఎమ్మెల్యే మల్లాది విష్ణువర్ధన్ ఇచ్చిన ఫిర్యాదు పైనా సీఐడీ విచారణకు ఆదేశించింది. ఈసీ ఆదేశాలతో కేసు నమోదు చేసిన అధికారులు చంద్రబాబు ఏ-1, ఆయన కుమారుడు నారా లోకేశ్ ఏ-2గా మొత్తం పది మందిని కేసులో చేర్చారు. వీరిని సోమవారం జరిగే విచారణకు రావాలంటూ టీడీపీ కార్యాలయంలో నోటీసులు అందజేశారు.



వైసీపీ నాయకుల చేతిలో దాడికి గురైన గర్భిణి కల్యాణి

నిండు గర్భిణిని కాలితో తన్ని!

» వైసీపీ నాయకుల రౌడీయిజం

» మంత్రి పెద్దిరెడ్డి సోదరుడి నియోజకవర్గం తంబళ్లపల్లెలో ఆయన భార్య ముందే ఘటన

మదనపల్లె టౌన్, మే 5: అన్నమయ్య జిల్లా తంబళ్లపల్లెలో వైసీపీ మూకలు రెచ్చిపోయాయి. ప్రచారానికి వచ్చిన వైసీపీ నాయకులను.. వీధి దీపాలు వెలగడం లేదని ప్రశ్నించిన నిండు గర్భిణిని నేలపై పడేసి, కాలితో తన్ని దుర్భాషలాడారు. అడ్డొచ్చిన ఆమె భర్త గొంతు పట్టుకుని దాడి చేశారు. గర్భిణి అపస్మారక స్థితి చేరుకోగా ఆసుపత్రికి తరలించి వైద్యం అందిస్తున్నారు. మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి సోదరుడు ద్వారకానాథ్‌రెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్న తంబళ్లపల్లె నియోజకవర్గంలో ఆయన సతీమణి కవిత పార్టీ నాయకులతో కలిసి ప్రచారం చేస్తూ ఆదివారం కూటగోళ్లపల్లెకు వెళ్లారు. గ్రామానికి చెందిన కల్యాణి(8 నెలల గర్భిణి) ఇంటికి వెళ్లి.. వైసీపీకి ఓటేయాలని కోరారు. కల్యాణి ఇంటి ముందు వీధి దీపాలు వెలగడం లేదని, రాత్రిళ్లు చిన్నారులు బయట తిరగాలంటే భయంగా ఉందన్నారు. దీనికి సమాధానం చెప్పాల్సిన వైసీపీ నాయకులు.. ఆమెను దుర్భాషలాడారు. ఆమె భర్త మల్లికార్జునపై దాడికి దిగారు. అడ్డుకోబోయిన కల్యాణిని కింద పడేసి కాలితో తన్నారు.

ఇది టెర్రరిస్టు ప్రభుత్వం

» ఓటమి భయంతోనే వైసీపీ దాడులు: పవన్

గుంటూరు/తుని, కాకినాడ, మే 5 (ఆంధ్రజ్యోతి): ఏపీలో అరాచక ప్రభుత్వం నడుస్తోందని, ఇది టెర్రరిస్టు సర్కారు అని జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్ విరుచుకుపడ్డారు. గుంటూరు జిల్లా పొన్నూరులో హెలిప్యాడ్ తవ్వేసిన విషయం ఎవరూ చూడకపోయి ఉంటే ఎంతటి ప్రమాదం జరిగేదో ఎవరూ ఊహించలేరని అన్నారు. ఆదివారం పొన్నూరు, కాకినాడ జిల్లా తునిల్లో జరిగిన భారీ బహిరంగ సభల్లో ఆయన ప్రసంగించారు. 'నేను వస్తున్నానని హెలిప్యాడ్ తవ్వేశారు. అది ఉగ్రవాద చర్య! ఆ చర్యలకు పాల్పడిన మీపైన ఉగ్రవాద కేసులు పెడతాం అన్నారు. 'రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం రాబోతోందని తెలిసే వైసీపీ నాయకులు అనకాపల్లి జిల్లాలో సీఎం రమేశ్‌పై, మచిలీపట్నంలో బాలశౌరిపై దాడులు చేశారు.' అని ధ్వజమెత్తారు. పవన్ కల్యాణ్ సమక్షంలో జనసేనలో చేరందుకు వైసీపీ నేత ముద్రగడ పద్మనాభం కుమార్తె క్రాంతి, అల్లుడు చందు ఆదివారం తుని సభకు హాజరయ్యారు. వారినుద్దేశించి పవన్ మాట్లాడారు. 'వచ్చే ఎన్నికల్లో క్రాంతికి అసెంబ్లీ టికెట్ ఇచ్చి గౌరవిస్తా' అని ప్రకటించారు.

ఏపీ డీజీపీ ఔట్!

వైసీపీతో అంటకాగిన రాజేంద్రనాథ్ రెడ్డి బదిలీ



» కార్యాలయం విడిచి వెళ్లాలని ఈసీ ఆదేశం

» అదనపు డీజీ శంకబ్రతకు బాధ్యతలు

» ముగ్గురి పేర్లు పంపాలని సీఎస్‌కు ఆదేశం

» కొత్త డీజీపీ రేసులో తిరుమలరావు, అంజనా సిన్హా, మాదిరెడ్డి ప్రతాప్!

అమరావతి, మే 5 (ఆంధ్రజ్యోతి): అధికార పార్టీతో అంటకాగిన డీజీపీ కేవీ రాజేంద్రనాథ్ రెడ్డిపై బదిలీ వేటు పడింది. మరో వారం రోజుల్లో సార్వత్రిక ఎన్నికలు జరగనున్న సమయంలో ఆదివారం కేంద్ర ఎన్నికల సంఘం ఈ కీలక చర్య తీసుకుంది. తక్షణమే పోలీసు ప్రధాన కార్యాలయం విడిచి వెళ్లాలని ఆయన్ను ఆదేశించింది. రాజేంద్రనాథ్ రెడ్డికి ఎటువంటి ఎన్నికల విధులూ అప్పగించవద్దని రాష్ట్ర ప్రభుత్వానికి ఆదేశాలు జారీ చేసింది. సోమవారం ఉదయం 11 గంటల్లోగా ముగ్గురు డీజీ ర్యాంకు అధికారుల పేర్లు పంపాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి ఈసీ సూచించింది. ఈసీ ఆదేశాల మేరకు డీజీపీ కేవీ రాజేంద్రనాథ్ రెడ్డిని బదిలీ చేస్తూ సీఎస్ జవహర్‌రెడ్డి ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. తన తర్వాతి ర్యాంక్ అధికారికి బాధ్యతలు అప్పగించాలని రాజేంద్రనాథ్‌రెడ్డిని ఆదేశించారు. ఆదేశాలు అందే సమయానికి కార్యాలయంలో లేని రాజేంద్రనాథ్ రెడ్డి.. తన బాధ్యతల్ని శాంతి భద్రతల అదనపు డీజీ శంకబ్రత బాగ్చికి అప్పగిస్తూ సంతకం చేసిన ఫైలును ఇంటి నుంచి పంపినట్లు తెలిసింది. అలాగే వైసీపీకి అనుకూలంగా పనిచేస్తున్న అనంతపురం డీఎస్పీ వీరరాఘవరెడ్డి, రాయచోటి డీఎస్పీ మహబూబ్ బాషాపైనా ఎన్నికల సంఘం వేటు వేసింది. తక్షణం విధుల నుంచి వైదొలగాలని ఆదేశించింది. డీజీపీ హోదాలో రాజేంద్రనాథ్ రెడ్డి ఏకపక్షంగా వ్యవహరిస్తూ జగన్ సేవలో తరించారనే ఆరోపణలు మూటగట్టుకున్నారు. రాష్ట్రంలో ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చిన తర్వాత కూడా జరిగిన పలు హింసాత్మక ఘటనలు ఉదాహరిస్తూ ప్రతిపక్షాలు ఈసీకి ఫిర్యాదు చేశాయి. రాష్ట్రంలో ఐపీసీ చట్టం కాకుండా వైసీపీ చట్టాన్ని అమలు చేస్తున్న పోలీసు అధికారులను తప్పించి నిష్పక్షపాతంగా ఎన్నికలు జరిగేలా చూడాలంటూ కోరాయి. ఈ నేపథ్యంలో డీజీపీపై ఈసీ చర్యలు తీసుకుంది. ముఖ్యమంత్రి జగన్ సొంత జిల్లా కడపకు చెందిన, ఏసీబీ డైరెక్టర్ జనరల్‌గా ఉన్న రాజేంద్రనాథ్ రెడ్డి 2022 ఫిబ్రవరి 17 నుంచి డీజీపీగా పూర్తి అదనపు బాధ్యతలు నిర్వహించారు. 1992లో ఐపీఎస్‌కు ఎంపికైన ఆయన ఉమ్మడి రాష్ట్రంలో వివిధ హోదాల్లో పనిచేశారు.

ఐపీఎస్‌లపై వరుసగా వేటు

ఇటీవల పలువురు పోలీస్ అధికారులపై ఈసీ చర్యలు తీసుకున్న సంగతి తెలిసిందే. ఐదుగురు ఎస్పీలు, గుంటూరు రేంజ్ ఐజీ, విజయవాడ సీపీ, రాష్ట్ర ఇంటెలిజెన్స్ చీఫ్, చివరికి డీజీపీపైనా చర్యలకు ఉపక్రమించింది. ఎన్నికల వేళ ఇంతమంది ఐపీఎస్ అధికారులపై ఈసీ బదిలీ వేటు వేసిందంటే.. పోలీసులు ఏ స్థాయిలో అధికార పార్టీకి వత్తాసు పలుకుతున్నారో అర్థం చేసుకోవచ్చు. కాగా, అధికార పార్టీకి అనుకూలంగా వ్యవహరిస్తున్న అనంతపురం, రాయచోటి డీఎస్పీలను ఈసీ బదిలీ చేసింది.

కొత్త డీజీపీ తిరుమలరావు..?

కొత్త డీజీపీగా ద్వారకా తిరుమలరావును ఎంపిక చేసే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తోంది. రాష్ట్రంలోని ఐపీఎస్ అధికారుల్లో తిరుమలరావు అందరి కన్నా సీనియర్.1989లో ఐపీఎస్‌కు ఎంపికయ్యారు. ఎలాంటి వివాదాల్లేని నిజాయితీపరుడిగా పేరు తెచ్చుకున్న తిరుమలరావు ప్రస్తుతం ఏపీఎస్‌ఆర్టీసీ ఎండీగా ఉన్నారు. విశ్వసనీయ సమాచారం మేరకు రాష్ట్ర ప్రభుత్వం ఈసీకి పంపేందుకు ఎంపిక చేసి న ముగ్గురు ఐపీఎస్ అధికారుల పేర్లలో తిరుమలరావు, అంజనా సిన్హా, మాదిరెడ్డి ప్రతాప్ ఉన్నట్లు తెలిసింది.

మా మామ 'అంబటి' నీచుడు, నికృష్టుడు

» దయచేసి ఓటేయకండి.. అల్లుడు గౌతమ్ వీడియో వైరల్

గుంటూరు, మే 5(ఆంధ్రజ్యోతి): 'మా మామ అంబటి రాంబాబుకు దయచేసి ఓటెయ్యకండి. అటువంటి వ్యక్తికి ఓటేస్తే సిగ్గులేని తనాన్ని ప్రోత్సహించినట్టే అవుతుంది' అని డాక్టర్ గౌతమ్ విజ్ఞప్తి చేశారు. పల్నాడు జిల్లా సత్తెనపల్లి సిట్టింగ్ ఎమ్మెల్యే, మంత్రి అంబటి రాంబాబుకు ఆయన రెండో అల్లుడు. ఓటర్లను అభ్యర్థిస్తూ ఆయన విడుదల చేసిన వీడియో ఆదివారం సోషల్ మీడియాలో వైరల్ అయింది. ఆ వీడియోలో ఆయన.. 'నా పేరు డాక్టర్ గౌతమ్. నేను మంత్రి అంబటి రాంబాబు అల్లుడిని. అది నా దురదృష్టం. అంబటి రాంబాబు అంతటి నీచుడు, నికృష్టుడుని నేను నా జీవితంలో చూడలేదు. రోజూ దేవుడికి దండం పెట్టుకునేటప్పుడు ఇంతటి నీచుడు మరోసారి నా జీవితంలోకి రాకుండా చేయి స్వామి అని మొక్కుకుంటున్నా. అంత భయంకరమైన వ్యక్తి అంబటి. అంబటికి 0.001 శాతం కూడా విలువల్లేవు. ఇలాంటి వ్యక్తికి మనం ఓటేస్తే మనకు తెలియకుండానే సిగ్గులేనితనాన్ని ప్రోత్సహించినట్లవుతుంది. నిస్సిగ్గుగా పెద్ద గొంతు వేసుకుని ఎంతటి అబద్ధమైనా నిజం చేయగలనని భావిస్తుంటాడు. అలాంటి వారికి ఓటేస్తే ఎన్నిలేకి పనులు చేసినా సమాజంలో గౌరవంగా బతకొచ్చు అనే భరోసా ఇచ్చినట్టవుతుంది. ఇలాంటి వారికి ఓటేస్తే సమాజం కూడా ఇలాగే తయారవుతుంది. దీనిని గమనించి ప్రజలు విజ్ఞతతో ఓటు హక్కును వినియోగించుకుంటారని ఆశిస్తున్నా' అంటూ విజ్ఞప్తి చేశారు.

పులిలా గర్జించి.. పిల్లిలా తలదించిన జగన్

» కేంద్రం ప్రవేశపెట్టే ప్రతి బిల్లుకూ ఆమోదం: షర్మిల

కోవూరు, మే 5: 'గత ఎన్నికల్లో వైఎస్ జగన్ ప్రత్యేకహోదా సాధిస్తానంటూ పులిలా గర్జించారు. తీరా గెలిచాక కేంద్రం ఎదుట పిల్లిలా మారి తలదించారు. ప్రతి బిల్లుకూ ఆమోదం పలికారు' అని పీసీసీ అధ్యక్షురాలు షర్మిల ఎద్దేవా చేశారు. నెల్లూరు జిల్లా కోవూరులోని బజారుకూడలిలో ఆదివారం జరిగిన సభలో ఆమె మాట్లాడారు. 'ప్రతి సంక్రాంతికీ జాబ్ కేలెండరు ఇస్తామని ప్రకటించి గత ఐదేళ్లలో ఒక్క సంక్రాంతికి కూడా కేలెండరు ఇవ్వలేక పోయారు. నాసిరకం మద్యం తాగి మృతి చెందేవారిలో దేశంలో 25 శాతం మంది రాష్ట్రంలోని యువకులే. రాష్ట్రంలో ఇసుక, మట్టి, గ్రావెల్ మాఫియాలు రాజ్యమేలుతున్నాయి. కంటైనర్లలో మాదక ద్రవ్యాలు వస్తున్నాయి' అని ఆరోపించారు.

అభివృద్ధికి పునాదులు వేసిన చంద్రబాబు నాయుడు

» వాటిని ధ్వంసం చేసిన జగన్

» ఏపీ అభివృద్ధికి బాబు, మోదీ భరోసా

» కేంద్ర హోంమంత్రి అమిత్‌షా ఉద్ఘాటన

అనంతపురం, మే 5 (ఆంధ్రజ్యోతి): పోలవరం ప్రాజెక్టు నిర్మాణంలో జాప్యానికి జగన్మోహన్ రెడ్డి అవినీతే కారణమని కేంద్ర హోంమంత్రి, బీజేపీ అగ్రనేత అమిత్‌షా పేర్కొన్నారు. రాష్ట్రంలో చంద్రబాబు... కేంద్రంలో మోదీ సర్కార్ వస్తే రెండేళ్లలో పోలవరం ప్రాజెక్టును పూర్తి చేస్తామని ప్రకటించారు. సార్వత్రిక ఎన్నికల ప్రచారంలో భాగంగా శ్రీసత్యసాయి జిల్లా ధర్మవరం నియోజకవర్గ కేంద్రంలో ఆదివారం ఏర్పాటు చేసిన 'ప్రజాగళం' బహిరంగ సభలో టీడీపీ అధినేత చంద్రబాబుతో కలిసి ఆయన పాల్గొన్నారు. జగన్ పాలనపై అమిత్‌షా మండిపడ్డారు. ఆయన ప్రసంగాన్ని ధర్మవరం బీజేపీ అభ్యర్థి సత్యకుమార్ యాదవ్ తెలుగులోకి అనువదించారు. ముఖ్యాంశాలు అమిత్‌షా మాటల్లోనే...ఏపీలో గూండాగిరి, నేరస్థుల అరాచకాలను అరికట్టేందుకు, జగన్ అవినీతి ప్రభుత్వాన్ని దించేందుకే కూటమిగా ఏర్పడ్డాం. రాష్ట్రంలో అవినీతిని పూర్తిగా అంతం చేసేందుకు, ల్యాండ్ మాఫియాను అరికట్టేందుకు, ఏపీ రాజధానిగా అమరావతిని పునర్నిర్మించేందుకు, తిరుమల తిరుపతి వెంకటేశ్వర స్వామి పవిత్రతను కాపాడేందుకు, ఉన్నతమైన తెలుగు భాషను పరిరక్షించేందుకే కూటమిగా ఏర్పడ్డాం. రాయలసీమలో పెండింగ్ ప్రాజెక్టులను జగన్ పూర్తిగా నిర్లక్ష్యం చేశారు. ఏపీలోని మొత్తం 25 ఎంపీ స్థానాలలో కూటమి అభ్యర్థులను గెలిపించండి. హంద్రీనీవా సుజల స్రవంతి, ఇతర ప్రాజెక్టులను పూర్తి చేసి ఈ ప్రాంతాన్ని సస్యశ్యామలం చేస్తాం. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌తోపాటు విభజిత ఏపీని ప్రగతి పథంలో నిలిపిన నాయకుడు చంద్రబాబు నాయుడు. అభివృద్ధికి పునాదులు వేశారు. జగన్ వచ్చి ఈ రాష్ట్రాన్ని భ్రష్టుపట్టించారు. జగన్ పాలనలో ఏపీలో అభివృద్ధి శూన్యం. పెట్టుబడులు సున్నా... అవినీతి మాత్రం కొండంత! రూ.13.50 లక్షల కోట్లు అప్పు తీసుకొచ్చి జనం నెత్తిన మోపారు. మౌలిక సదుపాయాలు కల్పించలేదు. రాష్ట్రంలో ల్యాండ్ మాఫియా పెట్రేగిపోతోంది. మద్యపాన నిషేధం చేస్తానని చేయకపోగా.. మద్యం సిండికేట్‌తో అవినీతికి పాల్పడుతున్నారు.

భూమి జగన్‌దా.. మీదా..?

» దానిపై హక్కు ఆయన తాత, నాన్న ఇచ్చారా: చంద్రబాబు

'భూమి మీదా.. సీఎం జగన్‌దా...? భూమిపైన హక్కు మీదా.. జగన్‌దా..' అని టీడీపీ అధినేత చంద్రబాబు ప్రజలను ప్రశ్నించారు. పట్టాదారు పాసుపుస్తకం మీద ఆయన ఫొటో ఏమిటని నిలదీశారు. ఆదివారం శ్రీసత్యసాయి జిల్లా ధర్మవరంలో కేంద్ర హోం మంత్రి అమిత్‌షా హాజరైన సభలోను, తర్వాత అన్నమయ్య జిల్లా అంగళ్లు, అనంతపురం జిల్లా కేంద్రంలో జరిగిన ప్రజాగళం భారీ బహిరంగ సభల్లో ఆయన ప్రసంగించారు. జనం భూములపై హక్కు జగన్ తాత, నాన్న.. నానమ్మ.. అమ్మమ్మ ఏమైనా ఇచ్చారా అని మండిపడ్డారు. ఆయన ఇచ్చిన పాసుపుస్తకాలను చింపేసి చెత్తబుట్టలో వేయాలని పిలుపిచ్చారు. తాము అధికారంలోకి రాగానే.. కొత్తవి ఇస్తామని.. ప్రజల ఫొటోలే వాటిపై ముద్రిస్తానని హామీ ఇచ్చారు. జగనన్న భూ హక్కు పుస్తకాన్ని చూపించి, దాన్ని చింపేసి ఆగ్రహం వ్యక్తం చేశారు.

నవ్య | చిత్రజ్యోతి

ఆద్యంతం వినోదాత్మకంగా



పాపులర్ కమెడియన్ గెటప్ శ్రీను లీడ్ రోల్‌లో నటించిన చిత్రం 'రాజుయాదవ్'. కృష్ణమాచారి దర్శకత్వం వహించారు. కె.ప్రశాంత్ రెడ్డి, రాజేశ్ కల్లేపల్లి సంయుక్తంగా నిర్మించారు. ఈ నెల 17న 'రాజుయాదవ్' విడుదలవుతోంది. ఆదివారం మూవీ ట్రైలను విడుదల చేశారు. ఈ సందర్భంగా హీరో తేజ సజ్జా మాట్లాడుతూ "శ్రీను విలక్షణమైన నటుడు. ఆయన నటించే పాత్ర సవాల్‌గా ఉంటే చెలరేగిపోతారు. ఈ సినిమా కథలో హిలేరియస్ ఎంటర్టైన్‌మెంట్‌తో పాటు హృదయానికి హత్తుకునే భావోద్వేగాలూ ఉన్నాయి" అని చెప్పారు. గెటప్ శ్రీను మాట్లాడుతూ "ఈ సినిమా కోసం చిత్ర బృందం ఎంతో కష్టపడ్డారు. వారందరి కష్టం తెరపై కనపడుతుంది. ఆద్యంతం వినోదాత్మకంగా ఉంటుంది" అని అన్నారు. "వాస్తవ సంఘటనల ఆధారంగా ఈ సినిమా తెరకెక్కింది. ప్రేక్షకులు కొత్త అనుభూతికి లోనవుతారు" అని డైరెక్టర్ కృష్ణమాచారి అన్నారు. నిర్మాత ప్రశాంత్ రెడ్డి మాట్లాడుతూ "ఈ సినిమాలో గెటప్ శ్రీను అద్భుతంగా నటించారు. ఆయన నటన అందరికీ గుర్తుండిపోతుంది" అని అన్నారు.



పాత తరం ప్రేమకథ

ఫీల్ గుడ్ వింటేజ్ లవ్ స్టోరీగా తెరకెక్కుతోన్న చిత్రం 'కౌసల్య తనయ రాఘవ'. రాజేశ్ కొంచాడా, శ్రావణి శెట్టి హీరో హీరోయిన్లుగా నటిస్తున్నారు. 1980ల నేపథ్యంలో జరిగే ప్రేమకథగా రాబోతున్న ఈ సినిమాకు స్వామి పట్నాయక్ దర్శకత్వం వహించారు. అడపా రత్నాకర్ నిర్మించారు. ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ జరుగుతోంది. త్వరలోనే విడుదల చేసేందుకు చిత్ర బృందం సన్నాహాలు చేస్తోంది. ఈ చిత్రానికి ఎడిటర్: శ్రీ కృష్ణప్రసాద్, కెమెరామెన్: యోగి రెడ్డి, సంగీతం: రాజేశ్ తేలు.



భలే ఉన్నాడే అనిపిస్తాడు

రాజ్ తరుణ్, మనీషా కంద్కూర్ జంటగా నటిస్తున్న చిత్రం 'భలే ఉన్నాడే'. సింగీతం శ్రీనివాస్, హైపర్ ఆది, కృష్ణ భగవాన్, శ్రీకాంత్ అయ్యంగార్ కీలకపాత్రలు పోషిస్తున్నారు. జె. శివసాయి వర్ధన్ దర్శకత్వంలో ఎన్‌వీ కిరణ్‌కుమార్ నిర్మిస్తున్నారు. ఆదివారం ఈ చిత్రం సమర్పకుడు మారుతి చేతుల మీదుగా టీజర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 'ఇది కాన్సెప్ట్ ఫిల్మ్. ప్రేక్షకులను థియేటర్‌కి రప్పించగల కంటెంట్ ఉంది. రాజ్‌తరుణ్ ప్రేక్షకులతో 'భలే ఉన్నాడే' అనిపిస్తాడు. కిరణ్‌కు కథ నచ్చి నిర్మించేందుకు ముందుకొచ్చారు. సాయి మంచి అభిరుచి ఉన్న దర్శకుడు' అని ప్రశంసించారు. రాజ్ తరుణ్ మాట్లాడుతూ 'ఇండస్ట్రీకి వచ్చినప్పటి నుంచి మారుతి గారితో ఓ సినిమా చేద్దామనుకుంటే ఈ సినిమాతో కుదిరింది. శివసాయి దర్శకత్వంలో మరో సినిమా చేయాలనుంది' అన్నారు. దర్శకుడు మాట్లాడుతూ 'ఇది నా మొదటి సినిమా. మారుతి గారి వల్లే నా కల నెరవేరింది' అని చెప్పారు.

ప్రజల ముందుకు ప్రతినిధి



పదేళ్ల క్రితం విడుదలై సంచలన విజయం సాధించిన 'ప్రతినిధి' సినిమాకు సీక్వెల్‌గా తెరకెక్కిన చిత్రం 'ప్రతినిధి 2'. నారా రోహిత్ హీరోగా నటించిన ఈ చిత్రానికి మూర్తి దేవగుప్తపు దర్శకత్వం వహించారు. కుమార్‌రాజా బత్తుల, ఆంజనేయులు శ్రీతో, సురేంద్రనాథ్ బొల్లినేని నిర్మించారు. ఈ నెల 10న ఈ చిత్రం విడుదలవుతోందని మేకర్స్ ప్రకటించారు. ఇందులో నిజాయితీ గల న్యూస్ రిపోర్టర్ పాత్రలో నారా రోహిత్ కనిపించనున్నారు. సరీ లెల్లా కథానాయికగా నటిస్తుండగా, తనికెళ్ల భరణి, ప్రవీణ్, అజయ్ ఘోష్, పృథ్వీరాజ్, రఘుబాబు, దినేశ్ తేజ్, సప్తగిరి, ఇంద్రజ, ఉదయభాను కీలక పాత్రలు పోషించారు. ఈ చిత్రానికి ఎడిటర్: రవితేజ గిరజాల, డీఓపీ: నాని చమిడిశెట్టి, సంగీతం: మహతి స్వరసాగర్, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: కార్తీక్ పుప్పాల.

సందేశాత్మకంగా స్కూల్



ప్రిన్స్ నవీద్‌ఖాన్, స్నేహా శర్మ జంటగా నటిస్తున్న చిత్రం 'ది స్కూల్'. 'ప్లేస్ ఆఫ్ లెర్నింగ్' అనేది ఉపశీర్షిక. వాల్మీకి దర్శకత్వంలో శివ రెమికాల నిర్మిస్తున్నారు. ఈ సినిమా చిత్రీకరణ ఆదివారం ప్రారంభమైంది. ఈ సందర్భంగా నవీద్‌ఖాన్ మాట్లాడుతూ 'ఈ చిత్రంలో హీరోగా నటించడంతో పాటు కథ కూడా అందిస్తున్నాను. వాస్తవ సంఘటనల స్ఫూర్తితో ఈ సినిమాను తెరకెక్కిస్తున్నాం. దర్శకుడు సినిమాను అన్ని వర్గాలను ఆలోచింపజేసేలా తెరకెక్కిస్తున్నారు. అలాగే శివ రెమికాల భారీ ఎత్తున ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు' అని చెప్పారు. తన నట జీవితంలో ఈ చిత్రం మైలురాయిగా నిలిచిపోతుందని నటుడు కృష్ణభగవాన్ చెప్పారు. ప్రజల ఆలోచనాధోరణిలో మార్పు తేవాలనే ఆశయంతో ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నాం, మా ప్రయత్నాన్ని ప్రేక్షకులు ఆదరించాలి అని నిర్మాత కోరారు. ఈ చిత్రానికి దర్శకత్వంతో పాటు సంగీతం కూడా అందిస్తున్నట్లు వాల్మీకి తెలిపారు. ఇంద్రజ, రాజా రవీంద్ర, జబర్దస్త్ కార్తీక్ కీలకపాత్రలు పోషిస్తున్న ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ: విజయ్ ఠాగూర్. ఎడిటింగ్: నందమూరి హరి

ముగిసిన మూడో దశ ప్రచారం

అహ్మదాబాద్/బెంగళూరు, మే 5: మూడో దశ లోక్‌సభ ఎన్నికల ప్రచారం ఆదివారం ముగిసింది. మంగళవారం 11 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లోని 92 సీట్లకు ఎన్నికలు జరగనున్నాయి. ఈ దశలో ఎన్నికలు జరిగే గుజరాత్, ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్, బిహార్ రాష్ట్రాల్లో చాలా చోట్ల గతంలో బీజేపీయే గెలుపొందింది. ఈ దశలో కేంద్ర మంత్రులు అమిత్ షా (అహ్మదాబాద్), సింధియా(గుణ), మాండవీయ(పోర్‌బందర్), పురుషోత్తం రూపాలా(రాజ్‌కోట్), ప్రహ్లాద్ జోషి (ధార్వాడ్) పోటీలో ఉన్నారు. మధ్యప్రదేశ్‌కు చెందిన ఇద్దరు మాజీ సీఎంలు శివరాజ్(విదీశ), దిగ్విజయ్(రాజ్‌ఘర్), కర్ణాటక మాజీ సీఎం బొమ్మై (హవేరీ) కూడా ఈ దశలోనే బరిలో ఉన్నారు.


అయోధ్య రామాలయంలో మోదీ పూజలు

దేశ విభజనకు ఇండియా కూటమి కుట్ర

» ఉత్తరప్రదేశ్ ఎన్నికల ప్రచారంలో మోదీ

అయోధ్య, మే 5: లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో దేశవ్యాప్తంగా సుడిగాలి పర్యటనలు నిర్వహిస్తున్న ప్రధాని మోదీ ఆదివారం ఉత్తర్‌ప్రదేశ్‌లోని అయోధ్యకు చేరుకున్నారు. అక్కడ రామమందిరాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. జనవరి 22న జరిగిన రామమందిర ప్రాణప్రతిష్ఠ కార్యక్రమం తర్వాత అయోధ్య రాముణ్ని దర్శించుకోవడం మోదీకి ఇదే తొలిసారి. అనంతరం నిర్వహించిన రోడ్ షోలో ఆయన పాల్గొన్నారు. దాదాపు రెండు కిలోమీటర్ల మేర ఆయన రోడ్ షో కొనసాగింది. అంతకు ముందు ధౌరాహ్రా నియోజకవర్గ బీజేపీ అభ్యర్థి రేఖా వర్మ నిర్వహించిన ర్యాలీలో మోదీ మాట్లాడారు. కాంగ్రెస్, ఇండియా కూటమి ముస్లింలను పావులుగా వాడుకుంటున్నాయని విమర్శించారు. ఆ విషయం ముస్లిం సమాజానికి ఇప్పుడిప్పుడే అర్థమవుతోందని అన్నారు. బీజేపీ ప్రభుత్వం అమలు చేస్తోన్న ప్రతీ పథకం ఎటువంటి వివక్షలు లేకుండా ముస్లింలకు అందుతోందని, దాంతో వారు కాంగ్రెస్‌తో కూడిన ఇండియా కూటమికి క్రమంగా దూరమవుతున్నారని పేర్కొన్నారు. అది సహించలేకే ఇప్పుడు రిజర్వేషన్ల పేరుతో కొత్త నాటకానికి తెరలేపాయని ఆరోపించారు. దేశాన్ని విభజించేందుకు ఇండియా కూటమి కుట్ర చేస్తోందని ఆరోపించారు. కర్ణాటకలో రాత్రికిరాత్రే ముస్లింలకు ఓబీసీ కోటా కింద రిజర్వేషన్లు కల్పించారని, ఇప్పుడు అదే ప్రణాళికను దేశవ్యాప్తంగా అమలు చేసేందుకు కాంగ్రెస్, ఇండియా కూటమి ప్రయత్నిస్తున్నాయని ఆరోపించారు.

రాజా సింగ్, నూపుర్ శర్మల హత్యకు కుట్ర!

» గుజరాత్‌లో మతబోధకుడు మౌల్వీ సోహెల్ అరెస్టు



సూరత్, మే 5: హిందూ నాయకుల హత్యకు కుట్ర పన్నాడన్న ఆరోపణలతో మత బోధకుడు మౌల్వీ సోహెల్ అబూబకర్ తిమోల్ (27)ను గుజరాత్‌లోని సూరత్ పోలీసులు అరెస్టు చేశారు. హైదరాబాద్‌కు చెందిన బీజేపీ ఎమ్మెల్యే రాజా సింగ్, ఆ పార్టీ మాజీ అధికార ప్రతినిధి నూపుర్ శర్మ, ఓ హిందీ టీవీ న్యూస్ ఛానల్ ప్రధాన సంపాదకుడు సురేష్ చవ్హాంకే, మరి కొందర్ని హత్య చేయడానికి కుట్ర పన్నినట్టు సీనియర్ పోలీసు అధికారి అనుపమ్ సింగ్ గెహ్లోత్ చెప్పారు. ఒక దారాల మిల్లులో మేనేజర్‌గా పనిచేసే తిమోల్..ముస్లిం పిల్లలకు ఇస్లాంపై ప్రయివేటు ట్యూషన్లు చెబుతుంటాడు. కుట్రపై విశ్వసనీయ సమాచారం అందుకున్న పోలీసులు సోదాలు చేసి పలు విషయాలను గుర్తించారు. అతనికి నేపాల్, పాకిస్థాన్‌లో ఉన్న వ్యక్తులతో సంబంధం ఉన్నట్టు తేలింది. మొదటి టార్గెట్‌గా హిందూ సనాతన్ సంఘ్ జాతీయ అధ్యక్షుడు ఉపదేశ్ రాణాను పెట్టకున్నాడని పోలీసు అధికారి గెహ్లోత్ చెప్పారు.

అబద్ధాలకు నాయకుడు ప్రధాని మోదీ: ఖర్గే

మాల్డా/బెంగళూరు(ఆంధ్రజ్యోతి), మే 5: ప్రధాని మోదీ అబద్ధాల దేవుడంటూ కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే ధ్వజమెత్తారు. 'విదేశాల్లోని నల్లధనాన్ని తెచ్చేస్తా. ప్రతి ఒక్కరి ఖాతాల్లో రూ.15 లక్షలు జమ చేస్తా. రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేస్తా. యువతకు రెండు కోట్ల ఉద్యోగాలిస్తా' అంటూ పోయిన ఎన్నికలకు ముందు మోదీ హామీలిచ్చారని ఖర్గే గుర్తు చేశారు. వీటిల్లో ఒక్కటి కూడా అమలు చేయకుండా తాను అబద్ధాల నాయకుడినని మోదీ నిరూపించుకున్నారని కాంగ్రెస్ చీఫ్ మండిపడ్డారు. మళ్లీ బీజేపీకి అధికారం అప్పగిస్తే మోదీ ఒక నియంతగా మారిపోతారని ఖర్గే హెచ్చరించారు. కాగా, రాసలీలల వివాదంలో ఇరుక్కున్న ఎంపీ ప్రజ్వల్ గురించి మాట్లాడబోనని మల్లికార్జున ఖర్గే తెలిపారు. ప్రజ్వల్ గురించి మాట్లాడే రేంజ్ తనకు లేదని ఎద్దేవా చేశారు.

రాహుల్ గాంధీలో సత్తా లేదు: రాజ్‌నాథ్

న్యూఢిల్లీ, మే 5: కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీలో సత్తా లేదని, అయితే ఆయన పార్టీ హిందూ, ముస్లింల మధ్య చిచ్చు పెట్టి ఎన్నికల్లో లబ్ధి పొందాలని చూస్తోందని రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ ఆరోపించారు. ఆయన పీటీఐతో శనివారం మాట్లాడుతూ పలు అంశాలపై చర్చించారు. ఎన్డీయే కూటమి 400కు పైగా సీట్లు సాధిస్తుందని, బీజేపీ 370కి పైగా సీట్లు సాధించడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. ఆంధ్ర, తెలంగాణలోనూ మెరుగైన సంఖ్యలో సీట్లు గెలుస్తామన్నారు. తాము అధికారంలోకి వస్తే యూనిఫామ్ సివిల్ కోడ్, ఒకే దేశం.. ఒకే ఎన్నికపై ముందడుగు పడుతుందన్నారు. రాజ్యాంగాన్ని మార్చడంగాని, రిజర్వేషన్లను రద్దు చేయడంగానీ బీజేపీ ఎప్పటికీ చేయబోదని స్పష్టం చేశారు.

గాలీ లేదు.. ఎదురుగాలీ లేదు

గుజరాత్‌లో అధికార బీజేపీకి హ్యాట్రిక్ స్వీప్ కష్టమే!.. కమలానికి పలుచోట్ల కాంగ్రెస్-ఆప్ నుంచి సవాలు

» కాషాయ పార్టీ పైన కత్తి దూస్తున్న క్షత్రియులు

» అభ్యర్థుల ఎంపికలో సమర్థంగా వ్యవహరించిన హస్తం



ఇదీ సొంతంగా మేం సాధించిన ఘనత అని ఓటర్లకు చెప్పుకొనేందుకు ఏమీలేదు..! పదేళ్ల కిందటి 'మనవాడు ఒకరు తొలిసారి దేశ ప్రధాని కాబోతున్నాడు' అనే వేవ్ కూడా లేదు..! ఐదేళ్లక్రితం నాటి జాతీయవాద ఉధృత పవనాలూ లేవు..! అలాగని వ్యతిరేకత ఏమీ కనిపించడం లేదు..! ఇదీ గుజరాత్‌లో ప్రస్తుతం బీజేపీ పరిస్థితి..! తీవ్ర అసంతృప్తిలో సీనియర్ నేతలు.. గతంలోలా పార్టీని గెలిపించాలన్న కసిలేని కార్యకర్తలు..! వెరసి ప్రధాని మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షా సొంత రాష్ట్రంలో బీజేపీకి బీజేపీనే ప్రత్యర్థి..! 25ఏళ్ల నుంచి గుజరాత్‌ను కాషాయ పార్టీనే పాలిస్తోంది. పవర్ పాలిటిక్స్, జిత్తులతో అధికారాన్ని గుప్పిట పట్టిన వైనంపై ప్రజల్లో అసంతృప్తి ఉంది. అయితే ఓటేసేందుకు వారికి బీజేపీని మించిన ప్రత్యామ్నాయం కనిపించడం లేదు. గత 2 లోక్‌సభ ఎన్నికల్లోలాగానే ఈసారి 26 స్థానాల్లోనూ గెలిచి హ్యాట్రిక్ స్వీప్ చేయాలని ఆ పార్టీ లక్ష్యం పెట్టుకుంది. కానీ, ఇది కష్టమేనన్న విశ్లేషణలు వస్తున్నాయి. సూరత్ కాంగ్రెస్ అభ్యర్థి నామినేషన్ తిరస్కరణకు గురికావడం, స్వతంత్రులూ తప్పుకోవడంతో ఈ స్థానం ఎన్నికలేకుండానే బీజేపీ వశమైంది. మిగిలిన 25 సీట్లకు ఈ నెల7న ఒకే విడతలో పోలింగ్ జరగనుంది. ఇండియా కూటమి పొత్తులో భాగంగా కాంగ్రెస్ 24 సీట్లలో, ఆప్ 2 స్థానాల్లో పోటీ చేస్తున్నాయి. ఇక గుజరాత్ అంటే దాదాపు 3దశాబ్దాలుగా బీజేపీ అడ్డా. మోదీ వచ్చాక అది మరింత బలపడింది. ఇలాంటిచోట సీట్లు తగ్గితే ఇబ్బంది అని భావించారో..? శ్రేణుల్లో ఉదాసీనతను గమనించారో కానీ, బీజేపీ పెద్దలు గెలుపు కాదు.. అభ్యర్థులందరికీ 5 లక్షలపైగా మెజార్టీ మన లక్ష్యమంటూ టార్గెట్ పెట్టారు. అమిత్‌షా గత ఎన్నికల్లో గాంధీనగర్ నుంచి 5.57 లక్షల ఓట్లతో నెగ్గగా, ఈసారి 10 లక్షల ఆధిక్యంతో గెలిపించాలని నిర్దేశించారు. ఈ నియోజకవర్గంలో మొత్తం ఓటర్లు 13 లక్షలే. మోదీ ప్రభుత్వ పనితీరు, బీజేపీ వార్ రూమ్ వ్యూహాలతో ఓటింగ్ శాతం పెరిగినా ప్రతి అభ్యర్థి 5లక్షలపైగా ఓట్లతో నెగ్గడం సాధ్యంకాదని విశ్లేషకులు వివరిస్తున్నారు. మరోవైపు కేంద్రమంత్రులు పురుషోత్తం రూపాలా, మన్‌సుఖ్ మాండవీయ అమ్రేలీ, భావ్‌నగర్ నుంచి పోటీ చేస్తుండటం కార్యకర్తలకు నచ్చలేదు. మొత్తంగా చూస్తే బీజేపీ కార్యకర్తల్లో కనిపించే ఎన్నికల దూకుడు ఈసారి లేదనేది రాజకీయ విశ్లేషకులమాట. ఇక క్షేత్ర స్థాయిలో నాయకత్వం బలహీన పడడంతో గుజరాత్ కాంగ్రెస్ చాలాచోట్ల బీజేపీని సవాల్ చేయలేకపోతోంది. విశేష ఆదరణ ఉన్న కాంగ్రెస్ నాయకులు గత పదేళ్ల నుంచి బీజేపీలోకి వరుస కడుతున్నారు. పార్టీ సిద్ధాంతాలను నమ్మే కార్యకర్తలు, ఓటర్లు ఉన్నప్పటికీ సొమ్ము చేసుకోలేకపోతోంది. బీజేపీపై ఉన్న తీవ్ర వ్యతిరేకతను అనుకూలంగా మలుచుకోవడంలో వెనుకబడుతోంది. ఈసారి అలా జరగకుండా చూసుకోవాల్సి ఉంది. కాగా, బ్రిటిష్ వారితో రోటీ-బేటీ ఒప్పందం చేసుకుని.. మనుగడకు ముప్పు రాకుండా చూసుకున్నారంటూ క్షత్రియులపై పురుషోత్తం రూపాలా చేసిన వ్యాఖ్యలతో ఆవర్గం వారు బీజేపీపై గుర్రుగా ఉన్నారు. రూపాలా క్షమాపణ చెప్పినా వారు శాంతించలేదు. వారు బీజేపీకి ఓటు రూపంలో బుద్ధి చెప్పాలనే పట్టుదలతో ఉన్నారు. కాగా, 6.5కోట్ల గుజరాత్ జనాభాలో 11-12శా తమున్న పటీదార్లు ఈసారీ బీజేపీవైపే ఉన్నారంటున్నారు. ఠాకూర్లు, కోలీలు తదితర బీసీలు 40% వరకున్నారు. బీజేపీ ఆరుగురు పటీదార్లకు టికెటివ్వగా, కాంగ్రెస్-ఆప్ ఏడుగురిని నిలిపింది. బీజేపీ ముగ్గురు కోలీలు, ఏడుగురు ఓబీసీలకు సీట్లిస్తే, కాంగ్రెస్-ఆప్ ఏడుగురు బీసీలు, ఇద్దరు కోలీలను దింపింది. ఇక గుజరాత్ సీఎంగా ఎవరున్నా అక్కడి బీజేపీనేతలు మోదీపైనే ఆశలు పెట్టుకుంటారు. ఈసారీ అదే జరుగుతోంది.

(సెంట్రల్ డెస్క్)

2022 అసెంబ్లీ ఎన్నికల్లో ఓట్లు ఇలా..

పార్టీ	ఓట్లు
బీజేపీ	1.68 కోట్లు
కాంగ్రెస్	80 లక్షలు
ఆప్	40 లక్షలు

ఐదుగురు కాంగ్రెస్ ఎమ్మెల్యేలు బీజేపీలో చేరి పదవులకు రాజీనామా చేయడంతో గుజరాత్‌లో 5 అసెంబ్లీ స్థానాలకు మే 7న ఉప ఎన్నిక జరగనుంది

రాహుల్ యాత్రతో కాంగ్రెస్‌కు ఆశావహ పరిస్థితులు

గుజరాత్‌లో గతంలోకంటే కాంగ్రెస్ పరిస్థితి ఆశావహంగా ఉందనే విశ్లేషణలు వస్తున్నాయి. అగ్రనేత రాహుల్‌గాంధీ న్యాయ్ యాత్రతో పార్టీ పట్ల సానుకూలత ఏర్పడిందని, కాంగ్రెస్ మేనిఫెస్టో ప్రజల్లో చర్చనీయాంశంగా మారిందని చెబుతున్నారు. కొన్నిచోట్ల తప్ప..పార్టీ సిద్ధాంతాలకు కట్టుబడి, ప్రజల్లో ఆదరణ ఉన్న అభ్యర్థులను ఈసారి కాంగ్రెస్ పోటీకి నిలిపింది. కార్యకర్తలూ కష్టపడుతున్నారు. బనస్కాంత, సబర్‌కాంత, పటాన్, ఆనంద్, భరూచ్, వల్సాడ్, సౌరాష్ట్రలోని అమ్రేలీ, సురేంద్రనగర్, జునాగఢ్‌లో బీజేపీ, కాంగ్రెస్ మధ్య హోరాహోరీ సమరం జరుగుతోంది. దీంతో ఈసారి కాంగ్రెస్‌కు కొన్ని సీట్లు వస్తాయనే భావన వ్యక్తమవుతోంది. ఆప్‌తో పొత్తు. రాష్ట్రవ్యాప్తంగా మంచి నెట్‌వర్క్ ఏర్పాటు చేసుకున్న ఆప్ అసెంబ్లీ ఎన్నికల్లో 13% ఓట్లు సాధించింది. ఇవన్నీ కాంగ్రెస్‌వే. ఇప్పుడు కలిసి పోటీ చేస్తుండడంతో ఓట్ల చీలికపై హస్తం పార్టీ ఆందోళన లేదు. కాగా, తమ అధినేతను బీజేపీ అక్రమంగా అరెస్టు చేసిందనే ఆలోచనతో ఉన్న ఆప్ కార్యకర్తలు కసిగా పనిచేస్తున్నారు.

రాయ్‌బరేలీ, అమేఠీల్లో ప్రియాంక మకాం

న్యూఢిల్లీ, మే 5: కాంగ్రెస్ కంచుకోటగా పేరున్న రాయ్‌బరేలీ, అమేఠీల్లో ఎన్నికల ప్రచారానికి ఆ పార్టీ నాయకురాలు ప్రియాంక నేతృత్వం వహించనున్నారు. సోమవారం నుంచి ఈ నెల 20న పోలింగ్ ముగిసేవరకూ ఈ నియోజకవర్గాల్లోనే మకాం వేయనున్నారు. రెండు దశాబ్దాలుగా సోనియా ప్రాతినిధ్యం వహిస్తున్న రాయ్‌బరేలీ నుంచి ఈ సారి రాహుల్ బరిలోకి దిగుతుండగా, కిశోరి లాల్ శర్మ అమేఠీ నుంచి పోటీచేస్తున్నారు. రాహుల్ దేశవ్యాప్త ప్రచారంలో బిజీగా ఉండడంతో.. ఎంతో కీలకమైన రాయ్‌బరేలీ, అమేఠీల్లో ప్రచార బాధ్యతను ప్రియాంక తీసుకున్నారు. ప్రియాంకా గాంధీ రెండు నియోజకవర్గాల్లో దాదాపు 200-300 గ్రామాల్లో ఆమె పర్యటిస్తారని, వందలాది రోడ్ షోలు నిర్వహిస్తారని, ఇంటింటికీ ప్రచారం వంటి కార్యక్రమాల్లో పాల్గొంటారని పార్టీ వర్గాలు తెలిపాయి. ఇప్పటికే స్వాతంత్ర్య సమరయోధులు, గాంధీ కుటుంబంతో దశాబ్దాల బంధం ఉన్న వారితో సంప్రదింపులు మొదలుపెట్టారు. డిజిటల్, సోషల్ మీడియా ప్రచారాన్ని పర్యవేక్షిస్తున్నారు. ఖర్గే, రాజస్థాన్ సచిన్ పైలట్ వంటి అగ్రనేతల ప్రచార షెడ్యూల్‌ను కూడా ప్రియాంక చూసుకోనున్నారు.

యూపీలో సమాజ్‌వాదీకి పరీక్ష!

రేపు 10 లోక్‌సభ స్థానాలకు ఎన్నిక

సార్వత్రిక ఎన్నికల మూడోదశలో ఉత్తరప్రదేశ్‌లోని కీలకమైన 10 లోక్‌సభ నియోజకవర్గాలకు మంగళవారం ఎన్నికలు జరుగనున్నాయి. అవి సంభల్, హత్రాస్, ఆగ్రా, ఫతేపూర్ సిక్రీ, ఫిరోజాబాద్, మెయిన్‌పురి, ఎటా, బదాయూ, బరేలీ, ఆవ్‌లా నియోజకవర్గాలు. వీటిలో ఎనిమిది స్థానాలను గత ఎన్నికల్లో బీజేపీ గెలుపొందగా, సంభల్, మెయిన్‌పురిల్లో మాత్రమే సమాజ్‌వాదీ పార్టీ(ఎస్పీ) విజయం సాధించింది. పార్టీ అధినేత అఖిలేశ్ యాదవ్ కుటుంబానికి చెందిన ముగ్గురు కీలకమైన వ్యక్తులు మూడో దశ బరిలో ఉన్నారు. దీంతో ఈ ఎన్నికలు సమాజ్‌వాదీ పార్టీకి పరీక్షగా భావిస్తున్నారు. అఖిలేశ్ యాదవ్ భార్య డింపుల్ యాదవ్ మెయిన్‌పురిలో, అఖిలేశ్ బాబాయి శివపాల్ యాదవ్ కుమారుడు ఆదిత్య యాదవ్ బదాయూలో, వీరి కుటుంబానికే చెందిన అక్షయ్ యాదవ్ ఫిరోజాబాద్‌లో పోటీ చేస్తున్నారు. వెనుకబడిన తరగతులకు చెందిన యాదవ, లోధ్, కచ్ఛీ/శక్య/మురావ్ కులాల ఓట్లు మూడో దశలో కీలక ప్రభావం చూపనుండగా కొన్ని ప్రాంతాల్లో ముస్లింలు, జాట్‌ల ఓట్లు కూడా గణనీయమైన ప్రభావం చూపనున్నాయి. బీజేపీ తరఫున మోదీ, అమిత్ షా, యోగి ఆదిత్యనాథ్ తదితర కీలక నేతలు ఇక్కడ ముమ్మరంగా ప్రచారం చేశారు. ఎస్పీ, కాంగ్రెస్ పార్టీల కుటుంబ పాలన, అయోధ్య రామాలయ ప్రారంభోత్సవ ఆహ్వానాన్ని ఆ పార్టీల నేతలు తిరస్కరించడం తదితర అంశాలను బీజేపీ ప్రచారాస్త్రాలుగా చేసుకుంది. దీనికి దీటుగా.. బీజేపీ మరోసారి గెలిస్తే రిజర్వేషన్లను తొలగిస్తుందంటూ సమాజ్‌వాదీపార్టీ ప్రచారం చేసింది. హత్రాస్, ఫిరోజాబాద్, ఎటా, బదాయూ నియోజకవర్గాల్లో బీజేపీ, ఎస్పీ మధ్య హోరాహోరీగా ద్విముఖ పోరు ఉంటుందని, మిగిలిన స్థానాల్లో మాయావతి నేతృత్వంలోని బీఎస్పీకి కూడా ఓటుబ్యాంకు గణనీయంగా ఉండటంతో వాటిలో ఎన్డీయే, ఇండియా కూటమి, బీఎస్పీ మధ్య త్రిముఖ పోరు ఉంటుందని భావిస్తున్నారు.

-సెంట్రల్ డెస్క్

ప్రజ్వల్ బాధితులకు పరిహారమిస్తాం

బెంగళూరు, మే 5(ఆంధ్రజ్యోతి): జేడీఎస్ ఎంపీ ప్రజ్వల్ రేవణ్ణ రాసలీలల వివాదంలో బాధిత మహిళలకు ప్రభుత్వం పరిహారం ఇవ్వనుందని కాంగ్రెస్ పార్టీ కర్ణాటక వ్యవహారాల ఇన్‌చార్జ్ రణదీప్‌సింగ్ సుర్జేవాలా వెల్లడించారు. కర్ణాటకలో ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆదివారం ఆయన బెంగళూరులో మీడియాతో మాట్లాడారు. బాధితులకు సీఎం సిద్దరామయ్య న్యాయం చేస్తారని అన్నారు. ఇదే విషయంపై అగ్రనేత రాహుల్‌గాంధీ ప్రత్యేకంగా సీఎంకు లేఖ రాసిన విషయాన్ని ప్రస్తావించారు. వందలాదిమందిపై లైంగిక వేధింపులు దేశానికి స్వాతంత్ర్యం వచ్చాక ఎక్కడా చోటు చేసుకోలేదని అన్నారు. ఇటువంటి దుర్మార్గపు చర్యలకు పాల్పడిన వ్యక్తికి మద్దతుగా ప్రధాని మోదీ ఎలా ప్రచారం చేశారని సూర్జేవాలా ప్రశ్నించారు. ఇదిలా ఉండగా, ప్రజ్వల్ రేవణ్ణ లైంగిక దౌర్జన్యాలపై ప్రధాని మోదీ మౌనం వీడాలని ఏఐసీసీ మహిళా విభాగం అధ్యక్షురాలు అల్కాలంబ డిమాండ్ చేశారు. కేంద్ర మంత్రి స్మృతి ఇరానీ, జాతీయ మహిళా కమిషన్ చైర్మన్ రేఖా శర్మ ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు.

మూడు రోజుల సిట్ కస్టడీకి రేవణ్ణ

బెంగళూరు, మే 5 (ఆంధ్రజ్యోతి): కిడ్నాప్ వివాదం కేసులో అరెస్టయిన కర్ణాటకలోని హొళెనరసీపుర జేడీఎస్ ఎమ్మెల్యే హెచ్‌డీ రేవణ్ణను సిట్ మూడు రోజుల కస్టడీకి తీసుకుంది. బెంగళూరులోని బౌరింగ్ ఆసుపత్రిలో ఆదివారం ఆయనకు వైద్య పరీక్షలు చేయించిన అధికారులు అనంతరం మెజిస్ట్రేట్ ముందు హాజరు పరిచి, మూడు రోజుల కస్టడీకి అనుమతి తీసుకున్నారు. ఆయన్ను విచారించేందుకు ఈ నెల 8 వరకు మెజిస్ట్రేట్ అవకాశం కల్పించారు. అంతకు ముందు రేవణ్ణ ఆసుపత్రిలో మీడియాతో మాట్లాడుతూ, ఎలాంటి ఆధారం లేకుండానే తనను అక్రమంగా అరెస్టు చేశారని ఆరోపించారు. కిడ్నాప్‌తో తనకు ఎలాంటి సంబంధం లేదన్నారు.

డీకే శివకుమార్ నకిలీ ఫొటోలు వైరల్

బెంగళూరు, మే 5(ఆంధ్రజ్యోతి): కేపీసీసీ అధ్యక్షుడు, ఉపముఖ్యమంత్రి డీకే శివకుమార్ నకిలీ ఫొటోలను సోషల్ మీడియా ద్వారా వైరల్ చేసేందుకు ప్రయత్నించిన ముగ్గురిపై హైగ్రౌండ్ పోలీసులు ఆదివారం ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. డీకే శివకుమార్ పరువుకు భంగం కలిగించేలా వ్యవహరించారని కాంగ్రెస్ నాయకుడు హరీశ్ నాగరాజ్ ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశారు. సంతోష్ (నెలమంగల), రాజేశ్‌గౌడ (కేసరి సామ్రాట్) పేర్లతో ఉండే సోషల్ మీడియా ఖాతాద్వారా నకిలీ ఫొటోలు, వీడియోలను సోషల్‌మీడియాలో పోస్ట్ చేశారు.

కర్కరే బలైంది పోలీసు తూటాకు..

మహారాష్ట్ర కాంగ్రెస్ నేత విజయ్ ఆరోపణ!

ముంబయి, మే 5: 26/11ముంబై ఉగ్రదాడుల్లో పోలీసు అధికారి హేమంత్ కర్కరే ఉగ్రవాది కసబ్ బుల్లెట్లకు బలి కాలేదని, ఆరెస్సెస్‌కు అనుకూలంగా ఉండే ఓ పోలీసు అధికారి తూటాలు తగిలి మరణించారని కాంగ్రెస్ నేత విజయ్ నామ్‌దేవ్‌రావ్ వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. ఉగ్రదాడికి పాల్పడిన కసబ్‌ను ఉరి కంబానికి ఎక్కించడంలో స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా వ్యవహరించిన ఉజ్వల్ నికమ్ కీలక పాత్ర పోషించారు. నికమ్ ప్రస్తుతం ఉత్తర మధ్య ముంబై నియోజకవర్గం నుంచి బీజేపీ అభ్యర్థిగా పోటీ చేస్తుండడంతో కాంగ్రెస్ నేత వడెట్టివార్ పాత విషయాలను ప్రస్తావిస్తూ విమర్శలు గుప్పించారు. "నికమ్ దేశ ద్రోహి. కర్కరేకు తగిలింది పోలీసు అధికారి బుల్లెట్టు అన్న విషయాన్ని కోర్టులో చెప్పొద్దా? కోర్టులో వాస్తవాలు దాచిపెట్టిన దేశద్రోహికి బీజేపీ టిక్కెట్ ఇచ్చింది" అని విమర్శించారు.

ప్రచారంలో నోరుజారిన కంగనా

న్యూఢిల్లీ, మే 5: కంగనా రనౌత్ తన ఎన్నికల ప్రసంగంలో భాగంగా పప్పులో కాలేశారు. ఆర్జేడీ నాయకుడు తేజస్వీ యాదవ్‌పై విమర్శలు చేయబోయి బెంగళూరు దక్షిణ నియోజకవర్గం బీజేపీ అభ్యర్థి తేజస్వీ సూర్యపై నోరు జారారు. హిమాచల్ ప్రదేశ్‌లోని మండి నుంచి బీజేపీ తరఫున లోక్‌సభ ఎన్నికల బరిలో నిలిచిన కంగనా శనివారం ప్రచారం నిర్వహించారు. ఈ ప్రచారంలో ఆమె మాట్లాడుతూ.. "చెడిపోయిన రాకుమారుల పార్టీ ఒకటి ఉంది. అది చంద్రుడిపై బంగాళదుంపలు పండించాలనుకునే రాహుల్ గాంధీ కావొచ్చు లేదా గుండాయిజం చేసి చేపలు తినే తేజస్వి సూర్య కావొచ్చు" అని అన్నారు. తేజస్వి యాదవ్ చేపలు తింటుండగా తీసిన ఓ వీడియోను ఉద్దేశించి కంగనా ఈ వ్యాఖ్యలు చేశారు.

పోలీసుల సమన్లను పట్టించుకోవద్దు

రాజ్‌భవన్ సిబ్బందికి బెంగాల్ గవర్నర్ ఆదేశం

కోల్‌కతా, మే 5: లైంగిక వేధింపులకు సంబంధించి తనపై ఆరోపణలు వచ్చిన నేపథ్యంలో కోల్‌కతా పోలీసుల నుంచి వచ్చే సమన్లను పట్టించుకోవద్దని రాజ్‌భవన్ సిబ్బందిని పశ్చిమబెంగాల్ గవర్నర్ సీవీ ఆనంద బోస్ ఆదివారం ఆదేశించారు. గవర్నర్ తనను లైంగికంగా వేధించారంటూ రాజ్‌భవన్‌లో పనిచేసే మహిళా ఉద్యోగి చేసిన ఫిర్యాదుపై దర్యాప్తు చేసేందుకు కోల్‌కతా పోలీసులు ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో గవర్నర్ తాజా ఆదేశాలు జారీ చేశారు. సిట్ తన దర్యాప్తులో భాగంగా రాజ్‌భవన్‌కు చెందిన సీసీటీవీ ఫుటేజీలను ఇవ్వాలని కూడా కోరింది. కాగా, ఆనందబోస్ తన ఆదేశాల్లో చట్టపరమైన చర్యల విషయంలో రాజ్యాంగం గవర్నర్లకు కల్పించిన మినహాయింపులను ప్రస్తావించారు.

ఎంఆర్ఐ టెక్నాలజీపై చెరగని ముద్ర

బ్రెయిన్ ఇమేజింగ్ పరిశోధనల గతినే మార్చిన గుళ్లపల్లి పూర్ణచంద్రరావు


» నేడు ఆయన ప్రథమ వర్ధంతి.. పలువురు వైద్యుల నివాళులు

» కెమికల్ ఇంజనీరింగ్‌లో బీటెక్.. ఐఐటీ ఖరగ్‌పూర్‌లో పీజీ పూర్తి

» 1982లో అమెరికాకు గుళ్లపల్లి

» అక్కడే పీహెచ్‌డీ, పరిశోధనలు

» 150కి పైగా పీర్ రివ్యూడ్ పత్రాల ప్రచురణ.. 13 పేటెంట్లు



న్యూయార్క్, మే 5: 'మ్యాగ్నెటిక్ రెజొనెన్స్ ఇమేజింగ్ (ఎంఆర్ఐ)' టెక్నాలజీపై విస్తృతంగా పరిశోధనలు చేసి 150కి పైగా పీర్ రివ్యూడ్ పరిశోధన పత్రాలు రాసి, 13 పేటెంట్లు పొందిన మన తెలుగువాడు.. డాక్టర్ గుళ్లపల్లి పూర్ణచంద్రరావు. బ్రెయిన్ ఇమేజింగ్ రిసెర్చ్ గతినే మార్చిన ప్రతిభావంతుడిగా పేరొందిన ఆయన.. ఆ పరిశోధనల క్రమంలోనే క్యాన్సర్ బారిన పడి గత ఏడాది కన్నుమూశారు. సోమవారం ఆయన ప్రథమ వర్ధంతి సందర్భంగా.. వైద్యరంగానికి చెందిన పలువురు నిపుణులు, శాస్త్రవేత్తలు ఆయన సేవలను గుర్తుచేసుకుంటూ, నివాళులర్పిస్తున్నారు. ఏపీలోని కృష్ణాజిల్లా మొసునూరులో 1958 ఆగస్టు 28న డాక్టర్ వెంకటకృష్ణారావు, రుక్మాబాయి దంపతులకు జన్మించిన పూర్ణచంద్రరావు బాల్యం, విద్యాభ్యాసం అంతా హైదరాబాద్‌లోనే జరిగాయి. ఉస్మానియా యూనివర్సిటీ నుంచి కెమికల్ ఇంజనీరింగ్‌లో బీటెక్ పట్టా పుచ్చుకున్నారు. ఐఐటీ ఖరగ్‌పూర్‌లో మినరల్స్ ఇంజనీరింగ్‌లో పీజీ చేసి 1982లో అమెరికాకు వెళ్లారు. అక్కడ ఆర్కన్సాస్ వర్సిటీలో ఎమ్మెస్ పూర్తి చేసి, ఇన్‌స్ట్రుమెంటల్ సైన్సెస్‌లో పీహెచ్‌డీ చేశారు. అనంతరం కేస్ వెస్ట్రన్ రిజర్వ్ యూనివర్సిటీ నుంచి ఎంబీఏ పూర్తిచేశారు. ఆ తర్వాత క్లీవ్‌లాండ్ ఒహాయోలోని పికర్ ఇంటర్నేషనల్ క్లినికల్ పరిశోధన విభాగంలో యువ స్టాఫ్ సైంటిస్ట్‌గా చేరి తన కెరీర్‌ను ఆరంభించారు. 1996లో యూనివర్సిటీ ఆఫ్ మేరీల్యాండ్‌లో చేరి గణనీయమైన శాస్త్రీయ పరిశోధనలు, ఆవిష్కరణలు చేశారు. ఆ వర్సిటీలోని డయాగ్నస్టిక్ రేడియాలజీ, న్యూక్లియర్ మెడిసిన్ విభాగంలో 27 సంవత్సరాలపాటు పనిచేసిన ఆయన.. ట్రామాటిక్ బ్రెయిన్ ఇంజురీ(ఏదైనా బలమైన దెబ్బ తగిలినప్పుడు మెదడుకు అయ్యే గాయాలకు) సంబంధించిన కొత్త ఇమేజింగ్ బయోమార్కర్లను గుర్తించడంపై ప్రధానంగా దృష్టి సారించారు. మెదడుకు గాయమైనప్పుడు జరిగే మైక్రోస్ట్రక్చరల్ మార్పులను, న్యూరో ఇన్‌ఫ్లమేషన్‌ను గుర్తించేందుకు వినియోగించే 'డిఫ్యూజన్ కర్టోసిస్ ఇమేజింగ్' ఆవిష్కరణకు నేతృత్వం వహించారు. ముఖ్యంగా.. బ్రెయిన్ ఇంజురీ తర్వాత మెదడులో జరిగే 'లాంగిట్యూడినల్ చేంజెస్ ఇన్ స్ట్రక్చర్ అండ్ ఫంక్షన్'పై విస్తృతంగా పరిశోధనలు చేశారు (లాంగిట్యూడినల్ పరిశోధనలు అంటే.. ఒకే వ్యక్తి/ఆబ్జెక్ట్‌పై సుదీర్ఘకాలం పాటు చేసే పరిశోధన). ఇమేజ్-గైడెడ్ ఇంటర్వెన్షనల్ టెక్నిక్స్‌ను అభివృద్ధి చేశారు. ఆయన తయారుచేసిన 'మినిమల్లీ ఇన్వేజివ్ న్యూరోసర్జికల్ ఇంట్రాక్రేనియల్ రోబో'కుగాను యూనివర్సిటీ ఆఫ్ మేరీల్యాండ్ ఔట్‌స్టాండింగ్ ఇన్వెన్షన్ ఆఫ్ ద ఇయర్ అవార్డు పొందారు. ఒక ప్రొఫెసర్‌గా.. దాదాపు రెండున్నర దశాబ్దాల పాటు ఎంతోమంది పీహెచ్‌డీ విద్యార్థులను ముందుండి నడిపించారు. మేరీల్యాండ్ వర్సిటీలోని 'సెంటర్ ఫర్ మెటబాలిక్ ఇమేజింగ్ అండ్ థెరపాటిక్స్' డైరెక్టర్‌గా, 'రిసెర్చ్ అండ్ డైరెక్టర్ ఆఫ్ ద కోర్ ఫర్ ట్రాన్స్‌లేషనల్ రిసెర్చ్ ఇన్ ఇమేజింగ్' వైస్‌చైర్‌గా, 'జర్నల్ ఆఫ్ మెడికల్ రోబోటిక్స్ రిసెర్చ్' సీనియర్ ఎడిటర్‌గా వ్యవహరించారు. 2016లో మేరీల్యాండ్ వర్సిటీ ఏర్పాటు చేసిన 'ఫోకస్డ్ అల్ట్రాసౌండ్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్'లో.. మెదడులో అంతకుముందు అల్ట్రాసౌండ్ ద్వారా చేరుకోలేకపోయిన భాగాలను చేరుకుని, చికిత్స చేసే అవకాశాలపై డాక్టర్ గుళ్లపల్లి పరిశోధనలు చేశారు. ఆ టెక్నాలజీ ద్వారా మూర్ఛ వంటి జబ్బులకు చికిత్స చేయడంపై దృష్టి సారించారు. 2022లో మేరీల్యాండ్ వర్సిటీ ప్రకటించిన ఎనిమిది మంది 'ఎంపవర్ ప్రొఫెసర్స్' జాబితాలో ఆయన కూడా ఉన్నారు. ఆ పురస్కారాన్ని ప్రకటించిన సందర్భంలో డాక్టర్ గుళ్లపల్లి పూర్ణచంద్రరావు మాట్లాడుతూ.. "మెదడులో సమస్యల కారణంగా దశాబ్దాలపాటు చేతులు వణికిపోవడం వంటి సమస్యలను ఎదుర్కొన్నవారు, ఎంఆర్-గైడెడ్ ఫోకస్డ్ అల్ట్రాసౌండ్ చికిత్స తర్వాత అసలు ఎలాంటి వణుకూ లేకుండా బయటకు వస్తుంటే చూడడం కన్నా ఆనందం ఏముంటుంది? ఎలాంటి మత్తుమందూ ఇవ్వకుండా, స్కాల్‌పెల్ వాడకుండా బ్రెయిన్ సర్జరీ చేస్తున్నప్పుడు.. పేషెంట్ మెలకువగా ఉండి ఫీడ్‌బ్యాక్ ఇస్తుంటే.. ఆ చికిత్స చేసే బృందంలో మనం కూడా భాగమైతే.. ఆ ఉత్సాహం ఇంకా ఎన్నో సాధించేలా మనను పురిగొల్పుతుంది" అని పేర్కొన్నారు. ఆయనకు భార్య ఆశ, కుమార్తెలు మీరా, లేఖ ఉన్నారు. డాక్టర్ పూర్ణచంద్రరావు సంస్మరణార్థం ఆయన కుటుంబసభ్యులు కిమ్స్ ఆస్పత్రిలో ప్రతిభావంతులైన పది మంది వైద్యులకు 1000 డాలర్ల చొప్పున నగదు పురస్కారాన్ని అందజేశారు.

బెత్తం దెబ్బలు తిన్నా

» సిగ్గుతో ఇంట్లో చెప్పలేదు: సీజేఐ



కాఠ్‌మండూ, మే 5: పిల్లల పట్ల ఉపాధ్యాయుల ప్రవర్తన వారి మనస్సులపై తీవ్ర ప్రభావం చూపుతుందని సీజేఐ జస్టిస్ చంద్రచూడ్ తెలిపారు. చిన్నప్పుడు పాఠశాలలో టీచరు చేతిలో బెత్తం దెబ్బలు తిన్న అనుభవాన్ని ఇప్పటికీ మరిచిపోలేనన్నారు. నేపాల్ రాజధాని కాఠ్‌మండూలో 'జువైనల్ జస్టిస్' అంశంపై జరిగిన సదస్సులో పాల్గొన్న జస్టిస్ చంద్రచూడ్ అప్పటి సంగతులు గుర్తుచేసుకున్నారు. "నేను ఐదో తరగతి చదువుతున్నప్పుడు టీచర్ నా చేతిపై కొట్టారు. ఆ విషయాన్ని ఇంట్లో చెప్పలేదు. ఇంట్లో వాళ్లకు చేతిపై దెబ్బ కనబడకుండా పదిరోజుల పాటు జాగ్రత్తపడ్డా" అని జస్టిస్ చంద్రచూడ్ పేర్కొన్నారు. కాగా, నేపాల్ ప్రధాన న్యాయమూర్తి బిశ్వంభర్ ప్రసాద్ శ్రేష్ఠ ఆహ్వానంపై మూడు రోజుల పర్యటన కోసం జస్టిస్ చంద్రచూడ్ అక్కడకు వెళ్లారు. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా ఉన్న వ్యక్తి అధికారికంగా నేపాల్‌లో పర్యటించడం ఇదే తొలిసారి కావడం గమనార్హం.

'ఉచిత బ్యాగేజీ' పరిమితి తగ్గింపు

న్యూఢిల్లీ, మే 5: దేశీయ విమాన సర్వీసుల్లో ఎకానమీ క్లాసులో ఉచిత బ్యాగేజీ పరిమితిని తగ్గిస్తూ టాటా గ్రూప్‌కు చెందిన ఎయిర్ ఇండియా విమానయాన సంస్థ నిర్ణయం తీసుకుంది.ఎకానమీ విభాగంలో కంఫర్ట్, కంఫర్ట్ ప్లస్, ఫ్లెక్స్ అనే మూడు ధరల కేటగిరీలు ఉంటాయి. ఇంతకాలం వీటిలో కంఫర్ట్‌లో 20 కేజీలు, కంఫర్ట్ ప్లస్‌లో 25 కేజీల వరకు బ్యాగేజీ అనుమతించగా, ఇకపై 15 కేజీలు మాత్రమే అనుమతిస్తారు. ఫ్లెక్స్ కేటగిరీలో మాత్రం 25 కేజీల వరకు అనుమతిస్తారు.

లోకం తీరు





రోహిత్ వేముల పేరుతో చట్టం చేస్తాం: కేసీ వేణుగోపాల్

న్యూఢిల్లీ, మే 5 (ఆంధ్రజ్యోతి): కేంద్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక.. ఏ విద్యార్థి కూడా రోహిత్ వేముల మాదిరిగా కుల వివక్ష, మత దౌర్జన్యాలకు గురికాకుండా ఆయన పేరుతో చట్టాన్ని తీసుకొస్తామని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ స్పష్టం చేశారు. రోహిత్ వేముల మృతి కేసులో తెలంగాణ పోలీసులు ఇటీవల దాఖలు చేసిన రిపోర్టుపై వివాదం నేపథ్యంలో కేసీ వేణుగోపాల్ ఆదివారం 'ఎక్స్' వేదికగా స్పందిస్తూ రోహిత్ కుటుంబానికి రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం న్యాయం చేస్తుందన్నారు. రోహిత్ కేసు దర్యాప్తులో గతంలో అనేక అవకతవకలు జరిగాయన్నారు. కేసు రిపోర్టును గతేడాది జూన్‌లో సిద్ధం చేసినట్లు పోలీసులు తెలిపారన్నారు.బీజేపీ దళిత వ్యతిరేక మనస్తత్వాన్ని రోహిత్ మరణం బట్టబయలు చేసిందని వేణుగోపాల్ తన ట్వీట్‌లో ఆగ్రహం వ్యక్తం చేశారు.

కేసీఆర్ మాదిరిగా మోదీని గద్దె దించాలి

» జిల్లాల రద్దుపై రేవంత్ ఎక్కడా మాట్లాడలేదు: తుమ్మల



మహబూబాబాద్, మే5 (ఆంధ్రజ్యోతి): పదేళ్ల విధ్వంసానికి పాల్పడిన మాజీ సీఎం కేసీఆర్‌ను ఇంటికి సాగనంపిన విధంగా కార్పొరేట్ శక్తులకు ఊడిగం చేస్తున్న ప్రధాని మోదీని గద్దె దించాలని మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు పిలుపునిచ్చారు. పెట్టుబడిదారులకు మద్దతుగా నిలుస్తున్న బీజేపీ, పేదలకు అండగా ఉంటున్న ఇండియా కూటమి మధ్య ఎన్నికల సంగ్రామం జరుగుతోందని మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు అన్నారు. మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో ఇండియా కూటమి ఎంపీ అభ్యర్థి పోరిక బలరాంనాయక్ గెలుపును కాంక్షిస్తూ.. సీపీఎం ఆధ్వర్యంలో ఎన్నికల సభను నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన తుమ్మల మాట్లాడుతూ.. దేశరక్షణ, ప్రజల బాగోగుల కోసం ఇండియా కూటమి అభ్యర్థులను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. అందరి సహకారంతో రాష్ట్రంలో కాంగ్రెస్ సర్కార్ వచ్చిందని, బయ్యారం ఉక్కు ఫ్యాక్టరీ, కాజీపేట కోచ్ ఫ్యాక్టరీ, గోదావరి జలాల సాధన, ప్రజాసమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తామని చెప్పారు. జిల్లాల రద్దు గురించి సీఎం రేవంత్‌రెడ్డి ఎక్కడ కూడా మాట్లాడలేదని, మాజీ సీఎం కేసీఆర్ అన్నీ అబద్ధాలే చెబుతారని ఆయన విమర్శించారు.

ఓటమి భయంతో అసత్య ప్రచారం

» బీజేపీపై టీపీసీసీ నేత రామ్మోహన్‌రెడ్డి ఫైర్

» ప్రజ్వల్ రేవణ్ణను అరెస్టు చేయాలి: మహిళా కాంగ్రెస్

హైదరాబాద్, మే 5 (ఆంధ్రజ్యోతి): ఓటమి భయంతో బీజేపీ అసత్య ప్రచారాలు చేస్తోందని టీపీసీసీ మీడియా కమిటీ చైర్మన్ సామా రామోహన్ రెడ్డి మండిపడ్డారు. ఆదివారం గాంధీభవన్‌లో ఆయన మాట్లాడుతూ.. సీఎం కాన్వాయ్ కిందపడి చనిపోయారని.. ఆర్మూర్‌లో జీవన్‌రెడ్డి మహిళను కొట్టినట్టుగా ఫేక్ వీడియోలతో దుష్ప్రచారం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. నిజామాబాద్ బీజేపీ అభ్యర్థి అరవింద్ బతుకే అబద్ధాల బతుకుగా మారిందని విమర్శించారు. బీజేపీ అనైతిక చర్యలను చట్టపరంగా ఎదుర్కొంటామని టీపీసీసీ లీగల్ సెల్ ఇన్‌చార్జ్ రామచంద్రారెడ్డి అన్నారు. రాష్ట్రంలో ఢిల్లీ పోలీసుల ద్వారా అనాలోచిత చర్యలకు బీజేపీ పాల్పడుతోందని మండిపడ్డారు. కొంతమంది అసాంఘిక శక్తులు ఢిల్లీ పోలీసుల ముసుగులో హైదరాబాద్‌కు వచ్చి ఐటీ నిపుణుల వద్దకు వెళ్లి ఇబ్బందులు సృష్టిస్తున్నారని, వారికి తగిన రక్షణ కల్పించాలని కోరుతూ డీజీపీకి తెలంగాణ ఫిషర్‌మెన్ కాంగ్రెస్ చైర్మన్ మెట్టు సాయికుమార్ వినతిపత్రం సమర్పించారు. పోలీసుల ముసుగులో ఐటీ నిపుణుల ఫోన్లు, లాప్‌ట్యాప్‌లను బలవంతంగా లాక్కుని వెళ్తున్నారని అందులో పేర్కొన్నారు. వందలాది మంది మహిళలను లైంగికంగా వేధించిన ప్రజ్వల్ రేవణ్ణను వెంటనే అరెస్టు చేయాలంటూ మహిళా కాంగ్రెస్ రాష్ట్ర శాఖ డిమాండ్ చేసింది. గాంధీభవన్‌లో నిరసన దీక్ష నిర్వహించింది. కాగా, భువనగిరి నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న చామల కిరణ్‌కుమార్‌రెడ్డికే తమ మద్దతు ఉంటుందని తెలంగాణ గౌడ సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ బాలగౌని వెంకటేశ్ గౌడ్ తెలిపారు.

ఎన్నికల వేళ ఎగుమతి రాజకీయాలు

» మహారాష్ట్రలో ఉల్లి ఎగుమతిపై నిషేధం ఎత్తివేత

» వరి పండించే తెలుగు రాష్ట్రాలకు మాత్రం మొండి చెయ్యే!

ఆంధ్రజ్యోతి గల్ఫ్ ప్రతినిధి: ఎన్నికల వేళ రైతులను ఆకర్షించేందుకు బీజేపీ సంచలన నిర్ణయాలను తీసుకుంటోంది. ఆయా పంటలకు సంబంధించిన ఎగుమతులపై ఆంక్షలు ఎత్తివేస్తోంది. అయితే ఈ సడలింపు కొన్ని ప్రాంతాలకే పరిమితమవుతుండటం ఆందోళన కలిగిస్తోంది. ఇటీవల మహారాష్ట్రలో ఉల్లి ఎగుమతిపై నిషేధాన్ని ఎత్తివేసిన కేంద్రం, బాస్మతియేతర రకం ఎగుమతులపై ఆధారపడ్డ తెలుగు రాష్ట్రాల రైతాంగాన్ని మాత్రం ఖాతరు చేయకుండా ఇప్పటికీ ఎగుమతి నిషేధాన్ని కొనసాగిస్తోంది. విదేశాలకు ముఖ్యంగా గల్ఫ్, అమెరికా దేశాలకు భారతదేశం నుంచి ఉల్లితోపాటు బాస్మతియేతర బియ్యం ప్రధానంగా మసూరి రకాల ఎగుమతి జరుగుతుండడంతో రైతాంగానికి గిట్టుబాటు ధర లభిస్తోంది. కానీ వర్షాభావ పరిస్థితుల కారణంగా దేశీయ మార్కెట్‌లో ధరలు పెరిగిపోకుండా వీటి ఎగుమతులపై కేంద్రం నిషేధం విధించింది. కానీ గుజరాత్‌లో పండించే ఉల్లిని ఎగుమతి చేసుకోవడానికి కేంద్రం ప్రత్యేక అనుమతినిచ్చింది. తాజాగా మహారాష్ట్రలో పోలింగ్‌కు ముందు ఉల్లి ఎగుమతిపై నిషేధాన్ని ఎత్తివేసింది. దీంతో శరద్ పవార్ ప్రాబల్యం ఉన్న బారామతి, నాసిక్ ఇతర పశ్చిమ జిల్లాల్లో బీజేపీ-శివసేన కూటమికిది ప్రధాన అస్త్రంగా మారింది. ఇదిలావుండగా... బాస్మతియేతర బియ్యం ప్రధానంగా మసూరి రకాల ఎగుమతిలో దేశం మొత్తం మీద తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ ముందంజలో ఉన్నాయి. కానీ, ఇక్కడ ఎగుమతులకు అవకాశం లేకపోవడంతో రబీలో ధరలు పతనమయ్యాయి. అయితే తెలుగు రాష్ట్రాల్లో నాలుగు దశలో ఎన్నికలు జరగనుండటంతో కనీసం అప్పటివరకైనా నిషేధాన్ని ఎత్తివేస్తారేమో వేచి చూడాలి.

కవిత బెయిల్ పిటిషన్లపై నేడు తీర్పు

న్యూఢిల్లీ, మే 5 (ఆంధ్రజ్యోతి): ఢిల్లీ మద్యం కుంభకోణం కేసులో తిహాడ్ జైలులో ఉన్న బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత బెయిల్‌పై కొనసాగుతున్న ఉత్కంఠకు నేడు తెరపడనుంది. కవిత బెయిల్ పిటిషన్లపై సోమవారం రౌస్ అవెన్యూ కోర్టు ప్రత్యేక న్యాయమూర్తి కావేరి బవేజా తీర్పు ఇవ్వనున్నారు. సీబీఐ కేసులో బెయిల్ కోసం గత నెల 22న వాదనలు జరగ్గా న్యాయమూర్తి కావేరీ బవేజా తొలుత మే 2కు తీర్పు రిజర్వు చేశారు. అయితే మే 2న తీర్పు వస్తుందని అంతా భావించగా.. ఈడీ కేసులో బెయిల్ పిటిషన్‌పై తీర్పు మే 6కు రిజర్వ్ అయ్యింది. ఈ నేపథ్యంలో రెండు కేసుల్లో బెయిల్ పిటిషన్లపై తీర్పును మే 6న వెలువరిస్తామని న్యాయమూర్తి స్పష్టం చేశారు. మరోవైపు కవిత జ్యుడీషియల్ కస్టడీ రేపటితో ముగియనుంది. ఒకవేళ కవితకు బెయిల్ లభిస్తే జ్యుడీషయల్ రిమాండ్ నుంచి మినహాయింపు లభిస్తుంది. బెయిల్‌ను న్యాయస్థానం నిరాకరిస్తే మాత్రం.. కవితను కోర్టులో హాజరుపరుస్తారు.

సాయిధరమ్‌తేజ్‌పై దాడి

» డ్రింక్ బాటిల్ విసిరిన వైసీపీ మూకలు.. తప్పిన ప్రమాదం

» పక్కనే ఉన్న వ్యక్తికి గాయాలు.. తాటిపర్తిలో ఘటన

గొల్లప్రోలు రూరల్, మే 5: సినీనటుడు సాయిధరమ్‌తేజ్‌పై ఆదివారం రాత్రి వైసీపీ మూకలు డ్రింక్ బాటిల్‌తో దాడికి పాల్పడ్డాయి. సరిగ్గా బాటిల్ పడే సమయంలో తేజ్ తప్పించుకోవడంతో పక్కనే ఉన్న జనసైనికుడికి తగిలి తీవ్ర గాయాలయ్యాయి. వివరాలు... జనసేన అధినేత పవన్‌కల్యాణ్‌కు మద్దతుగా సాయిధరమ్‌తేజ్ ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్నారు. కాకినాడ జిల్లా గొల్లప్రోలు మండలం చినజగ్గంపేట వెళ్లేందుకు తాటిపర్తి మీదుగా వెళ్తున్నారు. అప్పటికే తాటిపర్తి గ్రామ వీధులన్నీ జనసేన, టీడీపీ నాయకులు, కార్యకర్తలు, జనసైనికులు, మెగా అభిమానులతో నిండిపోయాయి. వారిని చూసి వైసీపీ శ్రేణులు కవ్వింపు చర్యలకు పాల్పడ్డాయి. తేజ్ కాన్వాయ్ తాటిపర్తి మీదుగా వెళ్తుండగా బాంబులు వేసి బాణాసంచా కాల్చారు. ఈ సమయంలో జనసేన, వైసీపీ శ్రేణుల మధ్య వాగ్వాదం, తోపులాట చోటుచేసుకుంది. ఆ సమయంలో బందోబస్తులో ఉన్న ఎస్ఐ, ఇద్దరు కానిస్టేబుళ్లు వారిని నియంత్రించేందుకు ప్రయత్నించినా వెనక్కి తగ్గలేదు. ఈ గొడవ సద్దుమణగకుండానే చినజగ్గంపేటలో రోడ్‌షో ముగించుకున్న సాయిధరమ్‌తేజ్.. తాటిపర్తి గజ్జాలమ్మ సెంటర్‌కు చేరుకున్నారు. ఆ సమయంలో అక్కడికి సమీపంలో గుమిగూడి ఉన్న వైసీపీ శ్రేణుల్లో నుంచి ఒకరు డ్రింక్ బాటిల్‌ను ఆయన పైకి విసిరారు. దానినుంచి తేజ్ తప్పించుకోగా ఆ బాటిల్ పక్కనే ఉన్న జనసైనికుడు నల్లల శ్రీధర్‌కు తగిలి కంటిపై, ముఖంపై తీవ్ర గాయాలయ్యాయి. దీంతో అక్కడ తీవ్ర ఉద్రిక్తత ఏర్పడింది. సాయిధరమ్‌తేజ్ తన రోడ్‌షో ముగించుకుని వెళ్లిపోయారు. బాధితుడిని హుటాహుటిన పిఠాపురం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కాగా, గాయపడిన శ్రీధర్‌ను పిఠాపురం మాజీ ఎమ్మెల్యే ఎస్వీఎస్ఎన్ వర్మ పరామర్శించారు.

ఏడాదికి 1.3 లక్షలు!





జన జాతర సభకు హాజరైన ప్రజలు; రాహుల్ గాంధీకి పాదాభివందనం చేస్తున్న ఎంపీ అభ్యర్థి సుగుణ

(మొదటిపేజీ తరువాయి)

'ఇండియా' కూటమి, ఇంకోవైపు రాజ్యాంగాన్ని మార్చే ప్రణాళికలో ఉన్న ఎన్డీయే కూటమి నిలబడ్డాయని పేర్కొన్నారు. "దేశంలోని పేదలు, దళితులు, ఆదివాసీలు, బలహీనవర్గాల కోసం అంబేడ్కర్, మహాత్మా గాంధీ, నెహ్రూ రూపొందించిన రాజ్యాంగాన్ని బీజేపీ నలిపివేయాలని చూస్తోంది. ఆర్ఎస్ఎస్‌తో కలిసి రిజర్వేషన్లను రద్దు చేసేందుకు కుట్ర పన్నుతోంది" అని వ్యాఖ్యానించారు. బీజేపీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన 'అగ్నిపథ్' పథకం రిజర్వేషన్ల రద్దు అమల్లో భాగమేనని ఆరోపించారు. మళ్లీ అధికారంలోకి వస్తే రాజ్యాంగాన్ని రద్దు చేస్తామంటూ బీజేపీ నేతలు సూటిగానే ప్రజలకు చెబుతున్నారని.. రిజర్వేషన్లు తీసేయాలని బీజేపీలోని పెద్ద పెద్ద నాయకులు, సంఘ్ ముఖ్య నాయకుడు తరచూ మాట్లాడుతున్నారని ఆరోపించారు. తాము అధికారంలోకి వస్తే రైతులకు రుణమాఫీ చేస్తామని, కనీస మద్దతు ధరకు చట్టబద్ధత కల్పిస్తామని చెప్పారు. రైతుల రుణాలను ఎన్నడూ మాఫీ చేయని మోదీ ప్రభుత్వం.. అదానీ, అంబానీ కుటుంబాలకు చెందిన రూ.16 లక్షల కోట్ల రుణాన్ని మాఫీ చేసిందని, ఈ మొత్తం.. ఉపాధి హామీ పథకాన్ని 24 ఏళ్ల పాటు అమలు చేయడానికి అయ్యే నిధులతో సమానం అని అన్నారు.

జాతీయ జనగణన తేల్చాక ఇక క్రాంతికారీ రాజకీయాలే

దేశ జనాభాలో వెనుకబడిన వర్గాలు 50%, దళితులు, మైనారిటీలు 15% చొప్పున, ఆదివాసీలు 8%, అగ్రకుల పేదలు ఐదు నుంచి ఆరు శాతం మేరకు ఉన్నారని.. మొత్తంగా 90 శాతానికి పైగా ఉన్న ఈ వర్గాల వారు దేశంలో పేరున్న ఏ సంస్థల్లోనూ కనిపించరని రాహుల్ గాంధీ ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వాన్ని నడిపిస్తున్న 90 మంది బ్యూరోక్రాట్లలో ఓబీసీలు, దళితులు ముగ్గురు చొప్పున, ఆదివాసీల నుంచి ఒకరు మాత్రమే ఉన్నారని.. పైగా వారికి ఇచ్చినవీ చిన్న చిన్న మంత్రిత్వ శాఖల్లోని పోస్టు లేనని చెప్పారు. తాము అధికారంలోకి రాగానే జన గణన, ఆర్థిక సర్వే చేస్తామని.. ప్రతి సంస్థనూ సర్వే చేస్తామని, ఫలితంగా 90 శాతానికి పైగా ఉన్న ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, అగ్రకుల పేదల వద్ద ఉన్న సంపద ఎంత? కొద్ది మంది ధనవంతుల చేతుల్లో ఉన్న సంపద ఎంత? అన్నది తేలిపోతుందన్నారు. జన గణన, ఆర్థిక సర్వే తర్వాత దేశ రాజకీయ ముఖచిత్రమే మారిపోతుందని, క్రాంతికారీ రాజకీయాలు నడుస్తాయని చెప్పారు. దేశంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాలు, అగ్రకుల పేదలు 90 శాతానికి పైగా ఉన్నప్పుడు రిజర్వేషన్లు 50 శాతాన్ని మించకూడదన్న నిబంధన అర్థరహితమన్నారు. రిజర్వేషన్లపై ఉన్న పరిమితిని ఎత్తివేసి 50శాతానికి మించి రిజర్వేషన్లు పెంచుతామని స్పష్టం చేశారు. రిజర్వేషన్లపై పరిమితిని ఎత్తివేస్తామంటూ ప్రధాని మోదీ ఇంతవరకు ఎక్కడా చెప్పలేదని, రిజర్వేషన్ల అమలుకు ఆయన వ్యతిరేకమని విమర్శించారు.

నిరుద్యోగుల కోసం ప్రత్యేక పథకం

తాము అధికారంలోకి వస్తే దేశ వ్యాప్తంగా ఉన్న డిగ్రీ, డిప్లొమా చేసిన నిరుద్యోగుల కోసం 'పెహలీ నౌకరీ పక్కా' (మొదటి ఉద్యోగం గ్యారెంటీ) పేరుతో సరికొత్త పథకం తీసుకొస్తామని రాహుల్ గాంధీ చెప్పారు. ఈ పథకం కింద ప్రభుత్వ ప్రైవేటు రంగ సంస్థలు, ప్రభుత్వాస్పత్రులు, విద్యాసంస్థలు, యూనివర్శిటీల్లో నిరుద్యోగులకు అప్రెంటిస్‌షిప్ కింద ఏడాది పాటు 'మొదటి ఉద్యోగం' దొరుకుతుందని పేర్కొన్నారు. ఈ మేరకు వారికి ఏడాది పాటు నెలకు రూ. 8,500 చొప్పున రూ.లక్ష మొత్తం వారి బ్యాంకుఅకౌంట్లలో పడుతుందని చెప్పారు. అప్రెంటిస్‌షిప్ కాలంలో ఆయా చోట్ల మంచిగా పని చేస్తే ఉద్యోగం పర్మినెంట్ కూడా అవుతుందని వివరించారు. ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వంలో 30 లక్షల ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయని, తాము అధికారంలోకి రాగానే అన్నింటినీ భర్తీచేస్తామని చెప్పారు. ఇండియా కూటమి అధికారంలోకొచ్చాక ఆదివాసీల హక్కులకు రక్షణ కల్పిస్తాయని హామీ ఇచ్చారు. ఈ మేరకు తెలంగాణలోని ఆదివాసీలు, దళితులకు వారి భూముల పరంగా ఉన్న సమస్యలను త్వరలో పరిష్కరించి శాశ్వత హక్కులు కల్పిస్తామని చెప్పారు. ఉపాధి హామీ పథకం కింద ప్రస్తుతం రోజుకు ఇస్తున్న రూ.250ని రూ.400కు పెంచుతామని ప్రకటించారు. ఆశా, అంగన్ వాడీల ఆమ్దానీని రెట్టింపు చేస్తామని చెప్పారు.

బీజేపీ చిమ్మిన విద్వేషాల వీధిలో ప్రేమ దుకాణాన్ని తెరిచాం

దేశ ప్రజల మధ్య మోదీ ప్రభుత్వం విద్వేషాన్ని పెంచిందని, అన్నదమ్ముల మధ్య కూడా చిచ్చు పెట్టిందని ఇదంతా 'భారత్ జోడో' యాత్రలో తాను ప్రజల ద్వారానే తెలుసుకున్నానని రాహుల్ గాంధీ పేర్కొన్నారు. కన్యాకుమారి నుంచి కశ్మీరు దాకా 4వేల కి.మీ మేర సాగించిన ఆ పాదయాత్రలో భాగంగా తాను ఎంతో మందిని కలిశానని చెప్పారు. బీజేపీ సృష్టించిన విద్వేషాల వీధిలో తాము ప్రేమ దుకాణాన్ని తెరిచామన్నారు. విద్వేషాలతో దేశానికి ఒనగూరే ప్రయోజనం ఏమీ లేదని, ప్రేమతోనే అభివృద్ధి జరుగుతుందని ఆయన చెప్పారు.

దేశవ్యాప్తంగా తెలంగాణ పథకాల అమలు

తెలంగాణలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఐదు నెలల్లో పేదలకు ఎంతో మేలు చేసిందని రాహుల్ చెప్పారు. నిరుద్యోగులకు 30వేల ఉద్యోగాలు ఇచ్చిందని, ఆరోగ్య బీమా పథకం పరిమితిని రూ.10 లక్షలకు పెంచిందని, గ్యాస్ సిలిండర్ రూ.500కే ఇస్తోందని, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించిందని, పేదలకు 200 యూనిట్ల మేరకు ఉచిత విద్యుత్తునూ అమలు చేస్తోందని కొనియాడారు. తాము కేంద్రంలో అధికారంలోకి వస్తే తెలంగాణలో అమలవుతున్న పథకాలను దేశవ్యాప్తంగా అమలు చేస్తామని హామీ ఇచ్చారు.

9న మరోసారి రాహుల్ రాక..

» 10న రాష్ట్రానికి ప్రియాంకా గాంధీ

హైదరాబాద్/వికారాబాద్/తాండూరు, మే 5 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో లోక్‌సభ ఎన్నికల ప్రచారానికి ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీ మరో దఫా రానున్నారు. ఈ నెల 9న ఉదయం 11 గంటలకు కరీంనగర్‌లో జరిగే జనజాతర సభకు, సాయంత్రం 6 గంటలకు ఎల్బీనగర్‌లోని సరూర్ నగర్‌లో జరిగే జన జాతర సభకు హాజరు కానున్నారు. అలాగే మరో అగ్ర నేత ప్రియాంకా గాంధీ ప్రచార షెడ్యూలూ ఖరారైంది. ఈ నెల 10న మధ్యాహ్నం 12 గంటలకు కామారెడ్డిలో, సాయంత్రం 4 గంటలకు తాండూరులో జరిగే జనజాతర సభల్లోనూ, సాయంత్రం 6 గంటలకు షాద్‌నగర్‌లో జరిగే రోడ్‌షో, కార్నర్ మీటింగ్‌లలో ఆమె పాల్గొని పార్టీ అభ్యర్థుల తరఫున ప్రచారం చేయనున్నారు. తాండూరులో జరిగే సభకు సుమారు లక్ష మందికి సరిపడా సభా ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆ పార్టీ ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి తెలిపారు. ఇటు వచ్చే ఐదు రోజులూ ఎన్నికల ప్రచారంలో సీఎం రేవంత్ రెడ్డి.. బిజీగా గడపనున్నారు. సోమవారం ఉదయం ఇబ్రహీంపట్నంలో.. సాయంత్రం ఉప్పల్‌లో జరిగే రోడ్‌షో, కార్నర్ మీటింగ్‌లలో ఆయన పాల్గొంటారు. అదే రోజున రాత్రి సికింద్రాబాద్ కంటోన్మెంట్‌లో ప్రచారం చేస్తారు. మంగళవారం ఉదయం నర్సాపూర్‌లో జరిగే జనజాతర సభలో, సాయంత్రం వరంగల్ తూర్పు, పశ్చిమ నియోజకవర్గాల్లో జరిగే రోడ్‌షో, కార్నర్ మీటింగ్‌లలోనూ పాల్గొంటారు. అలాగే 8న సాయంత్రం ఆర్మూర్ కార్నర్ మీటింగ్, నిజామాబాద్‌లో జరిగే రోడ్‌షో, కార్నర్ మీటింగ్‌లలో పాల్గొంటారు. 9, 10 తేదీల్లో రాహుల్, ప్రియాంకలతో కలిసి ఎన్నికల ప్రచారంలో పాలుపంచుకుంటారు.

గాంధీని చంపిన గాడ్సేను పూజించే బీజేపీకి ఓటేస్తారా?

» వైశ్యులు, ప్రజలు ఆలోచించాలి

» రాహుల్‌తోనే మహాత్ముడి ఆశయ సాధన సాధ్యం: జగ్గారెడ్డి

సిద్దిపేట టౌన్, మే 5: "దేశానికి స్వాతంత్ర్యం తెచ్చిన మహాత్మాగాంధీని గాడ్సే చంపాడు. అలాంటి గాడ్సేను బీజేపీ నాయకులు దేవుడిలాగా చూస్తున్నారు. గాంధీని చంపిన గాడ్సేను పూజించే బీజేపీకి ఆర్యవైశ్యులు ఓటేస్తారా?" అని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్, సంగారెడ్డి మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి ప్రశ్నించారు. ఆదివారం సిద్దిపేట పట్టణంలో మెదక్ లోక్‌సభ నియోజకవర్గ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి నీలం మధును గెలిపించాలని కోరుతూ స్థానిక ముస్తాబాద్ చౌరస్తా నుంచి బస్టాండ్ మీదుగా గాంధీ చౌరస్తా వరకు బైక్ ర్యాలీ, రోడ్ షో నిర్వహించారు. కాంగ్రెస్ సిద్దిపేట నియోజకవర్గ అధ్యక్షుడు పూజల హరికృష్ణ, పట్టణ అధ్యక్షుడు అత్తుఇమామ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమాలకు టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్, సంగారెడ్డి మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి హాజరయ్యారు. రోడ్ షోలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పెద్దఎత్తున పాల్గొన్నారు. ఈ సందర్భంగా జగ్గారెడ్డి మాట్లాడుతూ.. పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థికి కొందరు వైశ్యులు మద్దతు ఇస్తున్నట్లుగా తనకు తెలిసిందన్నారు. గాడ్సేకు మద్దతిస్తున్న ఆ పార్టీకి ఓట్లు వేసే ముందు ఒక్కసారి ఆలోచించాలని కోరారు. 'రఘుపతి రాఘవ రాజారాం.. పతీత పావన సీతారాం' అని గాంధీ నినాదమిచ్చారని, అప్పుడు బీజేపీ నాయకులు ఎక్కడున్నారని ప్రశ్నించారు. అప్పుడు మోదీ, ఇతర నాయకులు పుట్టలేదని పేర్కొన్నారు. గాంధీజీ శ్రీరాముని గుణగణాలను ప్రజలకు వివరించారని చెప్పారు. అలాంటి గాంధీజీని అవమానించిన బీజేపీ.. రాముడి పేరుతో ఓట్లు దండుకోవడానికే ప్రజల ముందుకు వస్తోందని విమర్శించారు. గాంధీజీని చంపిన గాడ్సేకు మద్దతిస్తున్న బీజేపీ కావాలా? గాంధీజీ ఆశయాలను నేరవేర్చుతున్న కాంగ్రెస్ కావాలా? ఆలోచించాలని సూచించారు. గాంధీజీ బోధించిన రాముని ఆశయాలను రాహుల్ మాత్రమే నేరవేర్చుతారని చెప్పారు.



సిద్దిపేట గాంధీ చౌక్‌లో మాట్లాడుతున్న జగ్గారెడ్డి

'ఫైనల్'గా మోదీని ఓడించాలి!

13న తెలంగాణ వర్సెస్ గుజరాత్ మ్యాచే! .. బీజేపీని డకౌట్ చేయాలి.. సెమీస్‌లో బీఆర్ఎస్‌ను ఓడించాం

» దేవుడి పేరుతో ఓట్లు అడిగేందుకు బీజేపీ నేతలు సిగ్గుపడాలి

» కేటీఆర్.. చీర కొట్టుకొని బస్సెక్కు.. గ్యారెంటీల అమలు తెలుస్తది

» 'కారు' పాడైపోయింది.. జుమ్మేరాత్ బజార్లో అమ్మాల్సిందే: రేవంత్



తుక్కుగూడ రోడ్‌షోలో మాట్లాడుతున్న సీఎం రేవంత్

మహబూబ్‌నగర్, నిర్మల్, ఇబ్రహీంపట్నం, మహేశ్వరం, శంషాబాద్/శంషాబాద్ రూరల్/షాద్‌నగర్, మే 5 (ఆంధ్రజ్యోతి): ఈ లోక్‌సభ ఎన్నికలు తెలంగాణ వర్సెస్ గుజరాత్ మధ్య ఫైనల్ మ్యాచ్ అని, ఈ ఆటలో బీజేపీని డకౌట్ చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రజలకు పిలుపునిచ్చారు. రాష్ట్రంలో మొన్న సెమీఫైనల్లో బీఆర్ఎస్‌ను ఓడించామని, ఈనెల 13న జరిగే ఫైనల్లో మోదీని ఓడించాలని అన్నారు. ఆదివారం నిర్మల్, ఆలంపూర్‌లో రాహుల్ గాంధీ పాల్గొన్న జనజాతర సభల్లో.. రంగారెడ్డి జిల్లా తుక్కుగూడ, శంషాబాద్‌లో రోడ్‌షోల్లో, కార్నర్‌మీటింగ్‌ల్లో రేవంత్ రెడ్డి మాట్లాడారు. రాష్ట్ర పునర్విభజన చట్టంలో తెలంగాణకు ఐటీఐఆర్, మూసీ ప్రక్షాళన, బయ్యారం ఉక్కు కర్మాగారం, వరంగల్ రైల్వే కోచ్ ఫ్యాక్టరీ ఇస్తామని పేర్కొన్నారని.. మోదీ ప్రభుత్వం వచ్చాక రైల్వే కర్మాగారాన్ని లాతూర్‌కు తరలించి, విభగతా హామీలను తుంగలో తొక్కారని విమర్శించారు. ఫలితంగా తెలంగాణకు ప్రధాని నరేంద్రమోదీ గాడిద గుడ్డు తప్ప ఇచ్చిందేమీ లేదని పేర్కొన్నారు. దేవుడి పేరు చెప్పి బీజేపీ ఓట్లను అడుక్కుంటోందని.. ఇందుకు ఆ పార్టీ సిగ్గుపడాలన్నారు. రాముడిని, కృష్ణుడిని అందరం పూజించుకుంటామని.. మోదీ మాత్రం రాముడిని తామే సృష్టించినట్లు మాట్లాడుతున్నారని విమర్శించారు. అయోధ్య ప్రాణప్రతిష్ఠ సందర్భంగా పంచిన అక్షింతలు అక్కడివి కావని.. రాష్ట్రంలోనే రేషన్ బియ్యానికి పసుపు పూసి జనానికి ఇచ్చారని విమర్శించారు. 'కారు' రిపేర్‌కొస్తే గ్యారేజీకి వెళ్లిందని, మళ్లీ వస్తుందని కేసీఆర్, కేటీఆర్ చెబుతున్నారని.. అయితే ఆ 'కారు' పాడై పనికిరాకుండా పోయిందని.. జుమ్మేరాత్ బజార్‌లో తెగనమ్మాల్సిందేనని ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో గత ఐదు నెలల పాలనలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏమీ చేయలేదని అంటున్న కేటీఆర్, తన అనుమానాలను నివృత్తి చేసుకునేందుకు చక్కగా చీరకట్టుకొని ఆర్టీసీ బస్సెక్కాలని సూచించారు. "అయ్యా నీకు సినీ పరిశ్రమల వాళ్లు బాగా తెలుసు కదా.. నువ్వు చీరకట్టుకొని ఆడపిల్లగా మంచిగా తయారై ఆర్టీసీ బస్సెక్కు. నిన్ను టికెట్ కోసం పైసలడిగితే అడిగితే ఆరు గ్యారెంటీలు అమలుకానట్టే. అడకపోతే మేం ఆరు గ్యారెంటీలను అమలు చేసినట్లే" అని కేటీఆర్‌ను ఉద్దేశించి వ్యాఖ్యానించారు. హామీ ఇచ్చినట్లుగా ఆరు గ్యారెంటీలను చిత్తశుద్ధితో అమలుచేస్తామని స్పష్టం చేశారు. ఆదిలాబాద్ జిల్లాను తాను దత్తత తీసుకుంటానని ప్రకటించారు. ఈనెల 9లోగా రైతుభరోసాని పూర్తిస్థాయిలో అమలుచేస్తామని పునరుద్ఘాటించారు. హరీశ్‌రావు రూ. 2 లక్ష ల రుణమాఫీ చేయలేదంటున్నారని, పంద్రాగస్టులోగా రుణమాఫీ చేసి తీరుతామని, రాజీనామాకు హరీశ్ సిద్ధంగా ఉండాలని సూచించారు. రాష్ట్రంలో వచ్చే పదేళ్లపాటు కాంగ్రెస్సే అధికారంలో ఉంటుందని చెప్పారు. కేంద్రంలో బీజేపీ మళ్లీ అధికారంలోకి వస్తే రిజర్వేషన్లు రద్దు చేసి.. దళితులు, గిరిజనులను బానిసలుగా మార్చి.. కార్పొరేట్ కంపెనీలకు అప్పగిస్తుందని హెచ్చరించారు. అప్పట్లో ఈస్ట్ ఇండియా కంపెనీ సముద్రం పక్కన సూరత్‌లో సంసారం పెట్టి మన రాజుల మధ్య చిచ్చుపెట్టి దేశాన్నే ఆక్రమించుకొని, వందల ఏళ్లు దేశాన్ని పాలించిందని.. స్వాతంత్ర్యం వచ్చిన 75 ఏళ్ల తర్వాత అదే సూరత్ నుంచి వచ్చిన మోదీ, అమిత్ షా పార్టీల మధ్య చిచ్చుపెట్టి ఏళ్లకు ఏళ్లు ఏలాలని కుట్ర చేస్తున్నారని ఆరోపించారు. కాగా రాహుల్ గాంధీ ఆధ్వర్యంలో నిర్మల్, ఆలంపూర్‌లో జరిగిన జనజాతర సభలకు మండుటెండలో కూడా జనం పెద్ద ఎత్తున హాజరయ్యారు. ఈ సభలు సక్సెస్ కావడంతో కాంగ్రెస్ నేతల్లో నూతనోత్సాహం నెలకొంది.



అబూధాబీలోని ఒక పార్కులో సమావేశమైన బీజేపీ కార్యకర్తలు

గల్ఫ్‌లో బీజేపీ అభిమానుల ప్రచారం

» తెలంగాణ, ఏపీలో ప్రవాసీ కుటుంబాలు కమలం గుర్తుకు ఓటేయాలని అభ్యర్థన

(ఆంధ్రజ్యోతి గల్ఫ్ ప్రతినిధి)

తెలంగాణ ప్రవాసీలు పెద్ద సంఖ్యలో ఉన్న గల్ఫ్ దేశాల్లో బీజేపీ అభిమానులు ప్రచారం చేస్తున్నారు. దుబాయ్, షార్జా, అబూధాబీ, మస్కట్, రియాద్, కువైట్ నగరాల్లో సాయంకాలం ప్రవాసీలను కలుస్తున్నారు. బీజేపీకి ఓటు వేయాలని స్వదేశంలోని కుటుంబ సభ్యులకు చెప్పాలని కోరుతున్నారు. దుబాయ్ ఎమిరేట్స్‌లోని తెలంగాణ ప్రవాసీల్లో సింహభాగం ఉత్తర తెలంగాణ జిల్లాలకు చెందిన వారున్నారు. కరీంనగర్ ఎంపీ బండి సంజయ్, నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్‌లకు ఇక్కడి ప్రవాసీ యువతలో చాలా మంది అభిమానులు ఉన్నారు. అర్వింద్ తరచూ దుబాయ్ పర్యటనలకు వస్తూ వీలైనంత ఎక్కువ మంది యువకులతో సమావేశాలు జరుపుతుండటం పార్టీకి సానుకూల అంశం. ఒక్క ఉత్తర తెలంగాణకు మాత్రమే పరిమితం కాకుండా రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ప్రవాసీలను కలిసి ఓట్లను అభ్యర్థిస్తున్నామని బీజేపీ అనుబంధ ప్రవాసీ సంఘమైన ఇండియన్ పీపుల్స్ ఫోరం యూఏఈ అధ్యక్షుడు కుంబాల మహేందర్ రెడ్డి వెల్లడించారు. ఇక ఆంధ్రప్రదేశ్ విషయానికి వస్తే.. అన్నమయ్య జిల్లాలోని రాజంపేట లోక్ సభ నియోజకవర్గానికి చెందిన వారు కువైట్‌లో భారీ సంఖ్యలో ఉన్నారు. రాజంపేట నుండి మాజీ ముఖ్యమంత్రి కిరణ్ కుమార్ రెడ్డి బీజేపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్నారు. ఆయనకు మద్దతుగా మంగఫ్ ప్రాంతంలోని అనేక చోట్ల బీజేపీ అభిమానులు ప్రచారం చేస్తున్నారు.

కార్యకర్తల పట్టుదలతో సభ విజయవంతం : ఈటల



పరేడ్ గ్రౌండ్స్‌లో ఆదివారం నిర్వహించిన బహిరంగ సభ తమ పార్టీ కార్యకర్తల పట్టుదల వల్ల విజయవంతమైందని మల్కాజిగిరి నియోజకవర్గ బీజేపీ అభ్యర్థి ఈటల రాజేందర్ అన్నారు. నాలుగైదు రోజులుగా తాము పడిన కష్టానికి ఫలితం దక్కిందని పేర్కొన్నారు. అమిత్‌షా హాజరైన ఈ సభ ద్వారా పార్టీ కేడర్‌లో ఉన్న జోష్ మరోసారి వెల్లడైందని చెప్పారు. సభకు వచ్చిన జనంలో చివరి వరకు జోష్ ఉండడం తాను తొలిసారిగా చూశానన్నారు.

ఆరు గ్యారెంటీలకు డబ్బుల్లేవా?

- కాంట్రాక్టర్లకు రూ.వేల కోట్లు చెల్లించేందుకు.. ఢిల్లీకి కప్పం కట్టేందుకు పైసలెలా వస్తున్నాయ్: సంజయ్



భగత్‌నగర్(కరీంనగర్), మే 5: కాంట్రాక్టర్లకు రూ.వేల కోట్ల బిల్లులు చెల్లించేందుకు, ఢిల్లీకి కప్పం కట్టేందుకు డబ్బులిస్తున్న కాంగ్రెస్ సర్కారు.. ఆరు గ్యారెంటీల అమలుకు డబ్బుల్లేవని చెప్పడం సిగ్గుచేటని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ విమర్శించారు. ఆదివారం కరీంనగర్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. ఫోన్ ట్యాపింగ్‌లో దొరికిన దొంగలు కేసీఆర్, కేటీఆర్ అని విమర్శించారు. ట్యాపింగ్ ప్రధాన నిందితుడు పంపే సొమ్ముతో కరీంనగర్‌లో కార్పొరేటర్లను, ప్రజా ప్రతినిధులను కాంగ్రెస్ నాయకులు కొనుగోలు చేస్తున్నారని ఆరోపించారు. ఫోన్ ట్యాపింగ్ నిందితుడి వియ్యంకుడితో కలిసి ఓ వ్యాపారవేత్త, మాజీ ప్రజాప్రతినిధి కార్పొరేటర్లను కొంటున్నాడని చెప్పారు. సిరిసిల్ల కేంద్రంగా ఫోన్ ట్యాపింగ్ వార్‌రూమ్‌ను ఏర్పాటు చేసుకుని తమ ఫోన్లను ట్యాప్ చేసినట్లు నిందితుడైన ప్రణీత్‌రావు చెప్పారని అన్నారు. కేసీఆర్ చెబితేనే ఫోన్లను ట్యాప్ చేశామని రాధాకిషన్‌రావు పోలీసుల విచారణలో వెల్లడించారని తెలిపారు. ఇంత స్పష్టమైన ఆధారాలున్నా కేసీఆర్, కేటీఆర్‌ను ఎందుకు అరెస్టు చేయడం లేదని బండి సంజయ్ ప్రశ్నించారు. రాష్ట్ర ప్రభుత్వం కేసీఆర్‌తో కుమ్మక్కై, తదుపరి విచారణ లేకుండా కేసును నీరు గారుస్తోందని విమర్శించారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు కుమ్మక్కై తనను ఓడించేందుకు కుట్రలు చేస్తున్నాయని విమర్శించారు. కేసీఆర్ నవి్వంచి గొంతు కోసే రకమని, మళ్లీ డ్రామాలాడుతూ ఓట్లు దండుకోవడానికి వస్తున్నాడని తెలిపారు. సోషల్ మీడియా ద్వారా చేయిస్తున్న ప్రచారాన్ని నమ్మవద్దని ప్రజలను కోరారు.

నేడు రాష్ట్రంలో నడ్డా ప్రచారం..

బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా సోమవారం రాష్ట్రంలో మూడు పార్లమెంటు నియోజకవర్గాల పరిధిలో ఎన్నికల ప్రచారం నిర్వహించనున్నారు. ఉదయం 11 గంటలకు గోదావరిఖని(పెద్దపల్లి పార్లమెంటు), మధ్యాహ్నం 2 గంటలకు చౌటుప్పల్(భువనగిరి పార్లమెంటు), 3 గంటలకు నల్లగొండలో నిర్వహించే బహిరంగ సభల్లో నడ్డా పాల్గొంటారు.

బీజేపీపై సీఎం రేవంత్ అవాస్తవ ప్రచారం

- పోలీసులకు బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఫిర్యాదు

హైదరాబాద్, మే 5 (ఆంధ్రజ్యోతి): తమ పార్టీ ప్రతిష్ఠకు భంగం కలిగించేలా సీఎం రేవంత్‌రెడ్డి అవాస్తవాలు ప్రచారం చేస్తున్నారని పేర్కొంటూ ఆయనపై చర్యలు తీసుకోవాలని బీజేపీ నాయకులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. తమ పార్టీపై రేవంత్ అబద్ధాలు ప్రచారం చేస్తున్నారని బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి. ప్రేమేందర్‌రెడ్డి ఆరోపించారు. రాజ్యాంగాన్ని మార్చడానికి బీజేపీ 400 సీట్లు అడుగుతోందంటూ రేవంత్ శనివారం కొత్తగూడెం సభలో మరోసారి ప్రచారం చేశారని పేర్కొన్నారు. ఈమేరకు కొత్తగూడెం పోలీసులకు ఆన్‌లైన్‌లో ఫిర్యాదు చేసినట్లు ఆయన ఒక ప్రకటనలో తెలిపారు. అలాగే కాంగ్రెస్ పార్టీ అధికార దుర్వినియోగానికి పాల్పడుతోందని, డబ్బులు ఎర చూపి ఓటర్లను ప్రలోభపెట్టే ప్రయత్నం చేస్తోందని ఎన్నికల ప్రధాన అధికారి వికాస్‌రాజ్‌కు ప్రేమేందర్‌రెడ్డి ఆదివారం ఫిర్యాదు చేశారు. ఎన్నికల నియమావళికి విరుద్ధంగా జరుగుతున్న డబ్బు పంపిణీని అడ్డుకోవాలని కోరారు. కాంగ్రెస్ పార్టీకి చెందిన మంత్రి ఒకరు.. కరీంనగర్ పార్లమెంటు నియోజకవర్గం పరిధిలోని పలు ప్రాంతాల్లో ఒక్కో ఓటరుకి రూ.వెయ్యి, రూ.2 వేలు పంచేందుకు దాదాపు రూ.100 కోట్లు ముట్టజెప్పినట్లు తమ దృష్టికి వచ్చిందని సీఈవోకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. గత ప్రభుత్వం చేసినట్లుగానే కాంగ్రెస్ నేతలు ఇతర పార్టీల నేతల ఫోన్‌కాల్స్ ట్యాప్ చేస్తున్నారని బీజేపీ తన ఫిర్యాదులో ఆరోపించింది.


ఎస్సీ, ఎస్టీ, బీసీలకు అదనపు రిజర్వేషన్లు!



పరేడ్‌గ్రౌండ్స్‌లో బీజేపీ సభకు హాజరైన జనం

(మొదటి పేజీ తరువాయి)

నాయకత్వమే లేదని, కాంగ్రెస్ హయాంలో రూ.12 లక్షల కోట్ల మేర అవినీతి జరిగిందని ఆరోపించారు. అవినీతి కాంగ్రెస్ కావాలా? సీఎంగా, పీఎంగా 23 ఏళ్ల పాలించినా.. ఒక్క అవినీతి ఆరోపణ కూడా లేని మోదీ కావాలా? అని ప్రజలను ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీ ఉగ్రవాదాన్ని, తీవ్రవాదాన్ని పెంచి పోషించిందని ఆరోపించారు. నరేంద్ర మోదీ పాలనలో ఉగ్రవాదాన్ని, తీవ్రవాదాన్ని, నక్సలిజాన్ని పూర్తిగా అణచివేశామని వెల్లడించారు. ఆదివారం కుమరం భీం ఆసిఫాబాద్ జిల్లా కాగజ్‌నగర్‌లో, నిజామాబాద్‌లోని గిరిరాజ్ కళాశాలలో, సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్‌లో నిర్వహించిన బహిరంగ సభల్లో అమిత్ షా ప్రసంగించారు. సికింద్రాబాద్ సభలో 'పెద్దమ్మ తల్లి'కి నమస్కారాలు చేస్తూ తన ప్రసంగాన్ని ప్రారంభించారు. కరోనా సమయంలో ప్రజలందరికీ ఉచితంగా టీకాలు అందజేస్తే.. రాహుల్‌బాబా వ్యాక్సిన్లపైనా దుష్ప్రచారం చేశాడని, చివరికి ఆయన, సోదరి కలిసి చీకట్లో టీకాలు వేయించుకున్నారని చెప్పారు.



40 వేల కోట్లతో అభివృద్ధి

తెలంగాణలో రూ.40 వేల కోట్ల కేంద్ర నిధులతో అభివృద్ధి పనులు చేసినట్లు అమిత్ షా తెలిపారు. ఇందులో మంచిర్యాల నుంచి ఉట్నూరు మీదుగా ఆదిలాబాద్‌కు బ్రాడ్‌గేజ్ రైల్వే నిర్మాణం కూడా ఉందన్నారు. బీజేపీ హయాంలో చేపట్టిన ప్రత్యేక నిబంధనలతోనే పరిశ్రమల పునరుద్ధరణ జరిగినట్లు చెప్పారు. బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే తెలంగాణలో ఎస్సీ, ఎస్టీ, ఓబీసీల రిజర్వేషన్లను పెంచుతామన్నారు. ఈసారి ఎన్నికల్లో బీజేపీకి 10 సీట్లు పక్కాగా వస్తాయని ధీమా వ్యక్తం చేశారు. హైదరాబాద్ విమోచన దినోత్సవాన్ని బీజేపీ ఘనంగా నిర్వహిస్తోందని, బీఆర్ఎస్, కాంగ్రెస్ ఆ విషయం జోలికి వెళ్లవని, ఒవైసీ వాటిని విమోచన దినోత్సవం చేయనిస్తాడా? అని ప్రశ్నించారు.

కాంగ్రెస్ పాలన అవినీతిమయం

దేశంలో 70 ఏళ్ల కొనసాగిన కాంగ్రెస్ పాలన అంతా అవినీతిమయమని షా ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం రూ.12 లక్షల కోట్ల అవినీతి చేసిందన్నారు. రామ మందిర నిర్మాణంపై కాంగ్రెస్ ప్రభుత్వం 70 ఏళ్ల పాటు నాన్చుడు ధోరణి అవలంబించిందని.. 2019లో బీజేపీ సర్కారు రెండోసారి కొలువుదీరగానే ప్రధాని మోదీ రామాలయం నిర్మించారని చెప్పారు. మందిరం ప్రారంభోత్సవానికి రాహుల్, ఖర్గేను ఆహ్వానించినా రాలేదన్నారు. కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే తెలంగాణ ప్రజలకు, కశ్మీర్‌కు సంబంధం ఏంటనడం హాస్యాస్పదంగా ఉందని చెప్పారు. కశ్మీరు ప్రజలకు స్వేచ్ఛాస్వాతంత్ర్యం ఇచ్చేందుకు ఆర్టికల్ 370ని రద్దు చేశామన్నారు. ఐదేళ్లు గడిచినా.. కశ్మీర్‌లో ఎలాంటి సమస్యలు రాలేదని అమిత్ షా గుర్తుచేశారు. తాము అధికారంలోకి వస్తే ఆర్టికల్ 370ని వెనక్కి తీసుకుంటామని రాహుల్ చెబుతున్నారని.. అసలు ఆ పార్టీ అధికారంలోకి వచ్చేదే లేదని ఎద్దేవా చేశారు. ఇక అసదుద్దీన్, బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలను ఏబీసీగా అభివర్ణించారు. ఏ అంటే అసదుద్దీన్ ఒవైసీ, బీ అంటే బీఆర్ఎస్, సీ అంటే కాంగ్రెస్ పార్టీ అని తెలిపారు. మజ్లి్‌సను ఈ రెండు పార్టీలు వ్యతిరేకించవన్నారు. వీరంతా ముస్లిం ఓట్ల కోసమే పనిచేస్తారని తెలిపారు. రిజర్వేషన్లపై తన ప్రసంగాలపైనే ఫేక్ వీడియోలు సృష్టించారని.. వాటిని సీఎం రేవంత్‌రెడ్డి కూడా షేర్ చేశారని షా చెప్పారు. ఈ వీడియోలపై ఢిల్లీ పోలీసులు కేసులు నమోదు చేశారన్నారు. ఫేక్ వీడియోలు తయారు చేస్తే సీఎం వెంట పడకుండా ఉంటారా!? అని ప్రశ్నించారు. తెలంగాణలో మీట నొక్కితే కాంగ్రెస్‌కు ఇటలీలో షాక్ తగలాలని అమిత్ షా అన్నారు.

పసుపు బోర్డు ఇందూరులోనే

పసుపు బోర్డును ఇందూరులోనే ఏర్పాటు చేస్తామని అమిత్ షా ప్రకటించారు. ఈ బోర్డు కోసం ఎంపీ అర్వింద్ ఎంతో కష్టపడ్డారని.. ప్రధాని వెంట పడి ఏర్పాటు చేసే విధంగా చూశారని అన్నారు. ఈ ఎన్నికల్లో బీజేపీని గెలిపిస్తే పార్లమెంట్ పరిధిలోని రెండు చక్కెర ఫ్యాక్టరీలను తెరిపిస్తామని హోంమంత్రి ప్రకటించారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ తీసుకున్న నిర్ణయాల వల్లనే ఈ ఫ్యాక్టరీలు మూతపడ్డాయన్నారు. బీడీ కార్మికుల కోసం ప్రత్యేకంగా ఆస్పత్రిని ఏర్పాటు చేస్తామని ఆయన ప్రకటించారు.

కుర్చీ పోతుందని రేవంత్ భయం

- రిజర్వేషన్లపై దుష్ప్రచారం
- కాంగ్రెస్ సర్కారును పడగొట్టే ఉద్దేశం లేదు
- తెలంగాణ ప్రగతికి మోదీ గ్యారెంటీ: కిషన్‌రెడ్డి



హైదరాబాద్, మే 5 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలో మెజారిటీ పార్లమెంటు స్థానాల్లో బీజేపీ గెలుపు ఖాయమని తేలడంతో సీఎం రేవంత్‌రెడ్డి రిజర్వేషన్ల రద్దు పేరుతో తమ పార్టీపై దుష్ప్రచారం చేస్తున్నారని కేంద్ర మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి మండిపడ్డారు. "ఎంపీ ఎన్నికల్లో బీజేపీకి ఎక్కువ సీట్లు రాబోతున్నాయని రేవంత్‌కు అర్థమైంది. దీంతో కాంగ్రెస్ అగ్ర నాయకులు ఎక్కడ ఆయన పదవికి ఎసరు పెడతారో అన్న భయం పట్టుకుంది. అందుకే బీజేపీని బద్‌నాం చేసేందుకు రిజర్వేషన్లపై తప్పుడు ప్రచారంతో మా ఓట్లు కొల్లగొట్టేందుకు ప్రయత్నిస్తున్నారు" అని కిషన్‌రెడ్డి స్పష్టంచేశారు. ఆదివారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన మీట్ ది ప్రెస్‌లో కిషన్‌రెడ్డి మాట్లాడారు. ప్రాణముండగా రిజర్వేషన్లను ఎత్తివేసే ప్రసక్తే లేదని ప్రధాని మోదీ చెప్పినా.. ఇంకా దుష్ప్రచారం చేస్తారా..? అని నిలదీశారు. ఒక ప్రధాన మంత్రి అంత స్పష్టంగా ప్రకటించినా.. ముఖ్యమంత్రి హోదాలో రేవంత్ ఎలా తప్పుడు ప్రచారం చేస్తారని ప్రశ్నించారు. "రిజర్వేషన్ల ఎత్తివేత ఎవరికైనా సాధ్యమా..? రిజర్వేషన్లను తీసేసి ఒక పార్టీ ముందుకు వెళ్లడం సాధ్యమా..? బీజేపీ రిజర్వేషన్లను ఎత్తేస్తుందని మీకేమైనా కల వచ్చిందా..? మా కంఠంలో ప్రాణం ఉన్నంత వరకు రిజర్వేషన్లను తాకేశక్తి దేశంలో ఎవరికీ లేదు" అని కిషన్‌రెడ్డి స్పష్టం చేశారు.

గ్యారెంటీలా.. గాడిద గుడ్డా..?

గ్యారెంటీలు అమలు చేయలేకపోవడం, తెలంగాణలో బీజేపీ గెలుపు ఖాయమవడం వంటి అంశాల నుంచి ప్రజల దృష్టి మళ్లించేందుకు రేవంత్ ప్రయత్నిస్తున్నారని కిషన్‌రెడ్డి మండిపడ్డారు. "తెలంగాణకు కేంద్రం పదేళ్లలో రూ.9.5 లక్షల కోట్లు ఇస్తే గాడిద గుడ్డు అంటారా..? పేదలకు ప్రతీ నెలా ఉచిత బియ్యం ఇస్తున్నాం.. అది గాడిద గుడ్డా..? పంచాయతీలకు నేరుగా నిధులివ్వడం గాడిద గుడ్డా..? రైతులకు ఏటా ఎకరానికి రూ.20వేల సబ్సిడీ ఇవ్వడం గాడిద గుడ్డా..? ప్రతీ రైతుకు రూ.6వేల పెట్టుబడి సాయం అందిస్తుంటే అందులో గాడిద గుడ్డు కనిపించిందా..? రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కూలగొట్టే ఉద్దేశం మాకు లేదు. కాంగ్రెస్‌లో అంతర్గత విభేదాల వల్ల కూలితే మాకు సంబంధం లేదు. ఈ అంశం కాంగ్రెస్, బీఆర్ఎస్‌ల అసమ్మతి ఎజెండాల్లో ఉంటే నేనేం చేయలేను. బీఆర్ఎస్ గద్దె దిగేందుకు పదేళ్లు పడితే.. కాంగ్రెస్ గద్దె దిగేందుకు 5 ఏళ్లు చాలా ఎక్కువ" అని కిషన్‌రెడ్డి అన్నారు. కేంద్రంలో మూడో కూటమి ఏర్పాటవుతుందని బీఆర్ఎస్ నాయకులు చేసిన ప్రకటనపై కిషన్‌రెడ్డి స్పందించారు. "బీఆర్ఎస్ నాయకత్వం లిక్కర్ బ్రాండ్ కూటములు.. ఫాంహౌస్ కూటములు పెట్టుకోవచ్చు. అధికారం కోల్పోవడంతో కేటీఆర్‌కు పీడకలలు వస్తున్నాయి. కేటీఆర్ చెబుతున్నట్లు హైదరాబాద్‌ను కేంద్ర పాలిత ప్రాంతం చేసే ఆలోచన లేదు. ఈ ఎన్నికల్లో బీఆర్ఎస్ ఒక్క సీటు గెలిచినా.. ఓడినా.. వచ్చేదేం లేదు" అని అన్నారు.

పదేళ్లలో అద్భుత ప్రగతి..

తెలంగాణ అన్ని రంగాల్లో మరింత అభివృద్ధి సాధించేందుకు బీజేపీ కృషి చేస్తుందని.. దీనికి ప్రధాని మోదీ గ్యారెంటీ అని కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. మోదీ గ్యారెంటీ అంటే దేవుళ్లపై ఒట్లు వేసి చెప్పడం కాదని.. గ్యారెంటీని అమలు చేసే గ్యారెంటీ అని అన్నారు. ప్రధానిగా మూడోసారి మోదీ బాధ్యతలు చేపట్టడం ఖాయమని చెప్పారు. పదేళ్లలో రైల్వేలు, అంతరిక్ష ప్రయోగాలు, సాంకేతిక విప్లవం ఇలా అనేక రంగాల్లో దేశం అద్భుతమైన ప్రగతి సాధించిందని తెలిపారు. దేశంలో రైల్వేల అభివృద్ధి వేగంగా సాగుతోందన్నారు. సికింద్రాబాద్ స్టేషన్ ఆధునీకరణను రూ.720 కోట్లతో చేపట్టామని, 25 శాతం పనులు పూర్తయ్యాయని పేర్కొన్నారు. శంషాబాద్ విమానాశ్రయం తరహాలో ఈ రైల్వేస్టేషన్ ఉండబోతోందని చెప్పారు. బయ్యారంలో ఉక్కు ఫ్యాక్టరీ ఏర్పాటు అంశంపై కాంగ్రెస్, బీఆర్ఎస్‌లవి గాలి మాటలని కిషన్‌రెడ్డి విమర్శించారు.

కాంగ్రెస్ ఐదేళ్లూ ఉండదు

(మొదటి పేజీ తరువాయి)



కరీంనగర్ జిల్లా వీణవంకలో మాట్లాడుతున్న కేసీఆర్

ధీమా వ్యక్తం చేశారు. తెలంగాణ ఉద్యమం ఇంకా అయిపోలేదని, పునర్నిర్మాణ ప్రక్రియ మిగిలే ఉందని స్పష్టం చేశారు. తాను చేస్తున్న బస్సుయాత్రకు వస్తున్న ప్రజాదరణను చూసి ఓర్వలేక.. కాంగ్రెస్, బీజేపీలు కుతంత్రంతో 48 గంటల పాటు ప్రచారాన్ని ఆపించాయని విమర్శించారు. రైతులు నాట్లు వేసేప్పుడే బీఆర్ఎస్ సర్కారు రైతుబంధు ఇస్తే.. కాంగ్రెస్ హయాంలో వడ్లు అమ్ముకుంటున్నా డబ్బులు ఇవ్వలేదని మండిపడ్డారు. ఆదివారం ఆయన కరీంనగర్ జిల్లా వీణవంకలో నిర్వహించిన బీఆర్ఎస్ ఆత్మీయ సమ్మేళనంలో, జగిత్యాలలో జరిగిన రోడ్‌షోలలో మాట్లాడారు. "గోదావరి నీళ్లను కర్ణాటక, తమిళనాడుకు తరలించేందుకు కుట్రలు జరుగుతున్నాయి. నేను సీఎంగా ఉన్నప్పుడు ప్రధాని మోదీ ఢిల్లీలో మీటింగ్‌కు పిలిచి అడిగితే, నేను ఒప్పుకోలేదు. తెలంగాణ నీటి వాటాను తేల్చాకే మాట్లాడతానని సూటిగా చెప్పాను. మోదీ మీటింగ్‌కు హాజరుకాలేదు. ఇప్పుడు ఆ కుట్రలు ముమ్మరమయ్యాయి. సీఎం రేవంత్ మాత్రం నప్పుడు చేయడం లేదు" అని మండిపడ్డారు. బీఆర్ఎస్ హయాంలో ప్రధాని మోదీ అసూయపడేలా రాష్ట్రానికి పెట్టుబడులు తెచ్చామని గుర్తుచేశారు. కాంగ్రెస్ వచ్చాక.. రూ.వెయ్యి కోట్లతో వచ్చిన ఓ ఐటీ ప్రాజెక్టు తమిళనాడుకు వెళ్లిపోయిందని విమర్శించారు. 'కాంగ్రెస్ మోసపూరిత హామీలతో అధికారంలోకి వచ్చింది. ఐదు నెలలు గడిచినా.. ఆరు గ్యారెంటీలు.. పించన్ పెంపు లేనేలేదు. కరెంటు కోతలతో ఓ అల్యూమినియం కంపెనీ వేరే ప్రాంతానికి తరలిపోయేందుకు ప్రయత్నిస్తోంది" అని కేసీఆర్ వ్యాఖ్యానించారు. తెలంగాణ ప్రజల్ని నూకలు తినమన్న మోదీకి ఎందుకు ఓటేయాలని ప్రశ్నించారు. "కాంగ్రెస్ సర్కారుకు తోక, తొండం తెలియదు. బీఆర్ఎస్ హయాంలో వరద కాల్వను రిజర్వాయర్‌గా చేసుకున్నాం. ఇప్పుడు వరద కాల్వలను ఎండబెట్టారు. ఐదు నెలల్లోనే రాష్ట్రాన్ని కాంగ్రెస్ సర్కారు ఆగమాగం చేసింది" అని కేసీఆర్ మండిపడ్డారు. కాంగ్రెస్ చెప్పిన వరికి రూ.500 బోనస్ అంతా బోగస్ అని.. కల్యాణలక్ష్మితో తులం బంగారం తుస్ అని ఎద్దేవా చేశారు. పేద విద్యార్థులకు రూ.20 లక్షల స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ ఆగిపోయాయని, గురుకులాల విద్యార్థులు కలుషితాహారం తిని అనారోగ్యం పాలవుతున్నారని పేర్కొన్నారు. నిర్మల్ బహిరంగ సభలో రాహుల్ అబద్ధాలు చెప్పారని కేసీఆర్ విమర్శించారు. రూ.25 వేలు మహిళల ఖాతాల్లో వేస్తున్నామని రాహుల్ చెప్పారని, ఎవరి ఖాతాలోనైనా డబ్బులు పడ్డాయా? అని ప్రశ్నించారు. నిజామాబాద్‌కు ఎంపీగా అర్వింద్ చేసిందేమీ లేదని, పసుపు బోర్డు రాలేదని, దక్కన్ షుగర్‌ను తెరవలేదని విమర్శించారు. రేవంత్ సర్కారు జగిత్యాల జిల్లాను తీసేస్తామంటోందని.. జగిత్యాల జిల్లాగా ఉండాలంటే నిజామాబాద్ ఎంపీగా బాజిరెడ్డి గోవర్ధన్‌ను, పెద్దపల్లి ఎంపీగా కొప్పుల ఈశ్వర్‌ను, కరీంనగర్ ఎంపీగా బోయినపల్లి వినోద్‌కుమార్‌ను గెలిపించాలని ప్రజలను కోరారు.

టీ తాగి.. సెల్ఫీలకు చాన్సిచ్చిన కేసీఆర్

మల్యాల, మే 5: నిజామాబాద్ ఎంపీ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్‌కు మద్దతుగా ప్రచారానికి బస్సు యాత్రగా బయలుదేరిన కేసీఆర్ మార్గమధ్యంలో జగిత్యాల జిల్లా కొండగట్టు వద్ద ఆగారు. ఇక్కడి టీపాయింట్‌లో దాదాపు గంటపాటు కూర్చుని, టీ తాగారు. సమోసాలు తెప్పించుకుని తిన్నారు. ఈ సందర్భంగా తనతో సెల్ఫీలు దిగడానికి వచ్చిన ప్రజలు, చిన్నారులకు కేసీఆర్ అవకాశమిచ్చారు. వారితో ముచ్చటించారు. ఓ దశలో భద్రతాసిబ్బంది ప్రజలను తోసివేయడంపై స్థానిక నేతలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. భద్రతా సిబ్బందిని ఎందుకు వారించలేదన్నట్లు విమర్శిస్తూ.. "మీలాంటి నాయకుల వల్లే పార్టీ అధికారం కోల్పోయింది" అని మండిపడ్డారు.

కాంగ్రెస్‌కు ఓటేస్తే దొంగలకు సద్ది కట్టినట్టే

- గ్యారంటీల బాండ్లు బౌన్స్ అయ్యాయి
- దీనికి శిక్షగా ఈ ఎన్నికల్లో ఓడించాలి
- ప్రజలకు సీఎం క్షమాపణ చెప్పాలి: హరీశ్

సిరిసిల్ల/భీమదేవరపల్లి/సిద్దిపేట, మే 5 (ఆంధ్రజ్యోతి): ఆరు గ్యారంటీలతో మోసం చేసిన కాంగ్రెస్ పార్టీకి ఓటేస్తే దొంగలకు సద్ది కట్టినట్టే అవుతుందని బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి హరీశ్‌రావు అన్నారు. అసెంబ్లీ ఎన్నికల ముందు వంద రోజుల్లో ఆరు గ్యారంటీలు అమలు చేస్తామని కాంగ్రెస్ ఇచ్చిన బాండ్లు బౌన్స్ అయ్యాయని, ఇప్పుడు సీఎం రేవంత్ రెడ్డి మళ్లీ దేవుళ్లపై ఒట్లు వేసుడు మొదలుపెట్టాడని విమర్శించారు. బౌన్స్ అయితే చట్టం శిక్షిస్తుందని, ఆ లెక్క ప్రకారం పార్లమెంటు ఎన్నికల్లో రేవంత్‌రెడ్డి సర్కారును శిక్షించి ఓడించాలన్నారు. ఉచిత బస్సు ప్రయాణం తప్ప మిగిలిన ఐదు పథకాలు తుస్సుమన్నాయని విమర్శించారు. తెలంగాణ ప్రజలు బీఆర్ఎస్‌కు పట్టం కట్టాలని పిలుపునిచ్చారు. హరీశ్‌రావు ఆదివారం రాజన్న సిరిసిల్ల జిల్లా మల్యాలలో ప్రజాశ్వీరాద సభ, హనుమకొండ జిల్లా ముల్కనూర్‌లో రోడ్ షో సందర్భంగా కార్నర్ మీటింగ్‌లో మాట్లాడారు. కేసీఆర్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలకు కాంగ్రెస్ సర్కారు ఎగనామం పెడుతోందన్నారు. ఇప్పటికీ రైతుబంధు డబ్బులు ఇవ్వకపోవడం సిగ్గుచేటని విమర్శించారు. ఇప్పుడు ఆగస్టు 15 అంటున్నారన్నారు. ఓట్ల కోసం కాంగ్రెస్ కుట్రలు పన్నుతోందని విమర్శించారు. కాగా, తెలంగాణలో ఆరు గ్యారంటీలను అమలు చేశామని, మహిళల ఖాతాల్లో ప్రతి నెలా రూ.2,500 జమ చేస్తున్నామని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ చెప్పడం ఆయన దిగజారుడుతనానికి నిదర్శనమని హరీశ్‌రావు విమర్శించారు. నిర్మల్ సభలో రాహుల్ గాంధీ పచ్చి అబద్ధాలు చెప్పి రాంగ్ గాంధీగా నిరూపించుకున్నారని ఎద్దేవా చేశారు. హరీశ్‌రావు ఆదివారం ఆయన సిద్దిపేటలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఆరు గ్యారంటీల్లో కేవలం ఒకే ఒక్క గ్యారంటీని పూర్తిగా అమలు చేశారనే విషయం రాహుల్‌కు తెలియదా అని ప్రశ్నించారు. మహిళల ఖాతాల్లో ఏటా రూ.30వేలు జమ చేస్తున్నట్లు సభలో చెప్పి వారి మనోభావాలను దెబ్బతీశారన్నారు. ఆరు గ్యారంటీల అమలుపై సీఎం చర్చకు రావాలని, లేదంటే బేషరతు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.



ఎస్సీ వర్గీకరణకు మేము అనుకూలమే

రాంనగర్: బీఆర్ఎస్ పార్టీ మొదటి నుంచీ ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా హరీశ్ రావు చెప్పారు. ఎస్సీ వర్గీకరణ చేయాలని అసెంబ్లీలో రెండుసార్లు తీర్మానం చేశామని, ఇదే విషయమై మాజీ సీఎం కేసీఆర్ కూడా ప్రధాని మోదీని కోరారని తెలిపారు. హరీశ్ నివాసంలో ఎమ్మార్పీఎస్ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీజేపీ ఎస్సీ వర్గీకరణకు అనుకూలమని చెప్పినా మ్యానిఫెస్టోలో చేర్చలేదని విమర్శించారు. మాదిగలను గౌరవించిన చరిత్ర బీఆర్ఎస్‌దని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు వంగపల్లి శ్రీనివాస్ అన్నారు. ఈ ఎన్నికల్లో తాము బీఆర్ఎస్‌కు మద్దతు ఇస్తున్నట్లు ఆయన ప్రకటించారు.



ఎల్‌బీ నగర్ రోడ్ షోలో మాట్లాడుతున్న కేటీఆర్

రాహుల్.. రాసిచ్చింది చదవడం కాదు.. రేవంత్ నీతో ఉంటడో.. ఉండడో చూసుకో

కాంగ్రెసోళ్లు చెప్పేవన్నీ పచ్చి అబద్ధాలు: కేటీఆర్

హైదరాబాద్ సిటీ/ఉప్పల్/రాంనగర్/హైదరాబాద్, మే 5 (ఆంధ్రజ్యోతి): "రాష్ట్రంలో మహిళలకు ప్రతినెలా రూ.2500 ఇస్తున్నామని నిర్మల్ సభలో రాహుల్ గాంధీ చెప్పారు. నాకైతే నవ్వాలో.. ఏడ్వాలో అర్థం కాలేదు. రాహుల్.. రాసిచ్చింది చదువుడు కాదు.. ఎన్నికల అనంతరం రేవంత్ నీతో ఉంటడా..? లేదా..? చూసుకో" అని బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ అన్నారు. హామీలను అమలు చేయకుండా రాహుల్‌తో రేవంత్ పచ్చి అబద్ధాలు చెప్పిస్తున్నాడని ఆరోపించారు. రేవంత్ వ్యవహారం చూశాకే.. ఎన్నికల అనంతరం ఆయన బీజేపీలోకి వెళ్తాడని చెబుతున్నానని పేర్కొన్నారు. మల్కాజిగిరి బీఆర్ఎస్ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డికి మద్దతుగా ఎల్‌బీనగర్, ఉప్పల్ రింగ్‌రోడ్డులో, సికింద్రాబాద్ అభ్యర్థి పద్మారావు గెలుపును కాంక్షిస్తూ రాంనగర్ చౌరస్తాలో నిర్వహించిన రోడ్ షోలలో ఆయన మాట్లాడారు. నరేంద్ర మోదీ రాముని గుడి కట్టిస్తే.. కేసీఆర్ యాదాద్రిని కట్టించారని, రాష్ట్రంలో సాగునీటి ప్రాజెక్టుల పేరుతో ఆధునిక దేవాలయాలను నిర్మించారని చెప్పారు. ప్రాజెక్టులన్నింటికీ దేవతల పేర్లే పెట్టామని, అయినా దేవుని పేరు, మతం పేరు చెప్పి తాము ఓట్లు అడగడం లేదన్నారు. ఇచ్చిన హామీలను అమలు చేకుండా కాంగ్రెస్ అబద్ధాలు చెబుతోందని మండిపడ్డారు. బీఆర్ఎస్‌కు 10-12 ఎంపీ సీట్లు ఇస్తే ఆరు నెలల్లో రాష్ట్ర రాజకీయాలను మళ్లీ ఆయన శాసిస్తారన్నారు. జీఎస్టీ పేరిట రాష్ట్రాలకు వాటా దక్కకుండా రూ.30 లక్షల కోట్ల సెస్ వసూలు చేసిన ప్రధాని మోదీ.. అదానీ, అంబానీ లాంటి పారిశ్రామికవేత్తలకు రూ.14 లక్షల కోట్ల రుణం మాఫీ చేశారని ఆరోపించారు. తాను చెప్పింది అబద్ధమైతే ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తానని సవాల్ చేశారు.

చీర నువ్వు కట్టుకుంటావా? రాహుల్‌కే కట్టిస్తావా?

"ఆరు గ్యారెంటీలు అమలు చేస్తున్నామంటూ పచ్చి అబద్ధాలాడుతున్నావ్.. మహిళలకు రూ.2500 ఎక్కడ ఇస్తున్నావో చూపిస్తావా? లేదంటే.. నువ్వు చీర కట్టుకుంటావా..? రాహుల్‌కు కట్టిస్తావా..?" అంటూ రేవంత్‌ను కేటీఆర్ ప్రశ్నించారు. ఆరు గ్యారెంటీలు అమలు చేస్తున్నామని, కావాలంటే చీర కట్టుకొని ఆర్టీసీ బస్సుల్లో ఎక్కి తెలుసుకోవాలని రేవంత్ చేసిన వ్యాఖ్యలపై ఆదివారం 'ఎక్స్' వేదికగా కేటీఆర్ స్పందించారు. కాగా, పద్మశ్రీ పురస్కార గ్రహీత మొగులయ్యకు కేటీఆర్ ఆర్థిక సాయం అందించారు.



బీసీల మేథోమదన సదస్సులో అభివాదం చేస్తున్న జాజుల శ్రీనివాస్ గౌడ్, విశ్రాంత ఐఏఎస్ చిరంజీవులు తదితరులు

కాంగ్రెస్‌కే బీసీల మద్దతు: జాజుల

ఖైరతాబాద్/హైదరాబాద్, మే 5 (ఆంధ్రజ్యోతి): బీసీల మద్దతు కాంగ్రెస్ పార్టీకేనని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. బీజేపీకి బీసీల ఓట్లడిగే నైతిక హక్కు కూడా లేదని మండిపడ్డారు. ఆదివారం హైదరాబాద్‌లో ఓ హోటల్‌లో నిర్వహించిన బీసీల రాజకీయ మేధో మదన్ రాష్ట్ర స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశ ప్రధానిగా ఓబీసీకి చెందిన వ్యక్తే ఉన్నా.. బీసీ వర్గాలకు న్యాయం జరగలేదన్నారు. ఓబీసీ డిమాండ్లలో ఒక్కటి కూడా పరిష్కరించలేదని విమర్శించారు. బీజేపీ పాలనలో బీసీలకు తీవ్ర నష్టం జరిగిందన్నారు. అధికారంలోకి రాగానే దేశవ్యాప్త కులగణన చేపడతామని కాంగ్రెస్ హామీనిచ్చిన నేపథ్యంలో బీసీలంతా ఇండియా కూటమికే మద్దతునివ్వాలని నిర్ణయించినట్లు తెలిపారు.

ఓటమి భయంతో బీజేపీ విద్వేష రాజకీయాలు

- కాళేశ్వరం అవినీతిలో కేంద్రానిదీ పాత్ర: రాఘవులు

ఇబ్రహీంపట్నం/యాచారం, మే 5(ఆంధ్రజ్యోతి): బీజేపీకి ఓటమి భయం పట్టుకుందని సీపీఎం పొలిట్ బ్యూరో సభ్యుడు బీవీ రాఘవులు అన్నారు. పార్లమెంటు ఎన్నికల్లో ఆ పార్టీకి ఉత్తరాదిన సీట్లు తగ్గుతాయని అందుకే తెలుగు రాష్ట్రాల్లో సీట్ల సాధనకు ప్రజల మధ్య విద్వేషాలను రగిల్చే ప్రయత్నం చేస్తోందని పేర్కొన్నారు. రాబోవు రోజుల్లో అసలు సినిమా చూపిస్తామంటూ ఓ ఛానల్ ఇంటర్వ్యూలో ప్రధాని మోదీ మాట్లాడారని.. దీనిని దృష్టిలో పెట్టుకొని ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. భువనగిరి సీపీఎం అభ్యర్థి ఎండీ జహంగీర్‌కు మద్దతుగా ఆదివారం రంగారెడ్డి జిల్లా యాచారం మండలంలోని పలు గ్రామాల్లో రాఘవులు రోడ్ షో నిర్వహించారు. ఈ సందర్భంగా ఇబ్రహీంపట్నంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. పదేళ్లలో తెలంగాణకు కేంద్రం ఏం చేసిందని ప్రశ్నించారు. వర్గీకరణ విషయంలో దళితులను, కులగణన చేయకుండా బీసీలను మోసం చేసిందని విమర్శించారు. రూ.లక్ష కోట్లకుపైగా ఖర్చుతో నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టు అవినీతిలో బీఆర్ఎస్‌తోపాటు కేంద్ర ప్రభుత్వ పాత్ర కూడా ఉందని ఆరోపించారు. కమ్యూనిస్టులు ఓడినా గెలిచినా ప్రజల మధ్యే ఉంటారని చెప్పారు.

పోలీస్ కస్టడీకి క్రిశాంక్ తరలింపు

తార్నాక, సైదాబాద్, మే 5 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ సోషల్ మీడియా కన్వీనర్ క్రిశాంక్‌ను ఓయూ పోలీసులు కస్టడీలోకి తీసుకున్నారు. చంచల్‌గూడ జైలులో రిమాండ్‌లో ఉన్న ఆయనను కోర్టు అనుమతితో ఆదివారం మధ్యాహ్నం పోలీస్ కస్టడీకి తరలించారు. పోలీస్ కస్టడీకి తరలించే ముందు క్రిశాంక్‌కు ఉస్మానియా ఆస్పత్రిలో వైద్య పరీక్షలు నిర్వహించారు. సోమవారం ఉదయం 11 గంటల వరకు క్రిశాంక్‌ను పోలీసులు విచారించనున్నారు. ఆ తర్వాత ఆయనను తిరిగి చంచల్‌గూడ జైలుకు తరలిస్తారు. ఉస్మానియా విశ్వవిద్యాలయం సర్క్యులర్‌ను మార్ఫింగ్ చేసి సామాజిక మాధ్యమాల్లో వైరల్ చేసిన కేసులో క్రిశాంక్ ప్రధాన నిందితుడిగా ఉన్న విషయం తెలిసింది.



అబ్ కీ బార్?

ఈ ఐదుగురు తమకు తాము ఓటేసుకోలేరు



ప్రజాస్వామ్యంలో ఎన్నికలు ఎంత కీలకమైనవో ఓటు హక్కు వినియోగం కూడా అంతే ముఖ్యమైనది. అందుకే ఎన్నికల సంఘం మొదలుకుని, సమాజంలోని వివిధ రంగాల ప్రముఖుల వరకు 'ఓటు వేయాలంటూ' ప్రజలకు పిలుపునిస్తుంటారు. ఇక అభ్యర్థులైతే 'మీ విలువైన ఓటు వేసి' ఆశీర్వదించాలంటూ వేడుకుంటుంటారు. అయితే, ఇలాంటివారు ఐదుగురు తమ ఓటు తమకు వేసుకోలేని పరిస్థితుల్లో ఉన్నారు. హైదరాబాద్ మజ్లిస్ అభ్యర్థి, ఆ పార్టీ అధినేత అసదుద్దీన్ ఒవైసీ రాజేంద్రనగర్ పరిధిలో నివాసం ఉంటున్నారు. ఇది చేవెళ్ల పార్లమెంటు నియోజకవర్గం కిందకు వస్తుంది. కాగా, చేవెళ్లలో మజ్లిస్ అభ్యర్థిని నిలపలేదు. ఇప్పుడు అసదుద్దీన్ వేరే పార్టీ అభ్యర్థికి ఓటు వేయాల్సిన పరిస్థితి. అసద్ ఇప్పటి వరకు తన ఓటు తనకు ఎప్పుడూ వేసుకోలేదు. హైదరాబాద్ బీజేపీ అభ్యర్థి మాధవీలతకు కంటోన్మెంట్ (మల్కాజిగిరి ఎంపీ)లో ఓటుంది. ఈమె కంటోన్మెంట్ ఉప ఎన్నికతో పాటు మల్కాజిగిరి ఎంపీ స్థానానికి ఓటు వేయనున్నారు. హైదరాబాద్ కాంగ్రెస్ అభ్యర్థి మహ్మద్ సమీర్‌కు జూబ్లీహిల్స్ (సికింద్రాబాద్ ఎంపీ)లో ఓటుంది. కాగా, చేవెళ్ల బీఆర్ఎస్ అభ్యర్థిగా బరిలో ఉన్న కాసాని జ్ఞానేశ్వర్ కుత్బుల్లాపూర్ ఓటరు. ఈ స్థానం మల్కాజిగిరి ఎంపీ స్థానం పరిధిలోకి వస్తుంది. మల్కాజిగిరి కాంగ్రెస్ అభ్యర్థి పట్నం సునీతా మహేందర్‌రెడ్డికి తాండూరులో ఓటుంది. ఈమె కూడా తన ఓటు తనకు వేసుకోలేరు. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని నాలుగు ఎంపీ స్థానాల్లో పోటీకి దిగిన నాలుగు పార్టీల అభ్యర్థులు ఒకే విధమైన పరిస్థితి ఎదుర్కొంటుండడం విచిత్రమే.





సుడిగాలి మోటారు!

(మొదటిపేజీ తరువాయి)



మరీ హెలికాప్టర్లను వినియోగిస్తున్నాయి. తక్కువ సమయంలో దూరప్రాంతాలను చేరుకునేందుకు ఇదే అనువైన మార్గమని భావిస్తున్నాయి. రాష్ట్రంలో మే 13న పోలింగ్ ఉన్న నేపథ్యంలో కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్ లోక్‌సభ ఎన్నికల ప్రచారం తారాస్థాయికి చేరింది. జాతీయ పార్టీలైన కాంగ్రెస్, బీజేపీ అగ్ర, కీలక నేతలు రాష్ట్రానికి వస్తున్నారు. సీఎం రేవంత్‌రెడ్డి రోజుకు రెండు, మూడు జిల్లాల్లో సభలు, కార్నర్ మీటింగ్‌లకు హాజరవుతున్నారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ బస్సు యాత్ర సాగిస్తున్నారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి సహా ఇతర కీలక నేతలు ప్రచారానికి వెళ్తున్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో ప్రచారంలో ఐదు హెలికాప్టర్లు (కాంగ్రెస్ 3, బీజేపీ 2) తిరుగుతున్నాయి. 2, 3 రకాలకు చెందినవాటిని పార్టీలు బుక్ చేసుకున్నాయి. కాగా, హెలికాప్టర్లను ముంబై, ఢిల్లీ, బెంగుళూరుకు చెందిన సంస్థలు అద్దెకు ఇస్తున్నాయి. హోరాహోరీ ఎన్నికల నేపథ్యంలో ఇదే అదనుగా ఈ సంస్థలు అద్దెలను పెంచేశాయనే చర్చ జరుగుతోంది. ప్రయాణించిన సమయం వరకే చెల్లింపులు చేయాలి.

మోతెక్కనున్న గగనతలం..

కర్ణాటక సహా 11 రాష్ట్రాల్లో ఆదివారంతో ప్రచారం ముగిసింది. అక్కడినుంచి కాంగ్రెస్, బీజేపీ ముఖ్య నేతలు తెలంగాణకు రానున్నారు. వారితో పాటు పార్టీకి రెండు చొప్పున మరో 4 హెలికాప్టర్లు కూడా రాష్ట్రానికి రానున్నాయి. అంటే.. మొత్తం తొమ్మిది చాపర్లు రాష్ట్రంలో తిరగనున్నాయి. ఇవికాక ప్రధాని మోదీ ఎయిర్‌ఫోర్స్‌కు చెందిన భారీ రక్షణతో కూడిన హెలికాప్టర్, కేంద్ర హోం మంత్రి అమిత్ షా ప్రత్యేక హెలికాప్టర్‌లో పర్యటిస్తారు. అయితే, లోక్‌సభ పోరులో కాంగ్రెస్, బీజేపీ పోటీపడి మరీ హెలికాప్టర్లను వినియోగిస్తుండగా, బీఆర్ఎస్ తరఫున ఒక్క గాలి మోటారు కూడా ఎగరడం లేదు. గతేడాది అసెంబ్లీ ఎన్నికల నాటికి అధికారంలో ఉన్న కారు పార్టీ.. అగస్త్య, ఎయిర్‌బస్ కంపెనీలకు చెందిన 2 చాపర్‌లను వినియోగించింది. అయితే, బీఆర్ఎస్ కీలక నేత సోదరుడికి ఎయిర్‌బస్-హెచ్ 135 హెలికాప్టర్ ఉంది. ప్రచారం చివర్లో దానిని వినియోగించుకోవాలనే భావనలో ఉన్నట్టు సమాచారం.

వాతావరణ పరిస్థితుల మేరకు..

హెలికాప్టర్ ప్రయాణం వాతావరణ పరిస్థితులపై ఆధారపడి ఉంటుంది. మంచు అధికంగా ఉన్నా.. వర్షాలు పడే అవకాశం ఉన్నా ప్రయాణం కుదరదు. కాగా, ఒక్కో చాపర్ మోడల్‌ను బట్టి గంటకు సగటున 250 కిలోమీటర్ల వేగంతో ప్రయాణిస్తుంది. వెయ్యి లీటర్ల సామర్థ్యంతో కూడిన ఇంధన ట్యాంక్ ఉండే డబుల్ ఇంజిన్ హెలికాప్టర్లకు గంటకు 270-310 లీటర్ల ఇంధనం అవసరం. 500 లీటర్ల సామర్థ్యం ఉండే సింగిల్ ఇంజిన్ హెలికాప్టర్‌కు 130-150 లీటర్ల వరకు కావాలి. ఇంధనం లీటర్ ధర రూ.90-91గా ఉంటుంది. దీన్ని ఏవియేషన్ టర్బైన్ ఫ్యూయల్ (ఏటీఎఫ్)గా వ్యవహరిస్తారు.

మోడల్‌ను బట్టి గంటకు హెలికాప్టర్‌కు వసూలు చేస్తున్న అద్దె
రూ.4-6 లక్షలు

ఈ ఆరు రోజుల్లో తెలంగాణలో తిరిగే గాలిమోటార్ల సంఖ్య 12

కాంగ్రెస్, బీజేపీల హెలికాప్టర్లు ఇవే

అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఒకే హెలికాప్టర్‌కు పరిమితమైన కాంగ్రెస్.. అధికారంలోకి రావడంతో ఇప్పుడు మూడింటిని.. అగస్త్య-169, అగస్త్య-109, బెల్-429లను వాడుతోంది. సీఎం రేవంత్.. అగస్త్య-169లో పర్యటనలు చేస్తున్నారు. కాంగ్రెస్ అగ్ర నేతలు రాహుల్ గాంధీ, ప్రియాంకలకు బెల్-429 కేటాయించారు. కాంగ్రెస్‌కు కర్ణాటక నుంచి రెండు చాపర్‌లు రానున్నట్లు సమాచారం.

ప్రస్తుతానికి సికార్స్కీ-ఎస్76, బెల్-407 మోడల్ హెలికాప్టర్లను వాడుతోంది. వీటిలో ఒకటి స్టార్ క్యాంపెయినర్‌లకు, మరొకటి ఇతర రాష్ట్రాల నుంచి వచ్చే నేతలకు ఉద్దేశించారు. కర్ణాటక, ఛత్తీస్‌గఢ్ నుంచి రెండు హెలికాప్టర్లు వచ్చే అవకాశమున్నట్లు తెలుస్తోంది. అసెంబ్లీ ఎన్నికల్లోనూ బీజేపీ మూడు చాపర్‌లను వినియోగించింది. ప్రధాని హోదాలో మోదీ ఎయిర్‌ఫోర్స్‌కు చెందిన హెలికాప్టర్ ప్రత్యేకించి ఉంటుంది. ఇక అమిత్ షా.. అగస్త్య-139 మోడల్ చాపర్‌లో పర్యటిస్తున్నారు.

బీసీల బాద్‌షా ఎవరో?

అటు కర్ణాటక, ఇటు మహారాష్ట్రకు సరిహద్దున ఉన్న నియోజకవర్గం. రాష్ట్రంలోని రెండు జిల్లాల్లో విస్తరించి ఉన్న పార్లమెంటు స్థానం. మెజారిటీ సంఖ్యలో బీసీ ఓటర్లు. ఇప్పటివరకు జరిగిన మూడు ఎన్నికల్లోనూ బీసీ నేతకే ఎంపీగా పట్టం. తాజా ఎన్నికల్లో బీసీ నేతలనే బరిలోకి దించిన మూడు ప్రధాన పార్టీలు. ఇలా బీసీల అడ్డాగా నిలిచిన జహీరాబాద్ పార్లమెంటు స్థానంలో మరోసారి బీసీ అభ్యర్థుల మధ్యే పోరు జరుగుతుండడంతో 'బీసీల బాద్‌షా' ఎవరవుతారన్న ఆసక్తి నెలకొంది.

జహీరాబాద్‌లో బీసీ నేతల మధ్య ముక్కోణ పోరు

పార్టీ మారి హ్యాట్రిక్ కోసం బీబీ పాటిల్ ప్రయత్నం.. అధికారం అండగా సురేశ్ షెట్కార్

అధిష్ఠానం దన్నుతో బీఆర్ఎస్ అభ్యర్థి గాలి అనిల్‌కుమార్ పోరాటం



బీబీ పాటిల్ సురేశ్ షెట్కార్ అనిల్‌కుమార్

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, సంగారెడ్డి)

నియోజకవర్గాల పునర్విభజనలో భాగంగా ఏర్పాటైన జహీరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గంలో.. సంగారెడ్డి జిల్లా జహీరాబాద్, అందోల్, నారాయణఖేడ్ అసెంబ్లీ సెగ్మెంట్లతోపాటు కామారెడ్డి జిల్లా కామారెడ్డి, ఎల్లారెడ్డి, జుక్కల్, బాన్సువాడ అసెంబ్లీ సెగ్మెంట్లు ఉన్నాయి. 2009లో జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో జహీరాబాద్ నుంచి కాంగ్రెస్ తరఫున సురేశ్‌కుమార్ షెట్కార్ గెలుపొందారు. ఆ తర్వాత 2014, 2019లలో జరిగిన ఎన్నికలలో బీఆర్ఎస్ అభ్యర్థి బీబీ పాటిల్ వరుసగా రెండుసార్లు విజయం సాధించారు. అయితే తాజా ఎన్నికలకు ముందు బీబీ పాటిల్ బీఆర్ఎస్‌కు గుడ్‌బై చెప్పారు. బీజేపీలో చేరి ఆ పార్టీ తరఫున బరిలోకి దిగారు. దీంతో బీఆర్ఎస్ అధిష్ఠానం తమ పార్టీ తరఫున గాలి అనిల్‌కుమార్‌ను బరిలోకి దింపింది. కాగా, కాంగ్రెస్ నుంచి 2019 ఎన్నికలకు దూరంగా ఉన్న మాజీ ఎంపీ సురేశ్‌కుమార్ షెట్కార్ ఈసారి మళ్లీ పోటీ చేస్తున్నారు.

బీసీ, ముస్లిం మైనారిటీల ఓట్లపైనే గురి

మొత్తం 16,40,755 మంది ఓటర్లు ఉన్న జహీరాబాద్ నియోజకవర్గంలో బీసీలు, ముస్లింలు పెద్దసంఖ్యలో ఉన్నారు. బీసీల్లో లింగాయత్ సామాజికవర్గం ఓటర్లు 2.50 లక్షల మంది వరకు ఉండగా, మున్నూరుకాపు సామాజికవర్గం ఓటర్లు 3లక్షల వరకు ఉన్నట్లు అంచనా. ఇక ముస్లింలూ సుమారు 3 లక్షల వరకు ఉంటారు. లింగాయత్ సమాజం ఓటర్లు ఎక్కువగా జహీరాబాద్, నారాయణఖేడ్, జుక్కల్ సెగ్మెంట్లలో ఉండగా, ముస్లిం ఓటర్లు జహీరాబాద్, కామారెడ్డి సెగ్మెంట్లలో ఎక్కువగా ఉన్నారు. మున్నూరుకాపు ఓటర్లు ఎక్కువగా బాన్సువాడ, ఎల్లారెడ్డి, నారాయణఖేడ్ సెగ్మెంట్లలో ఉన్నారు. కాగా, మున్నూరుకాపు ఓట్లు తమకే ఎక్కువగా వస్తాయని ఆ సామాజిక వర్గానికి చెందిన బీఆర్ఎస్ అభ్యర్థి అనిల్‌కుమార్ ధీమాతో ఉన్నారు. మరోవైపు కాంగ్రెస్, బీజేపీ అభ్యర్థులిద్దరూ లింగాయత్ సామాజికవర్గానికి చెందినవారే కావడంతో ఆ వర్గం ఓటర్లు ఎవరివైపు మొగ్గుచూపుతారన్నది కీలకంగా మారింది.

ఎవరి ధీమా వారిదే..

సిటింగ్ ఎంపీగా ఈసారి బీజేపీ నుంచి బరిలోకి దిగిన బీబీ పాటిల్ ముచ్చటగా మూడోసారి గెలిచి హ్యాట్రిక్ కొట్టాలని చూస్తున్నారు. కాగా, గతంలో ఓసారి గెలిచిన కాంగ్రెస్ అభ్యర్థి సురేశ్‌కుమార్ షెట్కార్ మరోసారి విజయం కోసం శ్రమిస్తున్నారు. మరోవైపు ఇప్పటిదాకా ఏ ఎన్నికల్లోనూ గెలవని బీఆర్ఎస్ అభ్యర్థి గాలి అనిల్‌కుమార్ మున్నూరుకాపు సామాజికవర్గ ఓటర్లనే నమ్ముకున్నారు. వాస్తవానికి అనిల్‌కుమార్ ఈ నియోజకవర్గంతో సంబంధంలేని వ్యక్తి. ఆయన కూడా తనకు మెదక్ పార్లమెంట్ స్థానం నుంచి టికెట్ ఇవ్వాలని బీఆర్ఎస్ నాయకత్వాన్ని కోరారు. కానీ, అధిష్ఠానం జహీరాబాద్ టికెట్ ఇవ్వడంతో ఆయన కొద్దిరోజులపాటు అసంతృప్తితో ఉండిపోయారు. చివరకు హరీశ్‌రావు జోక్యంతో పోటీకి సిద్ధమయ్యారు. కాగా, రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలో ఉండడం, ఈ పార్లమెంటు స్థానం పరిధిలో గెలిచిన నలుగురు ఎమ్మెల్యేలు పూర్తి అండదండలు అందిస్తుండడం సురేశ్ షెట్కార్‌కు బలాన్నిస్తోంది. ఇక్కడ ఇన్‌చార్జిగా మంత్రి దామోదర రాజనర్సింహ, సహ ఇన్‌చార్జిగా ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్ మోహన్‌రావు.. కాంగ్రెస్ తరఫున ప్రచారం నిర్వహిస్తున్నారు. ఇక బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జిగా కామారెడ్డి ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి ఆ పార్టీ నాయకులను సమన్వయం చేసుకుంటూ సాగుతున్నారు. మొత్తంగా ముగ్గురు అభ్యర్థులూ విజయంపై ఎవరి ధీమాలో వారు ఉన్నారు.

2019 లోక్‌సభ ఎన్నికల్లో..


బీఆర్ఎస్	కాంగ్రెస్	బీజేపీ
4,34,244	4,28,015	1,38,947
బీబీ పాటిల్	మదన్ మోహన్‌రావు	బానాల లక్ష్మారెడ్డి

బీబీ పాటిల్ మెజార్టీ 6,229

పురుషులు	8,01,563
మహిళలు	8,39,133
ఇతరులు	59
మొత్తం ఓటర్లు	16,40,755

ఇటీవలి అసెంబ్లీ ఎన్నికల్లో ఏ సెగ్మెంట్ ఎవరికి!?

కాంగ్రెస్	అందోల్, నారాయణఖేడ్, ఎల్లారెడ్డి, జుక్కల్
బీఆర్ఎస్	జహీరాబాద్, బాన్సువాడ
బీజేపీ	కామారెడ్డి



2023 అసెంబ్లీ ఎన్నికల్లో ఎవరికెన్ని ఓట్లు!?

కాంగ్రెస్	5,43,817
బీఆర్ఎస్	5,29,648
బీజేపీ	1,71,029

అధినేతల రాకతో వేడెక్కిన ప్రచారం

మూడు ప్రధాన పార్టీల అధినేతలు రావడంతో జహీరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గంలో ప్రచారం వేడెక్కింది. తొలుత బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ప్రజా ఆశీర్వాద సభలో పాల్గొనగా, సీఎం రేవంత్‌రెడ్డి కాంగ్రెస్ జనజాతర సభకు హాజరయ్యారు. బీజేపీ తరఫున ప్రధాని నరేంద్రమోదీ ఇటీవలే విశాల్ జనసభలో పాల్గొన్నారు. బీబీ పాటిల్‌కు ఓటు వేయడమంటే నరేంద్రమోదీకి ఓటు వేసినట్లేనని గుర్తుంచుకోవాలన్నారు. ప్రధాన పార్టీల అగ్రనేతల రాకతో ఆయా పార్టీల నాయకులు, కార్యకర్తల్లో ఉత్సాహం పెరిగింది. 42-43 డిగ్రీల పగటి ఉష్ణోగ్రతలతో ఎండలు మండుతున్నా అభ్యర్థులు, నాయకులు లెక్క చేయకుండా ఊరూరా ప్రచారం చేస్తున్నారు.



పువ్వాడ పూరీలు

బీఆర్ఎస్ ఖమ్మం ఎంపీ అభ్యర్థి నామా నాగేశ్వరరావు తరఫున మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ వినూత్న ప్రచారం నిర్వహించారు. ఆదివారం నగరంలోని 49వ డివిజన్ రామాలయం సెంటర్‌లోని ఓ హోటల్‌లో పూరీలు వేశారు. ఓ దుకాణంలోకి వెళ్లి మిషన్ కుట్టారు.

ఎన్ని 'కాలమేనా?'

జోష్ కొరవడడంతో పార్టీల కేడర్‌లో నిరుత్సాహం

- సమ్మేళనాలు.. దావత్‌లు.. డబ్బుల పంపిణీ లేదు
- ద్వితీయ శ్రేణి నేతల చేరికలపై పట్టింపు కరువు
- ప్రచార రథాల చక్కర్లు, మైకుల మోత తక్కువే
- హంగామా లేకుండా సాదాసీదాగా ప్రచార పర్వం
- అసెంబ్లీ-లోక్‌సభ ఎన్నికల మధ్య చాలా వ్యత్యాసం
- అగ్ర నేతల పర్యటనలు, సభలున్నపుడే హడావుడి

అప్పుడేమో.. ప్రత్యర్థి పార్టీల్లో పలుకుబడి ఉన్నవారైతే పిలిచి మరీ కండువాలు! వీధివీధినా ఆత్మీయ సమ్మేళనాలు! దావత్‌లతో రాత్రింబవళ్లు మందు పార్టీలు! ఖర్చుకు లెక్కే లేదు! గడపగడపకూ నాయకులు! ఓటరన్నకు వంగివంగి దండాలు..!

ఇప్పుడేమో.. ప్రచార రథాల్లో హోరెత్తే మైకుల మోత లేదు.. ర్యాలీల్లో రయ్‌మంటూ దూసుకెళ్లే వాహనాల సందడి లేదు.. పార్టీల్లో చేరికల పేరిట డబ్బు ఎర లేదు.. ఆత్మీయ సమ్మేళనాలంటూ ఆలింగనాలూ లేవు.. మత్తులో ముంచెత్తే విందులూ లేవు..!



నిజామాబాద్ నియోజకవర్గం సాహెబ్‌పేటలో ఉపాధి హామీ కూలీలతో కాంగ్రెస్ నేతల సమావేశం

సరిగ్గా ఆరంటే ఆరే నెలలు.. అవీ ఎన్నికలే. ఇవీ ఎన్నికలే. కానీ, పూర్తిగా తేడా. ఎందుకంటే.. అవి అసెంబ్లీ ఎన్నికలు. ఇవి పార్లమెంటువి. వాస్తవానికి ఈ రెండూ కలిసొస్తే అభ్యర్థులు ఓ మాట అనుకుని ఖర్చు పెట్టేవారు. ఎంపీ అభ్యర్థులు ఇచ్చే ఫండ్.. ఎమ్మెల్యే అభ్యర్థులకు వేన్నీళ్లకు చన్నీళ్లు తోడైనట్లు ఆసరాగా ఉండేది. వీటికి సొంత ఆర్థిక వనరులు, పార్టీ ఇచ్చే డబ్బును కలుపుకొని ఎమ్మెల్యే అభ్యర్థులే ఎన్నికలను భుజాన మోసేవారు. ఎంపీ అభ్యర్థులు వారిని అనుసరిస్తూ ప్రచారంలో పాల్గొనేవారు. కానీ, ఇప్పుడు ఎవరి గోల వారిదే అన్నట్లుంది. అందుకే కాసుల కళకళ.. సీసాల గలగల లేదు. పోలింగ్ పది రోజులే ఉండగా.. అంతా మొక్కుబడిగా గడిచిపోతోంది. ఈ నేపథ్యంలో అసెంబ్లీ ఎన్నికల నాటి వైభవాన్ని, ప్రస్తుత పరిస్థితిని తలుచుకుని పార్టీల కేడర్ ఉసూరుమంటున్నారు.

భరించడం కష్టమే..

ఒక్కో పార్లమెంటు పరిధిలో ఏడు వరకు అసెంబ్లీ సెగ్మెంట్లు ఉంటాయి. డబ్బు సర్దుబాటులో ఎంపీ అభ్యర్థులకు.. అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జుల (ఎమ్మెల్యేలు, ఎమ్మెల్యేగా పోటీచేసి ఓడినవారు) మధ్య అభిప్రాయ భేదాలు వస్తున్నాయి. వ్యాపార నేపథ్యం ఉన్నవారు కాస్త ఖర్చు పెడుతున్నా, మిగిలినవారు మాత్రం బెంబేలెత్తిపోతున్నారు. 'మీరు డబ్బులు ఇస్తేనే.. మా క్యాడర్ వస్తారు. లేకపోతే మీ ఇష్టం!' అని అసెంబ్లీ ఇన్‌చార్జులు కుండబద్దలు కొడుతున్నారు. ఫండ్‌తో పాటు ప్రాధాన్యం ఏమాత్రం తగ్గినా అలకపాన్పు ఎక్కుతున్నారు. కాదని ముందుకెళ్లే పరిస్థితి లేదు. దీంతో వారిని భరించడం ఎంపీ అభ్యర్థుల వల్ల కావడం లేదు.

చేరికలున్నాయి.. కానీ ఫ్రీ

కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్‌ల కేడర్‌లో అసెంబ్లీ ఎన్నికల నాటి జోష్ లేదు. కారణం ఎంపీ అభ్యర్థులు ఆచితూచి ఖర్చు పెడుతుండడమే! గత ఎన్నికల సందర్భంగా.. జడ్పీటీసీ, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు, కార్పొరేటర్లు, కౌన్సిలర్లు, పదవులు లేకపోయినా ఓటర్లను ప్రభావితం చేయగలిగే నేతలకు స్థాయిని బట్టి చెల్లించారు. రూ.50 వేలు, లక్ష.. రూ.5 లక్షలు, రూ.10 లక్షల వరకు 'సర్దుబాటు' చేశారు. పార్టీలో చేర్చుకునేందుకు కూడా డబ్బులు ఇచ్చారు. ఇప్పుడు కూడా చేరికలున్నాయ్.. కానీ, అన్నీ ఉచితమే. అప్పటి అధికార బీఆర్ఎస్‌లో చేరికల సందడే సందడి. ఇప్పుడు అధికార కాంగ్రెస్, బీజేపీలోనూ అంతా గప్‌చుప్. కాసుల గలగల లేక.. ద్వితీయ శ్రేణి నేతలు ఎన్నికలను సీరియస్‌గా తీసుకోవడంలేదు. అగ్ర నేతల పర్యటనలు, ముఖ్య నేతల సమావేశాలు ఉంటేనే కాలు బయట పెడుతున్నారు. మిగతా సమయంలో పనుల్లో నిమగ్నం అవుతున్నారు.

ఆత్మీయ సభల్లేవు.. దావత్‌లు లేవు

అసెంబ్లీ ఎన్నికలకు నెల, రెండు నెలల ముందు నుంచే కుల సంఘాలతో ఆత్మీయ సమ్మేళనాలు, రైతులు, మహిళలు, యువజన, ఉద్యోగ సంఘాలతో సదస్సులు నిర్వహించారు. ఆత్మీయ సమ్మేళనాల్లో మద్యం ఏరులై పారింది. బిర్యానీలు వండిపెట్టారు. బస్సులు, జీపులు, దారి ఖర్చులతో పాటు సభలు, సమావేశాలకు వచ్చినవారికి రూ.250 నుంచి రూ.500 ఇచ్చారు. బూత్‌ల వారీగా ఇన్‌చార్జులను నియమించి.. ఓటర్ల లెక్కన డబ్బులు, మద్యం, మాంసం పంచారు. పోలింగ్‌కు 2 రోజుల ముందు నుంచి ఓటుకు రూ.500 మొదలు1,500 వరకు అందజేశారు. ప్రతిష్ఠాత్మక, ప్రధాన నియోజకవర్గాల్లో ఓటుకు రూ.3 వేల-రూ.5 వేల చొప్పు న కూడా పంచారు. ఇప్పుడు ఇది మచ్చుకైనా లేదు.

మారిన సరళి..

ఈసారి ప్రచార సరళి కూడా మారిపోయింది. ప్రధాని, కేంద్ర మంత్రులు, సీఎం, రాష్ట్ర మంత్రులు, పార్టీ అగ్ర నేతల సభలు, సమావేశాలను మాత్రమే ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్నారు. వీరు రోడ్ షోలు, కార్నర్ మీటింగ్‌లకు ప్రాధాన్యమిస్తున్నారు. అసెంబ్లీ ఎన్నికల తరహాలో ఇంటింటి ప్రచారం పెద్దగా కనిపించడం లేదు. ద్వితీయ శ్రేణి నేతలు క్రియాశీలంగా ఉన్నచోట.. నమూనా బ్యాలెట్ ఇస్తున్నారు. ఫ్లెక్సీలు, డోర్ పోస్టర్లు, వాల్ పోస్టర్లు కూడా పరిమితమే.

- ఆదిలాబాద్ నుంచి ఆంధ్రజ్యోతి ప్రతినిధి

ఎవరి పనుల్లో వారు నిమగ్నం

పార్టీల కేడరే కాదు.. ప్రజలు కూడా ఎంపీ ఎన్నికలను సీరియస్‌గా తీసుకోవడం లేదు. ఓటు వేసే రోజున చూద్దాంలే! అన్నట్లున్నారు. ఆదిలాబాద్ పరిధిలో 'ఆంధ్రజ్యోతి' పరిశీలించినపుడు ఇది స్పష్టమైంది. బోథ్ నియోజకవర్గం నేరడిగొండ మండలం నారాయణపూర్ గ్రామస్థుడు బస్వంతరావు... జొన్న చేనుకు కాపలా కాస్తూ కనిపించాడు. "ఈసారి ఒక్క పార్టీ మీటింగుకూ పోలే. కూలీకెళ్తే రోజుకు రూ.300 వస్తున్నాయి" అని తెలిపాడు. "అసెంబ్లీ ఎన్నికల్లో 3-4 వారాలపాటు ఇంటింటి ప్రచారానికి తిరిగా. ఇప్పుడదే పార్టీ ఇంటింటి ప్రచారం మొదలుపెట్టనే లేదు" అని ఇచ్చోడకు చెందిన ఉమారాణి చెప్పింది. కొసమెరుపు: బోథ్‌లో సాయంత్రం 7- రాత్రి 9 మధ్య.. చార్జింగ్ లైట్లు విక్రయించే ఇద్దరు వ్యాపారుల వాహనాల మైకుల మోత మినహా.. ఎన్నికల ప్రచార వాహనాలు కనిపించలేదు.



అసెంబ్లీ ఎన్నికల సమయంలో నెల రోజులు ఓ పార్టీ ప్రచారంలో క్రియాశీలకంగా పాల్గొన్నా. ఇప్పుడు ఉదయం పూట ఉపాధి హామీ పనికి పోతున్నా. మధ్యాహ్నం ఎండ తట్టుకోలేక విశ్రాంతి తీసుకుంటున్నా. సాయంత్రం వ్యక్తిగత పనులు చూసుకుంటున్నా.

-ముత్తన్న, ద్యాంగాపూర్, నిర్మల్

వామ్మో.. 47 డిగ్రీలు దాటేసింది!

- జగిత్యాల జిల్లా వెల్గటూరులో అత్యధికంగా 47.1
- సాయంత్రానికి పలు జిల్లాల్లో వానలు

(ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్): నిప్పులు కక్కుతున్న సూరీడు.. మరో రికార్డును దాటేశాడు.! వారం రోజుల పాటు 46 డిగ్రీలకు పైనే నిలిచిన భానుడు.. తాజాగా 47 డిగ్రీలు కూడా దాటేశాడు.. రోళ్లు పగిలే రోహిణి కార్తెకు ముందే తన ప్రతాపాన్ని చూపిస్తున్నాడు. ఆదివారం జగిత్యాల జిల్లా వెల్గటూరులో 47.1 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. ఈ సీజన్‌లో ఇదే అత్యధికం.. జగిత్యాల జిల్లా గోధూరులో 46.8, కరీంనగర్ జిల్లా అల్లీపూర్‌లో 46.7, నిర్మల్ జిల్లా బుట్టాపూర్‌లో 46.5, మంచిర్యాల జిల్లా హాజీపూర్, జన్నారంలో 46.3, నిజామాబాద్, మంచిర్యాల జిల్లా వెల్గనూరులో 46.2 డిగ్రీల చొప్పున ఉష్ణోగ్రతలు రికార్డయ్యాయి. అయితే సాయంత్రానికి ఉమ్మడి నల్లగొండ, ఖమ్మం, రంగారెడ్డి జిల్లాలతో పాటు అక్కడక్కడ వర్షం కురవడంతో జనం ఊరట చెందారు. రంగారెడ్డి జిల్లా ఆమనగల్లు మండలంలో గంట పాటు ఈదురుగాలులతో కూడిన వర్షం కురిసింది.

మూడ్రోజులు ఎండలే..

వచ్చే మూడ్రోజుల పాటు రాష్ట్రవ్యాప్తంగా 45 డిగ్రీలకుపైగా ఉష్ణోగ్రతలు నమోదు అయ్యే అవకాశం ఉందని వాతావరణ కేంద్రం హెచ్చరించింది. సోమవారం ఆదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, సిరిసిల్ల, పెద్దపల్లి జిల్లాల్లో తీవ్రమైన వడగాలులు వీస్తాయని తెలిపింది.

వడదెబ్బకు ఐదుగురు.. పిడుగులకు నలుగురి బలి

రాష్ట్రంలో వడదెబ్బతో ఐదుగురు ప్రాణాలు కోల్పోగా.. పిడుగులు పడి నలుగురు మృతి చెందారు. కరీంనగర్ జిల్లా ఇల్లందకుంట మండలం చిన్న కోమటిపల్లిలో మూడెడ్ల రాజయ్య (50), మహబూబాబాద్ జిల్లా గార్లలో జమాలపూరి నాగేందర్ (70), భద్రాచలం పట్టణంలో చింతకాయల సంజయ్ (14), నిర్మల్ జిల్లా కేంద్రంలోని బంగల్‌పేట్‌లో కాళ్ల లక్ష్మి (75), జమ్మికుంట రైల్వే స్టేషన్‌లో గుర్తు తెలియని మరో వ్యక్తి ఎండలకు అస్వస్థత చెంది మృత్యువాత పడ్డారు. రంగారెడ్డి జిల్లా ఆమనగల్లులో కావటి పద్మమ్మ గొర్రెలు మేపేందుకు వెళ్లి పిడుగు పాటుకు మరణించింది. యాదాద్రి భువనగిరి జిల్లా అడ్డగూడురు మండ లం కోటమర్తిలో పశువుల కొట్టంపై పిడుగు పడగా.. కొట్టంలోని రైతు చిప్పలపల్లి బాలమల్లు (65)తో పాటు ఓ పాడి గేదె మృతి చెందింది. జనగామ జిల్లా రఘునాథపల్లి మండలం కోడూరులో దాసరి అజయ్ (23)తో పాటు రెండు పాడి పశువులు పిడుగు పాటుకు మరణించాయి. ములుగు జిల్లా ఏటూరునాగారంలో కల్లంలో మిర్చి తడవకుండా పరదాలు కప్పేందుకు వెళ్లిన రైతు బుల్లయ్య (45) సమీపంలో పిడుగు పడగా అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు.

కఠినంగా 'నీట్'!

- ఫిజిక్స్‌లో తికమక పెట్టే ప్రశ్నలు
- తెలంగాణలో 80 వేల మంది హాజరు
- దేశంలో లక్షకుపైగా ఎంబీబీఎస్ సీట్లు
- ఒక్కో సీటుకు 21 మంది పోటీ
- నెలాఖర్లో 'కీ'.. జూన్ 14న ఫలితాలు

హైదరాబాద్, మే 5 (ఆంధ్రజ్యోతి): ఎంబీబీఎస్, ఆయుష్, బీడీఎస్‌లో ప్రవేశాల కోసం నిర్వహించిన జాతీయ అర్హత ప్రవేశ పరీక్ష (నీట్) ఆదివారం ప్రశాంతంగా ముగిసింది. దేశవ్యాప్తంగా 23 లక్షల మంది పైచిలుకు విద్యార్థులు హాజరైనట్లు సమాచారం. ఈసారి ప్రశ్నపత్రం చాలా కఠినంగా ఉందని, ముఖ్యంగా ఫిజిక్స్‌లో కఠినమైన ప్రశ్నలు ఇచ్చినట్లు నీట్ నిపుణులు చెబుతున్నారు. మొత్తం 720 మార్కులకు ఈసారి 700 దాటడం కష్టమన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. తెలంగాణలో కన్వీనర్ కోటాలో సీటు దక్కాలంటే కనీసం 440 మార్కులు వస్తే చాలని పేర్కొంటున్నారు. ఫలితాలు జూన్ 14న వెల్లడిస్తామని జాతీయ పరీక్ష సంస్థ ప్రకటించింది. ఈ నెలాఖరులోగా నీట్ 'కీ' విడుదలయ్యే అవకాశం ఉంది. దేశవ్యాప్తంగా 704 మెడికల్ కాలేజీల్లో 1,07,948 ఎంబీబీఎస్ సీట్లున్నాయి. ఒక్కో సీటుకు సగటున 21 మంది పోటీ పడుతున్నారు. ఈ ఏడాది కూడా అబ్బాయిల కంటే అమ్మాయిలే ఎక్కువ మంది నీట్‌కు హాజరయ్యారు. 13 లక్షల మంది అమ్మాయిలు, 10 లక్షల మంది అబ్బాయిలు ఉన్నారు.

కఠినంగా ఫిజిక్స్ ప్రశ్నలు

నీట్‌లో గత రెండుసార్లు కెమిస్ట్రీ ప్రశ్నలు చాలా కఠినంగా ఉండగా ఫిజిక్స్ తేలిగ్గా ఇచ్చారు. ఈసారి ఫిజిక్స్‌లో థియరీటికల్, ట్విస్ట్ చేసి ప్రశ్నలు ఎక్కువగా ఇచ్చారని, ఈ తరహా ప్రశ్నలను అర్థం చేసుకొని జవాబు ఇవ్వడానికి ఎక్కువ సమయం పడుతుందని విద్యార్థులు అంటున్నారు. కెమిస్ట్రీ ప్రశ్నలు తేలిగ్గా ఇచ్చారని చెబుతున్నారు. జువాలజీ నుంచి రెండు ప్రశ్నలు సిలబస్‌లో లేనివి ఇచ్చారని విద్యార్థులు తెలిపారు. ఇప్పటిదాకా బోటనీ, జువాలజీ, కెమిస్ట్రీ, ఫిజిక్స్‌లో వచ్చిన మార్కుల క్రమాన్ని బట్టి మొదటి ర్యాంకు ఇచ్చేవారు. ఈసారి ఆ పద్ధతి మార్చారు. బోటనీ, జువాలజీలో అందరూ సరైన జవాబులిచ్చి.. సమంగా మార్కులు సాధిస్తున్నారు. దాంతో కఠినంగా ఉండే ఫిజిక్స్‌లో వచ్చిన మార్కుల ఆధారంగా మొదటి ర్యాంకును నిర్ణయించనున్నారు.

440-450 వస్తే కన్వీనర్ సీటు ఖాయం!

ఈ ఏడాది పూర్తి మార్కులు (720) సాధించడం సాధ్యం కాకపోవచ్చని నిపుణులు పేర్కొంటున్నారు. గతంలో రెండుసార్లు 710-720 మధ్య చాలామంది స్కోర్ చేశారని, ఈసారి 700 దాటడం కష్టమన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. తెలంగాణలో 8,490 ఎంబీబీఎస్ సీట్లున్నాయి. ఈ ఏడాది మరికొన్ని పెరిగి 9 వేలకు చేరే అవకాశం ఉంది. రాష్ట్రం నుంచి ఈ ఏడాది సుమారు 80 వేల మంది పరీక్ష రాసినట్లు తెలుస్తోంది. దీన్ని బట్టి కన్వీనర్ కోటాలో సీటు దక్కాలంటే కనీసం 440 మార్కులు వస్తే చాలని నిపుణులు చెబుతున్నారు. గత ఏడాది 450 మార్కుల వరకు ప్రైవేటు కాలేజీల్లో కన్వీనర్ కోటాలో సీటు వచ్చింది. నీట్ రాసిన విద్యార్థుల సంఖ్య బట్టి తెలంగాణలో ఒక్కో సీటుకు సగటున 8 మంది పోటీపడుతున్నారు.



నల్లగొండలో పరీక్షా కేంద్రం వద్ద విద్యార్థులు

ఇన్విజిలేటర్లతో చిక్కులు!

మెజారిటీ పరీక్షా కేంద్రాలను సీబీఎస్‌ఈ స్కూళ్లలో ఏర్పాటు చేశారు. అక్కడ ఇన్విజిలేటర్లుగా వచ్చినవారికి సరైన శిక్షణ ఇవ్వలేదని, కొన్నిచోట్ల వారు బాగా డిస్టర్బ్ చేశారని విద్యార్థులు, తల్లిదండ్రులు చెబుతున్నారు. హైదరాబాద్‌లోని మాదాపూర్ మెరిడియన్ స్కూల్ పరీక్షా కేంద్రంలో గడియారం సరైన సమయం చూపకపోవడంతో 20 నిమిషాలు ఆలస్యంగా పేపరు ఇచ్చారు. నీట్ మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5.20 గంటల వరకు జరిగింది. పరీక్షా కేంద్రానికి గంట ముందే రావాలన్న నిబంధన ఉంది. 1.30 తర్వాత విద్యార్థులను పరీక్షా హాలులోకి అనుమతించలేదు. ఎండకు విద్యార్థులు, తల్లిదండ్రులు అల్లాడిపోయారు. కొన్ని కేంద్రాల్లో మంచినీటి సదుపాయం లేకపోవడంతో తీవ్ర ఇబ్బంది పడ్డారు.

ఫిజిక్స్ బాగా ఇబ్బంది పెట్టింది

ఎప్పుడూ రసాయనశాస్త్రం నుంచి కఠినమైన, తికమకపెట్టే ప్రశ్నలు అడిగేవారు. ఈసారి భౌతికశాస్త్రం నుంచి అటువంటి ప్రశ్నలు అడిగారు. గతంలో మాదిరిగా ఎక్కువ స్కోర్ చేసే అవకాశాలు తక్కువగా ఉన్నాయి. 700 మార్కులు పైగా తెచ్చుకోవడం ఈసారి అంత తేలిక కాదు. మన దగ్గర 80 వేల మంది హాజరైతే 20 వేల మందే చాలా గట్టిగా ప్రిపేర్ అయ్యేవారుంటారు. 440 మార్కులపైన తెచ్చుకోగలిగితే కన్వీనర్ కోటాలో సీటు వస్తుంది. గత ఏడాది నీట్ కటాఫ్ 137 మార్కులు ఉండగా.. ఈసారి అది 140-145 మధ్య ఉండే అవకాశం కనిపిస్తోంది.

-డి.శంకర్‌రావు, డీన్, శ్రీచైతన్య కాలేజీ, కూకట్‌పల్లి, హైదరాబాద్.

నేటి నుంచి రైతుభరోసా!

(మొదటి పేజీ తరువాయి)

ఇప్పటికే పేమెంట్ బిల్లులు సమర్పించారు. గతంలో మాదిరిగానే తక్కువ విస్తీర్ణం ఉన్న రైతుల వివరాలు ముందుగా.. ఎక్కువ విస్తీర్ణం ఉన్న రైతుల వివరాలు తర్వాత వచ్చేలా సాఫ్ట్‌వేర్ సిస్టమ్ రూపొందించారు. ఇప్పుడూ అదేతరహాలో చెల్లింపులు చేయనున్నారు. రైతు భరోసాను ఐదెకరాల వరకే పరిమితి చేస్తారని ప్రచారం జరిగింది. కానీ రాష్ట్ర ప్రభుత్వం అలాంటి నిర్ణయం ఏమీ తీసుకోలేదు. గతంలో మాదిరిగానే రాష్ట్రంలోని పట్టాదారులందరికీ, ధరణి పోర్టల్‌లో తహసీల్దారు డిజిటల్ సిగ్నేచర్ అయిన రైతులందరికీ ప్రభుత్వం నగదు బదిలీ చేసింది. ఈ సీజన్‌లోనూ అదేతరహాలో ఎలాంటి కటాఫ్‌లేకుండా, పరిమితి విధించకుండా రైతుబంధు చెల్లించాలని ప్రభుత్వం నిర్ణయించింది. దీంతో ఐదెకరాలకు మించి భూమి ఉన్న రైతులకు కూడా ఈ సీజన్‌లో ఆర్థిక సాయం అందుతుంది.

నేటి నుంచి పంట నష్టపరిహారం పంపిణీ

ఇచ్చిన మాట నిలబెట్టుకుంటున్నాం: మంత్రి తుమ్మల

హైదరాబాద్, మే 5 (ఆంధ్రజ్యోతి): వడగండ్ల వానల కారణంగా యాసంగి సీజన్‌లో పంటలు నష్టపోయిన రైతులకు సోమవారం నుంచి నష్టపరిహార ం పంపిణీ చేయనున్నట్లు వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. ఎకరాకు రూ.10 వేల చొప్పున రైతుల ఖాతాల్లో నిధులు జమ చేస్తామని, సోమ-మంగళవారాల్లో నగదు బదిలీ చేపడతామని వెల్లడించారు. గత మార్చి 16వ తేదీ నుంచి 24 వ తేదీ వరకు కురిసిన వడగండ్ల వానతో పది జిల్లాల్లో 15,814 ఎకరాల్లో పంట నష్టం జరిగినట్లు వ్యవసాయశాఖ అధికారులు నివేదిక ఇచ్చారని పేర్కొన్నారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం రూ. 15,81,40,000ను నష్ట పరిహారం కింద ప్రభుత్వం విడుదల చేసిందని చెప్పారు. ఎన్నికల కోడ్ అమల్లో ఉండటంతో నష్ట పరిహారం పంపిణీ విషయమై ఈసీ అనుమతి కోరుతూ లేఖ రాయగా.. ఆమోదం లభించినట్లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీని నిలబెట్టుకున్నదని, గతంలో ఎప్పుడూ లేని విధంగా పంట నష్టం సంభవించిన 45రోజుల్లోనే నష్టపరిహారం చెల్లించి, రైతులకు ఉపమనం కలిగించనున్నట్లు వెల్లడించారు.

ట్రాక్టర్ బోల్తా .. ముగ్గురి మృతి

- మరో నలుగురికి తీవ్రగాయలు

సుల్తానాబాద్, మే 5: మొక్కజొన్న చేనులో కంకుల బూరు ఒలిచే పనులకు వెళ్లి తిరిగి వస్తుండగా ట్రాక్టర్ బోల్తా పడి ముగ్గురు కూలీలు మృతి చెందిన సంఘటన పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్ మండలంలో జరిగింది. ఈ ప్రమాదంలో మరో నలుగురు తీవ్రంగా గాయపడగా, వారిలో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉంది. వివరాల్లోకి వెళ్తే... మండలంలోని చిన్నబొంకూరు గ్రామానికి చెందిన మల్యాల వెంకటేశం... తాను కౌలుకు తీసుకున్న మొక్కజొన్న చేనులో కంకుల బూరు ఒలిచే పనుల నిమిత్తం ఆదివారం ఉదయం ఐదు గంటల ప్రాంతంలో తన భార్య వైష్ణవితో పాటు అదే గ్రామానికి చెందిన ఆరుగురు మహిళలను తన ట్రాక్టర్‌లో తీసుకవెళ్లారు. పని పూర్తయ్యాక కంకులను ట్రాక్టర్‌లో నింపుకుని తిరిగి పదిన్నర గంటల ప్రాంతంలో ఇంటికి వస్తుండగా ట్రాక్టర్ అదుపుతప్పి రోడ్డు పక్క ఉన్న ఎస్సారెస్పీ ఉపకాలువ(33ఎల్)లో బోల్తా పడింది. కంకులపై కూర్చొని వస్తున్న మహిళలపై కంకులు, ట్రాక్టర్ ట్రాలీ పడడంతో ఊపిరి ఆడక పోచంపల్లి రాజమ్మ(61), బేతి లక్ష్మి(50), మల్యాల వైష్ణవి(35)లు అక్కడికక్కడే మృతిచెందారు. పోచంపల్లి పద్మ, విజ్జగిరి రమ, విజ్జగిరి రాజమ్మ, పోచంపల్లి లక్ష్మిలు తీవ్రంగా గాయపడ్డారు. వారిని సుల్తానాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వీరిలో పోచంపల్లి పద్మ, విజ్జగిరి రమల పరిస్థితి విషమంగా ఉండడంతో కరీంనగర్ ఆసుపత్రికి తరలించి చికిత్స చేయిస్తున్నారు.

పట్టాదారు బతికుండగానే విరాసత్

- తహసీల్ సిబ్బంది నిర్లక్ష్యంతో ఓ రైతుకు అన్యాయం
- రంగారెడ్డి జిల్లా జిల్లేడ్ చౌదరిగూడలో ఘటన
- 9 మందిపై ఎఫ్ఐఆర్, ఇద్దరు మహిళలకు రిమాండ్

చౌదరిగూడ, మే 5(ఆంధ్రజ్యోతి): తహసీల్దార్ కార్యాలయ సిబ్బంది నిర్లక్ష్యం ఓ రైతుకు తీవ్ర నష్టం కలిగించింది. ఆ రైతు పేరిట ఉన్న భూమిని అతనికి తెలియకుండా తహసీల్దార్ కార్యాలయ సిబ్బంది మరొకరికి విరాసత్(హక్కు పత్రం) చేశారు. దీనిపై రెవెన్యూ అధికారులు స్పందించకపోవడంతో బాధితుడు పోలీసులను ఆశ్రయించగా తహసీల్దార్ సహా తొమ్మిదిమందిపై ఎఫ్ఐఆర్ నమోదు చేసిన పోలీసులు ఇద్దరు మహిళలను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. కానీ, భూమిని కోల్పోయిన రైతు ఇప్పుడు తన పరిస్థితేంటనే ఆందోళనలో ఉన్నాడు. రంగారెడ్డి జిల్లా జిల్లేడ్ చౌదరిగూడ మండలం వీరన్నపేట్‌లో జరిగిన ఈ ఘటన వివరాలిలా ఉన్నాయి. వీరన్నపేటకు చెందిన గడ్డం వెంకటయ్య ఎనిమిది నెలల క్రితం మరణించాడు. దీంతో అతని పేరిట ఉన్న భూమి విరాసత్ కోసం వెంకటయ్య కుమార్తెలు తిమ్మగళ్ల గాయత్రి, హన్మగళ్ల మమత తహసీల్దార్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకున్నారు. మరోపక్క, అదే గ్రామానికి చెందిన గడ్డం నర్సయ్య కుమారుడు గడ్డం వెంకటయ్యకు చేగిరెడ్డిఘణాపూర్‌లోని సర్వే నంబర్ 222/3లో 0.20గుంటలు సీలింగ్ పట్టా, 16/26అలో 0.10 అసైన్డ్ భూమి ఉంది. గాయత్రి, మమత చేసుకున్న దరఖాస్తు విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన తహసీల్దార్ కార్యాలయ సిబ్బంది రికార్డులు సక్రమంగా పరిశీలించలేదు. గాయత్రి, మమత తండ్రికి చెందిన భూమికి బదులుగా నర్సయ్య కుమారుడు గంట వెంకటయ్యకు చెందిన 30 గుంటల భూమిని వారికి విరాసత్ చేసేశారు. దీంతో గడ్డం వెంకటయ్యకు తెలియకుండానే అతని భూమిపై హక్కులు సదరు మహిళలకు వెళ్లిపోయాయి. ఇదేమి తెలియని వెంకటయ్య రైతుబంధు డబ్బు కోసం ఆన్‌లైన్‌లో తనిఖీ చేసుకుంటుండగా తన భూమి ఇతరులకు పట్టా చేసినట్టు తెలుసుకుని ఆశ్చర్యపోయాడు. రికార్డులు సరిచేయాలని తహసీల్దార్ కార్యాలయ సిబ్బంది చుట్టూ తిరిగినా పట్టించుకోలేదు. దీంతో వెంకటయ్య ఏప్రిల్ 20న పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు తహసీల్దార్ విజయ్‌కుమార్, గాయత్రి, మమతసహా తొమ్మిది మందిపై ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. గాయత్రి, మమతను రెండ్రోజుల క్రితం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. మిగిలినవారిపై ఇప్పటిదాకా ఎలాంటి చర్యలు తీసుకోలేదు. దీనిపై సమాచారం ఇచ్చేందుకు జిల్లేడ్ చౌదరిగూడ పోలీసులు నిరాకరిస్తున్నారు.

టీఎస్ఎప్‌సెట్‌కు ఏర్పాట్లు పూర్తి

హైదరాబాద్ సిటీ, మే 5 (ఆంధ్రజ్యోతి): ఇంజనీరింగ్, అగ్రికల్చర్ అండ్ ఫార్మసీ కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహిస్తున్న టీఎస్ఎప్‌సెట్-2024 పరీక్షలు మంగళవారం నుంచి ప్రారంభంకానున్నాయి. ఇందుకవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు సెట్ నిర్వహణ బాధ్యతలు చేపట్టిన జేఎన్‌టీయూ అధికారులు తెలిపారు. ఈ నెల 7, 8 తేదీల్లో అగ్రికల్చర్ అండ్ ఫార్మసీ పరీక్షలు, 9 నుంచి 11 తేదీ వరకు ఇంజనీరింగ్ పరీక్షలు నిర్వహించనున్నారు. ప్రతి రోజూ రెండు సెషన్లలో పరీక్షలు జరుగుతాయి. పరీక్ష ప్రారంభమయ్యే సమయానికి ఒక్క నిమిషం ఆలస్యంగా వచ్చినా లోపలికి అనుమతించేదిలేదని సెట్ కో కన్వీనర్ కె.విజయకుమార్‌రెడ్డి సూచించారు. టీఎస్ఎప్‌సెట్‌కు ఈసారి 3,54,786 మంది దరఖాస్తు చేసుకోగా పరీక్షల నిర్వహణ కోసం 301 కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఇంజనీరింగ్ పరీక్షకు 2,54,462 మంది, అగ్రికల్చర్ అండ్ ఫార్మసీ పరీక్షలకు 1,00,227మంది దరఖాస్తు చేశారు.

Printed and Published by ***Koganti Venkata Seshagiri Rao*** *on behalf of Aamoda Publications Pvt. Ltd., printed at Aamoda Press, H.No.5-9-287/10 & 11, Plot No. 53 & 54, Prasanth Towers, Rajeev Gandhi Nagar, Moosapet, Kukatpally (Mandal), Kukatpally Municipality, Ranga Reddy District and Published at Plot No.76, Ashwini Layout, Huda Heights, Road No.70, Jubilee Hills, Hyderabad-500033. Editor:* ***K. Srinivas****. Fax No. 23558288, Phone No: 23558233 / 44 / 55, Regd. No.H/HD 674, RNI No.44903 / 86.* ***Managing Director: Vemuri Radha Krishna,*** *Founder: K.L.N.Prasad.*